# ద్రావిడి

అర్ధవార్షిక తెలుగు పరిశోధన పత్రిక

PRASAARAANGA

PRASARANGA

ద్రావిడ విశ్వవిద్యాలయం

శ్రీనివాసవనం, కుప్పం - 517 426

ద్రావిడి

సంపుటి - 4

జనవరి - జూన్ 2025

సంచిక-1

ISSN: 2319-3905

# ద్రావిడి

(Peer Reviewed Journal)

అర్ధవార్షిక తెలుగు పరిశోధన పత్రిక

సంపుటి - 4 | జనవరి - జూన్ 2025 | సంచిక-1

గౌరవ సంపాదకులు

ఆచార్య ఎం.దొరస్వామి, ఉపాధ్యక్షులు

సంపాదకులు

ఆచార్య డి.వి.శ్రవణ్ కుమార్, సంచాలకులు, ప్రచురణలు

ద్రావిడ విశ్వవిద్యాలయం

# ద్రావిడి

***(Peer Reviewed Journal)***

**(అర్ధవార్షిక తెలుగు పరిశోధన పత్రిక)**

**సంపుటి - 4** **జనవరి-జూన్ 2025** **సంచిక - 1**

*గౌరవ సంపాదకులు*

**ఆచార్య యం.దొరస్వామి,** *ఉపాధ్యక్షులు* i/c

*సంపాదకులు*

**ఆచార్య డి.వి.శ్రవణ్ కుమార్**

*సంచాలకులు, ప్రచురణలు*

*సంపాదక మండలి సభ్యులు*

**ఆచార్య కె.శ్రీదేవి,** *ద్రా.వి.వి.*

**ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు,** *హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం.*

**ఆచార్య విస్తాలి శంకరరావు,** *మద్రాసు విశ్వవిద్యాలయం.*

**డా.డి.ఉదయ కుమారి,***ద్రా.వి.వి.*

**డా.వి.పళణి,** *ద్రా.వి.వి.*

**డా.యం.హరికృష్ణ,** *ద్రా.వి.వి.*

**ద్రావిడ విశ్వవిద్యాలయం**

**శ్రీనివాసవనం, కుప్పం - 517 426**

**Dravidi** (Peer Reviewed Journal)
HALF-YEARLY RESEARCH JOURNEL IN TELUGU
January - June 2025, Vol.IV, Issue No.1

© Dravidian University

***Editorial Board***

**Editor**

Prof. D.V.Sravan Kumar

**Members**

Porf. K.Sridevi
Prof. Darla Venkateswara Rao
Prof. Vistali Shankara Rao
Dr. D.Udaya Kumari
Dr. V.Palani
Dr. M.Harikrishna

*Published by*
**Director**
Department of Publications
Dravidian University
Kuppam - 517 426

*For Copies*
**The Director**
Department of Publications
Dravidian University
Srinivasavanam
Kuppam – 517 426

**ISSN No.2319-3905**

*Printed at*
**Vijayavani Printers**
Chowdepalle



## సందేశం

ప్రాచీనమైన, సుసంపన్నమైన ద్రావిడ భాషల అభివృద్ధి కోసం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ద్రావిడ విశ్వవిద్యాలయాన్ని త్రిభాషా ప్రాంతమైన కుప్పంలో 1997వ సంవత్సరంలో నెలకొల్పింది. ద్రావిడ విశ్వవిద్యాలయం ద్రావిడ భాషలను మట్లాడే వారి మధ్య భావసమైక్యతా వారధి. ప్రచురణల శాఖ ఐదు ప్రధాన ద్రావిడ భాషలతో పాటు ఆంగ్ల భాషలో సైతం రచనల్ని వెలువరించింది. ఇన్ని భాషల్లో ఏ విశ్వవిద్యాలయమూ ప్రచురణల్ని చేపట్టిన దాఖలా లేదు. స్వతంత్ర గ్రంథాలు, అనువాదాలు, నిఘంటువులు, పరిశోధనా గ్రంథాలు, త్రిభాషా శాస్త్ర గ్రంథాలను ప్రసారాంగ ప్రచురించింది. "ద్రావిడి" రాకకు కొంత జాప్యం జరిగినప్పటికీ గత సంవత్సరం ఒక సంచిక, ప్రస్తుతం మరో సంచికగా "ద్రావిడి" వెలుగు చూడడం ఎంతైనా ముదావహం. ఈ పత్రిక తెలుగు సాహిత్య, సాంస్కృతికాభిమానులను అలరిస్తుందనేది అక్షరసత్యం.

పరిశోధకులు ఉన్నత ప్రమాణాలతో కూడిన వ్యాసాలను ప్రచురించడానికి ప్రామాణిక వేదిక అవసరం. ఈ విషయాన్ని గుర్తించిన నేపథ్యంగా వికసించిన సాహితీ కుసుమమే "ద్రావిడి" అర్ధవార్షిక తెలుగు పరిశోధన పత్రిక.

"ద్రావిడి" తెలుగు పరిశోధక పత్రికను ఆదరించి, తెలుగుకి సంబంధించిన ఉత్తమ పరిశోధన పత్రాలను పంపి, సాహిత్యాభిమానులు దీన్ని మరింత బలోపేతం చేయగలరని విశ్వసిస్తున్నాను.

**ఆచార్య ఎం.దొరస్వామి**
ఉపాధ్యక్షులు i/c

# సంపాదకీయం

ద్రావిడ భాషల అధ్యయనం, ద్రావిడ సంస్కృతిని గూర్చిన పరిశోధన, ఆ భాషల్లోని విశిష్ట సాహిత్య పరిశీలన ధ్యేయంగా ద్రావిడ విశ్వవిద్యాలయం ఏర్పడింది. విశ్వవిద్యాలయాలు చేపట్టవలసిన మూడు బాధ్యతలు బోధన, పరిశోధన, ప్రచురణ. ఈ మూడింటి వల్ల జ్ఞాన ప్రసారం సుగమమవుతుంది. ద్రావిడ విశ్వవిద్యాలయం ఈ మూడింటినీ నిర్వహిస్తూ ఉండడం ముదావహం. ముఖ్యంగా ప్రచురణల కేంద్రం ఏ విశ్వవిద్యాలయమూ చేపట్టని విధంగా ఆరు భాషలలో గ్రంథాలను ప్రచురిస్తోంది. ఇలా ప్రధాన ద్రావిడ భాషలలో, ఆంగ్లంలో పుస్తక ప్రచురణ చేస్తున్న మరో విశ్వవిద్యాలయం ఏదీ లేదు.

పుస్తక ప్రచురణతో బాటు వివిధ భాషలలో పరిశోధన పత్రికలను ప్రచురించాలనుకోవడం ద్రావిడ విశ్వవిద్యాలయం చేపట్టిన మరో మహత్కార్యం. పరిశోధన కోసం విశ్వవిద్యాలయం చేపట్టిన ఈ కార్యం ఇతర విశ్వవిద్యాలయాలకు మార్గదర్శకం కాగలదని చెప్పక తప్పదు.

తెలుగులో ఒకానొక కాలంలో పరిశోధన, గ్రంథ పరిష్కరణ, విమర్శ, సాంస్కృతిక అధ్యయనం వికసించాలనే ఉద్దేశంతో అనేక పత్రికలు వెలువడేవి. ఈ పత్రికలు సారస్వత రంగానికి చేసిన సేవ చిరస్మరణీయం.

ఒకప్పుడు ఏ సాహిత్యవేత్త అయినా, పరిశోధకుడైనా తమ వ్యాసాలు ప్రచురించాలంటే ముఖ్య వేదికగా 'భారతి' ఉండేది. ఈ పత్రిక తెలుగు సాహిత్య వికాసానికి చేసిన సేవ మరువరానిది. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం (వాఙ్మయి), ఉస్మానియా విశ్వవిద్యాలయం (వివేచన), కాకతీయ విశ్వవిద్యాలయం (విమర్శిని), తెలుగు అకాడెమీ (తెలుగు), దక్షిణ భారత హిందీ ప్రచారసభ (స్రవంతి) లాంటి సంస్థలు కూడా పరిశోధన రంగానికి తమ వంతు సేవల్ని అందించాయి.

ప్రస్తుతం పరిశోధనకు సంబంధించిన కొత్త విషయాలను చెప్పాలంటే సరైన వేదిక కావాలని సాహితీ అభిమానులు కోరుకుంటున్నారు. వేలమంది తెలుగులో పరిశోధనలు జరుపుతున్నా ఉన్నత ప్రమాణాలను అనుసరించటం లేదనే ఆరోపణ ఉంది. పరిశోధన చెయ్యాల్సిన విషయాలకు కొదువ లేదు. ఆయా పరిశోధనాంశాలకు తెలుగులో ఉత్తమ పరిశోధనకు ఆకరంగా వ్యవహరించాలని, ద్రావిడ భాషల తులనాత్మక పరిశీలనకు ఒక వేదిక కావాలని ఈ పత్రికను ప్రారంభించటం జరిగింది. మధ్యలో కొంతకాలం పత్రికను అనివార్య కారణాల వల్ల తీసుకురాలేక పోయినప్పటికీ ఈ సంచికకు ముందు ఒక సంచిక తీసుకురావడం జరిగింది. వెంటనే తిరిగి 'ద్రావిడి' మరో సంచికను మీ ముందుంచుతున్నాం.



'ద్రావిడి'ని తిరిగి తీసుకురావటానికి కారకులైన ప్రస్తుత ఉపాధ్యక్షులు (ఇంఛార్జి) ఆచార్య ఎం.దొరస్వామి గారికి, రిజిస్ట్రారు (ఇంఛార్జి) ఆచార్య వి.కిరణ్ కుమార్ గారికి ధన్యవాదాలు. ఈ సంచికలో మంచి పరిశోధనాత్మక వ్యాసాలు వున్నాయి. నేను కోరిన వెంటనే తన వ్యాసాలను పంపి ఈ సంచికకు వన్నె తీసుకొచ్చిన సీనియర్ ఆచార్యులకు, విశ్రాంత ఆచార్యులకు తదితర రచయితలందరికీ ధన్యవాదాలు. ఈ సంచిక తీసుకునిరావడంతో సహకరించిన సంపాదక మండలి సభ్యులందరికీ హృదయపూర్వక ధన్యవాదాలు. ఈ ముద్రణా బాధ్యతలో పాలుపంచుకున్న ప్రసారాంగ బోధన, బోధనేతర ఉద్యోగులందరికీ కృతజ్ఞతలు.

ఈ మా ప్రయత్నాన్ని హర్షించి పరిశోధకులు ఇంకా ఉత్తమ వ్యాసాలను ప్రచురణకు పంపి 'ద్రావిడి' పత్రికను నిరంతరాయంగా తీసుకురావడంలో సహకారం అందిస్తారని ఆశిస్తున్నాను. అదేవిధంగా వ్యాస రచయితలందరూ సంచిక చివర్లో పొందుపర్చిన 'శైలీ పత్రాన్ని' అనుసరించి వ్యాసాలు పంపగలరని కోరుతున్నాను.

**ఆచార్య డి.వి.శ్రవణ్ కుమార్**
***సంపాదకులు***

## విషయ సూచిక


సందేశం iiii

సంపాదకీయం v

1. జాతీయోద్యమ సాహిత్యం - నూతన భావనలు 1

- ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు

2. జానపద సాహిత్యంలో రామాయణం *13*

*- ఆచార్య పేట శ్రీనివాసులు రెడ్డి*

3. తెలుగువారికి చిరస్మరణీయుడు సి.పి.బ్రౌన్ 25

- ఆచార్య పి.సి.వెంకటేశ్వర్లు

4. శ్రీశ్రీ - అభ్యుదయ కవిత్వం *32*

*- ఆచార్య డి.వి.శ్రవణ్ కుమార్*

5. డా. పి. శ్రీదేవి కథల్లో వ్యక్తమైన స్త్రీల స్వతంత్ర భావాలు *39*

*- ఆచార్య కె.శ్రీదేవి & పి.శ్రీదేవి*

6. గురజాడ సాహిత్యం - విశిష్టత *72*

*- ఆచార్య ఎం.రామనాథం నాయుడు*

7. తెలుగు ప్రధాన ద్రావిడ భాషలతో పరస్పర సంబంధాలు *77*

*డా.డి.ఉదయ కుమారి*

8. ఆరుద్ర జీవితం - సాహిత్యం *81*

*- ఆచార్య ఎన్.ఈశ్వర రెడ్డి*

9. ఉత్తర భారతీయ, ద్రావిడ భాషల్లో ప్రాచీన సాహిత్యం: తులనాత్మక అధ్యయనానుకూలత *89*

*-డా.వి.పళని*

**10.** మధ్యయుగాల్లో పరిపాలనభాషగా తెలుగుకున్న స్థానం *98*

*– డా. పప్పుల వెంకటరమణ*

**11.** అమెరికా ప్రవాస జీవితాన్ని కళ్ళముందుంచే వంగూరి చిట్టెన్ రాజు నాటికలు **105**

*– డా. యం. హరికృష్ణ*

**12.** గుర్రం జాషువా "గబ్బిలం" **112**

*– డా. ఎస్. హేమలత*

**13.** ప్రపంచ కథలలో స్త్రీల స్థితి **117**

*– డా. పి. ఎస్. గణేష్ మూర్తి*

**14.** సంస్కృతభాషయందు విభక్తి వైచిత్రి **125**

– డా॥ లంక వేంకట సుబ్రహ్మణ్యేశ్వర శర్మ

**15.** తెలుగు సామెతలు – సాంఘిక, సాంస్కృతిక జనజీవన చిత్రణం *139*

*– డా. డి. జ్యోతమ్మ*

*రచయితల చిరునామాలు* **147**

*శైలీ పత్రం* **148**

"ద్రావిడి" పత్రికలో ప్రచురితమవుతున్న వ్యాసాలలోని విషయాలకు, వివరాలకు ఆయా రచయితలే బాధ్యులు. విశ్వవిద్యాలయం బాధ్యత వహించదు.

ISSN No.2319-3905

# 1

# జాతీయోద్యమ సాహిత్యం - నూతన భావనలు

**- ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు**

ప్రపంచ వ్యాప్తంగా జాతీయోద్యంలో నూతన భావనలు కనిపిస్తున్నాయి. అవి భారతీయ సాహిత్యంలోను, తెలుగు సాహిత్యంలోను కూడా కనిపిస్తున్నాయి.వాటిని సైద్ధాంతికంగా, సోదాహరణంగా వివరించే ప్రయత్నమే నా పత్రం లక్ష్యం. ఈ జాతీయోద్యమ భావనలు ప్రధానంగా నాలుగు రకాలుగా కనిపిస్తున్నాయి. భారత స్వాతంత్ర్యానికి పూర్వం, స్వాతంత్ర్యానంతరం అని ప్రధానంగా రెండు భాగాలుగా చూసినా, ప్రపంచవ్యాప్తంగా జాతీయోద్యమ స్ఫూర్తి చరిత్ర ఒక భాగంగాను, సమకాలీన ప్రపంచ జాతీయోద్యమ భావనలు మరొక భాగంగాను కనిపిస్తాయి. ఫ్రెంచి విప్లవం తర్వాత స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం అనే భావనలు రాజకీయ, ఆర్థిక, సామాజిక, సాహిత్య సాంస్కృతిక రంగాలలో కొత్తభావనలుగా విస్తృతమయ్యాయి. వాటిని నాలుగు రకాలుగా విభజించుకొని భారతదేశ జాతీయోద్యమ ప్రభావంతో తెలుగులో ప్రతిఫలించిన నూతన భావనలను ఈ పత్రంలో వివరిస్తున్నాను.

ఈ శతాబ్దంలో మన దేశాన్నీ, తెలుగు నేలనూ కుదిపేసిన ఉద్యమాల్లో ప్రముఖమైనది జాతీయోద్యమం. ఈ మహోద్యమం మొత్తం భారతీయ సాహిత్యాన్నీ, అలాగే తెలుగు సాహిత్యాన్నీ ఎంతగానో ప్రభావితం చేసింది. దాదాపు అన్ని సాహిత్య ప్రక్రియలపైనా జాతీయ స్వాతంత్ర్యోద్యమ ప్రభావం స్పష్టంగా కనబడుతుంది. జాతీయోద్యమ సాహిత్యం ద్వారా తెలుగులో ప్రాచుర్యంలో ఉన్న కొత్త భావనలు కనిపిస్తున్నాయి. జాతీయోద్యమం అనగానే మన భారతీయ జాతీయోద్యమం ఉండే మనం అన్వేషణ ప్రారంభిస్తాం. భారతజాతి అంతా అని ఒక సంస్కృతితో నిర్మించబడిందని భావిస్తూ ఆ జాతి స్వతంత్రమైన ఆలోచన విధానంతో ముందుకు వెళ్లే గురుతర బాధ్యతకు చేసిన ప్రయత్నం అంతా భారత జాతీయోద్యమంలో కనిపిస్తుంది. చిన్నచిన్న సాంస్క ృతికపరమైన వ్యత్యాసాలు ఉన్నప్పటికీ ఒక భౌగోళిక ప్రాంతంలోని ప్రజలు ఒక జాతిగా కలిసిగట్టుగా జీవించడంలో అత్యధిక సారూప్య లక్షణాలే కలిగి ఉంటాయి. అది ప్రపంచ వ్యాప్తంగా వివిధ ఖండాలు, వివిధ దేశాలు అనే విభజనతో మనం ఆ భౌగోళిక ప్రాంతాల్ని చూసినప్పుడు ఈ

ప్రత్యేక లక్షణం స్పష్టంగా కనిపిస్తుంది. ఈ లక్షణమే భారతీయులంతా ఒకటే జాతి అనే భావనను ఏర్పరిచింది. అది ఇతర దేశాల పాలకులు ఈ దేశం పై వలస పాలన కొనసాగిస్తున్నప్పుడు స్పష్టంగా కనిపించింది. అదే సమయంలో జాతిని ఏకం చేసి ప్రధాన భావన పట్ల అన్వేషణ కూడా కొనసాగింది. అది ఆచార వ్యవహారాలు, సాంస్కృతిక విధానం, దానితో ముడిపడిన తాత్విక ధార, దానికి ఆధారమైన మతం, ఒకదానితో పెనవేసుకుని కులం, ప్రాంతం మొదలైన అంశాలు కూడా కనిపించసాగాయి. ఈ పరిస్థితుల్లోనే జాతీయత నుండి మానవీయత, మానవీయత నుండి విశ్వజనీనత భావనలు బయటకు వచ్చాయి. ఈ భావనలు జాతీయ ఉద్యమంలో కొత్త భావనలకు కారణమయ్యాయి.

ప్రపంచవ్యాప్తంగా జాతీయోద్యమంలో జాతి, మతదృక్పథంతో పాటు సామాజిక న్యాయం, ఆర్థికంగా అందరినీ ఆదుకునే సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకోవడం అవసరం అనే భావనలు వచ్చాయి. జాతీయతను భౌగోళిక సరిహద్దులతో చూసేవారు కొందరైతే, జాతీయతనే విశ్వ మానవజాతిగా చూసేవాళ్ళు భౌగోళికేతర ప్రాంతాలతో కలిపి చూశారు. మానవుడినే కేంద్రంగా చూసిన వాళ్ళు ఉన్నారు. ఈ భావనలు అత్యంత ప్రాచీన కాలం నుండి అత్యంత ఆధునిక కాలం వరకు భిన్న రూపాలలో కనిపిస్తున్నాయి. దీన్ని మనం భారతీయ సాహిత్యం నుండి దానిలో అంతర్భాగంగా కొనసాగుతున్న ప్రాంతీయ సాహిత్యాలు ముఖ్యంగా తెలుగు, తమిళం తదితర భాషా సాహిత్యాలతో విశ్లేషించుకోవాల్సిన అవసరం ఉంది. రవీంద్రనాథ్ ఠాగూర్ భారతీయ జాతీయతను వివరిస్తూనే ఒక విశ్వ మానవుడిగా తన ఆలోచనలను కేంద్రీకరిస్తాడు. మహాకవి గురజాడ అప్పారావు జాతీయతను కేవలం ఒక భౌగోళిక ప్రాంతానికి మాత్రమే ముడిపెట్టే అంశం కాదని ఇంచుమించు రవీంద్రుని మార్గంలోని తన భావనలను వ్యక్తీకరిస్తాడు. మరొకవైపు భౌగోళిక సరిహద్దు చాలా ముఖ్యమని స్వయం పాలనకు స్వతంత్ర నిర్ణయాలకు అది చాలా ముఖ్యమైనటువంటి విషయమని మరి కొంతమంది కవులు భావిస్తున్నారు. దీనితోపాటు జాతీయ ఉద్యమంలో వచ్చిన కొత్త భావన స్వతంత్రత స్వయం సమృద్ధి తో పాటు లభించిన స్వేచ్ఛను దుర్వినియోగం కాకుండా కాపాడుకొని ఆలోచనలు చేయడం కూడా జాతీయ ఉద్యమ సాహిత్యంలో భాగంగానే గమనించాలి దాన్ని కేవలం అస్తిత్వ ఉద్యమ సాహిత్యం మాత్రమే ఒక చిన్న ఆలోచన దారిలో మనం పరిగణించకూడదు. 'ఈ దేశం నాది' 'ఇది జాతి నాది' అంటూనే తన జాతిలో తన భాగస్వామ్యాన్ని తన స్థితిని ప్రశ్నించుకుంటూ ఒక దేశ పౌరుడుగా ఒక దేశ జాతీయుడిగా తన గొంతుని ఎలుగెత్తి చాటుతున్న వైనాన్ని జాతీయ ఉద్యమంలో కొత్త భావన గానే మనం చూడాలి.

**జాతీయత అంటే?**

తన జాతిమీద అభిమానమే జాతీయత, మానవత అంటే స్వచ్ఛందమూ, ఆర్ద్రమూ అయిన హృదయం కలిగి ఉండటం. ప్రజలు తమ జాతికి చెందిన సర్వజనుల జీవన విధానానికి, స్వేచ్ఛకు ఎట్టి అడ్డంకులు ఉండకూడదని నమ్మి ఆ ధ్యేయంకోసంపాటుపడటం జాతీయత అనబడుతుంది.'



ISSN No.2319-3905

ప్రజలు తాము నివసిస్తున్న నేలమీద భక్తిని ప్రకటించటం, స్వజాతి జనులమీద ప్రేమను పెంపొందించుకోవటం 'జాతీయత'గా భావించవచ్చు. సృష్టి ప్రారంభం నుండి పరిశీలించినట్లైతే ఒక జాతి మరొక జాతిని, ఒక రాజ్యం మరొక రాజ్యాన్ని జయించి సామ్రాజ్యాలు స్థాపించటం జరిగింది. అంటే బలవంతులు బలహీనులను బానిసలుగా చేయటం ప్రపంచ చరిత్రలో కనిపిస్తుంది. ఈ పరిస్థితుల మధ్యలోనే 18వ శతాబ్దం తరువాత యూరపు ఖండంలో జాతీయతా భావన ఉద్బుద్ధమైంది. అంటే ఫ్రెంచి విప్లవానికి పూర్వం యూరోపులో జాతీయ భావాలు స్థిరపడినట్లు తెలుస్తుంది. కీ.శ.1857 నుండి 1947 మధ్యకాలంలో భారత స్వాతంత్ర్య ఉద్యమంలో ఇంత మంది పాల్గొని దాన్ని ఒక జాతీయోద్యమంగా కలిసి పరాయి పాలకులపై తిరుగుబాటు చేశారు. Where the Mind is without Fearఅనే గేయంలో రవీంద్రనాథ్ టాగోర్ స్వేచ్ఛను ఎంతో గొప్పగా కవిత్వీకరించారు. ఈ గీతంలో దేవునిపై తన భక్తిని, మాతృదేశంపై తనకున్న ప్రేమను ఆయన చక్కగా తెలిపారు. రవీంద్రుని ప్రార్థన, ఆకాంక్షలు ఆయన భావనలను మనం తెలుగులో చెప్పుకుంటే ఇలా ఉంటుంది.

*"ఎక్కడ మనసు నిర్భయంగా ఉంటుందో/ఎక్కడ మనుషులు తలెత్తుకుని తిరుగుతారో ఎక్కడ విజ్ఞానం స్వేచ్ఛగా ఉంటుందో/సంకుచిత భావాలతో ముక్కలుగా చీలిపోదో ఎక్కడ సత్యవాక్కులు వెలువడుతాయో/ఎక్కడ నిర్విరామ కృషి పరిపూర్ణత కోసం చేతులు చాపుతుందో./ ఎక్కడ స్వచ్ఛమైన వివేకధార ఇంకిపోకుండా ఉంటుందో/ఎక్కడ నిరంతర ఆలోచన, ఆచరణ వైపు నీవు/బుద్ధిని నడిపిస్తావో నా తండ్రీ!/ఆ స్వేచ్ఛా స్వర్గానికి నా దేశాన్ని నడిపించు"* ఇలా ఎందుకు కోరుకోవాలి వచ్చింది? అవి ఈనాటి తరానికి తెలియాలంటే ఆనాడు పరాయి దేశ పాలనలో కష్టనష్టాలు గురైనటువంటి వాళ్ళ అనుభవాలు తెలియాలి. ఇల్బర్ట్ బిల్లు అనేది 1883 ఫిబ్రవరి 9న యొక్క వైస్రాయ్ మార్క్వెస్ ఆఫ్ రిపాన్ సమయంలో అధికారికంగా ప్రవేశపెట్టబడిన ఒక బిల్లు , దీనిని కౌన్సిల్ ఆఫ్ ది గవర్నర్-జనరల్ ఆఫ్ ఇండియా యొక్క చట్టపరమైన సభ్యుడు సర్ కోర్టేనే పెరెజిన్ ఇల్బర్ట్ రూపొందించారు. భారతీయులను బ్రిటన్ న్యాయమూర్తులు విచారించవచ్చు. కానీ, బ్రిటన్ అధికారులు నేరం చేస్తే వారిని విచారించే అధికారం భారతీయులకు లేదు అనేది ఈ బిల్లులో ఉన్న ఒక వివాదం. నీలిమందు తోటల్లో పనిచేస్తున్న మహిళలను బ్రిటన్ సిపాయిలు అనేకసార్లు అత్యాచారాలు చేస్తున్నా వారికి సరైనటువంటి శిక్ష పడేది కాదు. అదే గనుక భారతీయ సిపాయిలు లేదా భారతీయులు ఏదైనా ఒక చిన్న నేరం చేసినా బ్రిటన్ న్యాయమూర్తులు తీవ్రమైన శిక్షలను విధించే వారనీ, అందువల్ల బిల్లుకు వ్యతిరేకంగా భారతీయులు ఉద్యమించారు.

దీనితోపాటు భారతీయ మహిళలు బ్రిటన్ మహిళలతో పోల్చుకుంటే ఉన్నత విద్యా అవకాశాలు వారికి లేవని అపహాస్యం చేశారు. ఇది ఒక ప్రధానమైన చారిత్రక పరిణామానికి దారితీసింది. భారత జాతీయ కాంగ్రెస్ (1885) ఏర్పడి భారతీయులందరినీ ఒక ఉద్యమ శక్తిగా

మార్చడానికి ఉపయోగపడింది. అనేకమంది త్యాగాల ఫలితంగా భారతదేశానికి స్వాతంత్ర్యం సిద్ధించింది. జనగణమన జాతీయ గీతం ఆలపిస్తుంటే ఒక ఆనందం దుఃఖం కలిసిన సమ్మేళనంతో మన దేహమంతా ఒక ఉద్విగ్నతకు గురవుతుంది. ఒక కంటితో ఆనంద భాష్పాలు మరొక కంటితో త్యాగవీరులకు అశ్రునివాళ్లు అర్పించుకునే సమయాన్ని ఏకకాలంలో జాతీయ గీతం మనకి అనుభూతిలోకి తీసుకొస్తుంది. స్వాతంత్ర్య ఉద్యమ సమయంలో రచించి ఆలపించడం మొదలైన వందేమాతరం, జనగణమన గీతాలు భారతీయులను ఒక జాతిగా సమైక్యపరిచి జాతీయ ఉద్యమంలో ఉత్సాహంతో పాల్గొనేటట్లు చేశాయి. అందుకే ఆ రెండు గీతాలకు చరిత్రలో మహోన్నతమైన స్థానం ఉంది. అందుకే ఈ రెండు గీతాలకు ఒక రకమైన పవిత్రత ఏర్పడింది. నేడు ఈ రెండు గీతాలు కేవలం ఒక ప్రాంతానికి సంబంధించినవి కావు. యావత్తు దేశ ప్రజలను మనమంతా ఒక్కటేననీ, మన కలాలు, మన గళాలు ఒక్కటిగానే స్పందిస్తారని ప్రపంచానికి ఎలుగెత్తి చాటిన గొప్ప గీతాలు.

మన భారతదేశానికి స్వాతంత్ర్యం సిద్ధించాక మనల్ని మనం పరిపాలించుకోవడానికి ఒక రాజ్యాంగాన్ని ఏర్పాటు చేసుకోవడం మనకి ఎదురైన మొట్టమొదటి పెద్ద సవాల్ గా మారింది. దీనికోసం ఒక రాజ్యాంగ పరిషత్ ఏర్పడింది. భారతదేశంలోని అన్ని ప్రాంతాలకు సంబంధించిన సుమారు 299 మంది ప్రతినిథులు ఈ కమిటీలో సభ్యులుగా ఉన్నారు. మన తెలుగు ప్రాంతం నుండి టంగుటూరి ప్రకాశం, పట్టాభి సీతారామయ్య గార్లు ప్రతినిథులుగా ఉన్నారు. రాజ్యాంగ పరిషత్ నే రాజ్యాంగ సభ అని కూడా అంటారు. ఇది రాజ్యాంగాన్ని రాయడానికి ఒక డ్రాఫ్టింగ్ కమిటీని ఏర్పాటు చేసింది. ఆ కమిటీ ఆనాటికే గొప్ప మేధావి, విద్యావంతుడు అయిన డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ని చైర్మన్ గా ఎన్నుకున్నారు. ప్రపంచ దేశాలలో ఉన్న రాజ్యాంగాలను అధ్యయనం చేసి ప్రజాస్వామ్యాన్ని పటిష్టంగా అమలుపరచుకోవడానికీ, ప్రజా సంక్షేమాన్ని విస్మరించకుండా ఉండడానికి అనేకమైన అనుకూలమైన విధానాలతో ప్రపంచ దేశంలోనే అత్యుత్తమ సమాఖ్య వ్యవస్థకు కావలసిన రాజ్యాంగాన్ని డ్రాఫ్టింగ్ కమిటీ అందించింది. దాన్ని 1949 నవంబర్ 26 వతేదీన భారత రాజ్యాంగాన్ని ఆమోదించారు. 1950 జనవరి 26 వ తేదీ నుండి దీని ప్రకారం భారత ప్రభుత్వం పరిపాలన మొదలైంది.అంటే మొదటి సవాల్ అయిన భారత రాజ్యాంగాన్ని మనం ఏర్పాటు చేసుకోవడంలో విజయవంతమయ్యాం.

నేటికీ కూడా అతిపెద్ద రాజ్యాంగం భారత రాజ్యాంగమేనని ప్రపంచ దేశాలలో ఉన్న రాజ్యాంగాలన్నీ పరిశీలించిన మేధావులు చెప్తున్నటువంటి మాట. ఈ రాజ్యాంగానికి ఉన్న మరొక అవకాశం సమకాలీన పరిస్థితులకు అనుగుణంగా రాజ్యాంగాన్ని సవరణలు చేసుకోవడానికి కూడా అవకాశాన్ని కల్పించారు. ప్రజలందరికీ స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం, పార్లమెంటరీ ప్రజాస్వామ్య వ్యవస్థ, బలమైన కేంద్రంతో కూడిన సమాఖ్య వ్యవస్థ. హక్కులతో పాటు విధులను కూడా సూచించిన గొప్ప రాజ్యాంగ వ్యవస్థను మనం ఏర్పాటు చేసుకొని భారతదేశం అంతా ఒకే





పరిపాలనకు అనుకూలమైనటువంటి అఖిలభారత సర్వీసులను కూడా మనం విజయవంతంగా అమలు చేసుకుంటున్నాం. జాతీయోద్యమంలో ప్రతిఫలించే ఈ భావనలను భౌగోళిక సరిహద్దుల జాతీయత, భౌగోళిక సరిహద్దులు లేని జాతీయత, బహుళ సాంస్కృతిక భావనల జాతీయత, మతపరమైన ప్రత్యేక దేశం లేదా రాజ్య భావన, పీడన విముక్తి భావనలు అనే **ఐదు రకాలుగా** విభజించుకోవచ్చు.

**1.భౌగోళిక సరిహద్దుల జాతీయత:**

ఒకప్పుడు జాతి, దాన్ని అనుసరించి ఒక భౌగోళిక సరిహద్దు, సాంస్కృతిక అంశాలలో ఏకీకృత ఆచరణలు ఉండేవి. దీన్ని ఆధారం చేసుకొనే భారతజాతి, స్వాతంత్ర్య ఉద్యమం, సాంస్కృతిక ఔన్నత్యం వంటి వాటిని కీర్తిస్తూ భారతీయ సాహిత్యం, అందులో తెలుగు సాహిత్యంలో కూడా ఒక భాగంగా కొనసాగింది. బంకించంద్రుని 'వందేమాతరం' రవీంద్రుని 'జనగణమన' అనే గీతాలు భారతీయ జాతీయోద్యమాన్ని ఎంతగానో ప్రభావితం చేశాయి. వాటి ప్రభావంతో తెలుగులో అనేకమంది కవులు కవిత్వం రాశారు. కృష్ణాపత్రికలో 1905 డిసెంబర్ 5వతేదీన 'ది క్రై ఆఫ్ మదర్ ఇండియా' పేరుతో వందేమాతరం ఉద్యమానికి వ్యతిరేకంగా ఒక అజ్ఞాతకవి రాసిన ప్రబోధగీతం ప్రచురితమయ్యింది.

"*హిందువులారా ఎన్నాళ్లీ గతి/మంద మతులరై మాటికి జెడెదరా/ నందనులగు మీరందరు సుక్కగ/ యెందుకు నా బ్రతుకితరుల కోసమ/ నావంటను గల సారంబంతయు/ నావంతయు లేకే పలికేగెను/చేవ చెడిన నేనేవిధి బ్రతుకుదు/ జీవించిన సార్థక్యం బేమిక*" అని కొనసాగుతుంది. దీన్నే తొలితెలుగు జాతీయోద్యమ గీతంగా డా.ఎస్వీ.సత్యనారాయణగారు తన సిద్ధాంత గ్రంథంలో అభిప్రాయపడ్డారు. (*తెలుగులోఉద్యమగీతాలు*,1991:45.) దీనిలో 'హిందువులారా' అనేది 'భారతీయులారా' అనే అవగాహనతో ఈ గేయాన్ని వర్ణించారనుకోవచ్చు. భారతజాతీయోద్యమాన్ని ఎంతో ప్రభావితం చేసిన గేయాల గురించి ప్రస్తావించుకొనేవాళ్ళందరూ చిలకమర్తి వారి పద్యం తప్పకుండా స్మరించుకుంటుంటారు.

'*భరతఖండంబు చక్కని పాడి యావు/హిందువులు లేగదూడలై ఏడ్చుచుండ/తెల్లవారను గడుసరి గొల్లవారు/ పితుకుచున్నారు మూతులు బిగియగట్టి*'తెలుగు ప్రాంతాల్లోని జాతీయోద్యమానికి ఈ పద్యాన్ని నిదర్శనంగా చూపవచ్చు. అయితే ఈ పద్యాన్ని గోడలపై రాసినట్లు ప్రచారంలో ఉంది. కానీ, దీనితో పాటు చిలకమర్తివారు మరికొన్ని పద్యాలను వర్ణించారు. వాటిని గురజాడ రాఘవశర్మ '*జాతీయ గీతాలు*' గ్రంథం (పుట: 21-22)లో గ్రంథస్థం చేశారు. విపరీతంగా పన్నులు వేస్తున్నారనీ, స్థానిక భాషలకు విలువనివ్వడంలేదనీ, స్థానిక ప్రజలను హింసిస్తున్నారనీ ఆ పద్యాల్లో వర్ణించాడు కవి. చిలకమర్తి వారి ఈ పద్యం, దాని ప్రభావం గురించి డా.సి.నారాయణరెడ్డిగారు వ్యాఖ్యానిస్తూ "*చిలకమర్తివారి 'భరతఖండంబు' అన్న పద్యము తెలుగులో భారతజాతీయోద్యమసంబంధమైన తొలిరచనయని చెప్పవచ్చును. ఈ పద్యముతో*

*జాతీయోద్యమకవిత్వమునకు బీజావాపనము జరిగినది. రాయప్రోలు ప్రభృతులుచేసిన దోహదముతో అది వర్ధిల్లినది."* అన్నారు. (పుట:357). మరొక ఉదాహరణగా రాయప్రోలు సుబ్బారావుగారు భారత జాతీయాభిమాన స్ఫూర్తితో రచించిన 'జన్మభూమి' గీతం కనిపిస్తుంది.

*"ఏ దేశమేగినా, ఎందు కాలిడినా/ పొగడరా నీ తల్లి భూమి భారతిని/ నిలుపరా నీ జాతి, నిండు గౌరవము..."/ఏ దేశమేగినా ఎందు కాలిడినా/ఏ పీఠమెక్కినా, ఎవ్వరేమనినా,/ పొగడరా నీ తల్లి భూమి భారతిని,/నిలపరా నీ జాతి నిండు గౌరవము.'* అనే గేయంలో మాతృదేశం, మాతృభాషల గొప్పతనాన్ని చాటాలనడంలో తమ అస్తిత్వాన్ని కోల్పోకూడదనే ప్రబోధం, చైతన్యం కనిపిస్తుంది. రాయప్రోలువారి ఈ గీతాన్ని, రాయప్రోలువారి జాతీయాభిమానాన్ని తన సిద్ధాంత గ్రంథం *ఆధునికాంధ్రకవిత్వము–సంప్రదాయములు : ప్రయోగములు* గ్రంథంలో డా.సి.నారాయణరెడ్డిగారిలా వ్యాఖ్యానించారు.(పుట: 292–293) *"1914 లో ప్రారంభమైన రాయప్రోలువారి దేశభక్తికవిత్వము రెండుమూడు దశాబ్దములపాటు బహుముఖములుగా విజృంభించినది. 'ఏ దేశ మేగినా ఎందుకాలిడినా పొగడరా నీ తల్లిభూమి భారతిని'వంటి గేయములలో వీరు భారతజాతీయభావమును ప్రబోధించిరి. 'చావలేదు చావలేదాంధ్రజనమహోజ్జ్వల చరిత్ర' యని ఆంధ్రాభిమానమును వ్యక్త మొనర్చిరి. 'తెనుగుతల్లి' అను శీర్షికతో భిన్న ప్రాంతములలో విడివడి యున్న ఆంధ్రులసమైక్యమును సూచించిరి. 'ఆంధ్ర' అను శీర్షిక క్రింద 'రాష్ట్రాభిమానమును చాటిరి. 'తెనుగుమాన్యము'అను శీర్షిక క్రిందగల పద్యములలో ఆంధ్రభాషాప్రాశస్త్యము నుగ్గడించిరి. 'తెనుగుతల్లి' అను పదమును మొదట ప్రయోగించినది వీరే. 'తెనుగువాణి', 'తెనుగు 'కత్తి', 'తెనుగు భూమి' మొదలైనవాని వెనుకగల ఆంధ్రజాతీయావేశమునకు దారులు తీసినది వీరే. తెలుగునదులను, తెలుగురాజుల శౌర్యపరాక్రమములను, తెలుగుసిరిని స్ఫుటమైన రేఖలతో చిత్రించిన ప్రథములువీరే."*

వీరికంటే ముందే ఒక అజ్ఞాత కవి ఒక గీతాన్ని రచించినా, తర్వాత అనేక జాతీయభావాలతో గీతాలు, పద్యాలు రచించిన వారిగా మాత్రం రాయప్రోలువారిని పేర్కొనవచ్చు. రాయప్రోలుతో పాటు మరికొంతమంది కవుల జాతీయోద్యమ ప్రభావాన్ని కూడా వివరిస్తూనే జన్మభూమి గేయం గొప్పతనాన్ని డా.సి.నారాయణరెడ్డిగారిలా అన్నారు. *"తెలుగులో వెలువడిన దేశాభిమానక విశ్వములో ఆంధ్రదేశాభిమానసంబంధికవిత్వమే విస్తారముగానున్నది. భావకవులలో భారతజాతీయతను ప్రబోధించినవారిలో దువ్వూరి, బసవ రాజుమున్నగువారు కొందరేయున్నారు. రాయప్రోలు, విశ్వనాథ, కొడాలి, జాషువా, తుమ్మల మున్నగువారు ఎక్కువగా ఆంధ్రాభిమానమును వెలార్చినవారే. రాయప్రోలువారు భారతజాతీయతకు సంబంధించి వ్రాసిన ఒకటిరెండుశీర్షికలే ఈ శాఖలో మకుటాయమానముగా నిలిచిపోయినవి. వారి 'జన్మభూమి' గేయము జాతీయకవితాపురంధ్రికి శిరోభూషణమువంటిది."* (పుట:361) రాయప్రోలు వారి తర్వాతపేర్కొన దగినవారిలో గరిమెళ్ళ సత్యనారాయణ (1893–1952). వీరు గొప్ప జాతీయోద్యమాన్ని ప్రభావితం చేస్తూ గేయాల్ని



ISSN No.2319-3905

రచించిన కవి. *"మా కొద్దీ తెల్లదొరతనము /దేవ/మా ప్రాణాలపై పొంచి మానాలు హరియించె //మాకొద్దీ//పన్నెండు దేశాలు పండుచున్నగాని/పట్టెడన్నము లోపమండి ఉప్పు ముట్టుకుంటె దోషమండి నోట మట్టి కొట్టి పోతాడండి/అయ్యో కుక్కలతో పోరాడి కూడు తింటామండి ఎమాకొద్దీఎచూడి యావుల కడుపు వేడివేడి మాంసం–వాడికి బహు ఇష్టమంట/మాదు పాడిపశువుల కోస్తాడంట, మామతము పాడుచేస్తాడంట/మా చూడియావుల మంద సురిగి ఇంటికిరాదు. / మాకొద్దీ/.*

దీనికి వ్యతిరేకంగా అనికాకపోయినా, దళితుల హక్కుల పరిరక్షణలో భాగంగా కుసుమధర్మన్న గారి 'మాకొద్దీ నల్లదొరతనము' కూడా చూడాలి. ఇలాంటి గేయాలు రావడానికి గల కారణాలేమిటో డా.ఎస్వీ.సత్యనారాయణ తన సిద్ధాంతగ్రంథం 'తెలుగులో ఉద్యమగీతాలు'లో ఎంతో హేతుబద్ధంగా వివరిస్తూ ఇలా అన్నారు. *"జాతీయోద్యమ కాలంలో అంటరానితనాన్ని నిరసించడం నాయకుల ప్రచారాల్లో ప్రధానాంశమయింది. అయితే కేవలం ప్రచారంతోనే సమస్య పరిష్కారం కాదు. దీనికి చిత్తశుద్ధి కావాలి. ఆచరణాత్మక నిబద్ధత కావాలి."* (పుట:120). ఇలాంటి వాటిని గమనించిన చైతన్యవంతులైన దళిత కవులే కాకుండా, దళితేతర కవులు కూడా అంటరానితనాన్ని ఖండిస్తూ కవిత్వం రాశారు. వారిలో వాన్నే పత్తిగౌడుపు రాఘవరాజు వ్యక్తంచేస్తూ...*'అంటరానివాడివోయ్ ఆవలకు సొమ్మంచు/ కంటగించు పాపకర్మలీ యిలనుండ/ అంటుదోషము పోవునా? సోదరా ఆనందమే చిక్కునా?'*అని ఆక్షేపించారు. మంగిపూడి వేంకటశర్మ, శిష్ట్లా సత్యనారాయణ రాజశేఖరం, గరిమెళ్ల సత్యనారాయణ, కరుణశ్రీ, నెల్లూరి వెంకటరామానాయుడు, ఊటుకూరు సత్యనారాయణరావు, జాలారంగస్వామి మొదలైన వారంతా ఈ రకమైన భావనలను వ్యాప్తి చేస్తూ తమ రచనలు కొనసాగించారు.

**2. భౌగోళిక సరిహద్దులు లేని జాతీయత:**

మరొక నూతన భావనల్లో నేడు అత్యంత ముఖ్యంగా పరిగణించాలనుకునే ప్రపంచమొక కుగ్రామంగామారుతున్న శాస్త్ర సాంకేతిక రంగాల అభివృద్ధిని కేంద్రంగా చేసుకొని భౌగోళిక సరిహద్దులు లేని మానవత్వమే ప్రధానంగా భావించే జాతీయోద్యమ భావన స్పష్టంగా కనిపిస్తుంది. గురజాడ అప్పారావు గారి 'దేశభక్తి' గేయం దీనికి ప్రత్యక్ష ఉదాహరణగా నిలుస్తుంది.

*'దేశమును ప్రేమించుమన్నా/మంచి యన్నది పెంచుమన్నా/వొట్టి మాటలు కట్టిపెట్టోయ్/ గట్టిమేల్ తలపెట్టవోయ్/....అన్నదమ్ముల వలెను జాతులు/మతములన్నియు మెలగవలెనోయ్/ సొంత లాభం కొంత మానుకు/పొరుగు వానికి తోడుపడవోయ్/దేశమంటే మట్టి కాదోయ్/దేశమంటే మనుషులోయ్"* అనే గేయంలో దేశం అంటే కేవలం దేశ భౌగోళిక సరిహద్దులు మాత్రమే కాదనీ, దేశంలోని ప్రజలని దేశభక్తికి కొత్త నిర్వచనాన్నిచ్చారు. అంతేకాకుండా మతములన్నియు మాసిపోవాలనడం ద్వారా మతం కంటే జ్ఞానానికి ప్రాధాన్యాన్నివ్వాలనడం కూడా ఒక కొత్తభావనగానే కనిపిసప్తుంది.

**3.బహుళ సాంస్కృతిక భావనల జాతీయత:**

ఒకే భౌగోళిక సరిహద్దులు గల ప్రాంతాలలో కూడా అంతర్గత వ్యత్యాసాలతో పాటు, బహుళ సాంస్కృతిక జీవన విధానాన్ని అనుసరిస్తూ ఇతరులతో కలిసిఉంటూనే తమ ప్రత్యేక అస్తిత్వాన్ని కాపాడుకొనే ప్రయత్నం చేయడం జాతీయోద్యమ నూతన భావనల్లో ఒకటి. అమెరికాలో నల్లజాతీయులు తెలివి తేటల్లో, అందంలో ఇతరులెవరికీ తక్కువ కాదనే ఆత్మగౌరవ భావన, భారతదేశంలో ముస్లిములు, దళితుల్లో కూడా కనిపిస్తుంది.

దేవరకొండ బాలగంగాధర తిలక్ 1963 లో రాసిన పద్యం "ప్రార్ధన."లో మానవత్వం, బహుళ సాంస్కృతిక జాతీయత ప్రతిఫలిస్తుంది. *"దేవుడా/రక్షించు నాదేశాన్ని/పవిత్రులనుండి పతివ్రతలనుండి/పెద్దమనుషులనుండి పెద్దపులులనుండి/నీతుల రెండునాల్కలు సాచి బుసలు కొట్టే/నిర్హేతుక కృపాసర్పాలనుండి/లక్షలాది దేవుళ్ళనుండి వారిపూజారులనుండి/వారి వారి ప్రతినిధులనుండి/సిద్ధాంత కేసరులనుండి సిద్ధులనుండి/శ్రీ మన్మద్గురుపరంపరనుండి"*

*''దేవుడా/నలభై కోట్ల మనుష్యుల నిజమైన ప్రాణం వున్న/మనుష్యులతో నిండిన దేశం నాది/ఆకలీ బాధలూ ఆందోళనలూ సమస్యలూ/విరివిగా వున్న విచిత్ర సౌధం మాది/కడుపునిండుగా ఆహారం గుండెనిండుగా ఆశ్లేషం/బ్రతుకుపొడుగునా స్వతంత్రం/కొంచెం పుణ్యం కించిత్ పాపం/ కాస్త కన్నీరు మరికాస్త సంతోషపు తేనీరూ/చాలు మాకు తండ్రీ/సరదాగానిజాయితీగా జాలి జాలిగా/ హాయిహాయిగా బ్రతుకుతాం/మాకు నటనలు వద్దు మాచుట్టూ కటకటాలు వద్దు/గొప్పలూ గోసాయి చిట్కాలు వద్దు"*

*"దేవుడా/కత్తి వాదరకు తెగిన కంఠంలో హఠాత్తుగా/ఆగిపోయిన సంగీతాన్ని వినిపించు/ మానవ చరిత్ర పుటలలో నెత్తురొలికి/మాసిపోయిన అక్షరాల్ని వివరించు/రహస్యసృష్టి సానువులనుండి జారిపడే/కాంతి జలపాతాన్ని చూపించు/మమ్మల్ని కనికరించు/చావు పుట్టుకలమధ్య సందేహం లాంటి/జీవితంలో నలువైపులా అంధకారం/మంచిగంధంలాగ పరిమళించే మానవత్వం/మాకున్న ఒకే ఒక అలంకారం/మజిలీ మజిలీ కి అలిసిపోతున్నాం/మలుపుమలుపికీ రాలిపోతున్నాం/ఆశల వెచ్చని పానుమీద స్వప్నాల పుష్పాలు జల్లుకొని/ఆదమరిచి కాసేపు విశ్రమించడానికనుమతించు తండ్రీ."*

ఈ కవితాఖండిక మొదటి భాగంలో అభ్యుదయవాదిగా (progressive), రెండవ భాగంలో మానవతావాదిగా (humanist), మూడవ అంటే చివరి భాగంలో నిస్పృహ (disappointment) కొట్టవచ్చినట్లు కనిపిస్తుందని, కానీ అది కూడా మానవత్వంలో భాగంగానే చూడాలనీ వేలూరి వెంకటేశ్వరరావు ( *ఈమాట,* సెప్టెంబరు–2005) వ్యాఖ్యానించారు. కానీ, దీన్ని ఆయన భావాలను ఏకీభవిస్తూనే, బాలగంగాధర తిలక్ ఒకే మతం, దేవుడు పేర్లతో జరిగే హింసను వ్యతిరేకిస్తూ బహుళ సాంస్కృతికజాతీయతను సమర్థిస్తున్న తీరునీ, ఆ లక్ష్యాన్నీ గుర్తించాలి.

చెరబండరాజు (1944 – 1982) బద్దం భాస్కరరెడ్డి రాసిన '*వందేమాతరం*' అనే కవిత ఇది సెప్టెంబర్ 1968 లో వచ్చిన పద్యం. దిగంబరకవుల మూడవ సంపుటి, "నేటి కుష్ఠ





*వ్యవస్థపై దిగంబరకవులు,"* లో మొదటి పద్యం. *"ఓ నా ప్రియమైన మాతృదేశమా/తల్లివి తండ్రివి దైవానివి నీవేనమ్మా/దుండగులతో పక్కమీద కులుకుతున్న శీలం నీది/అంతర్జాతీయ విపణిలో అంగాంగం తాకట్టు పెట్టిన అందం నీది/సంపన్నుల చేతుల్లో మైమరచి నిద్రిస్తున్న యవ్వనం నీది/ఊసినా దుమ్మెత్తి పోసినా చలనం లేని మైకం నీది/కోతకొచ్చిన చేనులో కలుగులు తవ్వుతున్న/ ఎలకల్నీ పందికొక్కుల్నీ భరిస్తూ నించున్న "భారతి" వమ్మా/నోటికందని సస్యశ్యామల సీమవమ్మా/ వందేమాతరం వందేమాతరం/ఒంటిమీద గుడ్డలతో జండాలు కుట్టించి/వివస్త్రవై ఊరేగుతున్న ధైర్యం నీది/అప్పుతెచ్చి వేసిన మిద్దెల్లో/కాలు గాలిన పిల్లిలా తిరుగుతున్న దీనత్వం నీది/ఎండిన స్తనాలమీదికి ఎగబడ్డ బిడ్డల్ని/ఓదార్చలేని శోకం నీది/ఆకలికి ఎండి మాడి ఎరువు సొమ్ములతో/ వీధిన బడ్డసింగారం నీది/అమ్మా భారతీ నీ గమ్యం ఏమిటి తల్లీ/వందేమాతరం వందేమాతరం."*

ఇదొక కోణమైతే, వందేమాతర గీతాన్ని అందరూ ఆలపించాలనడంలో భారతదేశంలో కొంత వ్యతిరేకత కనిపిస్తుంది. దీనికికారణం 'ఆనంద్‌మఠ్' నవలలో ముస్లింలను పారద్రోలాలని, లేదంటే చంపివేయాలని ఓ పాత్ర ద్వారా చెప్పిస్తాడు బంకించంద్ర. ఆ గీతమే తర్వాత కాలంలో మనం ఆలపించుకునే వందేమాతరం. దీని నేపథ్యం నుండే ఒక బలమైన నినాదం మనం వింటున్నాం.' *'భారతదేశంలో ఉండాలంటే వందేమాతరం పాడాల్సిందే!'*. దీనితో పాటు మరొక నినాదం ' *'భారతదేశం అంటే ధర్మసత్రం కాదురా'* అనేది మరొకనినాదం. వీటిలో ఎలాంటి జాతీయోద్యమ స్ఫూర్తి ఉంది? మతపరమైన ఆధిపత్య జాతీయోద్యమ భావజాలం కనిపించడం లేదా? అదే నేడు భారతదేశంలో మనం రాసుకున్న భారతరాజ్యాంగంలోని 'సెక్యులర్' అనే భావనకు తూట్లు పొడుస్తుంది. ఆ పదాన్ని తొలగించాలని నినదించే స్థాయికి వెళ్లింది. 1992లో బాబ్రీ మసీదు కూల్చేదాకా వెళ్ళింది. ముస్లిములను ఊచకోత కోసేదాకా వెళ్లింది. నిండు గర్భిణి, పసిపాపలని చూడకుండా అత్యాచారాలు చేసి హత్యలు చేసేవరకు వెళ్ళింది. ఆ ఆవేశం ముస్లిముకవుల్ని ప్రేరేపించింది.

*'ఈ దేశపటాన్ని చుట్టచుట్టి నీ తలకింద పెట్టుకోవడానికి/అది నీ అయ్య జాగీరు కాదు/ అంగట్లో దొరికే కుంకుమ చొట్టు కాదు దేశభక్తి'*అని సయ్యద్ గఫార్ అనేకవి 1998లో వచ్చిన ముస్లింవాద కవితా సంకలనం *'జల్‌జలా'* నిలదీసేదాకా వెళ్ళింది. ఖాదర్ మొహియుద్దీన్ గారు 1991లో ఫిబ్రవరిలో ప్రచురించిన 'పుట్టుమచ్చ (కవితా సంపుటి)లో.."*పట్టెడన్నం కోసం/ పేవ్‌మెంట్‌ల మీద పూలమ్ముకుంటాను/ పళ్లమ్ముకుంటాను, పల్లీలమ్ముకుంటాను/ గొడుగులు బాగుచేస్తుంటాను గడియారాలు బాగు చేస్తుంటాను/ వీధరుగుల మీద దర్జీ పని చేస్తుంటాను/ దూదేకుతుంటాను దినం గడుపుకుంటాను/ఏ గొడవల్లేకుండా/బతుకును వెళ్లమార్చాలనుకుంటాను/ ఉన్నట్టుండి ఎందుకో మరి/నగరాల నడి వీథిల్లో నా నెత్తురు/ తీర్థ స్నానఘట్టమవుతుంది/ఎన్నికలకు ముందు/ఎన్నెన్నో సంఘటనలకు ముందు/దేశ చరిత్ర దిశానిర్దేశానికి/నా నెత్తురు గూడుపట్టవుతుంది/ పార్లమెంటు భవనంలో వాలేందుకు/నా నెత్తురు పాదలేపనమవుతుంది./నా రక్త పదవీసోపానానికి/*

*అభయ 'హస్త'మవుతుంది/ నా రక్తం 'భరతమాత' నుదుటి/తిలకమవుతుంది. పూజా 'కమల' మవుతుంద'*నడంలో హిందూమతోన్మాదాన్ని ప్రశ్నిస్తాడు.

దీనితో పాటు ముస్లిములను కూడా ప్రాంతాలను బట్టి విభజన చేయడం, దాన్ని ఖండించడం ఒక ధోరణిగా కనిపిస్తుంది. దీనిలో 'మియా'లను అంటే వలస వచ్చిన ముస్లిములను తిట్టుపదంగా చేసి వాడుతున్న మియావాదం'*'ఈ మియా అన్నది అస్సాంలోని ఈశాన్య ప్రాంతపు ప్రజలు, బెంగాలీ ముస్లిములను ఉద్దేశించి వాడే పదం. నిజానికి మియా అన్న పదం దక్షిణ ఆసియాలో, ఉర్దూలో ముస్లిములకి, పెద్దమనిషి అన్న అర్థంలోనే వాడుకలో ఉంది. కానీ అస్సాంలో మాత్రం దాని అర్థం మారిపోయి, అది ఒక కళంకంగా ప్రతికూల అర్థంగా తీసుకున్నారు. ఆ పదం అక్కడి వలసదారులైన ముస్లిము లను కాందిశీకులుగా చూడటం లాంటిది. అక్కడి బెంగాలీ ముస్లిములు దానిని ఒక తిట్టుగానో నిందగానో భావించారు." ( ఆంధ్రజ్యోతిదినపత్రిక,* ముకుందరామారావు, సొంతనేలలో పరాయి మియా కవిత్వం,2022-11-21)

**4. మతపరమైన ప్రత్యేక దేశం లేదా రాజ్య భావన:**

జాతీయోద్యమ భావనల్లో మరొక నూతన భావన మతపరమైన ప్రత్యేక దేశం లేదా రాజ్యం ఏర్పడాలనే ధోరణికూడా ప్రపంచవ్యాప్తంగా కనిపిస్తుంది. దీనితో పాటే ప్రపంచీకరణను ఆధిపత్యదేశాలు తమకు అనుకూలంగా మార్చుకుంటున్న స్థితిని గుర్తించడం కూడా జాతీయోద్యమంలో భాగంగానే చూడాల్సి వస్తుంది. ఇది ఒక ప్రాంతానికీ, ఒక దేశానికీ మాత్రమే చెందింది కాదు. అటువంటి భావనలతో తెలుగు కవులు కూడా కవిత్వం రాస్తున్నారు.

జి. యస్. రామ్మోహన్, ఏప్రిల్ 2003 న *ఆంధ్రజ్యోతి* లో ప్రచురించిన, '*'యుద్ధప్రభు స్తోత్రము."* పద్యం వ్యంగ్యంగా ప్రపంచాన్ని శాసిస్తున్న అమెరికా, తదితర దేశాల ఆధిపత్యాన్ని వ్యతిరేకించాల్సిన అవసరాన్ని ప్రబోధిస్తున్న కవిత.'*'పెద్ద శబ్దముతోనూ, మిరుమిట్లు గొలుపు కాంతులతోనూ నీ రాకడ ప్రకటించుచున్న ప్రభువా/పూమొగ్గలకు కరవాలము బదులొసగిన కరుణామయుడా/పసిబుగ్గలను లోహవిహంగాలతో గిల్లిన క్షిపణాగా/ముల్లోకములకు శక్తిమంతుడవైన అయ్యా/నిన్నేమని పిలిచెదము తండ్రీ./లక్షలాది ఆదిమవాసుల బలిపీఠమును ఆసనముగా/మార్చుకున్న రారాజా/ఏడుజాములలో మెసపొటేమియా చంద్రుణ్ణి ఎర్రబార్చిన వాడా/ ఆదియు అంతమూ మూలమూ లేక అంతటా నీవై/కంచరగాడిదలా సంచరించు సర్వేశ్వరా/ అణువు పరమాణువు అన్నీ తానైన వాడా/నిన్నెన్నని అనమురా నాయనా/రంగునీళ్ళిచ్చి రక్తాన్ని కొలుచుకు పోగలిగిన బుద్ధిశాలీ/సమాచారమే జ్ఞానమని, బలమే సత్యమని మా చక్షువులు తెరిపించిన దివ్యమూర్తీ/నీ రక్తముతో పాప పరిహారము చేసుకొనుటకు లోకము వేచియున్నది నాయనా/ నీఘనతను బలపరుచుటకు/ఒక శిలువను తయారుచేయుచున్నారము తండ్రీ./ఆమెన్/*

ఇది క్రైస్తవ మతంలోని అనేక ప్రతీకలను ఉపయోగించుకొని రాసిన కవిత. ప్రేమను పంచిన క్రైస్తవమతం, క్రైస్తవమతాన్నే ప్రధానంగా చేసుకొని పరిపాలించే ప్రజాస్వామ్యదేశం చేస్తున్న ప్రేమరాహిత్యాన్ని, దోపిడినీ తూర్పారబట్టిన కవిత. ఇటువంటి ప్రతీకలే ఇతర మతాలకు చెందిన



ISSN No.2319-3905

ముఖ్యంగా హిందూ, ముస్లిం ప్రతీకలతో భారతదేశంతో సహా, ఇతర దేశాల్లో జరుగుతున్న ఆధిపత్యాన్ని ఖండిస్తూ వచ్చిన కవితలు కూడా జాతీయోద్యమంలో కొత్త భావనలకు నిదర్శనాలుగానే భావించాలి.

*"నేను పుట్టకముందే/దేశద్రోహుల జాబితాలో/నమోదై ఉంది నాపేరు/…/ఒక అందమైన తోట/ఆ తోటలో రకరకాల పూలు/ రంగురంగుల పూలు గులాబీలు మందారాలు చమేలీలు/ మొగలిపూలు బంతిపూలు గుల్ మొహర్‌లు/అన్ని రకాల పూలతో చాలా అందంగా కనబడుతుందా తోట/అయితే/ఆ పులన్నింటినీ నలిపేసి, తొక్కేసి, నరికేసిఒక్క కమలమే విస్తరించాలంటే/ఆ తోట అందమంతా ఏమైపోతుంది?!*అన్నాడు *జల్‌జలా* (1998) కవి ఆఫ్రీన్.

ఒకప్పుడు స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం భావనలు, సంస్కరణోద్యమం పేరుతో అందరినీ కలుపుకుపోయిన భావనతో మన రాజ్యాంగంలోకి వచ్చిన సెక్యులర్ పదం నేడు చర్చనీయాంశమైంది.

**5. తెలంగాణ విమోచనోద్యమం-పీడన విముక్తి భావనలు:**

మరొకవైపు 1947 ఆగస్టు 14 అర్ధరాత్రి దాటి ఆగస్టు 15 ప్రవేశించగానే భారతదేశం స్వతంత్ర దేశంగా అవతరించింది. కానీ హైదరాబాద్ రాజ్యం మాత్రం నిజాం నవాబు ఇనుప సంకెళ్ళ నుంచి విముక్తి పొందలేదు. ఇండియన్ యూనియన్‌లో హైదరాబాద్ సంస్థానం విలీనం కావాలని ప్రజలు కాంక్షించారు. మాడపాటి, బూర్గుల, రావి నారాయణరెడ్డి, దేవులపల్లి తదితరులు నిజాం రాజుకు వ్యతిరేకంగా ఉద్యమించారు. ప్రజా వ్యతిరేకతను అణచివేయడానికి నిజాం ప్రోద్బలంతో ఖాసీం రజ్వీ నేతృత్వంలో రజాకార్లు ఎన్నో అకృత్యాలకు పాల్పడ్డారు. ఇదే సమయంలో కమ్యూనిస్టులు సాయుధ పోరాటాన్ని ప్రారంభించారు. పీడనకు వ్యతిరేకంగా ఎందరో కవులు కలాలతో గళాలు వినిపించారు.

*'ఓ నిజము పిశాచమా! కానరాదు/ నిన్ను బోలిన రాజు మాకెన్నడేని తీగెలను తెంపి అగ్నిలోకి దింపినావు/ నా తెలంగాణ కోటి రతనాల వీణ'* అని దాశరథి అంటే…*'మన కొంపలార్చిన – మన స్త్రీలను చెరిచిన/ మన పిల్లలను చంపి – మనల బంధించిన/ మానవాధములను – మండలాధీశులను కండకండగా కోసి కాకులకు వేయాలే కాలంబు రాగానే కాటేసి తీరాలే!'* అని ప్రజాకవి కాళోజీ గర్జించారు. బండెనక బండి కట్టి పదహారు బండ్లు కట్టి ఏ బండ్లో పోతావ్ కొడుకో నైజామ్ సర్కరోడా అంటూ యాదగిరి గళం ఖణేల్ మంది. 'వెయ్ వెయ్యరా వెయ్యి *ఇయ్యారా! మయ్యారా వెయ్యి'* అని సుద్దాల హనుమంతు పాటలనే ఈటెలుగా మలిచాడు అని భూపతి వెంకటేశ్వర్లు ఒక వ్యాసంలో తెలంగాణాలో స్వాతంత్ర్యానంతరం కూడా కొనసాగిన జాతీయోద్యమ స్ఫూర్తి, స్వేచ్ఛ కోసం పడుతున్న తపనను వివరించారు. ఇది కేవలం తెలంగాణాలోనే కాకుండా భారతదేశంలోని సంస్థానాలన్నింటిలోను స్వాతంత్ర్యానంతరం కొనసాగిన జాతీయోద్యస్ఫూర్తికీ, పీడనలనుండి విముక్తి కోసం జరిపే పోరాటానికి నిదర్శనంగా నిలుస్తుంది.

ఫ్రెంచి విప్లవం ఫలితంగా ప్రపంచవ్యాప్తంసగా వ్యాపించిన స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం అనే భావనలు ఇంచుమించు అన్ని దేశాల సాహిత్యాలలోను ప్రతిఫలించాయి. అలాగే, తెలుగుసాహిత్యంలోనూ కనిపించసాగాయి. ఇవన్నీ భారత జాతీయోద్యమం ప్రభావంతో భారతదేశంలోని అన్ని భాషల సాహిత్యాలను ప్రభావితం చేసినట్లే తెలుగు సాహిత్యాన్ని కూడా ప్రభావితం చేశాయి. తెలుగు సాహిత్యంలో హిందూవులు అనేది భారతజాతి అంతా ఒకటే అనే అర్థంలో ప్రయోగించారు. అయినప్పటికీ హిందూమతంలోని కులం వల్ల అస్పృశ్యత ఒక జాఢ్యంగా మారింది. దాన్ని స్పష్టంగా గుర్తించిన కవులు అస్పృతానివారణ దృష్టితో సాహిత్యాన్ని రచించారు. అయినప్పటికీ పరాయి పాలనను వ్యతిరేకించేసాహిత్యంగానే దాన్ని కూడా చూడాలి. కానీ, భారతదేశ అంతర్గత సంఘర్షణలలో భాగంగా దేశ స్వాతంత్ర్యోద్యమానికి ముందుగానే పరిష్కరించుకోవాల్సిన అంశాలుగా అంటరానితనాన్ని ఒక సమస్యగా పైకి తీసుకొచ్చారు. అందువల్ల సంస్కరణోద్యమం జాతీయోద్యమంలో భాగమయ్యింది. అన్ని వర్గాలకు దేవాలయ ప్రవేశంతో పాటు, ఏ వృత్తి చేసినా దాన్ని గౌరవప్రదంగా చూడాలనే భావనలు జాతీయోద్యమంలో ప్రచారంలోకి తీసుకొచ్చారు. దాని వల్ల అంటరానితనం పాపంగాను, నేరంగాను భావించడమే కాకుండా, భారతరాజ్యాంగంలో అంటరానితనాన్ని నిర్మూలించేందుకు ప్రత్యేకమైన చట్టాలు కూడా తీసుకొచ్చారు. ఆ కులాలకు ప్రత్యేకమైన రిజర్వేషన్లు కల్పించారు. వీటన్నింటినీ సాహిత్యంలో ప్రతిఫలించేలా రచనలు కనిపిస్తున్నాయి. ఇవన్నీ జాతీయోద్యమ సాహిత్యంలో కనిపించే నూతన భావనలుగానే పరిగణించాలి.

**ఆధారగ్రంథాలు:**


నారాయణరెడ్డి, సి. (1999, తృతీయ ముద్రణ) ఆధునికాంధ్ర కవిత్వము- సంప్రదాయములు: ప్రయోగములు.

విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్: హైదరాబాద్. 1967, ప్రథమ ముద్రణ.

రాఘవశర్మ, గురజాడ. (సంపా.). 1973). జాతీయగీతాలు (సంకలనం). ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ:హైదరాబాద్.

రామారావు, ముకుంద. సొంతనేలలో పరాయి మియా కవిత్వం (వ్యాసం), ఆంధ్రజ్యోతిదినపత్రిక, 2022-11-21.

వెంకటేశ్వరరావు, వేలూరి. ఈమాట అంతర్జాల మాసపత్రిక, సెప్టెంబరు-2005.

సత్యనారాయణ, ఎస్వీ, (1991). తెలుగులో జాతీయోద్యమ గీతాలు. విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్: హైదరాబాద్.




ISSN No.2319-3905

# 2

# జానపద సాహిత్యంలో రామాయణం

**- ఆచార్య పేట శ్రీనివాసులు రెడ్డి**

రామాయణం లోకోత్తర మహత్తర గ్రంథం. సీతారాములు ఆదర్శ దంపతులు. వాల్మీకి మహాముని సంస్కృతంలో రామాయణాన్ని అద్భుతంగా రచించాడు. వాల్మీకి రామాయణాన్ని అనుసరించి, అనుకరించి ఎందరో ఆయా భాషల్లోకి అనువదించుకొన్నారు. ఇతిహాసాలైన రామాయణం, మహాభారతం ఒకప్పుడు జానపదులు పాడుకొనే వీరగాథల నుండే ఆవిర్భవించాయని కూడా అంటారు. తెలుగు జానపదులు రామాయణానికి సంబంధించిన అంశాలను తమ సాహిత్యంలో పాడుకొని, చెప్పుకొని ఆనందించారు. తెలుగు జానపదులు సీతారాములను స్వయంగా చూసినట్లున్నారు. వారికి రాముడు కన్నతండ్రి, సీతమ్మ కన్న తల్లి. తెలుగు జానపదులు సీతారాములు తమ ప్రాంతానికి చెందినవారిగానే భావించారు. వారు సంచరించిన కొండాకోనలు, అరణ్యాలు, నదులు, పర్ణశాలలు తమ సమీనంలోనివిగానే తలచారు. జానపద సాహిత్యంలో నాలుగు విభాగాలున్నాయి. అవి - 1) జానపద కవిత్వం, 2) గద్య కథనాలు, 3) సామెతలు, 4) పొడుపు కథలు ఈ నాలుగు విభాగాల్లోనూ జానపదులు రామాయణానికి సంబంధించిన విషయాలను ప్రస్తావించారు.

### 1. జానపద కవిత్వంలో రామాయణం:

జానపద కవిత్వం రెండు విభాగాలు అవి - 1.జానపద గేయాలు 2. జానపద కథా గేయాలు.

### 1.1. జానపద గేయాల్లో రామాయణం:

జానపద గేయాల్లో భావాంశాలుంటాయి. తెలుగు జానపదులు ఉదయం నిద్రలేచింది మొదలు రాత్రి పడుకొనే వరకు సీతారాములకు సంబంధించిన ఎన్నో గేయాలను పాడుకోవడాన్ని మనం నేటికీ చూడొచ్చు.

మన జానపదులు తెల్లవారు జామున నిద్రలేస్తూనే మేలుకొలుపు పాడుకోవడం పరిపాటి. తాము నిద్రలేచి శ్రీరాముడిని కూడా మేల్కొలపడానికి ఎలా పాడుతారో చూడండి.

ISSN No.2319-3905

"మేలుకో శ్రీరామా – మేలుకో రఘురామ
మేలుకొని మమ్మేలు కోవయ్యా"

అలాగే సీతాదేవి మేలుకొలుపు పాటను గమనించండి–

"కాకులన్నియు లేచి కావుకావుమని – కూయుచున్న వింకలేవే
కాకాసురుని మీద కోపగించియున్న – కలికి చిలుకలకొలికి లేవే
జనకునింట నీవెప్పుడు ఈలాగు – జాగు చేయుట లేదు లేవే
జల్తారు నీ కొంగు చక్కజేసుకొని – జనకపుత్రిక వేగ లేవే"

ఇలా మేలుకొలుపుల్లో సీతారాములను గూర్చి జానపదులు పాడుకొన్నారు. ఇక లాలి జోలపాటల్లో కూడా బాలరామునికి సంబంధించిన అనేక పాటలున్నాయి. కింది గేయాన్ని చూడండి–

"పుట్టుకింత నెయిబోసి – పుత్రూనీ నేనుగంటీ
నీళ్ళూ బోసిన గానీ నిద్దూరూపినగాని
నిదురాబోదమ్మా శ్రీరాములు – బెదిరినాడేమో
రాతికింత నెయిబోసి – రాములనీ నేనుగంటి
పాలుదాపిన గాని – పండాబెట్టిన గాని
నిదురాబోదమ్మా శ్రీరామూలు – బెదిరినాడేమో
బంగారి ఉయ్యాలా – ఎండీవీ గొలుసూలు
ఉయ్యాల్లో పండేసి లాలిపాడిన గాని
నిదురా బోదమ్మా శ్రీరామూలు – బెదిరినాడేమో
కైకోయి, కమసిల్య, సుమత్రి ముగ్గూరు
ఉయ్యాల్లో పండేసి జోల పాడిన గాని – ॥నిదురా॥
పచ్చానీ పసుపూలా తెల్లాటీ సున్నాము
ఎరినీళ్ళు కలిపినా తీసిపోసిన గాని ॥నిదురా॥
బంగారీ కిరీటం, సిరిసున ధరియించి
శిరసునా ధరియించీ శివపూజ జేసీనా ॥నిదురా॥
గోటీగయా సుతుడు బాలల జతగూడి
యా బాల జత గూడి యాగాలి సోకిందో ॥నిదరా॥"

సీతారాముల కల్యాణం మీద జానపదులు అనేక గేయాలను పాడుకొన్నారు. జానపదులు పాడుకొన్న దిగువ కల్యాణం పాట కొద్ది మార్పులతో సీతారామ కల్యాణం సినిమాలో కూడా చోటుచేసుకొని ఎంతో ప్రాశస్త్యం చెందింది. ఆ గేయాన్ని గమనించండి–

'కల్యాణము చూతము రారమ్మ
అయోధ్యారాములు కల్యాణము చూతము రారమ్మ



చూచు వారలకు చాల పుణ్యమట
భక్తాగ్రేసర ముక్తిదానమట
కల్యాణము చూతము రారమ్మ
అయోధ్యారాముల కల్యాణము చూతమురారమ్మ
భేరి మృదంగ దమరగానమట
గజరోహన పవీరని గార్లట
వింత వింతమగు విన్యలేలమట
వీనుల విందగు వినగ సన్నాయట
తెల్లని గోవుల బృంద మృదంగము
భజనలు ప్రార్థనలు భక్తుల నృత్యము
అత్యద్భుతముగ ఆనందముగా
కులుకుచు పలుకుచు కలకలలాడెడి ॥కల్యాణం॥
ముస్తాబిందిన ముచ్చటేనిగపై
మెత్తని పానుపు మోరి మనంబారట
అంబారపై అలరతేజమున
దగదగ మెరిసెటి దివ్యారాములట
.... ..... ..... "

తెలుగు జానపదులకు వాలి మీద కూడా చాలా ప్రేముంది. వాలిని గురించి, రామాయణంలోని ఇతర అంశాలపై కూడా అనేక గేయాలను పాడుకొన్నారు. కింది వాలి గేయాన్ని చూడండి–

"వాలిరావో వాలీ – వాలె సదుణ సాలె
కారణ మెంతుండేనే ఓ వాలే
ఆ వాలి పండేటి వమసల్ల పానుపు
సుగ్రీవు పాలెయెనే ఓ వాలీ
ఆ వాలి తలా కుగులూ నెమిలీ కుచ్చులు బోలు
యా దేవుదమెరించెనే ఓ వాలి
ఆ వాలి పలు వరుస సన్న బీమూలు వేల
యా దేముడమరించెనే ఓ వాలి
ఆవాలి సేతులూ చెరుకు పిచ్చలు వేల ॥యాదేముడు॥
ఆ వాలి పెనుదొడలు వరటి స్తంబములేలు ॥యా॥
ఆ వాలి గట్టేటి పులుసు దుంపీరాలు ॥యా॥

ఆ వాలి పెట్టేటి వమసల్ల కమ్మలు

సినదాని పాలెయెనె ఓ వాలి

పొదల సాటునా దాగె వాలెను వెవెవ్వరే

ఎదురు బాణము లిడుతునూ ఓ వాలె"

లంకాదహనం తర్వాత హనుమంతుడిని బంధించి సభకు తీసుకొని రాగా రావణాసురిడికి హనుమంతునికి జరిగే సంవాదాన్ని జానపదులు చక్కగా పాడుకొన్నారు. గమనించండి–

"ఏమిరా వానరుడా ఎందుండి వస్తివీ ఎవ్వరంపీనారురా

దశరథా మహరాజు తనయుడగు శీరాము దయను బంపగవస్తినీ

నీ నామమేదిరా నిక్కంబుగా దెల్పు వినువిడుత నేనిప్పుడో

నా నామ హనుమంత అంజనీ పుత్రుడను నాకెవ్వరడ్డంవ్వబురా

హనుమంత ఈ వార్ధి నలవిగాదెవ్వరికి

అది యెట్లు దాటితివిరా

అడుగకే నొక్కంగ నడుగకే చాలదునది అనగ నాకెంతరా

వచ్చి చెప్పిన పనులు వరుసతోడనె

యిపుడు వదలక నిక జెప్పరా

వచ్చి సీతమ్మకు యిచ్చి ముద్రిక నేను

సొచ్చితిని ఈలంకరా

సొచ్చితే నిన్నింక అచ్చితుడు వచ్చినా

హెచ్చరిక నీవిడువరా

.... .... ...."

ఇలా జానపదులు రామాయణ సంబంధ అంశాలనెన్నింటినో తమ గేయాల్లో పాడుకొన్నారు.

### 1.2. జానపద కథా గేయాల్లో రామాయణం:

జానపద కవిత్వంలో జానపద కథా గేయాలు మరో విభాగం. జానపద కథా గేయాల్లో కథాంశాలు ప్రధానంగా ఉంటాయి. ఇవి పైకి పాటలా కనిపించినా లోపల కథను కలిగి ఉంటాయి. జానపద కథాగేయాలను వింటే మనకు ఒక కథ చెప్పబడుతుంది. జానపదులు రామాయణానికి సంబంధించిన అనేక కథా గేయాలను పాడుకొన్నారు. జానపద రామాయణానికి ముగ్ధులై గోన బుద్ధారెడ్డి రంగనాథ రామాయణాన్ని రాస్తే, భాస్కరుడు భాస్కర రామాయణాన్ని రాశారని చెప్పవచ్చు. జానపద రామాయణాలను పరిశీలిస్తే అవి – కూచకొండ రామాయణం, శారద రామాయణం, ధర్మపురి, సూక్ష్మ, సంక్షేప, గుత్తెన దీవి, చిట్టి, ఆధ్యాత్మ రామాయణాలెన్నో ఉన్నాయి.





ఇక రామాయణంలో కొన్ని భాగాలను మాత్రమే తెలిపే కథా గేయాలెన్నో ఉన్నాయి. అవి – శాంతా కల్యాణం, పుత్ర కామేష్ఠి, కౌశల్య బైకలు, కౌశల్య వేవిళ్ళు, శ్రీరామజననం, రాఘవ కల్యాణం, లక్ష్మణ దేవర నవ్వు, ఊర్మిళాదేవి నిద్ర, పాతాళహోమం, లంకాయాగం వంటివెన్నో ఉన్నాయి.

ఒక్క సీతమ్మ వారి మీదనే ఎన్నో కథా గేయాలను జానపదులు పాడుకొన్నారు. అవి – సీత పుట్టుక, సీత సమర్త, సీతాకల్యాణం, సీత శుభగోష్ఠి, సీత గడియ, సీత వామన గుంటలు, సీతమ్మ వారి అలుక, సీత ముద్రికలు వంటివెన్నో చోటుచేసుకొని ఉన్నాయి. తెలుగు జానపదులు సీతారాములే కాకుండా ఊర్మిళా మహా సాధ్వీమణి పైకూడా పాడుకొన్నారు. కింది ఊర్మిళా దేవి నిద్ర కథా గేయాన్ని గమనించండి–

రాముడు సీతను అడవికి బయలుదేరవద్దన్నా ఆమె రాముడి వెంట వెళ్ళింది. సీతారాములకు సేవలు చేయడానికి లక్ష్మణుడు బయలుదేరి వెళ్ళాడు. ఊర్మిళాదేవి తాను కూడా లక్ష్మణుని వెంట వస్తానని వేడుకొంది. లక్ష్మణుడికి ఊర్మిళాదేవి పానకంలో పుల్లలాగా కనిపించింది. ఏదో కుంటి సాకుతో–

"బావ నడచిన మార్గమున నడువరాదందురూయేలాగు వేగింతునూ

బావ మాటల ధ్వని భూమిపై వినరాదు యేలాగు వేగింతునూ"

అని లక్ష్మణుడు ఊర్మిళను ఇంటిలోనే ఉండమని ఆజ్ఞాపిస్తాడు. ఊర్మిళ భర్త ఆజ్ఞను శిరసా వహించింది. ఆనాటి నుండి ఊర్మిళా దేవికి పద్నాలుగేండ్లు నిద్ర. వనవాసం తర్వాత అయోధ్యకు వచ్చిన లక్ష్మణుడు భార్య దగ్గరకెళ్లకుండా శ్రీరామ పట్టాభిషేకంలో అన్నగారికి వింజామరలు వీస్తూ ఉంటాడు–

'శ్రీ రామ భూపాలుడూ పట్టాభిషిక్తుడై కొలువుండగాను

భరత శతృఘ్నులపుడూ సౌమిత్రి వరుస సేవలు సేయగా

మారుతాత్మజులపుడూ రాఘవుల జేరి పాదములొత్తగా

సుగ్రీవుడా కొలువులో కూర్మితో నమ్ముడై కొలువుండగా

తుంబురులు నారదులునూ యేతెంచి నిలచి గానము సేయగా'

సీతాదేవి వచ్చి శ్రీరామచంద్రునితో ఇలా అంటుంది–

"దేవ దేవేంద్ర వినుమా విన్నపము తెలిపేను చిత్తగింపు

ధరణీశుడవతరించ ఒక చిన్న మనవి కద్దని పలికెను

ముందు మన మడవులకును పోగాను ముద్దుమరిది వెంటనూ

పయనమై రాగ జూచి తన చెలియ పయనమాయెను ఊర్మిళా

వద్దు నీవుండు మనచు సౌమిత్రి మనల సేవింప వచ్చే

నాడు మొదలు శయ్యపై కనుమూసి నాతి పవళించుచున్నది

యికనైన యానతిచ్చీ తమ్ముని యిందు ముఖి కడకంపుడి"

అని సీతమ్మ రామునికి చెప్పి లక్ష్మణునికి సెలవిప్పించింది. ఆలస్యం చేయకుండా లక్ష్మణుడు ఊర్మిళా శయ్యా గృహానికి చేరుకొంటాడు. లక్ష్మణుడు ఊర్మిళ అందచందాలను మెచ్చుకొంటూ ఆమెను పలకరించాడు. పద్నాలుగేళ్ళు నిద్రామత్తులో మునిగి ఉన్న ఊర్మిళకు ఎవరో పరపురుషులు అంత:పురంలోకి వచ్చినట్లునుకొంటుంది. లక్ష్మణుని మందలిస్తుంది. ఈ మందలింపు వల్ల ఊర్మిళ సిగ్గు, సౌశీల్యం చెప్పబడ్డాయి. తర్వాత లక్ష్మణుడు తనను తాను తెలియపరచుకొంటాడు. లక్ష్మణుడు ఆమె ఆవేదనను అర్థం చేసుకొంటాడు. తాను కూడా నిద్రాహారాలు మానని సంగతిని చెప్తాడు. జరిగిన సంగతులన్నింటినీ ఆమెకు చెప్తాడు. అందరూ సుఖంగా తిరిగొచ్చినందుకు ఊర్మిళ సంతోషపడ్తుంది.

లక్ష్మణదేవర నవ్వు:- 'ఊర్మిళాదేవి నిద్ర' కథా గేయానికి దగ్గర సంబంధం ఉండే కథాగేయమే లక్ష్మణ దేవర నవ్వు. ఇది జానపదుల మనస్తత్వాన్ని బాగా ప్రతిఫలిస్తుంది.

యుద్ధంలో రావణుని చంపేసిన తర్వాత సీతారాములు అయోధ్యకు తిరిగి వస్తారు. ఆ తర్వాత శ్రీరామ పట్టాభిషేకం సకల దేవతల సమక్షంలో జరుగుతుంది. ఆ నిండు సభలో లక్ష్మణుడు కిలకిల నవ్వుతాడు. అకారణంగా లక్ష్మణుడు. నవ్వినందుకు కొలువులోని సభ్యులంతా గుమ్మడి కాయల దొంగలంటే భుజాలు తడుముకున్నట్లు అవమాన పడ్డారు. అక్కడున్న వారంతా ఎవరి లోపాలను వారు తలచుకొని తలలు వంచుకొన్నారు. ఇలా సభలోని వాళ్ళను లక్ష్మణుడు అవమానం చేసినందుకు రాముడు కోపించి తన ఒరలోని కత్తిని దూసి లక్ష్మణుని తల నరకబోతూ నవ్వుకు కారణం అడుగుతాడు. లక్ష్మణుడు తన అన్నతో ఇలా అంటాడు. మనం అడవులకు పోయినప్పుడు ఒక రాత్రి పర్ణశాలలో మీరు నిద్రిస్తుండగా చేతిలో విల్లంబులను ధరించి నేను కాపలా వున్నాను. ఆ రాత్రి చీమ మొదలు సింహం వరకు నిద్రలో మునిగి ఉన్నాయి. నేనొక్కడినే మీ సేవకోసం మేల్కొని ఉన్నాను. నన్ను సమీపించడానికి ధైర్యం చాలని నిద్రాదేవి గోదావరి గల గలల్ని ఉపశ్రు తిగా చేసుకొని ఏడుస్తూ ఉంది. ఆమె దగ్గరకెళ్ళి కారణమడుగగా, నాయనా నేను నిద్రాదేవిని అష్ట దిగ్గజాలు, ఆది మహాఋషులు, సప్త సముద్రాలు, నిద్రలో మునిగాయి. అయితే నా ప్రభావం నీ మీద పడడం లేదు. ఇది ప్రకృతికి విరుద్ధం, నాకు అవమానం అని పలికింది. అప్పుడు నేను నిద్రాదేవికి సాష్టాంగపడి నా నిద్రను కూడా ఊర్మిళాదేవికి ఇవ్వమని బతిమాలగా ఆమె సరేనని వెళ్ళిపోయింది. మళ్ళీ ఈనాడు నిండు కొలువులో నన్నావరింప వచ్చింది. అందుకే నవ్వానని చెప్తాడు. ఈ సంగతిని తెలుసుకొన్న రాముడు హతాశుడై పోతాడు. తన తమ్ముడు చేసిన త్యాగానికి కృతజ్ఞత లేకుండా ఇలా కత్తి దూసినందుకు సిగ్గుపడి, ఎత్తిన కత్తితో తన తల నరుక్కోబోతాడు శ్రీరాముడు. అయితే పక్కనే ఉన్న వసిష్ఠ వాసుదేవాదులు అడ్డుపడ్డారు. దీనికి ప్రాయశ్చిత్తంగా వశిష్ఠుడు ఇలా అంటాడు-





"....... భూమీశ మీకిట్లు బుద్ధి గాదయ్య

మీరు లక్ష్మన్నకే నిద్ర పటమమర్చీ పాదాలు వత్తుమని పలికెరాముని

ఆ మాట విని యపుడు సంతోషముగను...!"

రాముడు సరేనంటాడు. లక్ష్మణుడికి ఆరోజు పద్నాలుగేళ్ళ నిద్ర. రాముడు లక్ష్మణుని దగ్గర కెళ్ళి నిద్రాభంగం కలగకుండా కాళ్ళొత్తడానికి ఉపక్రమించాడు. ఒకసారి ఒత్తితే ఊరుకొన్నాడు. రెండోసారి ఒత్తితే కల అనుకొన్నాడు. మూడవ సారికి కనువిప్పి చూస్తే కలకాదు నిజమనుకొని కడు భీతి చెంది లక్ష్మణుడు రాముని కాళ్ళపై పడ్డాడు. రాముడి తమ్ముడ్ని లేవదీసి గౌరవిస్తాడు. కొత్త పెళ్ళికొడుకలకు చేసినట్లు ఆరోజు తమ్ముళ్ళందరికీ శోభనాలను ఏర్పాటు చేస్తాడు రాముడు. మరదళ్ని అందరినీ శత్రుఘ్నుడ్ని అడ్డుగా పెట్టుకొని చూస్తాడు. ఆ రాత్రి అందరూ పాలు పంచదారలా కలిసిపోయారు. తెల్లవారు జాము పొద్దెక్కినా కూడా వాళ్ళు లేవనేలేదు. ఇది చూసి హనుమంతుని పిలిచి భేరీలు మోగించమన్నారు. ఆ భేరీ మృదంగాల శబ్దాలకు అన్నదమ్ములు అదరిపడి లేచారు. జానపదులకు హనుమంతుడు కూడా పరమదైవం. హనుమంతునికి కొన్ని కోతి చేష్టలైనా కల్పిస్తారు. శోభనపు రాత్రి మరుసటి రోజు అయోధ్యలో పెద్దవిందు జరుగుతుంది. శ్రీరాముడు బంధువులు, మిత్రులు, ఆప్తులతో కలిసి భోజనం చేస్తుంటాడు. అయితే వాళ్ళు హనుమంతుడ్ని మరచిపోతారు. అక్కడికి వచ్చిన హనుమంతుడు అలిగాడని తెలుసుకొని రాముడు హనుమంతుని ప్రాధాన్యాన్ని తెల్పుతాడు. అయినా హనుమంతుడు రాముడు తింటున్న పల్లెం తీసుకొని అక్కడున్న వాళ్ళందరికీ ప్రసాదంగా పంచి చెట్టెక్కి కూర్చుంటాడు. రాముడు హనుమంతుడ్ని రమ్మని పిలుస్తాడు. అప్పుడు హనుమంతుడు రామచిలకలాగ రాముని చేతిపైన వాలతాడు. హనుమన్నను రాముడు మెచ్చుకొంటూ ముత్యాలహారాన్ని మెడలో వేస్తాడు.

ఇలా జానపదులు తమ కథా గేయాల్లో ఎన్నో రామాయణానికి సంబంధించిన విషయాలను పాడుకొని తరించారు.

**2.గద్య కథనాలలో రామాయణం:**

గద్య కథనాలనే గద్యాఖ్యానాలని కూడా అంటారు. మనం జానపదం అంటేనే జానపద గేయాలే గుర్తుకొస్తాయి. గద్యమంటే వచనం, ఆఖ్యానమంటే చెప్పడం. వచనరూపంలోఉండే ఈ గద్య కథనాలు మూడు విభాగాలు. పురాగాథలు, ఐతిహ్యాలు, కథలు. ఈ మూడింటిలోనూ రామాయణ సంబంధ విషయాలను జానపదులు ఒకరికొకరు చెప్పుకొని ఆనందించారు. జానపద గేయాల్లాగా ఇవి కూడా జానపదుల శ్రమను పోగొట్టుకోవడానికి, వినోదానికి, ఉల్లాసానికి పొలం పనులు చేస్తున్నప్పుడు పొలం గట్ల మీదనో, ఖాళీ సమయాల్లో ఇళ్ళముందో కూర్చుని గద్య కథనాలను చెప్పుకొనేవారు.

**2.1. పురాగాథల్లో రామాయణం:-**

పురా అంటే పాతది, తొలుతటిది అనే అర్థాలున్నాయి. గాథ అంటే కథే. ప్రాచీనత్వాన్ని తెల్పడం కోసం పురాగాథలని అంటారు. వీటిలో సృష్టి గాథలు, దేవతా సంబంధ గాథలు, ఆచార

సంబంధ గాథలు అనే మూడు విభాగాలున్నాయి. దేవతా సంబంధ గాథల్లో మాత్రం రామాయణ సంబంధ విషయాలు చోటుచేసుకొని ఉన్నాయి. ఉదాహరణకు రెండు పురాగాథలను గురించి తెలుసుకొందాం.

సీతారాములు వనవాసం చేస్తున్నప్పుడు రావణాసురుడు సీతమ్మ వారిని అపహరించి లంకానగరంలోని అశోక వనంలో ఉంచాడు. తర్వాత హనుమంతుని ద్వారా లంకలో సీతమ్మజాడ తెలుసుకొని రావణునిపై రాముడు యుద్ధం ప్రకటిస్తాడు. లంకకు వెళ్ళాలంటే సముద్రంపై వారధిని నిర్మించాలి. వానరులు, తదితరులతో కలిసి లంకపై వారధి నిర్మాణం జరుగుతున్నప్పుడు ఒక ఉడుత తాను కూడా రాముడు నిర్మిస్తున్న వారధి నిర్మాణానికి సహాయపడాలనుకొంటుంది. అందులో భాగంగా ఉడుత మొదట నీటిలో మునిగి ఒడ్డునున్న ఇసుకలో పొర్లి ఆ తర్వాత నీళ్ళలో మునుగుతూ ఇసుక రేణువులను సముద్రంలోకి చేర్చడం చేయసాగింది. దీనిని చూసిన రాముడు ఉడుత భక్తిని మెచ్చుకొని దానిని ప్రేమ పూర్వకంగా ఎడమ చేతిలోకి తీసుకొని కుడిచేతి వేళ్ళతో ఆప్యాయంగా నిమిరాడు. ఉడుత వీపు రాముడు నిమరడం వల్ల మూడు వేళ్ళ గుర్తు పడి మూడు నామాలు పెట్టినట్లు అయింది. అప్పటి నుండి ఉడుత జాతికి వీపులో రాముడు ప్రసాదించిన మూడు నామాలు నిలిచిపోయాయి. మరో పురాగాథను గమనించండి–

సీతారాములు అరణ్యవాసం చేసేటప్పుడు ఒకరోజు సీతమ్మ మాంసపు వడియాలు ఎండబెట్టుకొంటుంది. ఆ సమయంలో ఒక కాకి అక్కడకు వచ్చి మాంసపు వడియాలను తినడం మొదలు పెట్టుంది. సీతమ్మకు కోపం వచ్చి కాకాసురుడి మీద ఒక మట్టి పెళ్ళను విసురుతుంది. కోపంతో కాకి సీతమ్మ వారి వక్షః స్థలంపై వాలి, వక్షః స్థలంపై పొడిచి ఒక మాంసం ముక్కను కరచుకొంటుంది. బాధకు అల్లాడిపోతున్న సీతమ్మ చీర కట్టు వదలడం వల్ల నడుంకున్న వడ్డాణం ఊడిపోతుంది. చేతికి దొరికిన ఆ వడ్డాణాన్ని తీసి సీత కాకిని కొట్టబోతుంది. కొలనులో స్నానం చేసి తడిబట్టల్తో వస్తున్న రాముడు చూసి కాకిని కొట్టడానికి వడ్డాణం విసురుతున్నావేంటి? అని నవ్వుతాడు. రాముడొచ్చేసరికి కాకి వెళ్ళిపోతుంది. కాసేపు అయ్యాక సీతమ్మ అలసిపోయి రాముడి ఒడిలో తలపెట్టి నిద్రపోతుంది. సీతమ్మ విశ్రమించాక రాముడు సీతమ్మ ఒడిలో తలపెట్టి నిద్రపోతాడు. ఇదే అదునుగా కాకి మళ్ళీ వచ్చి సీతమ్మ వక్షః స్థలంపై వాలి ముక్కుతో పొడిచి మాంసాన్ని తింటుంది. అయినా తన భర్తకు నిద్రాభంగం కలగకూడదని సీతమ్మ వారు నొప్పిని భరిస్తుంటుంది. సీతమ్మ వక్షః స్థలం నుండి రక్తం కారి రాముడి నుదురు మీద పడుతుంది. రాముడు వెంటనే పైకి లేచి కింద ఉన్న దర్భను తీసి మంత్రించి బ్రహ్మాస్త్రంగా ఆ కాకాసురుడిపై ప్రయోగించాడు. ఆ అస్త్రం నుండి తప్పించుకోవడానికి కాకి అన్ని లోకాలు తిరుగుతుంది. అయినా కాకిని ఎవరూ రక్షించలేదు. ఇకచేసేది లేక ఆ కాకి రాముడి దగ్గరకొచ్చి వేడుకొంటుంది. అప్పుడు సతారాములు శాంతిస్తారు. బ్రహ్మాస్త్రం నుండి తప్పించుకోవాలంటే శరీరంలోని ఏదో ఒక దానిని సమర్పించాలంటాడు రాముడు. అప్పుడు ఆ కాకాసురుడు తన కుడి నేత్రాన్ని





ఇచ్చేయడం వల్ల ఒక కన్నుచూపు కోల్పోతుంది. అప్పటి నుండి ఇంద్రుడి కుమారుడైన కాకాసురుని వంశానికి చెందిన కాకులకు ఒక కన్నుమాత్రమే కనిపిస్తుంది.

ఇలా పురాగాథల్లో రామాయణ అంశాలు చోటుచేసుకొని ఉన్నాయి.

**2.2. ఐతిహ్యాలలో రామాయణం:**

ఇతిహాసం లేదా చరిత్ర ఐతిహ్యానికి ఆధారం. నిర్దిష్ట స్థలం, వ్యక్తి లేక సంఘటనలను గురించిన మౌఖిక, సాంప్రదాయక వివరణే జానపద ఐతిహ్యం. ఐతిహ్యాలు కథలకంటే చాలా చిన్నవి.

**శ్రీరాముడు కాలు మోపిన కొండ:**

శ్రీ వేంకటేశ్వర స్వామి తిరుమలలో వెలయక ముందు ఈ కొండపై శ్రీరాముడు కాలుమోపాడట. త్రేతాయుగంలో సీతను రావణుడు ఎత్తుకెళ్ళినప్పుడు లంకపై శ్రీరాముడు దండయాత్ర చేశాడు. ఆ సమయంలో వానరులతో పాటు ఈ గిరి మీద కాలు పెట్టాడని అంటారు.

**తిరుపతి కొండలు అడవులు నచ్చిన సీతారాములు:**

సీతారాములు తిరుమల కొండల్లో విహరిస్తూ అరణ్యవాసం చేశారు. అప్పుడు తిరుమలలో వెంకన్న సన్నిధి లేదట. పైగా అంజనేయస్వామి తిరుమల కొండ మీదుండే అంజనాద్రి పర్వతం మీద జన్మించినా అప్పటికి వారి పరిచయం ఏర్పడలేదు. సీతారాములు తిరుమల కొండ, అక్కడి అరణ్యాలు, తీర్థాలు, సెలయేర్లు చూసి పులకించి పోయేవారట. సీతారాములు తిరుమల కొండ మీద ఎంతో మనోల్లాసంగా గడిపారట. చివరలో సీతమ్మ వారు రాముడి నుండి విడిపోయాక తిరుమల కొండకొచ్చి లవకుశలను ప్రసవించిందట. దానినే ఇప్పటికే సీతమ్మ తీర్థమని అంటారు. దీనిని బట్టి సీతమ్మకు తిరుమల కొండంటే ఎంత ఇష్టమో? అని అంటారు.

**రాముల వారి మేడ (రామర్ మేడై)**

ఒకప్పుడు మధురై దగ్గర కురవితురై అనే గ్రామంలో ఒక బ్రాహ్మణుడు రామలక్ష్మణ భరత శతృఘ్నులను పూజించేవాడు. ఉన్నట్టుండి ఒకరోజు ఆవూర్లో అల్లర్లు చెలరేగుతాయి. ఆ రోజు రాత్రి రాముడు బ్రాహ్మణుడికి కలలో కనిపించి తనను తిరుమల కొండకిందకు చేర్చమన్నాడు. అతను అలాగే చేశాడు. అక్కడ రామానుజాచార్యులు తిరుమల నంబి దగ్గర ప్రతిరోజూ రామాయణం వింటుండేవాడు. ఆ రోజు రామాయణం విన్నాక వెనుకకు తిరిగి చూసేసరికి బండ మీద విగ్రహాలు కనబడతాయి. తర్వాత సీత విగ్రహాన్ని రామానుజాచార్యులు చేయించి తిరుమలేశుని ఆలయంలో వుంచాడు. అలా ఆ విగ్రహాలుంచిన ప్రదేశాన్ని రామర్ మేడై అని నేటికీ అంటున్నారు.

**సీత గుండం:**

తిరుమలలోని జాబాలి తీర్థంలో ఆంజనేయస్వామి జన్మించాడని అంటారు. ఇక్కడ ఆంజనేయస్వామి గుడికూడా వుంది. ఈ గుడి వెనుక అంటే పడమర వైపు నీటి గుంట ఉంది.

దీనిని సీత గుండం అంటారు. ఆంజనేయస్వామికి వందలాది సంవత్సరాల నుండి పూజలు నిర్వహించే ఉత్తర భారత దేశం వాళ్ళు 'సీతా కుండ్' అని అంటారు. రావణ వధానంతరం సీతారాములు ఆంజనేయస్వామితో పాటు అయోధ్యకు వెళ్ళేటప్పుడు ఆంజనేయస్వామి జన్మ స్థలాన్ని చూడాలనుకున్నారట. అందుకని వాళ్ళు మార్గమధ్యమంలోని జాబాలి తీర్థంలో ఒక రోజు గడిపారట. సీతమ్మ స్నానమాచరించిన నీటి గుండానికి సీత గుండం అనే పేరొచ్చిందంటారు.

**దశరథ మహారాజు తపస్సు**

దశరథ మహారాజు పుత్ర సంతానం కోసం తిరుమలపై 10 వేల సంవత్సరాలు తపస్సు చేశారట. అతని తపస్సు ఫలించి పుత్ర సంతానం కలిగిందని చెప్తారు.

ఇలా ఐతిహ్యాలలో రామాయణానికి సంబంధించిన అంశాలు చోటుచేసుకొని ఉన్నాయి.

**2.3. జానపద కథల్లో రామాయణం:**

కథలు ముఖ్యంగా మనస్సును రంజింపజేయడానికి, ఉల్లాసానికి ఉద్భవించాయి. అందుకే వీటిలో అద్భుత విషయాలు, రోమాంచక వృత్తాంతాలు, కాల్పనిక సంఘటనలు ఎన్నో ఉంటాయి. ఈ కారణాల వల్ల పురాగాథ, ఐతిహ్యాల కంటే కథలు ఎక్కువ జనప్రియమైనవి. జానపద కథల్లో రామాయణానికి సంబంధించిన అనేక విషయాలు చోటుచేసుకొని ఉన్నాయి. ఇవి వాల్మీకి రామాయణానికి ఎంతో భిన్నంగా ఉండి, ఆశ్చర్యానికి గురి చేస్తుంటాయి. కింద కథను గమనించండి–

రావణాసురుడి కూతురు సీతాదేవి. తన కూతుర్ని రాముడికిచ్చి వివాహం చేస్తాడు. కొన్నాళ్ళ తర్వాత ఎందుకో రాముడి మీద కోపంతో సీతను తీసుకొని వచ్చేస్తాడు. రాముడి దగ్గరకు సీత వెళ్ళాలన్నా పంపించకుండా తన కోటలోని వనంలో బంధించేస్తాడు. ఎంతకూ సీతను పంపించకపోయే సరికి రాముడు విధిలేక తన మామ రావణాసురిడితో యుద్ధం చేసి, రావణుడిని సంహరించి సీతను తీసుకొని వెళ్తాడు.

ఈ కథ వినడానికి విడ్డూరంగా ఉన్నా జానపదులు తమకు నచ్చిన విధంగా కథలను అల్లుకొని చెప్పుకొంటుంటారు. సనకసనందనాదులు జయ విజయులను శపించారు. తర్వాత శాపవిమోచనంలో భాగంగా దుష్టులుగా జన్మిస్తే శ్రీహరిని మూడు జన్మల తర్వాత చేరుకోవచ్చని, మంచి వారుగా జన్మించాలనుకుంటే ఏడు జన్మల తర్వాత మహా విష్ణువుని చేరుకోవచ్చంటారు. తక్కువ కాలంలో శ్రీహరిని చేరుకోవడానికి దుష్టులుగా పుట్టారు. అలా రావణాసుడిగా పుట్టి జన్మను ముగించడాన్ని మనం చూడొచ్చు.

**3. సామెతల్లో రామాయణం:**

జానపద సాహిత్యంలో సామెతలు ఒక ప్రధాన విభాగం. అనుభవమే సామెతల పుట్టుకకు ప్రధాన కారణం. ప్రతి రోజూ జీవితంలో మనం కన్నవీ, విన్నవీ అనుభవించినవీ సామెతల రూపంలో వెలువడుతుంటాయి. మనం మాట్లాడేటప్పుడు సందర్భానుసారం అనేక సామెతలను



ISSN No.2319-3905

ప్రయోగిస్తుంటాం. సామెతలు చిన్నవే అయినా పెద్ద అర్థాన్నిస్తుంటాయి. రామాయణానికి సంబంధించిన ఎన్నో సామెతలు జానపదుల వ్యవహారంలో ఉన్నాయి. కింది సామెతలను గమనించండి–

'సీత పుట్టి లంక చెడె'

'కట్టె ,కొట్టె, తెచ్చె'

'రామ రామ అని రాజ్యం ఏలుదువులే'

'రాయుడున్నాడు రాజ్యముంది'

'రావణ కాష్ఠలా'

'రామాయణంలో పిడకల వేట'

'కూడేవేళ లేని సిగ్గు కొలువులో వచ్చిందా?' (సీతమ్మకు)

'రాత్రంతా రామాయణం విని తెల్లరితో రాముడికి సీత ఏమౌతుంది అన్నట్లు'

'రమాపతే సీతాపతే పొద్దున లేస్తే పొట్టేగతి'

'శ్రీరామ రక్ష నూరేండ్లాయుస్సు'

'నిధి చాలా సుఖమా రాముని సన్నిధి సుఖమా'

'కైక పుట్టి చెరచెగా రాము పట్టంబు'

'కన్నులు కంచాల మీద, నోరు రామ: రామౌ రామా;'

'రాముని పాదాలు తాకితే రాళ్లు రమణులౌతవి'

'రాముడు రాజ్యం చేస్తే నేమి? రావణుడు రాజ్యం చేస్తేనేమి?'

'రాఘవా స్వస్తి రావణా స్వస్తి' (అవకాశవాదులంటారు)

ఇలా సామెతల్లో రామాయణానికి సంబంధించిన సామెతలు చోటుచేసుకొని ఉన్నాయి. అయితే ఇవి ఎక్కువగా లేవు.

**4. పొడుపు కథల్లో రామాయణం:**

పొడుపు కథల్లో కూడా రామాయణ సంబంధ పొడుపు కథలు కొన్నింటిని మనం గమనించవచ్చు. జానపద సాహిత్యంలో జానపద కవిత్వం (గేయాలు, కథా గేయాలు), గద్యాఖ్యానాలు, సామెతలు వైవిధ్యం గల ప్రక్రియలైతే, పొడుపు కథలు వాటన్నింటికన్నా ఎక్కువ వైవిధ్యాన్ని కలిగి ఉన్నాయి. అటు వినోదాన్ని, ఇటు విజ్ఞానాన్ని సమానంగా పంచి యిచ్చే ప్రక్రియల్లో పొడుపు కథకు మించింది లేదు. జానపదులు పొడుపు కథల్ని శ్రమను పోగొట్టుకోవడానికి, వినోదానికి చెప్పుకుంటుంటారు. రామాయణానికి సంబంధించిన పొడుపు కథల్ని గమనించండి.

1. 'వంకర మూతి రామ సిలక
   పట్నమంత పొడుచేసే' (ఆంజనేయస్వామి)
2. 'రాముడు సీత పుట్టక ముందు

లంకల దీపం పెట్టక ముందు  నేను పుట్టాను' (ఉప్పు)

3. 'ఆలి పంచాయితీ (రామాయణం)

పాలి పంచాయితీ (భారతం)

4. చేసిన చేష్టలు ఎవరూ చూడరు కాని

కోసిన ముక్కు అందరూ చూచినారట (శూర్పణఖ ముక్కు చెవులు కోయడం)

5. అంకె లేని కోతి

లంకంతా చెరచిందట (హనుమంతుడు)

6. దశరథ విభు కగ్రదార ఎవతి? (కౌసల్య)

7. కడగొట్టు దశరథ కాంత ఎవరు? (సుమిత్ర)

8. ఒండొండు జలములో ఓ రాముడు జన్మించె

ఆ రాముని ఉదరంబున శ్రీరాముడు జన్మించె

శ్రీరాముని ఉదరంబున వజ్రము జన్మించె ఏమా కథ (బియ్యపు గింజ)

9. ఐదు అక్షరముల మహారాజుకి

మూడక్షరముల ముద్దుల యువరాజు

మూడక్షరముల ముద్దుల యువరాజుకి

రెండక్షరముల మురిపాల రాణి (దశరథుడు – రాముడు – సీత)

10. రాముడెవ్వరి గూడి రావణు మర్థించె (తోక మూకతో)

11. సీతను జేకొన చెరచిన ధనువేది (పంచాస్త్రుచాపం)

12. పొంచుండి రాముడు త్రుంచెను దేనిని (కోతిని)

ఇలా జానపద సాహిత్యంలో రామాయణానికి సంబంధించిన అనేక విషయాలు చోటుచేసుకొని తెలుగు జానపదుల ప్రత్యేకతల్ని, వైశిష్ట్యాన్ని చాటుతున్నాయి.

**ఆధార గ్రంథాలు:**


1. తెలుగు జానపద గేయ సాహిత్యము – బిరుదురాజు రామరాజు
2. చిత్తూరు జిల్లా పల్లె పదాలు – పేట శ్రీనివాసులు రెడ్డి
3. చిత్తూరు జిల్లా కోలాటం పాటలు – పేటశ్రీ
4. జానపద సాహిత్యం – పురాగాథలు – రావి ప్రేమలత
5. తెలుగు పొడుపు కథలు – కసిరెడ్డి వెంకటరెడ్డి
6. తెలుగు సామెతలు – జనజీవనం – పాపిరెడ్డి నరసింహారెడ్డి
7. కొండ కతలు – పేట శ్రీనివాసులురెడ్డి




ISSN No.2319-3905

# 3

# తెలుగువారికి చిరస్మరణీయుడు సి.పి.బ్రౌన్

***– ఆచార్య పి.సి.వెంకటేశ్వర్లు***

ఛార్లెస్ ఫిలిప్ బ్రౌన్ మరణించి 140 సంవత్సరాలైంది. అయిన తెలుగువారి స్మృతిపథంలో మెదలుతూనే వుంటాడు. ఎన్నేళ్ళయినా తెలుగు సాహిత్య చరిత్ర పుటల్లో చిరస్థాయిగా వుంటాడు. ఎందుకంటే తెలుగుభాషా సాహిత్యాలకు ఆయన చేసిన సేవ అలాంటిది. ఆయన 140 వర్థంతి దాకా వెళ్లాలంటే మనం కొన్ని అంశాలు తెలుసుకోవాలి. ఇప్పటికే బ్రౌన్‌పై ఆరు రకాలైన అధ్యయనం సాగింది. 1. సాహిత్యచరిత్రలు, 2. సంపూర్ణ విమర్శ గ్రంథాలు, 3. పిహెచ్ .డి.గ్రంథాలు / ప్రాజెక్టులు, 4. ప్రత్యేక సంచికలు/ పత్రికలు, 5. వ్యాసాలు, 6.తెలుగు వారు రాసిన ఆంగ్ల గ్రంథాలు. ఇన్ని వేలపుటలు ఒక విదేశీయుని గురించి మాట్లాడాయంటే మనకు ఆశ్చర్యం కలుగుతుంది. ఇన్ని సంవత్సరాలైనా అతని గురించే మాట్లాడుతూనే ఉన్నాయంటే దానికి కారణం మనం చర్చించుకోవలసిన అవసరం వుంది. కొత్తగా ఆయనలోని సాహిత్య శోధన కోణాలను పరిశీలించాలి. ఆ కోణాలను ముందుంచడం ఈ వ్యాసోద్దేశం. ఆయన జీవితం, చేసిన ఉద్యోగం, తెలుగు భాష పరిచయం దాని ప్రభావం, గ్రంథరచన– పరిష్కరణ, పత్రికారంగం–సేవ, వ్యాకరణరచన – నిఘంటు నిర్మాణం, వేమనపపై శోధన, బ్రౌన్‌పై వచ్చిన విమర్శ వంటి విషయాలు అర్థం చేసుకుంటే గాని బ్రౌన్ చిరస్మరణీయత మనకు అర్థంకాదు.

**1.జీవితం – చదువు :**

1798, నవంబర్ 10న కలకత్తాలో ఫ్రాన్సిస్ కౌలీ, రెవరెండ్ డేవిడ్ బ్రౌన్ లకు సి.పి. బ్రౌన్ పుట్టాడు. డేవిడ్ బ్రౌన్‌కు ఏడుమంది కొడుకులు, ఐదుమంది కూతుళ్లు అయితే అందులో ముగ్గురు కొడుకులు మాత్రం బ్రతికారు. వారిలో ద్వితీయుడు చార్లెస్ ఫిలిప్ బ్రౌన్. ఒక మతబోధకుడిగా ఉంటూ, హిందూమతంపై అధ్యయనం చేయడం కోసం డేవిడ్ బ్రౌన్ సంస్కృతం నేర్చుకున్నాడు. సర్ విలియం జోన్స్ ప్రోత్సాహంతో ఇంగ్లాండు నుండి మతబోధన కోసం వచ్చిన వ్యక్తి సంస్కృతం, నేర్చుకోవడం దాన్ని పిల్లలకు నేర్పించే సహృదయత డేవిడ్ బ్రౌన్‌ది. ప్రవోస్ట్‌గా ఉద్యోగం పోయాక, ఇంట్లో పిల్లల చదువుపై దృష్టి పెట్టాడు డేవిడ్ బ్రౌన్. 'పిల్లలకు జ్ఞానాన్ని పెంచే

చదువు నేర్పారు'. అంటాడు. ఇవి సి.పి. బ్రౌన్ తన తండ్రి గురించి. తండ్రి దగ్గర సంస్కృతం, అరబిక్ నేర్చుకున్నాడు. ఫలితంగా ఇండో యూరోపియన్ భాషలు ఉచ్ఛారణ బాగా తెలిసింది బ్రౌన్‌కి. 1812లో అంటే డేవిడ్ బ్రౌన్ 49 ఏళ్ల వయసులో మరణించాడు. అప్పటికి సి.పి. బ్రౌన్ కి 13 ఏళ్లు. చిన్నతనంలో తప్పులను ఎలా సవరించాలో, అసమగ్ర భాగాలను ఎలా పూరించాలో కూడా నేర్పించాడు తండ్రి. అదే అతన్ని తెలుగు గ్రంథపరిష్కరణ వైపుకు మళ్ళించేలాగా దోహదం చేసింది. తండ్రి మరణం తర్వాత తల్లితో ఇంగ్లాండ్ చేరిన బ్రౌన్, తొలిసారి బడిలో అడుగు పెట్టాడు. అయితే ఆ చదువు ఆరు నెలలు మాత్రమే సాగింది .'నేనేమీ నేర్చుకోలేదు' అనే బ్రౌన్ మాటలు బట్టి పాఠశాల చదువు ఆయనకు ఏమీ నేర్పలేదని అర్థమవుతుంది. ఇంగ్లాడులోనే హైలీబరీ కళాశాలలో 1814లో చేరి రెండు సంవత్సరాల ట్రైనింగ్ 1816లో పూర్తి చేశాడు. ఇంగ్లాడు ప్రభుత్వాధికారులు మద్రాసు పౌరసేవలకు బ్రౌన్‌ను ఉద్యోగం నిమిత్తం పంపాలని నిర్ణయించారు. అప్పటికీ 'తెలుగు' అనే పదం గురించి కూడా బ్రౌన్‌కు తెలియదు. ఆ పరిస్థితుల్లో అన్నతో కలిసి 1817 ఆగస్టులో మద్రాస్‌కు చేరిన బ్రౌన్, సెయింట్ జార్జి కోటలో శిక్షణ తీసుకున్నాడు. అక్కడ శిక్షకులు తెలుగు, మరాఠీ భాషలు నేర్చుకోమని ఆజ్ఞ జారీ చేశారు. వెలగపూడి కోదండ రామయ్య అక్కడ తెలుగు నేర్పించేవాడు. ఆ ట్రైనింగ్ కేంద్రంలో తెలుగు భాషకు సంబంధించి ఏడి క్యాంబెల్ రాసిన 'ఎ గ్రామర్ ఆఫ్ తెలుగు లాంగ్వేజ్' మాత్రమే అందుబాటులో ఉండేది. ఎలాంటి తెలుగు వాచకాలు లేవు. నిఘంటువులు లేవు. మూడు సంవత్సరాలు అక్కడే శిక్షణ పొందాడు బ్రౌన్. ఇక అక్కడ చదువు ఉండదు కాబట్టి అక్కడ నుంచి పంపేశారు. చివరి పరీక్ష సమయంలో తమ థామస్ మన్రో ఇచ్చిన ప్రసంగం సి.పి. బ్రౌన్‌ను ఉత్తేజపరిచింది. తెలుగు, సంస్కృతాలపై మక్కువ కలిగింది. ఈ సంఘటన 1920లో జరిగింది.

**2. ఉద్యోగం – అధ్యయనం :**

1820లో 22 ఏళ్ల వయసులో కడప జిల్లా కలెక్టర్ సహాయక ఉద్యోగిగా ఆయన సర్వీస్ లో చేరాడు బ్రౌన్. విధి ఆయన్ని తెలుగు భాషా సాహిత్యాలవైపు మళ్ళించింది. రెండేళ్ల పాటు అప్పటి కలెక్టర్ హేన్ బరీ తెలుగు బాగా మాట్లాడడాన్ని జాగ్రత్తగా గమనించాడు. కింది ఉద్యోగిగా ఆ భాషపై ఆసక్తిని పెంచుకున్నాడు. 1822లో విశాఖపట్నం రిజిస్ట్రార్‌గా పనిచేసేటప్పుడు తెలుగు మాటలని బాగా పరిశీలించేవాడు. నోట్స్‌లో రాసుకునేవాడు. అప్పుడే హిందువుల గురించి అబేదుబేవా రాసినటువంటి పుస్తకం అందుబాటులోకి వచ్చింది. మొదటిసారిగా వేమన గురించి చదివాడు. 1824 లోని వేమన పద్యాల అనువాదం మొదలుపెట్టాడు. తాళపత్ర ప్రతి – ఏ, కనకాద్రి కాపీ చేసినటువంటి ప్రతి – బి, ఇలా రకరకాల పేర్లతో శుద్ధప్రతులు తయారు చేసుకోవడం ప్రారంభించాడు. వేమన 1652వ సంవత్సరం వాడని చెప్పడానికి 30 తాళపత్ర ప్రతుల్ని పరిశీలించాడు. 1829 తొలి ప్రచురణలో ఈ విషయాలు పేర్కొన్నారు.



ISSN No.2319-3905

1825లో ఉప్పు గురించి గవరరాజుపై వేసిన దావా విషయమై కోర్టుబెంచ్‌లో ఓడిపోవడంతో సెలవుపై మద్రాస్‌కి వెళ్ళాడు. 1826లో కడప రిజిస్ట్రార్‌గా మరలా వచ్చాడు. అప్పుడే 'ఆంధ్ర గీర్వాణ ఛందము' గ్రంథాన్ని ముద్రించాడు. 1829లో తిరుచురాపల్లి బదిలీ అయ్యాడు. మరలా1830లో మచిలీపట్నం కోర్టు జడ్జిగా చేరాడు. 1834లో కంపెనీ బోర్డు బ్రౌన్‌ను రాజమండ్రి కేసు విషయమై డిస్మిస్ చేసింది. అంతటితో సెలవుపై బ్రౌన్ మూడేళ్లు లండన్‌కు వెళ్ళాడు. ఆ సమయంలో డబ్బు కోసం పుస్తకాలు అమ్ముకొని వెళ్లవలసిన సందర్భం వచ్చింది. అంటే ఆయన సంపాదన అంతా ఎలా తెలుగు భాష సముద్ధరణ కోసం వెచ్చించాడో అర్థం చేసుకోవాలి. మూడేళ్ళ తర్వాత 1838లో లండన్ నుండి ఇండియాకు వచ్చేటప్పుడు ఓడలో కాల్డ్వెల్‌తో పరిచయం ఏర్పడింది. 1838లో పార్సీ అనువాదకుడిగా 400 రూపాయలు వేతనంతో మళ్లీ ఉద్యోగంలో చేరాడు. ఆ సమయంలో మద్రాస్ కాలేజీ బోర్డు సభ్యునిగా నియమించబడ్డాడు. పైన పటారం లోన లొటారంగా ఉన్న తెల్లదొరల లోపాల్ని ఎత్తిచూపాడు. తెలుగు పండితుల్ని చిన్నచూపు చూస్తున్న దొరల తీరును అర్థం చేసుకున్నాడు.

1841లో మద్రాసు యాక్టింగ్ పోస్ట్‌మాస్టర్ జనరల్‌గా, జీఓఎంఎల్ క్యురేటర్‌గా అదనపు బాధ్యతలు స్వీకరించాడు. 1844లో మద్రాసు లెటర్ సొసైటీ పక్షాన 2440 పత్రాలును స్వీకరించి, ఆ సొసైటీకి బహూకరించాడు. అప్పుడే ఆ తాళపత్రాల విలువ 30 వేల రూపాయలు. ఇప్పటికీ మద్రాసు జిఓ ఎంఎల్‌ఏ లో ఉండేవి ఇవే. మెకంజీ కైఫీయత్తులను దళసరి కాగితాలపై ఎత్తి రాయించాడు. అందరు దొరలు గుర్రాలపై షికారు చేస్తుంటే, బ్రౌన్ తెలుగు సాహిత్యం, తెలుగు వారి చరిత్ర గ్రంథాలను సేకరించి భద్రపరిచే పనుల్లో సమయాన్ని వెచ్చించాడు. విశ్రాంతిలేని జీవితం, ఏదో ఒకటి చేస్తూ ఉండే మనస్తత్వం, నిరంతరం అన్వేషణ, పరిశోధన ఫలితంగా 1853లో తీవ్రపని ఒత్తిడిలో ఆయనకు పక్షవాతం వచ్చింది. నీలగిరికి సెలవుపై వెళ్లి, ఆ తర్వాత కోలుకున్నాక ఇండియాలోని అనేక ప్రాంతాలను సందర్శించాడు. నిద్రలేమి, నిరంతర అధ్యయనం, వైద్యులసలహా, సోదరీమణుల ఒత్తిడి వంటి కారణాలతో సి.పి.బ్రౌన్ 1854లో మే 1న స్వచ్ఛంద పదవీవిరమణ చేసి ఇంగ్లండ్‌కు పయనమయ్యాడు. 34 ఏళ్ళ భారతదేశానికి సేవచేసి, లండన్‌కు వెళ్ళిన బ్రౌన్ మరలా తిరిగి రాలేదు. 1884లో వీలునామా రాశాడు. అయితే, ఆ వీలునామా నిండా పుస్తకాల గొడవే. తన ఆస్తులు ఎవరికి చెందాలో వివరించాడు. చివరకు 1884 డిసెంబర్ 12న ఇంగ్లాండ్లో తుదిశ్వాస విడిచాడు.

ఇక్కడ ఆయన జీవితాన్ని చూసిన తర్వాత కొన్ని విషయాలు స్పష్టమౌతాయి. తండ్రి కలకత్తా ప్రెసిడెన్సీ, కొడుకు మద్రాసు ప్రెసిడెన్సీల్లో పనిచేశారు. తండ్రి ఇంగ్లాండులో పుట్టి పెరిగాడు. కొడుకు భారతదేశంలో పుట్టి పెరిగాడు. తండ్రి భారతదేశంలో మరణించాడు. కొడుకు ఇంగ్లాండ్లో మరణించాడు. తండ్రి జీవితాంతం మత బోధకుడిగా గడిపాడు. కొడుకు జీవితాంతం పుస్తకాలతో

కలిసి బ్రతికాడు. ఒక దేశం, ఒకే వాతావరణం, ఒకే రక్తం, ఒకరు మతబోధకుడు, మరొకరు భాషా సేవకుడు.!!! ఇదీ విచిత్రం.

**3. తెలుగు పరిచయం :**

సి.పి.బ్రౌన్ తెలుగు భాషా సాహిత్యాలతో మునిగిపోవడాన్ని అనేక అంశాలు ప్రత్యేక్ష, పరోక్ష కారణాలైనాయి. మద్రాసులో మన్రో గారి ప్రసంగం వినకుండా ఉంటే ప్రాంతీయ భాష అయిన తెలుగుతో పరిచయం చేసుకునేవాడు కాదేమో. అలాగే వెలగపూడి కోదండరామయ్య, రావిపాటి గురుమూర్తి శాస్త్రి వంటి వారి పాఠాలు కూడా విన్నాడు. ఏ.డి. కాంబెల్ రాసిన 'గ్రామర్ తెలుగు లాంగ్వేజ్' పుస్తకాన్ని చదివాడు. నాటి కడప కలెక్టర్ అయిన హేస్ బెర్రీ కింద రెండు సంవత్సరాలు పనిచేయడం వల్ల తెలుగుతో బాగా పరిచయం ఏర్పడింది. కాల్డ్వెల్‌తో పడవ ప్రయాణంలో పరిచయం వల్ల తెలుగు, ద్రవిడభాషలు వంటి వాటిపైన ఆసక్తి కలిగింది. అబేదుబాయితో పరిచయం వేమన పద్యాల సేకరణకు పురికొల్పింది. దేశీయ పండితుల ఛాందసత్వం బ్రౌన్‌ను క్షోభపెట్టింది, ఫలితంగా తెలుగు గ్రంథాలను ఎలాగైనా సముద్ధరించాలనే భావన మొదలైంది.

**4. గ్రంథ పరిష్కరణ :**

సి.పి.బ్రౌన్ 1826లో వెయ్యి వరహాలతో ఎర్రముక్కపల్లిలో బంగాళాతోట కొన్నాడు. అందులోనే పండితుల కోసం మరో మూడు కట్టడాలు కట్టించాడు. అదే 'బ్రౌన్ కాలేజీ' గా ప్రసిద్ధి చెందింది. ములుపాక బుచ్చయ్య శాస్త్రి, జూలూరి అప్పయ్య, వంగిపురం నరసింహచార్యులు, గరిమెళ్ళ వెంకయ్య, పైడిపాటి వెంకట నరసయ్య మొదలైన పండితుల చేత మనుచరిత్ర, వసుచరిత్ర, రాఘవ పాండవీయం వంటి గ్రంథాలను పరిష్కరింప చేశాడు. అయోధ్యపురం కృష్ణారెడ్డి బ్రౌన్‌కు నమ్మినబంటుగా సర్వకార్యాలు సమకూర్చేవాడు. ఫలితంగా ఎన్నో గ్రంథాలు వెలుగుచూసే అవకాశం దొరికింది.

**5. ప్రచురణలు :**

బ్రౌన్ ప్రచురించిన గ్రంథాలను చూస్తే ఆయనలోని బహుముఖీన పాండిత్యం, కృషి అర్థమౌతుంది. ఆంధ్ర గీర్వాణ ఛందము అనే ఛందో గ్రంథాన్ని, భట్టీయం, బాల సరస్వతీయం, అప్పకవీయం, కవిజనాశ్రయం, మొదలైన వ్యాకరణ గ్రంథాలను ప్రచురించాడు. ఇంగ్లీషు – తెలుగు, తెలుగు – ఇంగ్లీషు, జిల్లా నిఘంటువు, బ్రౌణ్య మిశ్రమ నిఘంటువుల నిర్మాణంలో బ్రౌన్ నిర్విరామ కృషిని మనం గుర్తించడం ఎంతైనా అవసరం. తాను తెలుగు నేర్చుకునే రోజుల్లో వాచకాలు అందుబాటులో లేకపోవడాన్ని, ఆ అవస్థ తర్వాత వారికి రాకూడనే వుద్దేశంతో తెలుగు వాచకం, వాక్యావళి మొదలైన గ్రంథాల్ని ముద్రించాడు. వేమన పద్యాలు, సుమతీశతకం, ప్రభులింగలీల, అహల్యచరిత వంటివి ఆంగ్లభాష మాత్రమే తెలిసిన వారు చదివి వాటి గొప్పదనాన్ని అర్థం చేసుకోవాలని వాటిని ముద్రించాడు. ఆయన రాసిన హైదరుచరిత్ర, ఆంధ్ర కర్ణాటక రాజుల



ISSN No.2319-3905

చరిత్ర, అనంతపురం రాజుల చరిత్ర వంటి చారిత్రక గ్రంథాలు తెలుగు వారి చరిత్రపై ఆయనకున్న మక్కువను తెలియజేస్తాయి. బ్రౌన్ సేకరించి, ముద్రించిన తాతాచార్య కథలు ఇప్పటికీ తాజాగానే కన్పిస్తాయి. నలచక్రవర్తి కథ, కుచేలోపాఖ్యానం, హరిశ్చంద్ర, ఆదిపర్వం, వసుచరిత్ర, మనుచరిత్ర మొదలైన గ్రంథాలు పరిష్కృత ప్రతులుగా మనకు దొరుకుతున్నాయంటే అది బ్రౌన్ చేతి చలువే. అసలు తెలుగు సాహిత్యంలో పరిష్కరణ పద్ధతిని ప్రవేశపెట్టిందే బ్రౌన్. అలాగే కవి రత్నాకరం, భగవద్గీత, అమరకోశం మొదలైనవి ఆయనలోని సంస్కృత భాషపై వున్న పాండిత్యాన్ని నిరూపిస్తాయి.

గ్రంథ పరిష్కరణ విషయంలో బ్రౌన్ ఎన్నో కొత్త పద్ధతులకు శ్రీకారం చుట్టాడు. తాళపత్రాలున్న వ్యక్తులతో పరిచయం చేసుకునేవాడు. తర్వాత వారినుండి లిఖితప్రతుల్ని సేకరించేవాడు. ఒక్కో గ్రంథానికి కనీసం 7, 8 ప్రతుల్ని సేకరించేవాడు. పండితులను గుండ్రంగా కూర్చోబెట్టుకోవడం వల్ల, వారితో ఒకేసారి చర్చలు చేయడం వల్ల శుద్ధప్రతి సిద్ధమయ్యేది. అదేవిధంగా అందరూ పండితులు కాకుండా జాగ్రత్తగా పడడం వల్ల ఒక సాధురూపం కోసం కాలయాపన చేయడం జరిగేది కాదు. ఆధునిక పద్ధతుల్లో ఆలోచించి నెలజీతం వల్ల నష్టమని, వేయి తెలుగు పద్యాలకు ఐదు రూపాయలు, వేయి సంస్కృత శ్లోకాలకు ఆరు రూపాయలు వేతనం చెల్లించేవాడు. దీనివల్ల సమయం, సొమ్ము రెండూ ఆదా అయ్యేవి.

**6. బ్రౌన్‌పై జరిగిన పరిశోధనలు :**

తెలుగు భాషా సాహిత్యాలకు నిరంతర సేవలందించిన బ్రౌన్ సాగించిన సాహిత్య వ్యవసాయాన్ని స్మృతిపథంలోకి తెస్తూ, సాహిత్య చరిత్ర నిర్మాతలు తమ తెలుగు గ్రంథాల్లో బ్రౌన్‌కు సముచిత స్థానం కల్పించారు. కందుకూరి (ఆంధ్రకవులచరిత్ర), కాశీనాథుని (ఆంధ్ర వాఙ్మయ సూచిక) కురుగంటి సీతారామయ్య (నవ్యాంధ్ర సాహిత్య వీధులు), నాగయ్య (తెలుగు సాహిత్య సమీక్ష), ఆరుద్ర (తెల్లవాళ్ళు – తెలుగుభాష) వేటూరి (చాటుపద్యాలు), నిడదవోలు వెంకటరావు (ఆంధ్ర వాఙ్మయ వికాసం) మొదలైన గ్రంథాల్లో బ్రౌన్‌పై పదుల పుటల్లో చర్చ జరిగింది. అయితే బ్రౌన్ చేసిన కృషిపై సంపూర్ణ విమర్శ గ్రంథాలు కూడా వచ్చాయి. కొత్తపల్లి వీరభద్రరావు – సిపి బ్రౌన్, పి.ఎస్. గోపాలకృష్ణ – తెలుగు దారిలో వెలుగుదీపిక, జానుమద్ది హనుమచ్ఛాస్త్రి – సి.పి. బ్రౌన్ చరిత్ర, చల్లా రాధాకృష్ణ శర్మ – సి.పి. బ్రౌన్ సాహిత్య సేవ, బంగోరె – బ్రౌన్ జాబులు – తెలుగు జర్నలిజం చరిత్ర, నిడదవోలు వెంకట్రావు –బ్రౌన్ స్వీయ చరిత్ర, కొండేపూడి సుబ్బారావు – సి.పి. బ్రౌన్ సంగ్రహ జీవితం, వల్లూరు శివప్రసాద్ –సి.పి. బ్రౌన్ జీవిత చరిత్ర – జీవిత విశేషాలు మొదలైనవి ఇందుకు నిదర్శనాలు అయితే ఈ గ్రంథాలన్నీ ఆయన జీవితాన్ని, సాహిత్యాన్ని సంపూర్ణంగా చర్చించాయి.

విశ్వవిద్యాలయ స్థాయిలో బ్రౌన్‌పై ఆశించిన రీతిలో పరిశోధనలు జరిగాయి. తెలుగు నిఘంటు నిర్మాణం – డా॥ ఉషారాణి, బ్రౌన్ తెలుగు కావ్య సముద్ధరణ – డా॥ పద్మావతి, సి.పి.

బ్రౌన్ ప్రాజెక్టు –బంగోరె వంటివి అయితే బ్రౌన్ రాసిన జాబులు, జాగ్రత్తగా రాసుకున్న డైరీలు, మార్జినల్ నోట్స్ వంటివి మాద్రాస్ మానుస్క్రిప్టు లైబ్రరిలో మరుగునపడి వున్నాయి.

అలాగే బంగోరె మూడేళ్ళు కష్టపడి సేకరించిన మైక్రోఫిల్మ్‌ల రూపంలో నిక్షిప్తం చేసిన బ్రౌన్ సాహిత్యరాశి యస్వీయూ తెలుగు శాఖలో నిరుపయోగంగా వుండిపోయింది. వీటన్నిటిపై పరిశోధకులు దృష్టి సారించాల్సిన అవసరం వుంది. బ్రౌన్‌ను గుర్తు చేసుకుంటూ ఆయన శోధించిన పలు అంశాలపై ప్రత్యేక సంచికలు వెలువడ్డాయి. సి.పి.బ్రౌన్ – వేమన, బ్రౌన్ గ్రంథాలయ ప్రారంభ సంచిక వంటివి ముఖ్యమైనవి. అలాగే బ్రౌన్‌పై ఆంగ్లంలో కూడా గ్రంథాలు వెలువడ్డాయి. వాటిలో జె.మంగమ్మ, వి.సుబ్బరాయుడు, వి.వి. సుబ్రహ్మణ్య శర్మ మొదలైన వారు రాసినవి చెప్పుకోవచ్చు. భారతి, ఆంధ్ర సారస్వత పరిషత్ పత్రిక, స్రవంతి, అముద్రిత గ్రంథ చింతామణి, వర్తమాన తరంగిణి మొదలైన పత్రికల్లో సి.పి.బ్రౌన్ సారస్వత సేవను విశ్లేషిస్తూ వ్యాసాలు అచ్చయ్యాయి.

**ముగింపు :**

ఆంగ్లేయుడే అయినా భారతదేశంలో పుట్టాడు. ఈస్టిండియా కంపెనీ నుండి జీతం తీసుకుని, భారతీయ సాహిత్యం, చరిత్ర, భాషోద్ధరణకోసం వెచ్చించాడు. అప్పులు చేసి జైలుపాలైన 11 మంది భారతీయుల్ని 355 రూపాయలు చెల్లించి, విడిపించిన మానవతావాది బ్రౌన్. క్రైస్తవుడైనప్పటికీ సి.పి. బ్రౌన్ ఏనాడు హిందూ సంప్రదాయాల్లో జోక్యం చేసుకోలేదు. పాండిత్యం ఉన్నవాళ్లంతా సహృదయులు కాలేరు. పాండిత్యం, సహృదయత రెండూ ఒకే చోట ఉన్న విదేశీయుడు బ్రౌన్. ఆయనలో పాలు నీళ్లలా రెండు గుణాలు కలిసిపోయాయి. తాను సాయం పొందని పండితుడు లేడని చెప్పడం ఆయనలోని వినయత్వానికి నిదర్శనం. కొడిగట్టిన తెలుగు సాహిత్య దీపాన్ని కాంతులు చిమ్మేలా చేసిన వ్యక్తి సి.పి.బ్రౌన్. అదే రాతప్రతుల సేకరణ , పరిష్కరణ కార్యక్రమం. పాశ్చాత్య గ్రంథ పరిష్కరణ పద్ధతులను తెలుగు పరిష్కరణకు పరిచయం చేసింది ఈయనే. గ్రంథ పాఠాలు గుర్తించడం, మూల ప్రతినిర్ధారణ, కాగితాల్లోకి ఎక్కించడం వంటి కొత్త రకమైన విధానాన్ని ప్రవేశపెట్టాడు.

ఆంధ్ర భారతావనికి 50 సమగ్ర ప్రతులను 2714 రూపాయలతో తయారు చేశాడు. భాగవత శుద్ధప్రతి కోసం 1827లోనే కృషి చేశాడు. 98 ప్రబంధాలు సేకరించాడు . 24 గ్రంథాలను పరిష్కరించాడు. 18 ప్రబంధాలకు వ్యాఖ్య రాయించాడు. 41 ద్విపద కావ్యాలు ఉద్ధరించాడు. 84 శతకాలను సేకరించి, పరిష్కరించి, ఆంగ్లంలో ఉపోద్ఘాతం రాశాడు. 1974 –75 కాలంలో శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో బంగోరె చేపట్టిన ప్రాజెక్టుల్లో భాగంగా, 25 వేల బ్రౌన్ స్వలిఖిత పుటలను 52 సంపుటాల్లో (రాతప్రతులను) మైక్రోఫిల్ములుగా తయారుచేసి యస్వీయూలో తెలుగుశాఖలో ఉంచారు. వీటికోసం లండన్ మ్యూజియం నుంచి ఎన్నో ప్రతులను తెప్పించారు.



ISSN No.2319-3905

అందుకే "బ్రౌన్ కొనగోటికి రాజ్యాలను ఏలాలని భావించే ప్రొఫెసర్లు , తెలుగు పండితులు, అకాడమీ ఛాయాల్లో, ప్రభుత్వ ఆసరాలో మసలే వారంతా సరితూగరు" అంటాడు బంగోరె. "నాలుగు యూనివర్సిటీలు, 14 అకాడమీలు, సవాలక్ష సమితులు, ఐరావతం లాంటి ప్రభుత్వం, 25 ఏళ్లలో చేయలేని పనులు, బ్రౌన్30 ఏళ్లలో ఒంటి చేత మీద నాడు నిర్వహించాడు" అని బంగోరె అనడం నిర్వివాదాంశం.

నిఘంటువులు, గ్రంథపరిష్కరణ, జానపద సాహిత్యం, గ్రంథ వ్యాఖ్యానం, ఛందస్సు, వ్యాకరణం ,వేమన ,విదేశీ సాహిత్యకారులు అన్నింటిలోనూ ముందుగా దర్శనం ఇచ్చే వ్యక్తి సి.పి. బ్రౌన్. అందుకే తెలుగు భాష బ్రతికివున్నన్ని రోజులు మనం బ్రౌన్ గురించి మాట్లాడుకోవాలి.

**ఆధారగ్రంథాలు :**

1. సి.పి. బ్రౌన్ – కొత్తపల్లి వీరభద్రరావు
2. తెలుగు దారిలో వెలుగుదీపిక – పి.ఎస్. గోపాలకృష్ణ
3. సి.పి. బ్రౌన్ చరిత్ర – జానుమద్ది హనుమచ్ఛాస్త్రి
4. సి.పి. బ్రౌన్ సాహిత్య సేవ – చల్లా రాధాకృష్ణ శర్మ
5. బ్రౌన్ జాబులు – తెలుగు జర్నలిజం చరిత్ర – బంగోరె
6. బ్రౌన్ స్వీయ చరిత్ర – నిడదవోలు వెంకట్రావు
7. సి.పి. బ్రౌన్ సంగ్రహ జీవితం – కొండేపూడి సుబ్బారావు
8. సి.పి. బ్రౌన్ జీవిత చరిత్ర – వల్లూరు శివప్రసాద్
9. బ్రౌన్ తెలుగు కావ్య సముద్ధరణ – డా॥ ఆర్. పద్మావతి
10. సి.పి. బ్రౌన్ మరోచూపు – వి. చెంచయ్య

# 4

# శ్రీశ్రీ - అభ్యుదయ కవిత్వం

**- ఆచార్య డి.వి.శ్రవణ్‌కుమార్**

'ఈ శతాబ్దం నాది' అని సగర్వంగా చెప్పుకున్న మహాకవి శ్రీశ్రీ గురించి "ఏ కవి నిండుగా నిర్భరంగా, స్పష్టంగా బలంగా రాసిపోతాడో - ఏ కవి యొక్క ఆవిర్భావం వల్ల ఈ ప్రపంచం ఇంకో అడుగు ముందుకు వేస్తుందో - ఆ కవి మహాకవి అయేట్లుంటే నిస్సంశయంగా మహాప్రస్థానం కవి మహాకవి" అని ప్రఖ్యాత విమర్శకులు కె.వి.రమణారెడ్డి గారు గండభేరుండంలో పేర్కొన్నారు.

భావకవితా యుగంలో దేవులపల్లి కృష్ణశాస్త్రి ప్రభావంతో శ్రీశ్రీ 1928లో 'ప్రభవ' అనే కావ్యం రచించారు. అప్పటికి శ్రీశ్రీపై కృష్ణశాస్త్రి, విశ్వనాథల ప్రభావం ఉండేది. 1930 సంవత్సరం తర్వాత ప్రపంచమంతా ఆర్థిక మాంద్యం అలముకొంది. పేద, మధ్య తరగతి ప్రజల జీవితం దుర్భరమైంది. ప్రపంచ దేశాల్లో పరిస్థితులు ఆందోళనకరంగా మారాయి. ఆకలి బాధతో ప్రజలు అలమటిస్తుంటే తెలుగునాట ఊహా ప్రేయసికోసం ప్రణయగీతాలు ఆలపించే కవులు నాటి యువతరానికి రుచించలేదు. ఆంధ్రదేశంలో జమీందారులు, భూస్వాములు పేదరైతులను, కూలీలను పీడించడం సహించలేక జమీందారీ వ్యతిరేక ఉద్యమం వచ్చింది. అటువంటి సమయంలోనే లండన్‌లోని భారతీయమేధావులు, రచయితలు మార్క్సిజాన్ని అధ్యయనం చేస్తూ, 'ఇండియన్ ప్రొగ్రెసివ్ రైటర్స్ అసోసియేషన్' స్థాపించారు.

అటువంటి సమయంలోనే 1930లో శ్రీశ్రీకి టైఫాయిడ్ జ్వరమొచ్చి, రెండు నెలల పాటు బాధపడ్డారు. ఈ సమయంలోనే శ్రీశ్రీ ఆలోచనా విధానంలో మార్పు వచ్చింది. కవిత్వానికి ఛందస్సు అవసరమనే భావం తొలగిపోయింది. దేశదేశాల కవుల రచనలు చదవడంతో శ్రీశ్రీ ఆలోచనా పరిధి విస్తృతమైంది. 1931లో డిగ్రీ పూర్తయి బతుకు తెరువు కోసం రకరకాల ఉద్యోగాలు చేశాడు. ఈ తరుణంలో 1933లో శ్రీశ్రీ రచించిన 'జయభేరి'-

"నేను సైతం

ప్రపంచాగ్నికి సమిధనొక్కటి





ఆహుతిచ్చాను" అన్న కవిత అభ్యుదయ కవిత్వానికి నూతన కవాటాలు తెరిచింది. ఆంగ్ల సాహిత్యంలోని New Signatures, ఫ్రెంచి జాతీయగీతం, హరీన్ ఛటోపాధ్యాయ ఘరూహువా హైజంగ్ గీతం, నజ్రుల్ ఇస్లాం గీతాలు, ఎడ్గార్, ఎలన్ సో, గురజాడ, కవికొండల గేయాలు మహాప్రస్థాన గేయానికి మార్గదర్శకాలుగా శ్రీశ్రీ చెప్పుకున్నారు. అలాగే ఆదిశంకరుల భజగోవిందం తన మరో ప్రపంచం గీతం నడకకు తోడ్పడిందని కూడా శ్రీశ్రీ చెప్పుకున్నారు. ఇలా 1933-1942ల మధ్య రచించిన కవితలు (గేయాలు) చదివి యువతరం కవులు ఉత్తేజితులయ్యారు. తర్వాతి కవులందరూ శ్రీశ్రీ మార్గాన్ని అనుసరించారు.

భారతదేశంలో 1933లో అభ్యుదయ రచయితల సంఘం ఏర్పడి, 1936లో లక్నోలో ప్రేమ్‌చంద్ అధ్యక్షతన దీని తొలి మహాసభ జరిగింది. ఆంధ్రలో 1943లో అభ్యుదయ రచయితల సంఘం ఏర్పడి ప్రథమ మహాసభ తాపీధర్మారావు అధ్యక్షతన తెనాలిలో జరిగింది. 1937లో

"పొలాలనన్నీ

హలాల దున్నీ

ఇలాతలంలో హేమం పిండగ

జగానికంతా సౌఖ్యం నిండగ

విరామ మెరుగక పరిశ్రమించే

ఘర్మ జలానికి ఖరీదులేదోయ్!" -అంటూ 'ప్రతిజ్ఞ' గేయాన్ని రచించాడు.

ప్రపంచ అభ్యుదయ రచయితలు 1932లో 'న్యూ సిగ్నేచర్స్' పేరుతో కవితా సంపుటిని వెలువరించారు. అదే సమయంలో లండన్‌లోని భారతీయ రచయితలు, అభ్యుదయ వాదులు మ్యానిఫెస్టోని ప్రకటించారు. ఈ మ్యానిఫెస్టో ప్రభావంతోనే శ్రీశ్రీ తన 'ప్రతిజ్ఞ' గీతాన్ని రచించారు. 'గనిలో, వనిలో, కార్ఖానాలో పరిక్లమిస్తూ, పరిప్లవిస్తూ, ధనికస్వామికి దాస్యం చేసే, యంత్ర భూతముల కోరలుతోమే, కార్మిక ధీరుల' కోసం ఈ గీతాన్ని రచించారు. ఈ కవితలో 'శ్రమైక జీవనం సౌందర్యానికి సమానమైనది లేనేలేదని' శ్రీశ్రీ తెలిపారు. 'వ్యధార్థ జీవిత యథార్థ దృశ్యాల'ను ఇందులో ఆవిష్కరించాడు. కాల్చే ఆకలి, కూల్చే వేదన దారిద్ర్యాలూ దౌర్జన్యాలూ పరిష్కరించే, బహిష్కరించే విధంగా వినిపించే నవీనగీతిగా, విరచించే నవీనరీతిగా తన గేయాన్ని శ్రీశ్రీ పేర్కొన్నాడు.

కాల్పనిక సాహిత్యం మీద విప్లవాత్మకమైన తిరుగుబాటుగా అభ్యుదయ కవిత్వం ఆవిర్భవించింది. సాహిత్యం ఒక భోగవస్తువుగా పరిగణించే దృక్పథంపైన అభ్యుదయ కవిగా అవతరించిన శ్రీశ్రీ తిరగబడ్డారు. వస్తువులోనూ, భావనలోనూ, భాషలోనూ, ఛందస్సులోనూ, సంవిధాన శిల్పంలోనూ, తాత్వికతలోనూ అభ్యుదయ కవిత్వం పూర్తిగా కొత్తదారులను తొక్కింది.

1933 నుండి శ్రీశ్రీ రచించిన కవితలను 1950లో 'మహాప్రస్థానం' కవితా సంపుటిగా చలం యోగ్యతా పత్రంతో వెలువడింది. అప్పటికే సాహిత్యంలో సంచలనం సృష్టించిన శ్రీశ్రీ కవితలతో నాటి యువకవులకు మార్గదర్శకుడైనాడు. "తెలుగు కవిత్వాన్ని ఖండించి, దీవించి, ఊగించి, శాసించి, రక్షించే అపూర్వ శక్తి"గా మహాప్రస్థాన కావ్య సంపుటిని చలం కొనియాడారు. కవిత్వంలో వచ్చిన అనేక కొత్త ప్రయోగాలను శ్రీశ్రీ తెలుగులో ప్రవేశపెట్టాడు. అనేక అనువాద రచనలు చేశారు. కథలు, నాటికలు, వ్యాసాలు, లిమరిక్కులు వంటి సాహిత్య ప్రక్రియల్లోనూ రచనలు చేశారు. మహాప్రస్థానమే కాకుండా చరమరాత్రి, ఖడ్గసృష్టి, చతురస్రం, మూడు యాభైలు, గురజాడ, మరో ప్రస్థానం, వారం వారం, శ్రీశ్రీ వ్యాసాలు, పాడవోయి భారతీయుడా, అనంతం మొదలైన రచనలు చేశారు.

శ్రీశ్రీ అభ్యుదయ కవిత్వానికి మార్క్సిజమే పునాది. మార్క్సిజం ప్రబోధించే సామ్యవాద సిద్ధాంతం, సమసమాజం శ్రీశ్రీ కవిత్వంలో ప్రత్యక్షంగానే గోచరిస్తాయి. వర్గరహిత సమాజ స్థాపన కోసం పీడితులకి, పీడించే వారికి మధ్య వర్గ సంఘర్షణ జరగాలి. అదిదానంతట అదే జరిగేది కాదు. ఇందుకోసం ప్రజల్ని ఉద్యమింప చేయాలనే వర్గ సంఘర్షణా సిద్ధాంతాన్ని ఈ కవితలు ప్రబోధిస్తాయి. మార్క్సిజానికి మూల సూత్రమనదగిన జర్మన్ తత్వవేత్త హెగెల్ గతితార్కిక భౌతికవాద సూత్రం ఇందులో కన్పిస్తుంది. రెండు పరస్పర విరుద్ధ శక్తుల మధ్య సంఘర్షణ తప్పదని, ఆ సంఘర్షణలోంచి వెలుగుపుట్టుకొస్తుందనే భౌతిక వాదం కన్పిస్తుంది. ఉదాహరణకు పాజిటివ్, నెగటివ్ శక్తుల నుంచి విద్యుత్తు ప్రభవిస్తుంది. అలాగే ఇక్కడ పెట్టుబడిదారుడు లేదా భూస్వామి శ్రామికుడి శ్రమను దోపిడి చేస్తాడు. శ్రమ ఫలితం శ్రామికుడికే దక్కాలి తప్పదోపిడిదారుడికి కాదు. సామ్యవాద సమాజంలో సొంత ఆస్తి ఉండదు. ఆస్తి అంతా సంఘానిదే. ఇదీ శ్రీశ్రీ కోరుకున్న మరో ప్రపంచం. దీన్ని సాధించడం కోసమే ఏర్పడిన సిద్ధాంతం 'వర్గ సంఘర్షణ' లేదా 'గతి తార్కిక భౌతిక వాదం'. సాంఘిక జీవనంలోని అన్ని ముఖ్యాంశాలు ఆర్థికమూలంగానే రూపొందుతాయి. సమాజ చరిత్ర గడుస్తున్న కొద్దీ ఒక దిగువ రూపం నుండి అంతకన్నా కొంచెం ఉత్తమ రూపానికి ఆర్థిక వ్యవస్థ పరిణమించడాన్ని గతితార్కిక సిద్ధాంతం రుజువు చేసింది. ఆదిమయుగానంతరం సమాజ చరిత్ర బానిస – యజమాని / శ్రామికుడు – భూస్వామి / కార్మికుడు – పెట్టుబడిదారుడు అనే వర్గాల ఆధారంగా ఆర్థిక వ్యవస్థ రూపొందింది. ఈ చారిత్రక దశల తర్వాత వర్గ సంఘర్షణ ద్వారా సాధించబడబోయేదే వర్గ రహిత సామ్యవాద వ్యవస్థ అని సామ్యావాద సిద్ధాంతం చెప్తుంది.

ఈ భావజాలమంతా శ్రీశ్రీ కవిత్వంలో స్పష్టంగా కనిపిస్తుంది. శ్రీశ్రీ మహాప్రస్థాన కావ్యంలోని 'అవతారం' అనే గేయంలో





"యముని మహిషపులోహ ఘంటలు

మబ్బు చాటున

ఖణేల్ మన్నాయ్" అనే ఖండికలో పీడించే వాణ్ణి పీడితుడు ఎదిరించడం కన్పిస్తుంది. యముడు – మహిషం; కనకదుర్గ– సింహం; ఇంద్రుడు – ఏనుగు ఇలా దేవతలు పీడించే వర్గంగా వారి వాహనాలు పీడిత వర్గానికి సంకేతాలుగా వాడబడ్డాయి. ఈ గేయంలో సింహం జూలు దులిపి ఆవులించడం, మదపుటేనుగు ఘీంకరిస్తూ సవాల్ చేయడం శ్రామిక వర్గ చైతన్యానికి ప్రతీకలు.

శ్రామిక వర్గ చైతన్యం వల్ల కల్గే ప్రయోజనం "పుడమి తల్లికి పురుటినొప్పులు కొత్త సృష్టిని స్ఫురింపించాయి" అని కవి తెలిపాడు. ఇక్కడ కొత్త సృష్టి అంటే కవి కోరుకున్న మరో ప్రపంచమని అర్థం.

వర్గ చైతన్యం పొందే ఈ దశలో శ్రామికుణ్ణి ఎవరూ మోసం చేయలేరని ప్రబోధిస్తూ,

"చిరకాలం జరిగిన మోసం

బలవంతుల దౌర్జన్యాలూ

ధనవంతుల పన్నాగాలూ

ఇంకానా ఇకపై చెల్లవు

ఒక వ్యక్తిని మరొక వ్యక్తి

ఒక జాతిని వేరొక జాతి

పీడించే సాంఘిక ధర్మం

ఇంకానా ఇకపై సాగదు" అని అంటాడు. శ్రామిక వర్గ చైతన్యంతో పీడించే సాంఘిక ధర్మాలు ఇక సాగవని తెలిపాడు.

తమ శ్రమ శక్తితో ఉత్పత్తి చేయబడుతున్న వస్తువులకు తాము యజమానికాకపోవడం వల్ల, తమకు తగిన ప్రతిఫలం లభించడం లేదని, వర్గ చైతన్యాన్ని పొందగలిగితే తప్ప పెట్టుబడిదారుడి దోపిడీని అంతమొందించలేమనీ,

"అందరం కలిసి చేసిన ఈ

అందమైన వస్తు సముదాయం అంతా

ఎవ్వడో ఒక్కడే వచ్చి

ఎత్తుకుపోతూ ఉంటే చూచి

ISSN No.2319-3905

'అన్యాయం, అన్యాయం' అని మేమంటే

'అనుభవించాలి మీ కర్మం' అంటాడు" అని తెలియజేస్తూ శ్రమ దోపిడీని శ్రీశ్రీ వివరించాడు.

శ్రీశ్రీ కోరుకున్న సమసమాజం గురించి 'మహాప్రస్థానం కవితలో,

"మరో ప్రపంచం

మరో ప్రపంచం

మరో ప్రపంచం పిలిచింది!

పదండి ముందుకు,

పదండి తోసుకు!

పోదాం, పోదాం పైపైకి" అని గర్జిస్తాడు. ఈ గేయం శంకరాచార్యుల భజగోవిందం ఛందోరీతిలో సాగింది. ఈ కవితా రచనపై నజురులిస్లాం 'విప్లవగీతి' ప్రభావం ఉంది.

'కుక్క పిల్లా, అగ్గి పుల్లా, సబ్బు బిళ్లా –

హీనంగా చూడకు దేన్నీ!

కవితామయమేనోయ్ అన్నీ' – అని 'ఋక్కులు' అనే కవితలో తన కవితా వస్తువుల గురించి వివరించాడు. ఇందులో వాస్తవికతావాదం కనిపిస్తుంది. అతీంద్రియశక్తులు తన కవితా వస్తువులు కాదని, వాస్తవాన్ని ప్రతిబింబించే శక్తులని తెలిపాడు.

మార్క్సిజం దృక్పథం ప్రకారం సాహిత్యం పరమావధి శ్రామిక వర్గ చైతన్యమే. అందుకే –

'నాలో కదలే నవ్యకవిత్వం

కార్మికలోకపు కల్యాణానికి,

శ్రామిక లోకపు సౌభాగ్యానికి' శ్రీశ్రీ తన కవితా రచన గావించాడు.

"కదిలేది కదిలించేదీ,

మారేదీ మార్పించేదీ,

పాడేదీ పాడించేదీ,

పెనునిద్దర వదిలించేదీ,

మునుముందుకు సాగించేదీ,

పరిపూర్ణపు బ్రదుకిచ్చేదీ' కావాలోయ్ నవకవనానికి" అంటూ 'నవకవిత'లో చెప్పడం ద్వారా, పాలకవర్గానికి వ్యతిరేకంగా పీడితుల్ని నడిపించడానికి కవిత్వాన్ని ఒక సాధనంగా మలుచుకున్నాడు.



గతితార్కిక దృష్టితో రచించిన 'దేశ చరిత్రలు' అనే కవితని పరిశీలిస్తే,

"ఏ దేశ చరిత్ర చూచినా ఏమున్నది గర్వకారణం?

నరజాతి చరిత్ర సమస్తం పరపీడన పరాయణత్వం"

అని అంటూ 'నరజాతి చరిత్ర సమస్తం దరిద్రులను కాల్చుకు తినడమేనని చాటిచెప్పాడు. మార్క్సు సిద్ధాంత సారమైన వర్గ సంఘర్షణ ఫలితంగా 'పరస్పరం సంఘర్షించిన శక్తులలో చరిత్ర పుట్టెన'ని ప్రకటించాడు.

"ఏ యుద్ధం ఎందుకు జరిగెనో?

ఏ రాజ్యం ఎన్నాళ్లుందో?

తారీఖులు, దస్తావేజులు

ఇవి కావోయ్ చరిత్రకర్థం

ఈ రాణిప్రేమ పురాణం,

ఆ ముట్టడికైన ఖర్చులూ

మతలబులూ, కైఫీయతులూ

ఇవి కావోయ్ చరిత్రసారం" అని చెప్పిన వాక్యాలు పరిశీలిస్తే చారిత్రక భౌతిక వాదం కనిపిస్తుంది.

ఆనాటి జమీందారీ వర్గంపై పెట్టుబడిదారి వర్గం తిరుగుబాటుగా భావించే మొదటి ఛార్లెస్ రాజుపై క్రాంవెల్ తిరుగుబాటుని స్ఫురించే విధంగా

'ఇతిహాసపు చీకటికోణం

అట్టడుగున పడికాన్పించని

కథలన్నీ కావాలిప్పుడు!

దాచేస్తే దాగని సత్యం' అని తెలిపాడు.

'జగన్నాథుని రథచక్రాలు' అనే కవితలో.

"వస్తున్నా యొస్తున్నాయి...

జగన్నాథ,

జగన్నాథ, జగన్నాథ రథచక్రాల్!

రథ చక్రాల్

రథచక్రాల్

రథచక్రాల్', రథ చక్రాలొస్తున్నాయొస్తున్నాయి! " అని అంటూ ఆదర్శ సమాజాన్ని ప్రబోధించాడు. జగన్నాథుని నాలుగు రథచక్రాలుగా ఐకమత్యం, స్వాధీనత, జ్ఞానం, శక్తిలు కల్గి ఉండాలన్నాడు. శ్రామికులే కర్తలుగా ఆకాశ మార్గంలో పయనించే ఆ రథాన్ని భూమార్గం పట్టిస్తానని శ్రీశ్రీ శపథం చేశాడు.

ఆధునిక భావ వ్యక్తీకరణకు సాంప్రదాయికమైన ఛందస్సులు ఆటంకాలుగా భావించిన శ్రీశ్రీ 'ఛందస్సుల సర్ప పరిష్వంగాలను' వదిలేశానన్నాడు. ఈయన మహాప్రస్థాన గీతాల్లో గతిప్రధానమైన, లయ ప్రధానమైన మాత్రాచ్ఛందస్సులను వాడుకున్నారు. మాత్రా ఛందస్సుల్లో త్రిశ్రగతి, చతురస్రగతి, ఖండగతి, మిశ్రగతి వంటి అన్ని గతులలోనూ రచన చేశారు.

కవిత్వంలో ఎప్పుడు ఏ కొత్తదనం వచ్చినా దాన్ని శ్రీశ్రీ ఆదరించారు. తెలుగులో వచ్చిన దిగంబర కవిత్వాన్నీ సమర్థించారు. అలాగే సాయుధ పోరాటమే సాంఘిక సమస్యలకు పరిష్కారమని నమ్మిన విప్లవ రచయితల సంఘానికి వ్యవస్థాపకులుగా, అధ్యక్షులుగా కూడా పని చేశారు. కవిత్వంలో రకరకాలైన ప్రయోగాలు చేశారు.

అందుకే ఆధునికాంధ్ర సాహిత్యంలో శ్రీశ్రీని యుగకర్తగా పేర్కొంటారు. శ్రీశ్రీ రచనల తర్వాత తెలుగు సాహిత్య స్వరూపంలో పెను మార్పులు వచ్చాయి. చలం చెప్పినట్లుగా "ఇంకా రాత్రి చీకట్లో లోకం నిద్రలో భయంకర స్వప్నాలు కంట్లో దీనంగా పలవరించే సమయాన ఉషాగమనాన్ని గుర్తించి స్వాగతమిచ్చే వైతాళికుడు శ్రీశ్రీ".

**ఆధార గ్రంథాలు:**


1. రాధాకృష్ణ, బూదరాజు, మహాకవి శ్రీశ్రీ: మేకర్స్ ఆఫ్ ఇండియన్ లిటరేచర్, సాహిత్య అకాడమీ, న్యూఢిల్లీ, 3వ ఎడిషన్, 2006 (ఐఎస్‌బిఎన్ నెం. 812600719-2)
2. T.Venkata Rao, Portrait of Revolutionary, The Hindu, Chennai, 15 July, 2007
3. నారాయణరెడ్డి సి., నూతన యుగకర్త శ్రీశ్రీ, శ్రీశ్రీ సాహిత్య నిధి, 2020.
4. నారాయణ రెడ్డి సి., ఆధునికాంధ్ర కవిత్వం సంప్రదాయాలు: ప్రయోగాలు, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, 1999.




ISSN No.2319-3905

# 5

# డా. పి. శ్రీదేవి కథల్లో వ్యక్తమైన స్త్రీల స్వతంత్ర భావాలు


*- ఆచార్య కె.శ్రీదేవి*

*- పి.శ్రీదేవి*


యాభైయవ దశాబ్దం నాటికి కథాసాహిత్యానికి చక్కటి పునాది, భద్రతా ఏర్పడ్డాయి. దీనికి తోడు మొదటి తరం రచయిత్రులు ఇచ్చిన ప్రేరణతో, ఈదశకంలో చదువుకున్న స్త్రీలు కలం పట్టారు. అర్ధ దశాబ్ది కాలంలో రంగనాయకమ్మ, వాసిరెడ్డి సీతాదేవి, మాలతీచందూర్, కె. రామలక్ష్మి, పి. శ్రీదేవి లాంటి రచయిత్రుల స్వతంత్ర భావజాలం ఈదశాబ్దాన్ని రచయిత్రుల దశాబ్దంగా నిలిపింది. తెలుగు కాల్పనిక సాహిత్యంలో లైంగికతను చర్చనీయాంశం చేసే క్రమంలో పి. శ్రీదేవి నిర్వహించిన పాత్ర గణనీయమైనది. నిర్దిష్టమైన వ్యక్తిత్వంతో తీర్చిదిద్దబడి, స్వతంత్రంగా ఆలోచించి, నిర్ణయం తీసుకోగల స్త్రీపాత్రల సృష్టితో పాఠకుల ఆలోచనలకు ఒక కొత్త ఉత్సాహాన్ని, స్ఫూర్తిని అందించగలిగాయి ఈమె కథలు.

డాక్టర్ పెమ్మరాజు శ్రీదేవి 21సెప్టెంబర్, 1929అనకాపల్లిలో జన్మించారు. ఈమె పేరు చెప్తే ఈతరం పాఠకులు తొందరగా పోల్చుకోలేక పోవచ్చు. ఈమె చాలా తక్కువ కథలు రాసినా ఎక్కువ మంది పాఠకుల అభిమానాన్ని పొందిన రచయిత్రి. అందరూ తన కథల్ని అభిమానిస్తున్నారు కదాని పుంఖాను పుంఖంగా కథారచన చేయలేదు. విశాఖపట్నంలో యం.బి.బి.యస్ చదివి, గుడివాడ ప్రభుత్వ ఆసుపత్రిలో కొంతకాలం డాక్టరుగా పనిచేశారు. తరువాత హైదరాబాద్ లో ప్రైవేటు ప్రాక్టీస్ చేశారు. తెలుగు స్వతంత్రలో అసిస్టెంటు ఎడిటర్‌గా కొంతకాలం పనిచేశారు. 1957లో తెలుగు స్వతంత్రలో ధారావాహికంగా "కాలాతీత వ్యక్తులు" నవల రచించారు.

శ్రీదేవి రాసిన కథలలో "రేవతీ స్వయం వరం", "చక్రనేమి క్రమాన", "కళ్యాణ కింకిణి", "వాళ్ళు పాడిన భూపాలం" ఈమెని ఉత్తమశ్రేణి కథా రచయిత్రిగా నిలబెట్టాయి. పి. శ్రీదేవి రాసిన ఒకే ఒక నవల "కాలాతీత వ్యక్తులు" తెలుగు సాహిత్యచరిత్రలో మైలురాయిగా నిలిచింది. బహుళ జనాదరణ పొందిన "కాలాతీత వ్యక్తులు" నవల తెలుగు సాహిత్యరంగంలోని ఐదు గొప్ప నవలల్లో ఒకటిగా ఈ నవలను సాహిత్య విమర్శకులు గుర్తించారు. 1958లో పుస్తకరూపంలో

ప్రచురించారు. అంతే కాక, ఈనవలను నాటికగా 1960 ఆకాశవాణిలో ప్రసారం చేశారు. చదువుకున్న ఆమ్మాయిలు పేరుతో చలనచిత్రంగా రూపొందింది. డిగ్రీ విద్యార్థులకు పాఠ్యాంశంగా కూడా పెట్టారు. ఈనవల గురించి చెప్పడంలో నాఉద్దేశం ఇంత ప్రాధాన్య ప్రాచుర్యాలను పొందడానికి కారణం ఈ నవలలోని రాడికల్ భావాలే. ఈ భావాలు పరిపక్వతను సాధించడానికి ముందుగా రాసిన పైన తెలిపిన కథలను గమనించినట్లయితే, ఒక క్రమంలో జరిగిన భావపరిణామాన్ని గుర్తించగలం. వైవాహిక వ్యవస్థ, దానికి ఆవల స్త్రీల లైంగిక, మానసిక సంఘర్షణలను కథలుగా మలిచారు. శ్రీదేవి కథనం అతి సులభంగా, అలవోకగా చక్కటి శైలిలో సాగిపోతుంది.

యాభైయవ దశకంలోని స్త్రీల స్థితిగతుల్లో, ఆలోచనల్లోని లైంగిక సంఘర్షణలను ఈమె కథల్లో చర్చించేందుకు ప్రయత్నించారు. స్త్రీలుగా తమజీవితాన్ని నిర్ణయిస్తున్న భావజాలాన్ని అంగీకరించలేక, వ్యతిరేకించడానికి గల కారణాలను అన్వేషించే సంధర్భంలో తమని తాము శక్తివంతంచేసుకునే క్రమంలో తలెత్తిన సందిగ్ధాలను నివృత్తి చేసుకుని తమ జీవితాలను తీర్చదిద్దుకోవాలన్న తపన లోనుంచి "రేవతీ స్వయంవరం"కథలో ప్రేమ, పెళ్ళిని సమస్యాత్మకం చేశారు.

మూడోవ్యక్తిగా ప్రవేశించటం అంతవరకు బలీయమైన పిలుపును శరీరం పిలుపు చాలా బలంగా ఉంటుం దని ఆనాటి 'ఇనుప కచ్చడాల్ గట్టిన మునిముచ్చులు' మొదలుకొని, ఈనాటి మనుషుల దాకా విన్న వాళ్లందరికీ తెలుసు. 'చక్రనేమిక్రమాన' అనే పి. శ్రీదేవి కథలో అమృతవల్లి గూడా తిరస్కరించలేకపోయింది. తనే ప్రేమించి పెళ్లాడిన రంగనాథం క్యాన్సర్ పాలయ్యాడు. నాలుగేళ్ల దాంపత్య జీవనం (ఆమెలో కోరికలు చెలరేగించి వదిలింది." ఫలితం మరో వ్యక్తితో సంబంధం. భర్త పట్ల అంతకుముందున్న ప్రేమ క్రమంగా జాలిగా చివరికి ఉదాసీనతగా మారింది. భర్త మరణంతో మిసెస్ రంగనాథం మిసెస్ పాణి అయింది. కొంతకాలానికి ఆమెకీ అదే వ్యాధి సోకింది. ఒకప్పుడు తను భర్తను నిర్లక్ష్యం చేసినట్టుగానే ఇప్పుడు రెండో భర్త తనను నిర్లక్ష్యం చేస్తాడు. అదే చక్రనేమిక్రమం కథలోని Irony. హాస్పిటల్ పాలైన అమృతవల్లి ఒకప్పుడు రంగనాథం చదవమని యిచ్చిన డైరీ అప్పుడు చదివి పశ్చాత్తాపం చెందుతుంది. తన ఆస్తినంతా మొదటిభర్త రంగనాథం: పేర ఆసుపత్రికి దానం చేస్తుంది. పాత్రల్లో మార్పు తేవటానికై రచయితలు సులభ పద్ధతులు పాటిస్తారు. అందులో ఒకటేమిటంటే ఏ పరిస్థితి పట్ల మనుషులు స్పందించరో, అదే పరిస్థితి వాళ్ల జీవితంలో కల్పించటం. తనదాకా వస్తేగాని తెలీదంటారు. ఇది Poetic Justice అవుతుందేమోగాని మెరుగైన కథా ప్రణాళిక మాత్రం అయితే కథను చెప్పటంలో 1950లోనే శ్రీదేవి సాధించిన నైపుణ్యం ఆశ్చర్యపరుస్తుంది.

**ఉరుములు – మెరుపులు**

స్వతహాగా అందమైనదని చెప్పదగ్గ సుధ అనుకోకుండా మశూచి బారిన పడింది. తన అందం అంతా పోయిందనీ, కాబోయే భర్తా, బావా అయిన సారథికి ఆనందాన్నివ్వలేనని





దుఃఖిస్తుంది. అందం పోయినతర్వాత కూడా ఆమెనే చేసుకోవడం ఎందుకని ఒక్కగానొక్క కొడుకుని సుధనుండి విముఖుడిని చేయాలనుకున్న తల్లిదండ్రులకు తనకు ఆమె అందంతో నిమిత్తం లేదని సుధని వివాహం చేసుకుంటాడు సారథి.

జాలిచేతే తనని చేసుకున్నాడనే భావంవల్లా, అందంపోయిన తనరూపంవల్లా గాయపడిన సుధ జడపదార్థంగా మారిపోయింది. దాంతో సారథి కూడా అలాగే మారేసరికి ఇద్దరి మధ్యా దూరం పెరిగింది. ఏ ఒక్కరూ దూరాన్ని తగ్గించుకొనే ప్రయత్నం చేయలేదు. ఆ పరిస్థితులలో వచ్చిన సుధ స్నేహితురాలు, పరిస్థితి గ్రహించి వీరిమధ్య అగాధాన్ని తొలగించే ప్రయత్నంలో సారథిని కవ్వించి రెచ్చగొడుతుంది. అదే సమయంలో సారథి అనారోగ్యం పాలవడంతో అతని తల్లిదండ్రులను పిలిపించి, తిరిగి సుధ సారథిల మధ్య మళ్ళీ జీవితంచెట్టు మొగ్గ తొడిగిందంటూ రచయిత్రి నాటకీయంగా కథని సుఖాంతం చేస్తుంది. వారిమధ్య శ్రావణంలో ఏర్పడిన వివాహబంధం ఉరుములు–మెరుపులతో అనేకానేక విధాలుగా అభిప్రాయ భేదాలతో చిట్లిపోతూ చివరికి తిరిగి ఏకమయ్యారనేది కథ. మరీ పెద్దదిగా కొనసాగించినట్లున్నా వాక్యాల వెంట పాఠకుణ్ని పరిగెత్తించే శైలితో కథ నడిపింది రచయిత్రి. స్త్రీ మనస్తత్వ చిత్రణలోని మెళుకువలూ, సమయోచిత ప్రతిస్పందనలూ ఈ కథలో శ్రీదేవి రచనా చాతుర్యాన్ని వ్యక్తపరుస్తాయి.

రేవతి స్వయంవరం

'రేవతి స్వయంవరం'. రేవతి చుట్టూ పరిభ్రమించే మూడు పాత్రలలో ఒకడు ఆమె గురువు శాస్త్రి, రెండవవాడు సహాధ్యాయి సీతాపతి, మూడవవాడు రేవతికి జూనియర్ అయిన కృష్ణమూర్తి. సీతాపతిపట్ల మొదట్లో రేవతి ఆకర్షితురాలై, అతడు వివాహితుడని తెలిసి తనను తాను హెచ్చరించుకుంటూ స్నేహాన్ని కొనసాగిస్తుంది. శాస్త్రి పట్లగల గురుభావం అతని పట్ల ఆకర్షణల్నీ కోరికల్నీ పెరగనీకుండా అధిగమించింది. వెన్నలా కరిగిపోయే పసి హృదయం కల కృష్ణమూర్తి పట్ల చిన్నపిల్లలపైగల ప్రేమ మాత్రమే రేవతికి ఉంది.

స్త్రీపురుషుల మధ్య స్నేహం ఈనాటికీకూడా ఎటువంటి అపోహలకు దారితీస్తుందో అందరికీ అనుభవైకవేద్యమే. అరవై ఏళ్ళ క్రిందట అటువంటి స్నేహం కేవలం ప్రేమతోనే ముడిపడినదని భావించే పరిస్థితి. దీనిని కథాంశంగా తీసుకొని రచయిత్రి కథని ఎంతో పకడ్బందీగా నడిపిన విధానం అభినందించ వలసినదే.

కథ చివరివరకూ ఎవరికివారు తననే రేవతి ప్రేమిస్తున్నదనీ, అనుకోని పరిస్థితులలో వివాహం చేసుకుంటున్నదనీ భావిస్తారు. రేవతి ముగ్గురికీ ఒకే రకమైన ఉత్తరాలతో వివాహానికి ఆహ్వానించుతుంది. అయితే శాస్త్రికి 'మీరు నాయందు దయుంటే తప్పక రండి' అని రాస్తుంది. ఆ ఒక్క పదంతోనే ఆమె తనకోసం పరితపిస్తుందనే భావంతో అతను వెళ్తాడు.

సీతాపతికి రాసిన ఉత్తరంలో 'నీమీద నాకుండే అభిమానం చేత నిన్ను ఇబ్బంది పెడుతున్నాను' అని రాస్తుంది. వివాహితుడైన సీతాపతి అభిమానం అనే పదాన్ని ప్రేమగానే భావించుకుంటాడు.

కృష్ణమూర్తికి రాసిన ఉత్తరంలో 'నువ్వు నిజంగా నన్ను ప్రేమిస్తుంటే తప్పక రావా'లని రాస్తుంది. మొదటినుండీ ఆమెని ఆరాధించే కృష్ణమూర్తి ఆమె సెలవుల్లో రమ్మని పిలిచినపుడు రాకపోవటంవల్లే మనసు మార్చుకొని వివాహం చేసేసుకుంటున్నదేమోనని బాధపడ్డాడు.

కథా గమనంలో ప్రతీ వ్యక్తీ రేవతి స్నేహాన్ని తనపై ప్రేమగా భావించటమే కాక ఆమె మిగతా ఇద్దరిలో ఎవరినైనా ప్రేమిస్తున్నదేమోననే అనుమానంతో మనసులోనే గిలగిల్లాడుతారు. అందుకే రేవతి స్నేహాన్ని అర్థంచేసుకొన్న కృష్ణమూర్తి అక్కడకు వచ్చిన శాస్త్రితో 'ఆమెకు మీ యందు భక్తి, అభిమానంమాత్రం ఉన్నాయి. ఇప్పుడనుకుంటున్నాను. నా విషయంలో అభిమానం మాత్రమే ఉంది కాబోలు' అని అంటాడు. కాని శాస్త్రికిమాత్రం ఇంకా తనని ప్రేమిస్తున్నదేమోననే భావం పోదు. అంతేకాక నేనుగానీ కృష్ణమూర్తిగానీ ఆమెకి ఒక స్పష్టమైన అభిప్రాయాన్ని ఈయలేకపోయామేమో. అందుకే ఈ బలవంతపు పెళ్ళి చేసుకుంటున్న దేమోననే అభిప్రాయంలోనే చివరి వరకూ శాస్త్రి ఉంటాడు.

అందుకే రేవతి ఇంటికి చేరాక 'పరిచయంలేని వ్యక్తితో జీవితం ప్రారంభించే కంటే అదివరకే అర్థంచేసుకొన్న వ్యక్తితో జీవితం సుఖంగా ఉండదంటావా? అటువంటి అవకాశం ఉండికూడా ఈ నిశ్చయానికి ఎందుకొచ్చావు?' అని నర్మగర్భంగా అడుగుతాడు. ఈ సంఘటనని రచయిత్రి చాలా తెలివిగా కల్పించింది.

ఈ సందర్భంలో ప్రేమ– పెళ్ళికి సంబంధించిన అనేక విషయాలు సుస్పష్టంగా వెల్లడించింది. ఆ అభిప్రాయాలన్నీ రేవతి పాత్రచేత చెప్పించినా అవి రచయిత్రి మనోభావాలుగానే మనం అర్థం చేసుకోవచ్చు.

ప్రేమ అనేది ఒకరి సొత్తుగా ఒకచోట నిల్చిపోయేది కాదు. ఎత్తునున్న నీరు పల్లానికి ప్రవహించటం ఎంత సహజమో ఇష్టం కలిగిన ప్రతి వ్యక్తియందు ప్రేమ ప్రసరించటం అంత సహజం. "ప్రేమించిన ప్రతీ వ్యక్తినీ వివాహం చేసుకోలేము.కానీ వివాహం చేసుకొనిన వ్యక్తిని ప్రేమించటం అంత కష్టం కాదనుకుంటాను" అని నర్మగర్భంగా రేవతి చేత చెప్పించటంలో ఆ ముగ్గురి పట్ల ఎవరిమీద ఎటువంటి అభిప్రాయం ఉందోననే విషయాన్ని కూడా భావయుక్తంగా తెలియజేసింది రచయిత్రి.

'ప్రేమ నిలకడలేని నీటి వంటిదని చులకన చేయడంలేదు. అనువైన ప్రతి హృదయంలోకి ప్రవహించగల శక్తివంతమైన సజీవ ప్రవాహమంటాను. దానిని మనకు కావలసిన చోట ఆనకట్టవేసి నిలుపుకోవటానికి ఎంతో నిగ్రహం కావాలి. చాలా ప్రయాసపడాలి. ఆ ప్రవాహంలో పడి కొట్టుకుపోయేకంటే ఒడ్డున కూర్చొని ఆనందించటం తేలికైన విషయంకదూ' అంటుంది.

ఈ అభిప్రాయాలు చదివితే ప్రేమ మీదా, పెళ్ళిమీదా రచయిత్రికి గల అభిప్రాయాలు ఎంత బలమైనవో తెలుస్తాయి. ఆ చెప్పటంలో ఏమాత్రం తొట్రుపాటుగానీ, తొందరపాటుకానీ ఉండదు. నిలకడగా నిల్చుని ఎదుటి మనిషి మనసులోని అపోహలన్నీ తెరిచి చూపి మరీ గుప్పున



ISSN No.2319-3905

ఎగరగొట్టేసినట్లే చెప్తుంది. ఆడపిల్ల చలాకీగా ఉండి చొరవగా మాట్లాడితే కలిగే అపోహల తీరు తెన్నులు రచయిత్రి తన రచనలో అద్దంలో చూపినట్లుగా తెలియచేసింది. రేవతి పాత్రలోనూ, వ్యక్తిత్వంలోనూ కాలాతీత వ్యక్తుల్లోని ఇందిర తొంగిచూస్తుంది.

అందుకేమరి కథ చివరలో ముగ్గురు పురుష పాత్రలూ రేవతి యింటికి చేరిన తర్వాత ఆమె మనసులో అభిప్రాయాలు అర్థం చేసుకోగలుగుతారు. స్త్రీ పురుషుల మధ్య ఏర్పడే పవిత్రమైన స్నేహ బంధాన్ని తెలుసుకోగలుగుతారు. అంతవరకూ వాళ్ళు ఊహించుకొన్న వివిధ అపోహల్ని గుప్పున సిగరెట్టు పొగతో ఎగర గొట్టేసుకున్నారని చమత్కారంగా చెప్తుంది శ్రీదేవి. ఆ రకంగా అంతవరకూ భారంగా నడిచిన కథని తేలికపరుస్తుంది. ఇన్నేళ్ళ తర్వాత కూడా సమకాలీనతకి ఈ కథ అద్దంపడుతుందనే చెప్పొచ్చు.

**కళ్యాణ కింకిణి**

మూడో కథ 'కళ్యాణ కింకిణి'లో కథానాయిక కళ్యాణిని తండ్రి తన స్నేహితుడు రాఘవయ్యకి అప్పగించి మరణించాడు. కళ్యాణిని పెళ్ళికి అంగీకరింప చేయటానికి రాఘవయ్య కన్నతండ్రిలా ప్రయత్నించాడు. తన పెళ్ళి ప్రస్తావనకి ఆమె హృదయం కదిలిపోయి బయటపడని దుఃఖం ఆమెని నిస్పృహలోనికి నెట్టేసింది.

ఇంట్లోని వాతావరణం, అక్క కళ్యాణి చుట్టూ ఆవరించిన గుబులు కలగలసిన స్తబ్దతని చలాకీపిల్ల అయిన హేమ భరించలేకపోయింది.

కార్తీక పౌర్ణమి నాటి శారద రాత్రి వెన్నెలని ఆస్వాదిస్తున్న హేమని చూసి క్రిందకి రమ్మని కేకలేస్తుంది కళ్యాణి. పున్నమి రాత్రిలోని వెన్నెల చాలా చెడ్డదని బాధపడుతున్న కళ్యాణి తత్త్వం అర్థం చేసుకోలేకపోయింది హేమ.

సవతి అన్నయ్య, తండ్రిచేసిన బ్యాంకు దొంగతనాన్ని నెత్తినేసుకు పారిపోయిన తర్వాత హేమ జన్మించింది. అన్నయ్య సత్యంకోసం ఎదురుచూసింది. అతను వచ్చిన తర్వాత తన దుఃఖ భారాన్ని దించుకుంది. ఇదీ స్థూలంగా కథ.

కథ చివరివరకూ టెంపోని, బలంగా కొనసాగించింది రచయిత్రి. కుటుంబంలోని ప్రతి రెండు పాత్రలకు బలమైన బంధం ఉంది. తిరిగి ప్రతీ పాత్రా మానసికంగా ఒంటరితనాన్ని అనుభవిస్తాయి. అందరిని చుట్టుకొని ఒక భయంకరమైన దుఃఖవేదన పెనవేసుకొని ఉంటుంది. ముందు మాటలో గోరా శాస్త్రి చెప్పినట్లు ఈ కథ 'బరువు రెప్పల విషాద గాథ'.

కళ్యాణి తల్లి సవతి కొడుకుని దూరంపెట్టి కూతురికోసం అతన్ని చదువు మాన్పించింది. కళ్యాణి దగాపడితే, ఆమెని కడుపులో దాచుకొని ఆమె కూతుర్ని తన కూతురుగా లోకానికి చెప్పింది. కళ్యాణి తండ్రి, కూతురి పెళ్ళికోసం చేసిన బ్యాంకు దొంగతనాన్ని తనపై వేసుకొని పారిపోయిన కొడుకుకోసం, కూతురి బతుకుకోసం దుఃఖిస్తూ రెండో భార్యకి ఎదురు చెప్పలేక మరణించాడు.

ఇంట్లో తండ్రి, తల్లి, చెల్లెలు అంతా ఉండికూడా – ఎందుకు నా చుట్టూ వీళ్ళంతా? నా వాళ్ళనబడే పరాయివాళ్ళు – అనే తపనతో పరారయ్యాడు సవతి అన్న. మానవులలో సహృదయత కోసం అన్వేషిస్తూ, మనుషులంటేనే భయపడ్తూ చివర్లో చెల్లెలు తమతో ఉండమన్నా లోకం పలు విధాలుగా అనుకుంటుందని తిరస్కరించాడు. హేమ తన స్నేహితుణ్ణి యింటివరకు తెచ్చినందుకు మందలించిన కళ్యాణిని విద్యా, సభ్యతా తెలియనిదని చిరాకుపడినా, అక్కగా భావించిన కళ్యాణే తనకు జన్మనిచ్చిన తల్లి అని చివర్లో తెలుసుకొని తనకూ అమ్మ ఉందని ఆనందపడుతుంది. ఆనాటి మధ్యతరగతి కుటుంబ జీవనంపై ఆర్థిక అంశాలు ఏ విధమైన ప్రభావం చూపుతాయో ఈ కథ తెలుపుతుంది. సమాజంలోని స్వార్థం ఏ విధంగా మానవ విలువల్నీ, కుటుంబ సంబంధాల్నీ నిర్వీర్యం చేస్తుందో చాలా శక్తివంతంగా ప్రతిపాదించింది ఈ కథలో రచయిత్రి.

కథంతా కళ్యాణి చుట్టూనే తిరుగుతుంది కానీ కళ్యాణిని దగా చేసినవాడు ఎవ్వరనేది పాఠకుల ఊహకే వదిలేసింది రచయిత్రి. వాళ్ళింటికి వచ్చే వారాల అబ్బాయి రామం ఏమో అనే సంశయాన్ని కలిగించినా ఎక్కడా ఆ ప్రస్తావన రాదు. ఏ కాలంలోనూ స్త్రీకి భద్రత లేకపోవటం అన్న విషయం ఇందులో గుర్తించవచ్చు. అభద్రతకు, లైంగిక దోపిడీకి గురైన స్త్రీ జీవితం, ఆమెతో ముడిపడిన వారి జీవితం ఏవిధంగా అస్థవ్యస్థం అయిపోతుందో చూపిస్తూ ఎక్కడా కథ తెగిపోకుండా బలంగా కథని నడిపించిన ఘనత శ్రీదేవిది.

ఈ 'ఉరుములు–మెరుపులు' సంపుటి మార్చి 1957లో ప్రచురితమైంది. అంటే ఇందులోని కథలు అంతకు పూర్వమే రాసినవని అర్థమౌతుంది.

ఆరు దశాబ్దాల క్రిందట రాసిన ఈ కథల్ని ఇంత జిగిబిగితో రాసిన రచయిత్రి భాషా వైచిత్రి ఆశ్చర్యపరుస్తుంది. ప్రతీ కథ మానవత్వ విలువల్ని పట్టి చూపుతుంది. కథానాయికలు బలమైన వ్యక్తిత్వం, మానసిక దృఢత్వం కలిగిన వారుగా తెలుస్తుంది. చదివిన తర్వాత పాఠకుల్ని ఆలోచింపచేసి ఎవరికి వారినే ప్రశ్నించుకొనేలా చేస్తాయి.

**శ్రావణ భాద్రపదాలు**

ఈ కథ నవంబరు 1958 జయంతి పత్రికలో ప్రచురింపబడింది. తిరిగి దీనిని ఏప్రిల్–జూన్ 2000 జయంతి సంచికలోనే పునర్ముద్రించారు.

ఈ కథానాయకుడు రచయిత. అతనొక లెక్కల ప్రొఫెసర్. పదవీ విరమణానంతరం జీవితకథ రాయాలని కలం కాగితం తీసి జీవితాన్ని తిప్పుతూ మంచి చెడుల్ని పునర్విమర్శించుకొంటూ నడిపిన కథ. కథంతా కథాకథన పద్ధతిలో ప్రథమ పురుషలో సాగుతుంది. ఆద్యంతాల మధ్య జీవిత పరమార్థం ఒకటుందని, దానిని తానందుకోగలిగానా అనే ఆత్మ విమర్శతో కథని ప్రారంభించటంలోనే రచయిత్రి ప్రత్యేకత అర్థమౌతుంది.

కథానాయకుడికి చదువుకుంటున్న వయసులోనే తగుమాత్రం చదువున్న సాధారణ స్త్రీ పదహారేళ్ళ అనసూయతో వివాహం జరిగింది. అయినా భర్త దస్తూరితో కనిపించిన ప్రతి కాగితం



ISSN No.2319-3905

జాగ్రత్త చేస్తుంది. అతని పుస్తకాలు, భోజనం అవసరాలు తప్ప తన ఆరోగ్యంగాని, భర్త తనని పట్టించుకుంటున్నాడా లేదా అనే ఆలోచన గాని లేదు. భర్త రచనలు బాగున్నాయని అంటుంది కానీ వాటిపట్ల ఆసక్తి లేదు. పుట్టినగుడ్డు ఇంద్రాణినీ, అయిదేళ్ళ సుదర్శనాన్నీ భర్తకప్పగించి గొప్పవాళ్ళని చేయమని కోరుతూ కన్నుమూసింది.

యాభయ్యవ దశకంలోని సాధారణ గృహిణికి ప్రతిబింబం అనసూయ. ఈ పాత్ర ఒక శ్రావణంలో నాయకుడి జీవితంలో అడుగుపెడుతుంది. భాద్రపదంలో కురిసే వర్షంలో నిష్క్రమిస్తుంది.

భార్యలేని జీవితం బాధాకరంగా ఉన్నా సవతి తల్లి పిల్లల్ని చూస్తుందో లేదోనని పునర్వివాహం చేసుకోడు. కూతురు ఇంద్రాణి అనారోగ్యం బారిన పడడం వల్ల, పిల్లని చూసుకోవటానికి పెట్టిన ముసలమ్మ చనిపోవటం వల్ల పిల్లల ఆలనాపాలనలతో కథలు రాయకపోతే నష్టమేమిటనే చింతనలో రచనల జోలికి పోడు.

శిష్యురాలిగా చేరి జీవితంలో ప్రవేశించిన శైలజ సాహిత్యానికీ, జీవితానికీ మధ్య అంతరాన్ని గుర్తించక అసంతృప్తికి గురై బంధం తెంపుకు వెళ్ళిపోయింది.

కనిపెట్టుకొని చూసుకొనే కొడుకు సుదర్శనం స్కాలర్షిప్తో అమెరికా వెళ్ళి గుండెజబ్బుల గురించి పరిశోధన చేసి కొత్త విషయాలు కనిపెట్టినవాడైనా తండ్రి హృదయవేదన అర్థం చేసుకోకపోవడంతో మానవ దౌర్బల్యం, స్వార్థం ఎంతటిదో అర్థమయ్యేలా తెలియజేసింది రచయిత్రి.

చిన్నపిల్లలా తండ్రి వెంట తిరిగే ఇంద్రాణిలో అంతకంతకూ మార్పు వచ్చింది. యాభయ్యో దశకంలో ఆడపిల్లలు ఇంట్లో పై చదువులకు ప్రోత్సాహం ఉన్నప్పుడు మాత్రమే కాలేజీకి వెళ్ళగలిగే రోజులు. అటుపూర్తిగా సాంప్రదాయక ఆంక్షలకు, ఇటు ఆధునికతకు మధ్య నలిగే సంధికాలంలో బలహీన మనస్కులైన ఇంద్రాణి వంటి వారు చెడు స్నేహాలకు, చెడు ప్రవర్తనలకు ఎలా ఆకర్షితులౌతారో ప్రతిభావంతంగా శ్రీదేవి తెలియజేసింది. చెడు తిరుగుళ్ళతో పిల్లలు ఇల్లు వదిలివెళ్ళి ఏ రకంగా బాధపడుతున్నారోనని మథనపడే తండ్రి హృదయాన్ని వివరించింది.

రచయితగా గొప్ప కీర్తి, వ్యక్తిత్వం, ఉన్నతోద్యోగం, ఆదర్శాలు గల కథానాయకుడి జీవితంతో సంబంధం ఉన్న ముగ్గురు స్త్రీలనీ మూడు తరాలకు ప్రతినిధులుగా, మూడు అవకాశాలకు ప్రతినిధులుగా తీర్చిదిద్దింది రచయిత్రి.

పదహారేళ్ళకే వివాహం అయి జీవితంలో అడుగు పెట్టిన అనసూయకు భౌతిక ప్రపంచం గురించి ఆలోచనలేదు. తానూ తన భర్తా పిల్లలూ వారి అవసరాలు, కుటుంబాన్ని తీర్చిదిద్దుకోవటం, భర్త అవసరాలకు ఏ ఆటంకం కాకుండా చూసుకోవటం ఇదే ఆమె బాధ్యత. కుటుంబానికి అంకితమైన ఏ స్త్రీ కూడా తన అనారోగ్యాన్నీ, అవసరాలనీ లెక్కచెయ్యదు. ఆ విషయాన్ని అనసూయ పాత్ర చిత్రీకరణలో రచయిత్రి ప్రదర్శించారు.

చదువుకున్న శైలజ, కథానాయకుడి రచనలకు వ్యక్తిత్వానికి ఆకర్షితురాలై, శిష్యురాలిగా చేరింది. మంచి సంస్కారవంతులు, విద్యావంతులైన ఇంటి అమ్మాయి శైలజ అతని జీవితంలో

ప్రవేశించింది. పిల్లల్ని తల్లిలా పెంచింది. అనసూయలాగే కుటుంబ బాధ్యతలు నిర్వహించింది. కానీ ఆమెకు కావలసిన ప్రేమ ఆప్యాయతలు పొందలేకపోయింది. శైలజ పాత్ర చిత్రణలో రచయిత్రి చాలా అనురక్తితో నిర్వహించినట్లు తెలుస్తుంది. కథలో ఆమె పాత్ర చిన్నదే అయినా ఆత్మాభిమానం, సంస్కారం వున్న యువతిగా తీర్చిదిద్దింది రచయిత్రి.

కథానాయకుని జీవితంలో ప్రవేశించినపుడు, నిష్క్రమించేటపుడు కూడా ఉత్తరం ద్వారానే తెలియజేస్తుంది. రెండు ఉత్తరాల్లోనూ శైలజ వ్యక్తిత్వాన్ని శక్తివంతంగా రచయిత్రి తెలియజేసింది.

"మీ కథలు, పుస్తకాలు చదివి మీ వ్యక్తిత్వాన్ని వలచి మీతో జీవితాన్ని పంచుకోవాలని ప్రయత్నించాను. మీకేదో కావాలని, చీకట్లో తడుముకుంటున్నారని అనిపించి మీరన్వేషించే దానిని నేనివ్వగలనని భ్రమపడ్డాను. మీ పూర్వ జీవితం అనసూయకు అంకితమైపోయిందని తెలుసు. శేషజీవితం కథలకీ, కావ్యాలకీ అంకితమైపోతున్నదని ఇప్పుడు తెలుసుకున్నాను. తల్లిలేని పిల్లలకొక అనువైన దాదిగా మాత్రమే నన్నాహ్వానించారు. ఆ కర్తవ్య నిర్వహణ సరిగానే చేశాననుకొంటాను. నిరానందమయమైన జీవితంలో ఇరుక్కుని అలానే హరించిపోవటంలో అర్థం లేదు. శైలజ మీ జీవితం నుండి తప్పుకుంది".

ఈ ఒక్క ఉత్తరంలోనే శైలజ మనస్తత్వం, వ్యక్తిత్వం, సంస్కారం, స్వాభిమానం అన్నీ ప్రదర్శితమయ్యేలా చూపింది శ్రీదేవి.

ఇక మూడో పాత్ర ఇంద్రాణి. మంచీ చెడుల మధ్య గల అతి చిన్న విభజన రేఖని అర్థం చేసుకోలేక, ఆ వయస్సులో గల ఆకర్షణలకు ప్రలోభాలకు గురై విచక్షణాజ్ఞానం లేక, చెడు తోవలు పట్టిపోయే యువతకు ప్రతినిధి ఇంద్రాణి.

పిల్లలు తమకంటే అన్ని విధాలా అధికులు కావాలని వాళ్ళ భవిష్యత్తుకు బంగారుబాటలు వేస్తూ అందరాని అందలాలకు నిచ్చెనలు వేసి, తమ జీవితాన్ని ఆలంబనగా చేసి చేయూతనిచ్చి, విదేశాలకు వెళ్ళేందుకు ప్రోత్సహించి, తీరా తమ వృద్ధాప్య దశలో ఆసరా కాలేకపోయిన ఈ కథలోని కొడుకు పాత్ర చిత్రణ రచయిత్రి ముందుచూపుకు నిదర్శనం. ఈనాడు వృద్ధాశ్రమాలుగా దేశం మారిపోతోన్న దృశ్యాన్ని యాభై ఏళ్ళ క్రితమే అందించిన రచయిత్రిని అభినందించాల్సిన విషయం.

కథారచన కాలం 1958. అంటే పి. శ్రీదేవికి అప్పటికే కొంత అనారోగ్యం సంభవించి ఉండొచ్చును. ఆ ప్రభావంవల్లనేమో బహుశా కథలో కొంత తాత్విక చింతన వుంది.

"నా జీవితం ఏనాడో ప్రారంభమైంది. అంతం సమీపంలోనే ఉందనిపిస్తుంది. ఈ ఆద్యంతాల మధ్య జీవిత పరమార్థమనేది ఒకటుందా అసలు? ఉంటే దానిని నేనందుకోగలిగానా?" అని కథ ప్రారంభించి, సుఖమంటే ఏమిటి? దుఃఖమంటే ఏమిటి? అసలు జీవితపు విలువలనేవి ఎక్కడున్నాయి? అని ప్రశ్నిస్తుంది.





ఇదొక జవాబులేని ప్రశ్న. ఎన్ని శ్రావణాలు గడచినా, మరెన్ని భాద్రపదాలు గడచినా ఈ ప్రశ్నకు జవాబే దొరకలేదని చెబుతూ కథని ముగిస్తుంది రచయిత్రి.

**కల తెచ్చిన రూపాయలు**

తాతలనాటి ఆస్థి కరిగిపోగా చేస్తున్న చిరుద్యోగం నుండి రిటైరై పదేళ్ళు దాటిన పరంధామయ్యకు తన కొడుకు శేషాద్రి వ్యసనాలకులోనై దేశాలు పట్టిపోవడం అతనికి ఎదురుదెబ్బ. కోడలు సరస్వతి గొంతు కోసాననే బాధతో బతుకు దుర్భరంగా గడుపుతున్నాడు. ముందురోజే వచ్చిన భర్త రాసిన ఉత్తరం మామయ్యకు ఇవ్వటానికి జంకుతుంది కోడలు. ఆరు నెలల క్రిందటే సర్వస్వం వాడిచేతిలో పోస్తే, ఉద్యోగం సంపాదించేవరకూ తిరిగి రానని చెప్పినవాడు మళ్ళీ 500రూపాయలు పంపమని రాశాడు. ఇప్పుడింకేం రాశాడోనని అనుకొంటూ కోపంతో కార్డు తీసాడు పరంధామయ్య. కోపంతో వణుకుతోన్న అతనికి కార్డు మీద 1000 అంకె మాత్రమే కన్పించి మళ్ళీ డబ్బు కోసమే రాశాడని ఆవేశపడి అది తట్టుకోలేక ఉద్వేగపడతాడు.

కలత నిద్రలో ఖరీదైన బట్టలతో కొడుకు వచ్చి తాను వెయ్యి రూపాయల జీతం వచ్చే ఉద్యోగంలో చేరానని అంటూ తండ్రికి భార్యకి బహుమతులు తెచ్చినట్లుగా కలగన్నాడు. ఉదయం లేచాక నిజంగానే కొడుకు రావటమే కాక దుర్వ్యసనాలను విడిచిపెట్టాననీ, 100 రూపాయల జీతంతో ఉద్యోగం వచ్చిందని తెలిపాడు. వెయ్యికి ఒక సున్నా తగ్గినా మంచి ప్రవర్తనతో తిరిగి వచ్చినందుకు తండ్రీ, భార్యా సంతోషించారు. ఈ కథ అతి సాధారణమైన కథే. ప్రత్యేకంగా చెప్పదగిన రచనా శిల్ప చాతుర్యం లేనిదే అయినా ఆనాటి దేశ ఆర్థిక పరిస్థితులలో చితికిపోయిన మధ్య తరగతి కుటుంబానికి దర్పణంగా ఉంది. బహుశా రచయిత్రి తొలిరోజులలో రాసిన కథ కావచ్చు.

**మెత్తని శిక్ష**

కథంతా ఒక ప్రభుత్వ డాక్టరు స్వగతంగానే సాగుతుంది. అతని స్నేహితుడు సుందర్రావు మద్యనిషేధం అమలులో ఉన్న రోజులైనా తాగి పోలీసుల చేతికి చిక్కి అరెస్టు అయ్యాడు. డబ్బు బాగా అందిఉంటుందన్న లోకుల మాటల్ని నిజం చేస్తూ సుందర్రావుని విడిపించాడు డాక్టరు. జరిగిన సంఘటనలన్నిటినీ ఆలోచిస్తూ కారులో సుందర్రావుతో కలిసివెళ్తున్న డాక్టరు కారుకి అడ్డుగా ఏడెనిమిదేళ్ళ పిల్లాడు పడబోయి తృటిలో తప్పించుకున్నాడు. అప్పుడే అక్కడికి అరుస్తూ వచ్చిన పిల్లాడి తండ్రి డాక్టరుని గుర్తుపట్టి 'రెండోసారి కూడా పిల్లాడిని మృత్యువు నుండి తప్పించారని కృతజ్ఞతలు తెలియజేసాడు.

ఒకనాటి అతని (రాములు) కథని గుర్తుకు తెచ్చుకున్నాడు డాక్టరు. కొత్తగా ఉద్యోగం వచ్చిన రోజుల్లో, రాములు తాగి రోడ్డుపై పొర్లుతుండగా పోలీసులు హాస్పిటల్కి తెచ్చారు. అతను తాగినట్లుగా తను ఇచ్చిన డాక్టరు సర్టిఫికెట్ వలన మూడు నెలల శిక్ష పడింది. ఆ శిక్ష కాలంలో అతని కుటుంబం ఛిద్రమైపోయింది. టైఫాయిడ్ బారిన పడి భార్య, కూతురు మృత్యువాత పడ్డారు.

రెండు నెలల పిల్లవాడినిమాత్రం డాక్టరు రక్షించగలిగాడు. అంతలో ఉద్యోగం బదిలీ కావడంతో పిల్లాడిని తండ్రి శిక్ష పూర్తి అయ్యేంతవరకూ పెంచమని నర్సుల సంరక్షణలో ఉంచి వెళ్ళిపోయాడు.

ఉద్యోగపు తొలి రోజుల్లో నీతి నియమాలపట్ల నిబద్ధత ఉన్న రోజులు. మనస్సాక్షికి విరుద్ధంగా మమతలు మైత్రులు మొహమాటపెట్టలేని నిగ్రహం ఉన్న రోజులు. ధనాశతో నైతిక పరిధులు అతిక్రమించని రోజులు కావడంతో నిజం చెప్పి రాములు కుటుంబానికి ద్రోహం చేసినందుకు రాములు బోనులో నుండి దీనంగా చూసిన చూపులు డాక్టరుని వెంటాడుతూనే ఉన్నాయి. ఏడేళ్ళ అనంతరం క్రమక్రమంగా ధర్మాలు, ఆశయాలు కరిగిపోతూ జీవిత దృక్పథాన్నే మార్చేశాయి. అందుకే రాములు పరిస్థితిలోనే ఉన్న స్నేహితుడు సుందర్రావుని అబద్ధపు సాక్ష్యంతో శిక్షనుండి తప్పించాడు.

ఆ పరిస్థితుల్లో రాములు హఠాత్తుగా ఎదురై తనపై నేడు చూపిన కృతజ్ఞత కన్నా మెత్తని శిక్ష మరొకటి ఉంటుందా అని డాక్టరు పొందిన ఆవేదన ఈ కథ.

ఈ కథలో ఒక ప్రత్యేకత– కథనమంతా ఒక తలపోతగానే చెప్పింది రచయిత్రి. మరొకటి – మద్యనిషేధం అమలులో ఉన్నప్పటికీ దిగువ వర్గం వారికి కూడా మద్యం అందుబాటులోకి రావడంలో ప్రభుత్వ నిర్లక్ష్యానికి ప్రతీకగా యిది వ్యక్తమౌతుంది. ఇంకో విషయం అవినీతిలో కూరుకుపోయే ప్రభుత్వ ఉద్యోగులతీరుని ఎత్తిచూపటం.

బహుశా శ్రీదేవి వైద్యవృత్తిలో ప్రభుత్వ డాక్టరుగా పనిచేస్తున్న రోజుల్లో ఆమె పరిశీలనలోకి వచ్చిన సంఘటనలే కథగా రూపుదిద్దుకొని ఉండాలి. ఉద్యోగపు తొలిరోజుల్లో డాక్టర్ల మానసిక స్థితి ఎంత అభ్యుదయ భావాలతో, ఆశయాలతో ఉత్తేజితమై ఉండేదో, కాలక్రమేణా అనేకానేక కారణాల వల్ల ఆశయాలలోని ఆవేశం తగ్గి జీవన మార్గం ఏ రకంగా మార్పుకు లోనవుతూ వస్తూవున్నదో చాలా సహజంగా తెలియజేసింది రచయిత్రి.

**వాళ్ళు పాడిన భూపాలరాగం**

పి. శ్రీదేవి కథలన్నీ కథానికలనేకన్నా నవలికలని కూడా చెప్పవచ్చు. అనేక భిన్న మనస్తత్వాలు కలిగిన పాత్రలతో, అనేక సంఘటనలతో విస్తృతమైన కథాంశంతో నడుస్తాయి. అటువంటిదే ఈ కథ కూడాఇందులో ముఖ్యపాత్ర రామారావు. అతని తండ్రి రామచంద్రయ్య చేస్తున్నది శుద్ధ మాస్టరీ ఉద్యోగమే కానీ లేమికి భయపడడు. అనారోగ్యం అతని ఇంట్లో ఎరగని విషయం. కుదురైన చిన్నసంసారం. జీవితావసరాలైన తిండి, బట్ట ఉన్నాయి. అంతకుమించి అతనికేమీ అక్కరలేదు. రేడియోలు, గ్రామఫోను, సినిమాలు వీటిలో నమ్మకంలేదు. ఇంట్లో కార్యాలు పొదుపుగా శాస్త్రోక్తంగా చేస్తాడు. ఇదీ రామచంద్రయ్య జీవితం. అందుకే ఫస్టుమార్కులతో పాసైన కొడుకు రామారావుని పై చదువులు చదివిస్తానని అనకుండా, పట్నంలో ఏ ఆఫీసులో ఏ ఖాళీలున్నాయో వాకబు చేసి మరీ పట్నం పంపించాడు. కూతురు మీనాక్షికి పదహారో ఏడు రాగానే రెండో సంబంధం చేసి చేతులు దులుపుకున్నాడు. ఈ రకంగా అతనిది మధ్య తరగతి



ISSN No.2319-3905

సగటు మనిషి జీవన విధానంగా వర్ణించింది రచయిత్రి. అయితే కథనంలో ఇది ప్రధానంగా చెప్పలేదు. కేవలం ఉపోద్ఘాతంగానే చెప్తూ పట్నంలో భిన్నకుటుంబాల దర్శనం దృశ్యమానం చేయటానికి వీలుగా రామచంద్రయ్యచేత “బంధువులు అందరిళ్ళకూ వెళ్లు కానీ ఎవరినో తెచ్చుకున్న శ్రీనివాసులు ఇంటికి వెళ్ళొద్దు” అని కొడుకుకి హితబోధ చేయడంతో కథకి ఆయువుపట్టు ఎక్కడో చెప్పింది రచయిత్రి.

రామారావు పట్నం వచ్చి దిగిన ఇల్లు సూర్యం బాబాయిది. మొదటి భార్య పోయాక మళ్ళీ పెళ్ళి చేసుకున్నాడు. మొదటి భార్య కూతురిని ఆస్థిపరుడైన శ్రీనివాసులుకి ఇచ్చి పెళ్ళిచేసాడు. రెండవ భార్యకు ఏటేటా పుట్టే సంతానంతో ఇల్లు ఒక ధర్మసత్రంలా అయ్యేసరికి ఖర్చంతా తన అల్లుడిపైనే మోపేసేడు సూర్యం బాబాయి. తర్వాత్తర్వాత అల్లుడు శ్రీనివాసులు ద్వారా దమ్మిడీ అయినా రాలకపోవడంతో అతనితో తగువుపెట్టుకున్నాడు. ఇంట్లో పిల్లలకీ, జబ్బులకీ చేయి సాగక శ్రీనివాసుల్ని నానా తిట్లూ తిడుతూనే, అవసరాలకో బియ్యానికో ఇంక దేనికో డబ్బు కోసం శ్రీనివాసులు ఇంటికే వెళ్ళి చెయ్యి చాపడానికి ఏమాత్రం సిగ్గుపడని సూర్యం బాబాయి తీరూ, బహుసంతానంతో చస్తూ బతుకుతున్న అతని సంసారాన్నీ చూసి అభం శుభం తెలియని రామారావు స్కూలు ఫైనల్ మెదడుకి అర్థం కాలేదంటుంది శ్రీదేవి.

రామారావు మరొక బంధువు వెంకటేశ్వర్లు. అతను డబ్బు లేదని భోజనం మానేసి, పిల్లలకి ఒక పకోడీ పొట్లాం కొనిచ్చి, పక్కవాళ్ళింట్లో వదిలేసి, అప్పు చేసైనా సరే, లేదా రామారావులాంటి వాళ్ళచేత ఖర్చుపెట్టించైనా సరే వారానికి మూడు సినిమాలైనా భార్యతో సహా చూసే రకం. డబ్బు కట్టలేదని ఎలక్ట్రిసిటీ కనెక్షన్ తీసేసినా అతనికి బాధలేదు. అతని జీతం డెబ్బయి రూపాయలైతే ఇంటద్దే ఇరవై రూపాయలుంది.

బంధువు శ్రీనివాసులుని అతని పరోక్షంలో ఎత్తిపొడుపులతో తిట్లతో దెప్పుకుంటూ మళ్ళీ ఆ శ్రీనివాసులు దగ్గరే సినిమా కోసం అప్పు చేయటానికి మొగమాటం లేనివాడు వెంకటేశ్వర్లు. ఎలక్ట్రిసిటీ కనెక్షన్ కన్నా, పిల్లలకి భోజనం కన్నా సినిమాలే ముఖ్యంగా తలంచే వెంకటేశ్వర్లుకు వచ్చే 70 రూపాయల జీతం నెలంతా ఎలా సరిపోతుందో రామారావు చదువు లెక్కకట్టలేకపోయింది.

ఇంకో పాత్ర సుబ్బారావు. తండ్రి లక్షాధికారి కావటంతో చదువు అబ్బక రాజసాలకి ఆస్తులు హరించిపోగా చిన్న ఉద్యోగాలు చేయటానికి నామోషీతో పట్నంలో తండ్రి పంపే డబ్బుతో కొత్త భార్యతో సినిమాలు, షికార్లతో కాలం గడుపుతున్నాడు. పూర్వ వైభవాన్ని చాటే ఇంట్లో అప్పులతో కృత్రిమ రాజసాన్ని ప్రదర్శిస్తూ రామారావులాంటివారి నెత్తిమీద చేయి పెట్టి భార్యతో సహా విలాసంగా గడపటానికి వెనుదీయని మనిషి అతను.

కృత్రిమ రాజసంతో, హిపోక్రసీతో బతికే సుబ్బారావుకి సినిమాలు షికార్లకీ, హొటళ్ళకీ ఎక్కడలేని డబ్బూ చాలదు. ముందు ముందు అతని జీవితం ఎలా గడుస్తుందనే ప్రశ్న రామారావుని వేదిస్తుంది.

ఈ కథలో నిజానికి హీరో శ్రీనివాసులు. 16 ఏళ్ళకే పెళ్ళి చేసుకొని పిల్లనిచ్చిన మామగారైన సూర్యం సంసారాన్ని తనే భరించి ఆస్తి హరింపచేసుకొని, చివరికి భార్య ప్రమేయంతో వేరుకాపురం పెట్టేడు.

అనుకోని పరిస్థితులలో శ్రీనివాసులుకు ఒక బాలవితంతువు వరలక్ష్మి కలిసింది. తననీ, తన ఆస్థినీ జాగ్రత్తగా చూసుకొనే మనిషని శ్రీనివాసుల్ని నమ్మింది. బహుభార్యానిషేధం వల్ల వరలక్ష్మితో గుట్టుగా సహజీవనం చేస్తున్నాడు శ్రీనివాసులు.

తన కథంతా రామారావుకి చెప్తూ "నేనొక లాటరీలో గెలిచాను. నా సమస్తం వరలక్ష్మి అధీనంలో పెట్టాను. నాలుగు కుటుంబాలవాళ్ళూ నన్నూ వరలక్ష్మినీ తిడుతున్నా అప్పులకు ఆమె ముందు చేయి చాస్తారు. మొన్న పుట్టిన పిల్లాడితో సహా మేమంతా ఆమె పెంపుడు చిలకలం" అని ప్రశాంతంగా చెప్పినవాడు శ్రీనివాసులు. బతికి చెడినవాడే కాక బతకడం ఎలాగో తెలిసినవాడు శ్రీనివాసులు. చస్తూ బతికేకన్నా చెడి బతికే మార్గం చూసుకోవాలనే సిద్ధాంతంతో తన భార్యాపిల్లల్నే కాకుండా తనతోసహజీవనం సాగించే వరలక్ష్మిని కూడా నిశ్చింతగా బతకడం ఎలాగో ప్రయోగాత్మకంగా చూపిస్తున్నాడు.

వరలక్ష్మి, సుశీల ఒకరికొకరు ఆదరంతో ఆప్యాయతలతో ప్రశాంతంగా గడపడం చూస్తుంటే ఆశ్చర్యం కలిగింది రామారావుకి. శ్రీనివాసులు తన కథంతటినీ తనతో విడమరచి చెప్పేసరికి తనకు ఒక ఆధిక్యాన్నిచ్చినట్లు, తనని ఆత్మీయునిగా భావించినట్లు తోచి ఉక్కిరి బిక్కిరి అయ్యాడు రామారావు.

అప్పుడే పాఠశాల చదువు ముగించి వచ్చిన ఓ విద్యార్థి మనస్తత్వాన్ని వివరించటంలో మానసిక విశ్లేషణను శ్రీదేవి చాలా నేర్పుగా చేసింది.

"కాయా పండూ కాని మెదడు మెలమెల్లగా పలకబారినట్లు అయింది. విడని మొగ్గని మంచి వాతావరణంలో పెడితే సహజసిద్ధంగా విచ్చుకున్నట్లు పుస్తకజ్ఞానం తప్ప మరొకటి తెలియని రామారావుకి ప్రపంచం అంతా తేటతెల్లమయినట్లు తోచింది".

"ఇప్పుడు తండ్రి చెప్పినట్లు ఉపాధి కోసం వచ్చినట్లే రేపు పెళ్ళి చేసుకో అంటే చేసుకుంటావు. ఆ తర్వాత నీకు వచ్చే అరవై డెబ్భై రూపాయలతో సూర్యం కుటుంబంలాగో, వెంకటేశ్వర్లు, సుబ్బారావుల్లాగో అయిదూ పదికీ మీ నాన్న మీద ఆధారపడతావో నిర్ణయం చేసుకో. వాళ్ళందరిలా పవిత్రంగా చచ్చిపోకు. బతికే మార్గం చూసుకో" అని శ్రీనివాసులు చేసిన ఉపదేశం, రామారావుకి మార్గనిర్దేశం చేసింది.

తిరిగి ఊరు చేరిన రామారావు నిశ్చయం విన్న తండ్రి మొదట కోపించినా తల్లి వత్తాసు పలకడంతో పైచదువుకి తండ్రి అంగీకరిస్తాడు. ఎవరిని ఉద్ధరించాలనో, మనకార్యం చేయాలనో చదవబోవటంలేదని బురదగుంటలోని కప్పలా ఒకరినొకరు కరచుకొని, కబళిస్తూ బతికేకన్నా కొన్నాళ్ళు పక్షిలా బతకటానికి ఒక వ్యవధి కోసమే నా చదువు అనుకుంటాడు.



ISSN No.2319-3905

ఈ కథలో రచయిత్రి అనేక అంశాలని పాఠకుల ముందు పెట్టి ఆలోచింపచేసింది. వరలక్ష్మి గురించి తన సహజపద్ధతిలో తెలియచేయటం గమనార్హం. 11వ ఏటో 12వ ఏటో వరలక్ష్మికి పెళ్లి జరిగింది. ఏడాదికే భర్త చనిపోవటంతో భర్త విలువా, డబ్బు విలువా తెలియకుండా పెరిగింది. ఆమె తండ్రి వియ్యాలవారి ముక్కు పిండి పాతిక వేల ఆస్తిలాగాడు. అది వడ్డీలకు వడ్డీలై పెరిగింది. తెలివైన వరలక్ష్మి స్కూలు ఫైనల్ వరకూ చదివింది. ఇంకా చదువుకుంటే ఎక్కడికైనా ఎగిరిపోతే ఆస్సహజీవనం సాగించే వరలక్ష్మిని కూడా నిశ్చింతగా బతకడం ఎలాగో ప్రయోగాత్మకంగా చూపిస్తున్నాడు.

వరలక్ష్మి, సుశీల ఒకరికొకరు ఆదరంతో ఆప్యాయతలతో ప్రశాంతంగా గడపడం చూస్తుంటే ఆశ్చర్యం కలిగింది రామారావుకి. శ్రీనివాసులు తన కథంతటినీ తనతో విడమరచి చెప్పేసరికి తనకు ఒక ఆధిక్యాన్నిచ్చినట్లు, తనని ఆత్మీయునిగా భావించినట్లు తోచి ఉక్కిరి బిక్కిరి అయ్యాడు రామారావు.

అప్పుడే పాఠశాల చదువు ముగించి వచ్చిన ఓ విద్యార్థి మనస్తత్వాన్ని వివరించటంలో మానసిక విశ్లేషణను శ్రీదేవి చాలా నేర్పుగా చేసింది.

"కాయా పండూ కాని మెదడు మెలమెల్లగా పలకబారినట్లు అయింది. విడని మొగ్గని మంచి వాతావరణంలో పెడితే సహజసిద్ధంగా విచ్చుకున్నట్లు పుస్తకజ్ఞానం తప్ప మరొకటి తెలియని రామారావుకి ప్రపంచం అంతా తేటతెల్లమయినట్లు తోచింది".

"ఇప్పుడు తండ్రి చెప్పినట్లు ఉపాధి కోసం వచ్చినట్లే రేపు పెళ్ళి చేసుకో అంటే చేసుకుంటావు. ఆ తర్వాత నీకు వచ్చే అరవై డెబ్భై రూపాయలతో సూర్యం కుటుంబంలాగో, వెంకటేశ్వర్లు, సుబ్బారావుల్లాగో అయిదూ పదికీ మీ నాన్న మీద ఆధారపడతావో నిర్ణయం చేసుకో. వాళ్ళందరిలా పవిత్రంగా చచ్చిపోకు. బతికే మార్గం చూసుకో" అని శ్రీనివాసులు చేసిన ఉపదేశం, రామారావుకి మార్గనిర్దేశం చేసింది.

తిరిగి ఊరు చేరిన రామారావు నిశ్చయం విన్న తండ్రి మొదట కోపించినా తల్లి వత్తాసు పలకడంతో పైచదువుకి తండ్రి అంగీకరిస్తాడు.

ఎవరిని ఉద్ధరించాలనో, మనకార్యం చేయాలనో చదవబోవటంలేదని బురదగుంటలోని కప్పలా ఒకరినొకరు కరచుకొని, కబళిస్తూ బతికేకన్నా కొన్నాళ్ళు పక్షిలా బతకటానికి ఒక వ్యవధి కోసమే నా చదువు అనుకుంటాడు.

ఈ కథలో రచయిత్రి అనేక అంశాలని పాఠకుల ముందు పెట్టి ఆలోచింపచేసింది. వరలక్ష్మి గురించి తన సహజపద్ధతిలో తెలియచేయటం గమనార్హం. 11వ ఏటో 12వ ఏటో వరలక్ష్మికి పెళ్లి జరిగింది. ఏడాదికే భర్త చనిపోవటంతో భర్త విలువా, డబ్బు విలువా తెలియకుండా పెరిగింది. ఆమె తండ్రి వియ్యాలవారి ముక్కు పిండి పాతిక వేల ఆస్తిలాగాడు. అది వడ్డీలకు వడ్డీలై పెరిగింది. తెలివైన వరలక్ష్మి స్కూలు ఫైనల్ వరకూ చదివింది. ఇంకా చదువుకుంటే

ఎక్కడికైనా ఎగిరిపోతే ఆస్తి కొన్నాళ్ళు పక్షిలా బతకటానికి ఒక వ్యవధి కోసమే నా చదువు అనుకుంటాడు.

ఈ కథలో రచయిత్రి అనేక అంశాలని పాఠకుల ముందు పెట్టి ఆలోచింపచేసింది. వరలక్ష్మి గురించి తన సహజపద్ధతిలో తెలియచేయటం గమనార్హం. 11వ ఏటో 12వ ఏటో వరలక్ష్మికి పెళ్లి జరిగింది. ఏడాదికే భర్త చనిపోవటంతో భర్త విలువా, డబ్బు విలువా తెలియకుండా పెరిగింది. ఆమె తండ్రి వియ్యాలవారి ముక్కు పిండి పాతిక వేల ఆస్తిలాగాడు. అది వడ్డీలకు వడ్డీలై పెరిగింది. తెలివైన వరలక్ష్మి స్కూలు ఫైనల్ వరకూ చదివింది. ఇంకా చదువుకుంటే ఎక్కడికైనా ఎగిరిపోతే దూరమౌతుందని అంతటితో చదువు ఆపించేశాడు తండ్రి. కానీ అన్న ద్వారా పరిచయమైన శ్రీనివాసులు తననీ, తన ఆస్తినీ కాపాడుతాడని నమ్మి అతని నీడకు చేరింది. ఇక్కడ అయిదు దశాబ్దాల క్రిందట ఆడపిల్లల పరిస్థితీ, అందులోనూ బాలవితంతువుల దుస్థితీ, ఆర్థిక అవసరాలు ఏ రకంగా మానవ సంబంధాలపై వుంటాయో రచయిత్రి వివరించింది.

ఈ కథలో ప్రతీ పాత్రకూడా విచిత్రమైన విభిన్న వ్యక్తిత్వం కలవే. ఒక పాత్రతో మరొక పాత్రని పోల్చటానికి లేదు. పల్లె జీవితానికీ నగర జీవితానికీ గల వ్యత్యాసం స్పష్టంగా తెలియజేసింది. నగరీకరణ నేపథ్యంలో సామాన్యులను ప్రలోభాలకు గురిచేసే విధానం, దాని ప్రభావంతో ఆర్థికపరమైన సమస్యలు, ఛిద్రమైపోతున్న మానవ సంబంధాలు ప్రతిభావంతంగా వ్యక్తపరిచింది రచయిత్రి.

కథానిక ప్రారంభంలోనే రచయిత్రి కాయాపండూ కాని రామం మెదడు అనే మాటతోనే స్కూలైఫైనల్ పరీక్ష రాసిన రామం ఇంకా కౌమారదశ దాటక పోవటంతో మంచీ చెడూ తెలుసుకోలేదు అనే అర్థాన్ని పాఠకులకు అందజేసింది. అంతేకాకుండా రామం వయసువాళ్ళింకా గోళీలాడుతున్నారు అనటంలోనూ, వెంకటేశ్వర్లు, సుబ్బారావుల ఆర్థిక జీవితాన్ని లెక్కకట్టలేకపోయింది స్కూల్ ఫైనల్ మెదడు అనటంలోనూ రామం మనసు ఇంకా పరిణతి చెందలేదనే విషయం వ్యక్తమౌతుంది.

అదేవిధంగా శ్రీనివాసులు తన జీవితాన్ని విప్పి చెబుతూ 'ఆ బంధువుల్లా జీవితం గడపడానికి పరీక్షలలో ఫస్టు రానవసరం లేదు. ఆ అవకాశాన్ని విదేశీ చదువులు చదివి ఉన్నత విద్య చదివే వారికి వదిలేస్తే బావుండేది' అనటంలో ఎలా బతకాలో తెలియజేయటానికి, ఎలా బతకకూడదో అర్థం కావటానికీ, జీవితాన్ని సఫలీకృతంగా నడపటానికీ ఉపయోగపడని చదువులు అనవసరం, చదివిన చదువువల్ల మానసిక వికాసం కలగవలసిన అవసరం, జీవితాల్ని చదవాల్సిన అవసరం కథలో ఆసాంతం వ్యక్తపరిచారు రచయిత్రి పి. శ్రీదేవి.

విభిన్న దృక్పథాలు కలిగిన వ్యక్తులతో గడపిన అనుభవాలూ, వారి జీవన విధానాలూ, ఆర్థిక అవసరాలూ రామాన్ని స్వంతంగా నిర్ణయం తీసుకోగలిగే చైతన్యాన్ని కలిగించడం వలన 'వాళ్ళు పాడిన భూపాలరాగం' శీర్షిక అర్థవంతంగా వుంది అని చెప్పవచ్చును. ఉషోదయంలో మేల్కొలుపుగా పాడే రాగం భూపాలరాగం.. బెడిసికొట్టిన వాత్సల్యం:



ISSN No.2319-3905

ఈ కథలో రచయిత్రి కథాకథన పద్ధతి మొదటినుండీ ప్రతీ పేరాలోను క్రమపద్ధతిలో వ్యక్తమౌతుంది. శ్రీదేవి ఈ పద్ధతిలో చాలా కథలు రాయటం గమనించవలసిన విషయం.

ఆరుగురు పిల్లలు పుట్టిపోయిన తర్వాత అపురూపంగా జన్మించిన పుత్ర సంతానం వెంకటలక్ష్మీనృసింహ సుబ్రహ్మణ్య వరప్రసాదరావు. ఊయలలో పాపడిగా ఊసులాడడంతో కథ మొదలౌతుంది. తాత పేరుని కలుపుకున్న మనవడిపై ముద్దులు కురిపిస్తూ బామ్మ 'తాతలా సంగీతం పాడుతున్నాడ'ని మురిసిపోతుంటేబీ పిల్లాడి తల్లి 'సంగీత మాష్టారేం కర్మం. వాడు మానాన్నలా పెద్దవకీలై ప్రాక్టీసు పెడతాడంటుంది. బామ్మ కూడా 'అవును సుబ్బయ్య తాత చక్రం వేసి అఖండుడౌతాడని చెప్పాడు కదా' అని రాజీపడుతుంది. పిల్లల భవిష్యత్తు గూర్చి పెద్దవాళ్ల ఊహల్ని సహజంగా వర్ణించింది రచయిత్రి.

అయిదేళ్ళవాడై బామ్మ వంగిన నడుంమీద గుర్రపు స్వారీ చేస్తుంటే 'నీ కాలం నాటికి గుర్రాలెక్కడమేమిటి? సూటూ, బూటూ వేసుకొని దొరబాబులా మంచి కారు మీద ఆఫీసుకు వెళుదువు' అని పెద్ద ఆఫీసరవ్వాలని మురిసిపోతుంది బామ్మ.

పదేళ్ళ ప్రసాదరావుకి బడినుండి వచ్చేసరికి టిఫిన్లు తయారుగా ఉండకపోతే ప్రథమ కోపంతో కలియబడి కొట్టి, నేలబడి దొర్లి రాగాలు పెడుతుంటాడని నెలాఖరైనా, వర్షం పడినా, ఒంట్లో బాగుండకపోయినా తండ్రి ఏవో ఒకటి కొని తెస్తాడు. మితిమీరిన గారాబాలు చేసే పెద్దలని అద్దంలో చూపింది రచయిత్రి శ్రీదేవి. పన్నెండేళ్ళనాడే కుర్చీలు,బెంచీలు విరగ్గొట్టడం నేర్చుకొని, మరలు, మేకులు ఊడదీసి లేనిచోట వాటిని కొట్టేవాడు. అదేమిటన్నవారికి 'నా యిష్టం' అనేవాడు. అప్పుడుకూడా 'ఇంజనీరైపోతున్నాడ'ని మురిసిపోయేవారు తల్లీబీ తండ్రీ, బామ్మ,ఇంటికే వచ్చి ప్రయివేట్లు చెబుతున్న మాష్టార్లు 'చదువు మీద మీ అబ్బాయికి శ్రద్ధ తగ్గుతోంది. భయం చెప్పండి' అని అంటే 'పిల్లలని భయపెట్టకూడదు. విన్నంతసేపే చెప్పమని' తండ్రి అనేవాడు. తల్లీ, తండ్రీ, బామ్మా తమకు బట్టలు ఎక్కువగా లేకపోయినా సరిపెట్టుకుంటారు కానీ ప్రసాదరావుకి లోటు చేయడం లేదు.

ప్రయివేటుగా చదువు చెప్పించి పదో ఏట బళ్ళో వేయటంతో ఆ వయసు వారికన్నా ప్రసాదరావు వెనుకబడినా వారికి బెంగలేదు. వరసాగ్గా మూడేళ్ళు స్కూల్ ఫైనల్ పరీక్షల్లో పోయినా పిల్లాడు ఎక్కడ దిగులు పెట్టుకుంటాడో అని ఇంట్లోవాళ్ళు బెంగపడ్డారేగాని కుర్రాడ్ని పల్లెత్తుమాట అనలేదు.

మూడోసారి కూడా పరీక్ష పోయి గోడకి కాళ్ళు తన్నిపెట్టి, మడతమంచంపై అడ్డంగా పడుకొని, గోల్డ్ఫ్లేక్ సిగరెట్టు కాల్చేస్తూ దీర్ఘాలోచనలో ఉన్న ప్రసాదరావుని చూసి మాతృహృదయం 'పాపం చిన్నతనం పడి తిండైనా తినటం లేద'ని తల్లడిల్లిపోయింది.

అబ్బాయి కొచ్చిన కష్టాన్ని ఊహించుకొని పితృవాత్సల్యంతో 'ఆడపిల్లలా ఏడుస్తారటరా, బెంబేలు పడిపోతే ఎలా? ఈసారి మరో సెంటర్లో పరీక్ష కట్టిస్తాను. పేపర్లెటు వెళ్ళాయో ఆచూకీ తీసి కనుక్కోవలసింది. అమ్మ ఇచ్చిన కాఫీ తాగి లేచి అలా తిరిగిరా' అని బుజ్జగించాడు తండ్రి.

ఇలా కథనం కొనసాగిస్తూ చివర్లో గవర్నమెంటు వారి ధర్మమా అని మరొక పదేళ్లు బతికుంటే నాన్నకి పెన్షను రాకపోదు! సినిమాలకీ సిగరెట్లకీ డబ్బులిస్తూనే ఉంటాడు. మంచం మీద నుండే మనవడికి చేసిపెట్టమని కోడలికి బామ్మ పురమాయిస్తూనే ఉంటుంది. దేవుడి దయవల్ల అమ్మ ధృఢంగానే ఉంది కనుక పది కాలాల పాటూ రోజుకి రెండు భోజనాలు, మూడుటిఫిన్లు, నాలుగు కాఫీలు అబ్బాయికి అందిస్తూనే ఉంటుంది. ఇన్ని హంగులున్నాక వెంకట లక్ష్మీ నృసింహ సుబ్రహ్మణ్య వరప్రసాదరావు మరో పదేళ్ళు పరీక్షకెళ్ళగలనూగలడు, అవిచ్ఛిన్నంగా తప్పనూ గలడు ముగిస్తుంది రచయిత్రి.

ఈ కథలో ప్రత్యక్షంగా చెప్పకుండానే చెప్పే కథ – ముఖ్యంగా మధ్య తరగతి సగటు కుటుంబాలలో – మగపిల్లాడి పెంపకంలో ఉండే ప్రత్యేకతనీ, ప్రాధాన్యతనీ తెలియజేస్తుంది. మూర? ప్రేమతో పిల్లాడి భవిష్యత్తుని పాడుచేసే పెద్దవాళ్ళ మూర్ఖత్వాన్ని ఎండగడ్తుంది.

ఈ రోజుల్లోనే వారసుడి కోసం అనేక అమానుషాలు జరుగుతుంటే 50–60 ఏళ్ళ క్రితం మగపిల్లలపై ప్రేమ ఇలా ఉండడంలో ఆశ్చర్యం లేదు.డాక్టరుగా చాలామంది మగపిల్లాడి కోసం ఆరాటపడటం గమనించినది కావటాన తన రచనా చమత్కృతితో వ్యంగ్య ధోరణిలో 'బెడిసికొట్టిన వాత్సల్యం' కథానికని చక్కగా మలచింది రచయిత్రి కథాంశంగా ఏ వస్తువుని తీసుకున్నా ఒక ప్రత్యేక పద్ధతిని ఎంచుకొని కథ నడపటంలో సిద్ధహస్తురాలు శ్రీదేవి అని ఈ కథ స్పష్టపరుస్తుంది.

**అర్థంకాని అనుభవం**

'ఈ విశాల విశ్వంలో ఏం జరిగినా భౌతికంగా కాక పారమార్థికంగా ఆలోచిస్తే ప్రతీదానికీ ఒక వ్యాఖ్యానం ఉంటుందంటారు. సృష్టిలో జరిగే ప్రతిచర్యకీ భగవత్పరంగా ఒక ఉత్తమ ప్రయోజనం ఉంటుందంటారు. అదే నిజమైతే ఒక క్షుద్రమైన కారణానికి ఆ కారణంతో ఏ సంబంధం లేని బైరాగి బలైపోవడం ఎందుకు? కాశీనాథుడి సమక్షంలో గతాన్ని గతంలోని కోర్కెల్ని విడిచిపెట్టేసిన బైరాగి, వెంకయ్యగారి గడ్డివాము పక్కన కత్తిపోట్లతో శవంగా పడిఉండడానికే ఈ ఊరు వచ్చాడా' అని తనలో ఆలోచించుకున్న స్వగతం ఈ కథకు మూలం. ఇది రచయిత్రి అనుభవంలో ఆసుపత్రిలో జరిగిన సంఘటన కావచ్చు.

ఇందులో చివరలో క్రిందటి రోజు వరకూ ప్రశాంత నిర్మలమైన మానవాకారంగా దర్శనమిచ్చి, తెల్లారేసరికి భయంకరంగా రక్తసిక్తంగా వికృతంగా దర్శనమిచ్చిన బైరాగి రెండు ఆకారాల మధ్యగల రహస్యమే అర్థం కాని అనుభవం.

ఈ కథానిక గ్రామ తగాదాల్లో రెండుపార్టీలు ఒకరిపై ఒకరు కత్తులు నూరుకోవడం, ఈ కారణాలతో సంబంధం లేకుండానే బలైపోయిన బైరాగి. వీటన్నిటికీ సాక్షీభూతురాలైన డాక్టరు అనుభవమే ఈ కథకు రూపకల్పన. ఈ కథానికలో రచయిత్రి ప్రత్యేకతని పట్టి యిచ్చేది కథ మొదట్లో డాక్టరు వ్యక్తపరచిన హేతువాద దృక్పథం.



ISSN No.2319-3905

'విద్యవల్ల, వృత్తివల్ల, శాస్త్రీయ విజ్ఞానం అలవరచుకున్న దానిని, సంస్కారం వల్ల హేతువాదాన్ని వంటపట్టించుకున్న దానిని, నిర్జీవమైన శరీరాలను కోసి భౌతిక సత్యాల్ని తెలుసుకున్నదానిని వీటన్నిటికీ అతీతమైన సత్యమేదో ఈ పిచ్చి బైరాగికి దర్శనం ఐనట్లనిపిస్తుందేమిటి? శుద్ధ బైరాగి, సంఘానికి ఏ విధంగానూ పనికి రాకపోగా ఒక రకంగా పరాన్నభుక్కుడు అవటం వలన సంఘానికి బరువు కూడా. అని అనుకున్నఈ కథలోని డాక్టరు పాత్ర స్వగతంలోని అభిప్రాయాలు రచయిత్రి మనసుకి ఆలోచనలకి ప్రతిబింబాలు.

**స్వరూపంలో రూపం**

ప్రేమని త్యాగం చేయడం అనేది ఒక ఆదర్శంగా చిత్రిస్తూ దానివలన ఒక నిండు జీవితం నిలబెట్టేందుకు ఏ విధంగా ఒక వ్యక్తి త్యాగమూర్తి అయ్యాడనేది ఈ కథాంశం.

రాధని తన సోదరుడు ప్రేమించి మోసం చేసినట్లు తెలిసి మధు ఆమెతో స్నేహం చేసి ఆమె పట్ల ఆకర్షితుడయ్యాడు. అంతేకాకుండా సమాజాన్ని ఎదిరించైనా రాధని వివాహం చేసుకోవటానికి ఇష్టపడి తన ఆలోచనను ఆమెకి తెలియజేసాడు. కాని, రాధ అందుకు అంగీకరించకపోవడమే కాక మధు సోదరుడు పెళ్ళి చేసుకొని విడిచిపెట్టేసి నిరాధారంగా వుండిపోయిన ఆమెను వివాహం చేసుకోమని సలహా యిచ్చింది.

ఈ కథలో నాటకీయత ఎక్కువగా ఉంది. శ్రీదేవి కథావస్తువుపై కాకుండా శైలిపట్ల ఎక్కువ శ్రద్ధ వహించినట్లుగా తోస్తుంది. రచయిత్రికి భాషపై గల స్వాధీనం వల్ల కథ పాఠకులను చదివిస్తుంది.

వీధి దీపాలు

స్నేహానికి పెద్ద పీట వేస్తూ రాసిన కథానిక వీధి దీపాలు. అంతేకాదు స్నేహంలోనే, స్నేహంగానే, స్నేహాల్ని విచ్ఛిన్నం చేయాలని చూసే మిత్ర భేదకులను గూర్చి తెలియజేసే కథానిక కూడా ఇది. విశ్వం అనే పాత్ర కథానిక అంతటా పరుచుకొని ఉంటాడు కాని తెరపైన ఉండడు. ఒక ప్రత్యేక పద్ధతిలో కథానికని నడిపింది రచయిత్రి.

సరోజ, మూర్తి మెడిసిన్ చదివే రోజుల్లో వారిరువురు సహ విద్యార్థులూ, స్నేహితులు. మూర్తికి బాల్యంనుండీ కుటుంబ మిత్రుడు విశ్వం. మూర్తీ, సరోజలు ప్రేమికులుగా భావించాడు విశ్వం. మూర్తి తన బంధువైన రమణమూర్తిని సరోజకు పరిచయం చేయడం, అనుకోని పరిస్థితుల్లో సరోజ రమణమూర్తులు ప్రేమలో పడడమే కాక కుటుంబాలలోని వారిని ఎదిరించి ప్రేమ వివాహం చేసుకోవడంతో విశ్వం అపోహ వీడిపోతుంది. మూర్తి తల్లి చూసిన మాలతిని మూర్తి వివాహం చేసుకోవాలనుకోవటాన్ని విశ్వం అభ్యంతరపరుస్తాడు. 'డాక్టరీ చదివిన నీకు పదో క్లాసు పిల్ల తగదని' వారిస్తాడు. విశ్వం మాటని కాదని తల్లి చూపిన మాలతిని ఇష్టంగానే వివాహం చేసుకున్నాడు మూర్తి. కానీ అనుకోకుండా రమణమూర్తి తీవ్రంగా జబ్బుపడి మరణించడంతో, ప్రేమ వివాహం వల్ల నా అనే వాళ్ళందరికీ దూరమైన సరోజను మాలతీ, మూర్తీ ఆత్మీయంగా తమ యింట్లోనే ఉంచుకొని ఆదరించారు. అది నచ్చని విశ్వం 'సరోజని ఇంట్లో ఉంచుకొని మాలతిని క్షోభపెడ్తున్నావని' మూర్తికి ఉత్తరం రాసాడు.

ఆ వుత్తరం మాలతి కూడా చదివి 'మన పెళ్ళికి ముందర అతనేమన్నాడో గుర్తు తెచ్చుకోండి, అట్లాగే చదువుకునే రోజుల్లో మీతో సరోజ గురించి ఎలా మాట్లాడేవాడు. అతని తీరే అంత. లోకంలో అందరి గురించీ బెంగ పెట్టుకునే వాళ్ళుంటారు లెండి' అంటుంది వ్యంగ్యంగా, విశ్వం మనస్తత్వాన్ని అర్థం చేసుకున్న మాలతి.

అంతవరకూ మాలతిని నిజంగానే క్షోభపెడ్తున్నానేమో అనుకుని బాధపడుతున్న మూర్తి మరిక విశ్వం గురించి పట్టించుకోవటం మానేసినా విశ్వం మాత్రం ఊరుకోలేదు. తిన్నగా సరోజనే కలిసి 'ఎంత స్నేహితులైతేమాత్రం సంవత్సరాల తరబడి మరొకరి యింటిమీద కూర్చుంటే అదేం బాగుంది. ప్రాణం విసిగిపోతుంది' అని మాలతి తనతో అన్నట్లుగా చెప్పాడు. 'మాలతి తనతోనే చెప్పొచ్చు కదా! మరొకరి ద్వారా చెప్పింద'ని బాధపడి సరోజ విడిగా యిల్లు తీసుకొని వెళ్ళిపోయింది.

విషయం తెలుసుకొన్న మూర్తికి మాలతి అలా అనదని ఖచ్చితంగా తెలిసినా, విశ్వం స్నేహాన్ని ఒదులుకోలేక ఆ విషయం సరోజకి చెప్పలేక అసమర్థుడిలా, వారి దృష్టిలో మాలతిని దోషిగా చేసాడు.

ఈ కథానికలో చదువుకోని మాలతిని ఉన్నతీకరించడమే కాకుండా స్నేహానికి విలువిచ్చి కట్టుకున్న భార్యనే దోషిగా చేసిన మూర్తిని అసమర్థుడిగా చిత్రీకరించిన విధానం రచయిత్రికి స్త్రీ చైతన్యం పట్ల వున్న అంకిత భావాన్ని తెలియజేస్తుంది.

తప్పు లేకుండానే అపప్రథపాలైన మాలతి, అర్థంలేని అసూయతో బాధపడే విశ్వం, అనుభవాల్ని శూన్యంలోకి నెట్టి అనుమానాలను పెంచుకొన్న సరోజ, వీటన్నిటి మధ్య నిస్సహాయుడైన మూర్తి మిత్రభేదం వలన చిదిగిపోయిన స్నేహ హృదయాల్ని స్పష్టంగా చెప్పటమే కాకుండా 'జీవిత సత్యాల చీకటి తెరలలో కృత్రిమ విజయాలు వీధి దీపాల్లా వెలిగి తీరుతాయి. అసమర్థునికి ఆ దీపాలే వెలుగు చూపిస్తాయి మరి' అంటూ ఒక జీవన సత్యంతో కథని ముగించింది రచయిత్రి.

జీవన నిర్వచనాల్ని కథలో అవసరమైనచోట్ల సమర్థవంతంగా అన్వయించే నేర్పుకల రచయిత్రి సరోజా రమణమూర్తుల ప్రేమ వివాహ సందర్భంగా ఇలా నిర్వచిస్తుంది – "ప్రేమ వివాహం చేసుకొన్నవారూ, లాటరీలో డబ్బు వచ్చినవారూ, హత్య చేసిన వారూ అందరి విమర్శలకీ గురౌతారు".

**ఒక్క రూపాయి ఎక్కువ**

డా. శ్రీదేవి కథారచనలలో చాలాకథలను స్వగతంగా చెప్పే పద్ధతిని ఎన్నుకుంటుంది. అదే పద్ధతిలోనే ఈ కథానికని కూడా రాసింది. మాష్టరుగిరీ చేసి రిటైరైన ఒక నాన్న పాత్ర స్వగతంగా కథ ప్రారంభమౌతుంది. కటకటలాడే దుర్భిక్షపు రోజుల్లో అన్నవస్త్రాలకు లోటులేకుండా పిల్లల్ని పెంచాలంటే సంసారం నడవటానికి పొదుపు తప్పనిసరి. మొదటి భార్య ఒక కూతురు విశాలాక్షిని కని మరణించింది. విశాలాక్షిని స్కూలు ఫైనల్ చదివించటమే కాక అనేక పుస్తకాలు ఇచ్చి మంచి చదువరిగా చేసాడు తండ్రి. పుస్తక పఠనంతో దృఢమైన వ్యక్తిత్వాన్ని పెంచుకొన్న



ISSN No.2319-3905

విశాలాక్షి తాను కులాంతర వివాహం చేసుకొని తండ్రికి మరో వివాహం చేసుకోమని ఉత్తరంలో సలహా యిచ్చి ఇల్లు విడిచి వెళ్ళిపోయింది. విశాల సలహా పాటించి తండ్రి మరో వివాహం చేసుకున్నాడు. ముగ్గురు పిల్లల్ని కన్న తర్వాత రెండవ భార్య కూడా చనిపోయింది. ఒక విధమైన నిరాసక్తతతోనే కాక పొదుపరిగా బతుకుతున్న తండ్రిని పిల్లలు ముగ్గురు పిసినారిగా విమర్శిస్తుంటారు.

ఆ పరిస్థితుల్లో ఎదురింటి అరుగుమీద కొత్తగా వెలసిన టైలరు దుకాణంలో జాకెట్లు చవగ్గా కుట్టించుకున్న పెద్ద కూతురు కుట్టు కూలీకోసం టైలరు వచ్చిందని రెండు రూపాయలు ఇవ్వాలని అడిగింది.

తండ్రి వీధి వరండాలోకొచ్చి కొంగు కప్పుకొని వినమ్రంగా నిలిచి ఉన్న టైలరుని చూసి మాట్లాడకుండా మూడు రూపాయలు తీసి ఆమె చేతిలో పెట్టడం కూతురికి ఆశ్చర్యంగానే అనిపించింది.

పిసినిగొట్టు తండ్రి ఒక్కరూపాయి ఎక్కువ ఎందుకిచ్చాడో పెద్ద కూతురు శ్యామకు అర్థం కాదు. ఇరవై ఏళ్ళ క్రిందట వెళ్లిపోయిన కూతుర్ని తండ్రి కానీ, ముసలి నాన్నని కూతురు విశాల గానీ పోల్చడం అసంభవం అని రచయిత్రే చెబుతూ, పాఠకుల సందేహ నివృత్తికోసం అన్నట్లుగా చిన్ననాడు వేన్నీళ్ళ గిన్నె దింపబోయినప్పుడు కాలిన పచ్చని మణికట్టు మీది గోధుమరంగు మచ్చలు 'నేను విశాల'ను అని తండ్రికి తెలిపాయి అంటుంది.

విశాలని మళ్ళీ చేరదీసినా పారిపోతుందని భావిస్తాడు తండ్రి. కథనంతట్నీ స్వగతంలో చెప్పటమే కాకుండా, ప్రతీ సంఘటననీ ఫాను మీద గూడుకట్టిన పిచ్చుకతో పోల్చడం ఒక విశేషం. అందుకే చివర్లో కూడా 'లాభం లేదు, రెక్కలు రాకుండానే పక్షి ఎగిరిపోయింది. తిరిగి గూటిలో చేరడం అసంభవం' అంటూ ముగించింది.

' వర్షం వెలిసేసరికి…'

'వర్షం వెలిసే సరికి'… ఒక పెద్ద కథ. ఈ కథని 'శ్రీ' అనే కలం పేరుతో రాసింది రచయిత్రి. ఒక డాక్టరు స్వగతంగా ప్రారంభమవ్వటం వలన కథంతా ప్రథమ పురుషలోనే సాగింది. డాక్టరు దగ్గర విశ్వసనీయంగానేకాక అంకిత భావంతో పనిచేసిన కాంపౌండరు శాస్త్రి జబ్బు పడి చనిపోయాడు. అప్పటికే గర్భవతి అయిన శాస్త్రి భార్య లక్ష్మి తన చికిత్స కోసం డాక్టరు దగ్గరకు వచ్చింది. నిరాధారంగా ఉన్న ఆమెని ఆ పరిస్థితులలో వదిలేయలేక ఆమె అనారోగ్యానికి కావలసిన చికిత్సని అందిస్తాడు డాక్టరు. వారిద్దరి మధ్య అక్రమ సంబంధాన్ని ఊహించు కుంటుంది డాక్టరు భార్య అరుంధతి. లక్ష్మి ప్రసవ సమయంలో తన దగ్గర ఉన్న డాక్టరుతో "నాకు తిరిగి ప్రాణం పోశారు, ఈ పాప మీ బిడ్డే" అన్నప్పుడు లక్ష్మితో డాక్టరు కూడా. 'ఈ బిడ్డని పెంచటం, చదివించటం నా బాధ్యతే' అని అన్నాడు.

కానీ అరుంధతి ఆ మాటలు విని అపార్థం చేసుకుని కోపంతో కొడుకుని తీసుకొని పుట్టింటికి వెళ్ళిపోయింది. ఈ సందర్భం పాఠకుడికి నాటకీయంగా అనిపించేలా రాసింది రచయిత్రి.

ఇరవై ఏళ్ళ తర్వాత అరుంధతి తాను వస్తున్నానని లక్ష్మికి ఉత్తరం రాసింది. ఆ వుత్తరం చదివిన డాక్టరుకు అరుంధతి రాకకు కారణం అర్థంకాలేదు. ఆమె వచ్చేలోగా లక్ష్మిని తన యింటికే తీసుకువచ్చి, అరుంధతి అపోహని నిజమేననే భ్రమని కల్పించాలని లక్ష్మి ఇంటికి బయల్దేరాడు. అప్పటికే అక్కడ అరుంధతి వచ్చి ఉంది. డాక్టరు కొడుకు మురళి, లక్ష్మీ కూతురు ఉష మెడికల్ కాలేజీ విద్యార్థులు. అంతేకాక వారిమధ్య గల స్నేహం ప్రేమగా మారడంతో, ఆ విషయం తెలిసి అరుంధతి వాళ్ళిద్దరూ ఒకే తండ్రి బిడ్డలని ఉషకి చెప్పటానికి హాస్టలుకి వెళ్తుంది. అక్కడ ఉష ద్వారా అసలు విషయం తెలుసుకొని, పశ్చాత్తాపంతో తిరిగి వచ్చింది అరుంధతి.

ఈ కథలోని సంఘటనలు పాఠకుడికి అనేక సినిమాలలో చూసిన వాటిలాగే ఉంటాయి. అంతేకాక భర్త కాళ్ళు పట్టుకొని వదలక కన్నీళ్ళతో కడిగేస్తున్న అరుంధతి దుఃఖం పాఠకుడికి విసుగు కలిగిస్తుంది. నిజానికి ఈ సన్నివేశాలు శ్రీదేవి ఆలోచనా విధానానికి సరిపోనట్లుగా ఉన్నాయి.

కానీ కథని ప్రారంభించటంలో వైశాఖమాసం సాయంత్రం అకస్మాత్తుగా పట్టోన్న వర్షాన్ని కిటికీలోంచి చూసిన డాక్టరు నున్నని తారురోడ్డు మీద జారిపోతూ సాగిపోతున్న కారుని చూస్తూ 'కొందరి జీవితాలు కూడా యిలానే చడి లేకుండా, ఆగకుండా, ఒడిదుడుకులు లేకుండా సిమెంటు రోడ్డుమీద పోయే కారులా గడిచిపోతాయి. కానీ జీవితం అంత బాగా గడవకపోవటానికి ఏదైనా కారణం కావచ్చు. రోడ్డు చెడిపోవచ్చు, కారు చెడిపోవచ్చు, కారు నడిపేవాని మతి చెడిపోవచ్చు. ఈ మూధూ ఒకసారి కాకపోయినా క్రమక్రమంగా జరగవచ్చు అని స్వగతంలో కారు ప్రయాణంలో జీవన గమనాన్ని పోల్చే విధానంమాత్రం రచయిత్రి కథాసంవిధానతీరుని తెలుపుతుంది.

అదేవిధంగా కథ ముగింపులో కిటికీలోంచి చూస్తున్న డాక్టరు తన భార్యతో "వర్షం వెలిసినట్లే కదూ"? అంటాడు. అందుకు అరుంధతి "మనకి రుతువులు మారిపోయాయి. మనకిక వసంతాలూ లేవు, గ్రీష్మం గడిచిపోయింది, శరత్తులు కూడా రావు, శిశిరమే" అని నిస్పృహగా అంటూ అతని కళ్ళలోకి చూసింది – అని ముగించటం కూడా రచయిత్రి చమత్కృతే.

వారి జీవితంలోని యవ్వనదశంతా అపోహలతో రుతువులు దాటిపోయిందనే ధ్వనిని వ్యక్తపరుస్తూ శిశిరమే మిగిలింది అంటుంది.

ఈ కథ రచయిత్రి తొలినాళ్ళలో రాసిఉండొచ్చు. అందుకే పాత్రల ఆలోచనాసరళిలో సహజంగా రచయిత్రికి గల అధునాతన భావాలు వ్యక్తం కావు అంతేకాక కథానికలోనిభాషలో కూడా కొంతమేరకు గ్రాంథిక ఛాయలకు దగ్గరగా ఉండే శిష్ట వ్యవహారికం తొంగిచూసింది.

'ఎదురు తిరిగిన ప్రకృతి'

ఇది కూడా పెద్ద కథే. రెండు భాగాలుగా తెలుగు స్వతంత్రలో ప్రచురితమైంది. రాజేశ్వరి,



ISSN No.2319-3905

ప్రభావతి అక్కచెల్లెళ్ళు. ఇరువురి మధ్య కొందరు పిల్లలు పుట్టిపోయారు. రాజేశ్వరి డాక్టరు. రాజేశ్వరి చదువు పూర్తయ్యాక తండ్రి కన్నుమూసాడు. రాజేశ్వరిని చూసిన పెళ్ళికొడుకు చలపతికి రాజేశ్వరి నచ్చింది కానీ ఆమెలోని స్వేచ్ఛా ప్రవృత్తి, అలంకరణాభిలాషా భరించలేననుకున్నాడు. చలపతి తండ్రికి కట్నం కావాలి. ఆ రకంగా ఆ సంబంధం తప్పిపోయింది. చలపతి, ప్రభావతి ఒక సీనియర్ లాయర్ దగ్గర అప్రెంటీస్ చేస్తుంటారు. కనుక ఇద్దరూ స్నేహితులై, వివాహం కూడా చేసుకుందామనుకున్నారు. సెలవులకు ప్రభావతితోపాటు ఊరు నుండి వచ్చి, ప్రభావతి కోరిక మీద వాళ్ళ ఇంట్లో ఒక రోజు చలపతి వున్నప్పుడు అనుకోని పరిస్థితుల్లో రాజేశ్వరికి దగ్గరయ్యాడు. డాక్టరుగా బాగా సంపాదిస్తున్న రాజేశ్వరిని కోడలిగా చేసుకోవడానికి ఇప్పుడు చలపతి తండ్రికి అభ్యంతరం లేదు. చలపతి మేనత్తకు జబ్బు చేస్తే చికిత్స నిమిత్తం రాజేశ్వరి చలపతి యింటికి రాకపోకలు సాగించింది. ప్రభావతి సెలవులు పూర్తికాగానే వెళ్లిపోయింది. చలపతి రాజేశ్వరులు దగ్గర కావటం గమనించినా ఏం జరుగుతుందో అనే భయం మాత్రం ప్రభావతికి లేదు అని రచయిత్రి ఆ సందర్భంలో చెప్పటంలోనే రచయిత్రి చూపే చమత్కారం పాఠకుడికి అందుతుంది. సహజంగా మానవత్వాన్ని ప్రేమించగల ప్రభావతి అతనే నా సర్వస్వం అని ఎన్నడూ అనుకోలేదు. ఇంతటితో సరి అని నిరాశపడే అవసరం ఆమెకు కలగలేదు. వస్తానన్న చలపతి ఏదో వంకతో రాకుండా ఊళ్ళోనే గడపటం ఆశ్చర్యం కలిగించింది. కానీ, బాధపడలేదు – అని ప్రభావతి మనస్తత్వాన్ని కొద్ది మాటలతోనే పాఠకుడికి అద్దంలో చూపింది రచయిత్రి.

ఇల్లూ, వాకిలీ, తోటా, అందం, ఐశ్వర్యం, వయసు అన్నీ శూన్యంలోకి ఇంకిపోతున్నాయని ఒంటరితనానికి దిగులు పడుతున్నా అంతవరకూ ఎవరికీ భయపడక ఎవరినీ లక్ష్యపెట్టక నిబ్బరంగా బతికేసిన రాజేశ్వరి, ఎన్నింటినో నెట్టుకొని ఎన్నింటికో తట్టుకొని బతుకుతున్న రాజేశ్వరి చివర్లో చెల్లెలికి భయపడ్తూ తాను చివరికేం కోరుకుందో ఉత్తరంలో తెలియజేసింది.

రాజేశ్వరి చలపతితో జీవితాన్ని పంచుకుంటుందని ముగించింది రచయిత్రి. రాజేశ్వరి పాత్ర చిత్రణలో శ్రీదేవి మార్కు పద్ధతిలోనే ఉన్నా చివరికి వచ్చేసరికి రాజీధోరణిగా అనిపిస్తుంది. వయస్సు మీరిపోతుందని అంతకుముందు తనని తిరస్కరించిన చలపతినే వివాహం చేసుకోవాలనుకోవటంలో వాస్తవికత లోపించినట్లు కూడా ఉంది. ఈ కథలో రచయిత్రి రచనల్లో వుండే జీవన సత్యాలూ నిర్వచనాలూ కూడా తక్కువే. శ్రీదేవికి భాషపై గల పట్టువల్లా మంచి నిర్మాణ శైలి వల్లా పెద్ద కథే అయినా పాఠకుణ్ణి ఆసక్తిగా చదివిస్తుంది.

**'జ్వరపీడితులు'**

గమ్యం లేని రైలు ప్రయాణం చేస్తున్న రామారావుకి సహ ప్రయాణికురాలు కామేశ్వరి. టిక్కెట్టు కలెక్టరుకి హడావుడిలో టిక్కెట్టు కొనలేదని పెనాల్టీ కడతానని చెప్పాడు రామారావు. ఎక్కడివరకూ టిక్కెట్టు ఇవ్వాలని అడిగిన టిక్కెట్టు కలెక్టరుకు, కామేశ్వరి ఎక్కడివరకూ వెళ్తుందో కనుక్కొని తనకి కూడా అక్కడకే హైదరాబాదుకు యివ్వమంటాడు. ఈ వ్యవహారం చూసి కామేశ్వరి

"ఇల్లు విడిచి పారిపోతున్నారా?" అని ప్రశ్నించింది అతన్ని. అంతటితో ఊరుకోక "ఎంతదూరం పారిపోయినా మీ బతుకు మీతోటే ఉంటుంది" అన్న కామేశ్వరితో "నిజమే రైలు కింద తల పెట్టే ధైర్యం వచ్చేదాకా రైల్లో ప్రయాణం" అన్నాడు రామారావు.

మంచి చదువు, హెదాగల ఉద్యోగం, అందమైన భార్యా, ముద్దులు మూటగట్టే పిల్లలూ గల సుఖవంతమైన జీవితంనుండి తెలివి తక్కువ పనుల వల్లా, విలాస జీవితం వల్లా ఉద్యోగం నుండి తొలగింపబడి బతికి చెడినచోట బతకలేక, మంచి ఉద్యోగం సంపాదించలేక పారిపోతున్న రామారావుని చూసి అసహ్యించుకొని మరిక మాట్లాడలేదు కామేశ్వరి. అతనే గుచ్చి గుచ్చి ప్రశ్నిస్తుంటే తానో కథ చెప్తానని "కూతురికి పెళ్ళి చేసే శక్తి లేని బీదవాడైన తండ్రి, చాదస్తురాలైన తల్లి, తిరుగుబోతైన తమ్ముడు కలిగిన అమ్మాయిని తనకంటే పెద్దవాడికి ఎనిమిది వందలకి భార్యగా అమ్మేసాడు తండ్రి. కొద్దికాలానికే ముసలి భర్త చనిపోతే దూరపు చుట్టం చదువుచెప్పించి, ఉద్యోగంలో చేర్చి మళ్ళీ పెళ్ళి చేసాడు. ఒక కొడుకు పుట్టాక నాలుగేళ్ళకే రెండవ భర్త జబ్బుతో చనిపోయాడు. అత్త మామలు కూతురింటికి వెళ్ళిపోయారు. భర్త జబ్బుకోసం సెలవులు పెట్టడంతో ఉద్యోగం కాస్తా వూడిపోయింది. తిరిగి సంపాదించుకొన్న టెంపరరీ పంతులమ్మ ఉద్యోగం కూడా ఏడాది కాగానే తీసేసారు" అని చెప్పి "ఆ అమ్మాయిని నేనే" అని తెలియజేసింది.

అంత విషాదాన్ని భరిస్తున్న కామేశ్వరిని చూసి రామారావు ఆశ్చర్య పోయాడు. "లోకంలో ప్రతీ ఒక్కడూ జ్వరపీడితుడే. ఎవరి బాధ వారిది. అయినా అందరూ బతుకుతున్నారు. బతకాల్సిందే. ఎక్కడికో పారిపోయి ప్రయోజనం లేదు" అంటుంది కామేశ్వరి. ఈ వాక్యాలలో రచయిత్రి కనిపిస్తుంది. ఈమె కథలలో వ్యక్తమయ్యే సిద్ధాంతాలు కనిపిస్తాయి.

కామేశ్వరి కథ విని వణికిపోయిన రామారావు ఆమె నిబ్బరానికి నివ్వెరపోయి తన మానసిక బలహీనతకు తాను రైలు దిగి రిక్షా ఎక్కుతున్న కామేశ్వరి చేత రచయిత్రి తనదైన శైలిలో రామారావుకి హితబోధ చేయిస్తుంది.

"బతకడం ఎందుకు అనే అర్థంలేని ప్రశ్నతో బాధపడక బతకడం నేర్చుకోండి. బతికి చూడండి. ఎక్కడికీ పారిపోకండి" అంటుంది.

నిజానికి ఇటువంటి కథలు ఈనాడు రావలసిన అవసరం చాలానే ఉంది. సమాజంలోను, జీవితంలోను ఎదురయ్యే సమస్యల్ని భూతద్దంలో చూసి, వాటిని తట్టుకోలేక విపరీత ఆలోచనలు చేస్తున్న యువతరాన్ని, జీవితంలో పలాయనవాదాన్ని నమ్ముతున్న వీరికివారిని చైతన్యపరిచే హితబోధతో ఆలోచింపచేయగల ఇటువంటి రచనలు నేడు బయటకు రావల్సి ఉంది.

**'ఎవరి స్వప్నం వారిదే'**

రాజ్యలక్ష్మి తన ఒక్కగానొక్క కూతురు సునందకి ఇరవయ్యో పుట్టిన రోజు కానుకగా ఒక మంచి ఆల్బమ్లో చిన్ననాటి నుండి వివిధ సందర్భాలలో తీసిన సునంద ఫోటోలన్నీ అతికించి ఇవ్వాలనుకుంది. ఒక్కొక్క ఫోటోనీ చూస్తూ వుంటే తాను కళ్ళల్లో పెట్టుకొని పెంచిన సునంద



ISSN No.2319-3905

జ్ఞాపకాలతో మాతృహృదయం పొంగిపోతున్నది. తనకు ముద్దిస్తున్న పసి సునంద, తప్పటడుగులు వేస్తున్న రెండేళ్ళ సునంద కఱ్ఱ గుఱ్ఱం మీద కదను తొక్కుతున్న సునంద, అయిదేళ్ళనాడు బడికి పోతోన్న సునంద, పదేళ్ళనాడు బడిలో నాట్యం చేస్తూన్న సునంద – ఇలా చూస్తూ మురిసిపోతు వాటిని అతికించేందుకు జిగురు తెమ్మని రాముడికి చెప్పింది. తాను కాపురానికి వచ్చినపుడు తనతోపాటు రాముడు, పదేళ్ళ పిల్లాడిగా వచ్చి ఇంట్లో పనులన్నీ నేర్చుకున్నాడు.

వయసొచ్చిన రాముడు తల్లి దగ్గరకిపోయి, తల్లి చూసిన పిల్లని పెళ్ళి చేసుకొని తన కొక కుటుంబంకోసం కలలు కంటూవుండేవాడు. సమయం దొరికినప్పుడల్లా రాజ్యలక్ష్మితో తనని పంపించమని కోరుతున్నా ఆమె పట్టించుకోవడం లేదు.

ఎఱ్ఱ దారం కోసం సునంద అల్మారాలో దొరుకుతుందేమోనని వెతుకుతున్న రాజ్యలక్ష్మి అందులో సునంద రాసి పోస్టు చేయని ఉత్తరం చూసి కుతూహలంతో చదివింది. అది చదివినప్పుడు ఆమె గుండె పగిలినట్లు అనిపించింది. ఆ ఉత్తరంలో "మా అమ్మకు నేనంటే ప్రాణం. కానీ ఆవిడకి దూరంగా ఉంటేగానీ నాకు స్వేచ్ఛ లేదు. నేను ఎక్కడకు వెళ్ళనో, ఎందుకు వెళ్ళానో అన్నీ చెప్పాలి. ఆవిడ నన్నెప్పుడూ పోలీసులా కాపలా కాస్తుంది' అంటూ సునంద తన ప్రియుడు శ్యామ్కి రాసిన వుత్తరం అది. ఆ ఉత్తరం చదివి రాజ్యలక్ష్మి తాను ఓడిపోయినట్లుగా భావించింది. హాస్టల్లో పెడితే కూతురి భవిష్యత్ వంకరలు పోతుందేమోనని, వేరే ఊరులో ఉద్యోగం చేస్తున్న భర్తని వదిలి కూతురు కోసమని అక్కడే వుండి మోసం, దగాల్లాంటి ఎత్తుపల్లాలు లేని సాఫీయైన బాట ఏర్పరచాలనుకుంటే సునంద స్వంతంగా అడుగులేసుకుంటూ తనదారిన తాను పోవాలనుకుంటుంది' అని నీరసపడిపోయింది తల్లి.

ఒక వయసు దాటినతర్వాత తల్లిదండ్రుల ప్రేమని పిల్లలు వాళ్ళ స్వేచ్ఛకు సంకెళ్లగా భావిస్తారని, అందుకే తల్లిదండ్రులు పిల్లల మనసుకు దగ్గరగా స్నేహితుల్లాగే ఉండాల్సిన అవసరాన్ని ఈ కథలో రచయిత్రి వ్యక్తపరిచింది.

అందుకే ఉత్తరం చదివిన తర్వాత రాజ్యలక్ష్మికి తన కూతురుకి కావలసింది ఏమిటో, పనివాడు రాముడు ఎందుకు తల్లిదగ్గరకు వెళ్ళిపోవాలనుకుంటున్నాడో అర్థమయ్యింది. తను చదువుకొనే రోజుల్లో చంద్రశేఖర్తో ప్రణయంలో పడి సర్వనాశనమయ్యే పరిస్థితుల్లో అదృష్టమే ఎదురై చంద్రశేఖర్నే వివాహం చేసుకొన్న పరిస్థితులను గుర్తు తెచ్చుకొని భూతభవిష్యత్ వర్తమానాల్లో ఊగిసలాడిన రాజ్యలక్ష్మికి అంతసేపూ భ్రమలో ఉన్నట్లు అప్పుడే మేల్కొన్నట్లు అనిపించింది.

వెంటనే సునందని హాస్టల్లో చేర్పించాలని, రాముణ్ణి అతని తల్లి దగ్గరకు పంపించేయాలనీ, తాను భర్త దగ్గరకి వెళ్ళిపోవాలని నిర్ణయించుకొంది. ఆలస్యంగా అయినా సునందకి గానీ, రాముడికిగానీ, తనకిగానీ కావలసినది ఏమిటో గ్రహించింది రాజ్యలక్ష్మి – అని చెప్పటంలో రచయిత్రి. వయసు వస్తున్నకొద్దీ పిల్లలకి కావలసినది తల్లిదండ్రుల ప్రేమ ఒక్కటే కాదని, అనేకానేక ఆకర్షణలకు లోనవుతారని, ఎవరి స్వప్నాలు వారివైనా వాటిని సాకారం చేసుకొని మంచి ఫలితం పొందేందుకు పెద్దవారి వాత్సల్యం తోడ్పడాలని రచయిత్రి ఉద్దేశ్యం.

## చక్రనేమి క్రమాన

పిల్లలు లేని దంపతులు శ్రీరంగం వెళ్లి వచ్చాక పుట్టినవాడు రంగనాథం. కానీ పుట్టిన నాలుగేళ్ళకే తల్లి పోగా తండ్రి మళ్ళీ వివాహం చేసుకొన్నాడు. మరి కొద్దిరోజులకే తండ్రి కూడా పోగా పిల్లలు లేని సవతి తల్లి ప్రేమగా పెంచింది. డబ్బుకు లోటు లేని రంగనాథాన్ని అపురూపంగా పెంచిన పిన్ని, తాను చనిపోతూ సోదరుడికి అప్పగించింది. రంగనాథం పదహారేళ్ళకే తనని ప్రేమిస్తున్నానని దరి చేరిన అమృతవల్లిని పెళ్ళి చేసుకున్నాడు.

వారి దాంపత్య జీవనం బాగానే ఉన్నా క్లబ్బులు, మీటింగులు, స్నేహితులూ, షికార్లూ వీటిపై ఆసక్తి, అభిలాష గల అమృతవల్లి ఎప్పుడూ తిరుగుతూనే ఉండేది. పెళ్ళయిన మూడేళ్ళకే వెన్నుపాము మీద కేన్సరుతో బాధపడుతున్న రంగనాథం గాలిమార్పుకోసం భార్యతోసహా కాశ్మీరు వెళ్ళాడు. అక్కడ వున్న మూడు నెలలూ ఇరువురూ కలిసి హాయిగా ప్రశాంతంగా గడిపారు.

తిరిగి వచ్చాక అనారోగ్యం పాలై హాస్పిటల్లో చేరాడు రంగనాథం. పరీక్షల మీద పరీక్షలంటూ శరీరాన్ని వైద్యుల కప్పగించి మనసుని ఎక్కడో దాచేసి తపస్విలా పడుకోవడంతప్ప మరో ఆలోచనలేదు.

మొదట్లో అతన్ని చూడడానికి తరచూ వచ్చిన అమృతవల్లి రాను రాను పూర్తిగా మానేసింది. మరణోన్ముఖుడై ఉన్న పరిస్థితిలో వచ్చిన అమృతవల్లితో "నీ జీవితాన్ని నీకు తోచిన రీతిలో మలుచుకో. జీవితాన్ని ఆనందమయం ప్రయత్నించు, ఆస్థి అంతటినీ నీ పేరున రాస్తున్నాను. ఒక ఇరవై వేలు మాత్రం కేన్సరు రోగం కోసం ప్రత్యేకం నిర్మిస్తున్న ఆసుపత్రికి నీ పేరుతో వార్డు కట్టమని దానం చేస్తున్నాను" అని చెప్పి తాను రాసిన డైరీని ఆమె చేతిలో పెట్టి "ఎప్పుడయినా తీరిక దొరికినపుడు చదువుకో అని కళ్ళు మూసాడు. ఇక్కడి వరకూ నేపథ్యంలోజరిగిన కథ. అసలైన కథ అమృతవల్లి ఆ తర్వాత పాణిని వివాహమాడి మిసెస్ పాణిగా కథ ప్రారంభమౌతుంది. చేసుకోవటానికై మిసెస్ పాణికూడా కేన్సర్ బారినపడి అదే హాస్పిటల్లో 'అమృతవల్లి వార్డు'లో ఉంటుంది. మిస్టర్ షాణి తన విలాసాలతో తిరుగుతూ, మిసెస్ పాణిని చూసేందుకు రానంత తీరిక లేకుండా ఉంటాడు.

పెద్ద నిట్టూర్పు విడిచి మిసెస్ పాణిగా మారిన అమృతవల్లి కసిగా 'ఎందుకు వస్తారు! ఇకమీద రారు' అని వెర్రిదానిలా అరిచింది. ఇక్కడితో కథ ఆపేస్తూ రచయిత్రి పేపర్లో పడిన వార్తగా 'మిసెస్ పాణి అనే ధనవంతురాలు కేన్సర్తో బాధపడి చనిపోతూ ఆమె ఆస్థినంతటినీ మొదటి భర్త కీ.శే. రంగనాథం పేర ఆసుపత్రికి దానం చేశారు. రంగనాథం మెమోరియల్ వార్డుకు త్వరలోనే శంకుస్థాపన జరుగుతుంది' అంటూ ముగించింది.

ఇందులో రచయిత్రి డాక్టరు కావటం వలన ఆసుపత్రి వాతావరణాన్ని, చికిత్సలను కళ్ళకు కట్టినట్లు చిత్రించింది. చదువుతుంటే అత్యంత సహజంగా ఆ వార్డు ముందో ఆ గది ముందో నిలబడి చూస్తున్నట్లుగా పాఠకుడు భావిస్తాడు.



ISSN No.2319-3905

మరో గుర్తించవలసిన విషయం శ్రీదేవి కూడా ముప్పయి మూడేళ్ళ ప్రాయంలోనే వెన్నెముకపై కేన్సరుతో మరణించింది. ఈ కథాకాలం నాటికే కొంత అనారోగ్యం ఉండిఉంటుందేమోననే భావన రచయిత్రిని గురించి తెలిసిన వారికి అర్థమౌతుంది.

కథానిక ముగింపుకి వచ్చేవరకూ అమృతవల్లీ, మిసెస్ పాణీ ఒకరే అనే విషయాన్ని సందిగ్ధంగా మంచి టెంపోతో చివరి వరకూ కథనాన్ని కొనసాగించింది శ్రీదేవి.

రంగనాథం తన భార్యతో చనిపోయేముందు ఇలా చెప్తాడు. "కొత్తగా కొన్నకారు చెడిపోతే బాగులేదని చీదరపడి దానిని అమ్మేసి మరొకటి కొనటం సహజమే కావచ్చు.

నీ సర్వస్వం అని నమ్మిన మనిషి కేవలం అతని దౌర్భాగ్యం వలన సర్వనాశనం అయిపోతుంటే చీదరించుకొని గాయపరచటం ఏం ధర్మం? మనిషిని కూడా మరచక్రంలా వాడుకొని పనికిరాని సమయంలో పారవేసుకునే నీ మనస్తత్వానికి కొంచెం ఔదార్యం తెచ్చిపెట్టుకోమని అర్థిస్తున్నా" నంటాడు. చక్రనేమిక్రమాన కథకు మూలాంశం ఇదే.

అతుకుల బతుకులు (శ్రవ్యనాటిక)

జ్వరపీడితులు పేరుతో 1958లో ప్రచురితమైన కథానికనే ఆకాశవాణిలో ప్రసారానికి అనుగుణంగా మరికొన్ని మార్పులు చేర్పులతో రాసిన శ్రవ్యనాటికే అతుకుల బతుకులు. జ్వరపీడితులు కథనంలో చెప్పిన విషయాలే ప్రారంభంలో నాటకీకరించింది రచయిత్రి. అయితే కథానాయకుడు రామారావు తప్ప ఇతర పాత్రల పేర్లు మార్చింది. నాటికలో నాయికగా చెప్పిన భానుమతి పేరు కథలో కామేశ్వరి, రామారావు భార్య హేమ పేరు కథలో లలితగా వున్నాయి. కథలో రామారావు సహాధ్యాయినిగా కామేశ్వరిని చెబితే నాటికలో హేమ సహాధ్యాయినిగా మార్చింది.

హేమ తన తల్లితో భానుమతికి వచ్చిన కష్టాల గురించి చెప్పి బాధపడడంతో నాటిక మొదలుపెట్టడం, అంతలో రామారావు ఉద్యోగం కోల్పోయి విషణ్ణవదనంతో నిరాశగా రావటం, హేమతండ్రి భానుమతిని పలకరించటానికి వెళ్ళటం మొదలైన సన్నివేశాల్ని జ్వరపీడితులు కథలో లేవు. అతుకుల బతుకులు నాటికలో మాత్రం ముందు మూడు అంకాలుగా రాసింది. మిగిలిన కథ జ్వరపీడితులులో చెప్పినట్లుగానే రైలు ప్రయాణంలో కామేశ్వరి, రామారావులు కలవటం అప్పటి సంభాషణలూ కథానికలోనివే నాటికలోనూ చెప్పింది.

చివరలో భానుమతి ఊరినుండి వచ్చి హేమ తండ్రి ఇంటికి వచ్చేసరికి అక్కడ రామారావు తిరిగి కలిసినట్లుగా చెబుతుంది. హేమతో 'ఈయనా, నేనూ రైల్లో కలిసి ప్రయాణం చేసాము. చెప్పవలసిందంతా చెప్పాను. కానీ ఆయనకెంత కోపం వచ్చిందనుకున్నావు' అంటుంది. 'ఇప్పుడయినా రాజీకి వస్తే చూద్దాం' అన్న హేమతో 'భానుమతిగారి నుండి నేర్చుకోవలసినది చాలావుంద'ని తన తప్పును ఒప్పుకుంటాడు రామారావు. ఆ సందర్భంలో 'అందరి బతుకులూ ఎక్కడో అక్కడ అతుకు పడక మానవేమో కానీ ఆ విషయంలో నువ్వు రికార్డ్ బ్రేక్ చేశావు. ఇంత జరిగి నువ్వు ఎలా నిలబడగలిగేవన్నదే ఆశ్చర్యం' అని హేమ తండ్రి భానుమతిని ప్రశంసించడం,

ఉద్యోగం వెతికిపెడతానని హామీ ఇవ్వడంతో నాటిక శీర్షికను అర్థవంతం చేసే వాక్యాలతో ముగించింది రచయిత్రి.

జ్వరపీడితులులో ఒక రకంగా జీవన సూత్రాన్ని నిర్వచిస్తే, నాటికలో ముగింపుకి అనుగుణంగా మరో రకమైన నిర్వచనం ఇచ్చింది శ్రీదేవి.

ఒకే కథాంశాన్ని కథానికగానూ, శ్రవ్యనాటికగానూ మలచినా చదువుతున్నపుడు చర్వితచర్వణంగా అనిపించకుండా రచయిత్రి భాషా పటిమ దోహదపడుతుంది.

ఈ కథలు కాక మబ్బు బ్రతుకు, తిరగేసి తొడుక్కున్న ఆదర్శం వంటి మరికొన్ని కథలున్నాయి. కాని అందుబాటులో లేవు. శ్రీదేవి కథాసాహిత్యాన్ని చదివిన తర్వాత అనేక విషయాలు పాఠకులకి గమనింపుకు వస్తాయి. చాలాకథలలో మెడిసిన్ చదువుతున్న వాళ్ళుగానీ, డాక్టరు గానీ, హాస్పిటల్ వాతావరణం గానీ ఉంటుంది. అంతేకాక చాలాకథలు ప్రథమపురుషలోనే నడవడమేకాకుండా ఆ పాత్ర డాక్టరు కావటం గుర్తించవలసిన విషయం. దీనికి కారణం రచయిత్రి డాక్టరు కావటమే.

పి. శ్రీదేవి కథలలో ఎక్కువగా స్వగతంతోనే ప్రారంభమై, అందులోనే సంఘటనలుగా ఏర్పడి కథనం కొనసాగుతుంది. ఇది ఈమె రచనా విధానంగా చెప్పొచ్చు.

పి. శ్రీదేవి కథలలో స్త్రీ పాత్రలన్నీ సజీవ చైతన్యంతో ఉంటాయి. దృఢమైన వ్యక్తిత్వం కలిగి వుండి, జీవితంపైన స్పష్టమైన అవగాహన కలిగి ఉంటాయి. వేసే ప్రతీ అడుగు తడబాటు లేకుండా ఆచితూచి వేస్తాయి. పొరపాటున అడుగు పక్కకు తప్పినా దానికి మరొకరిపై నింద వేయవు. తమ తప్పిదాన్ని తామే తెలుసుకొని మేలుకొంటాయి. ఎటువంటి పరిస్థితిలోనూ నిస్పృహకి నిరాశకి లోనుకావు. చాకచక్యంతో అధిగమించే నిబ్బరం కలిగిఉంటాయి. కర్మ సిద్ధాంతాన్ని కాక హేతువాద దృక్పథాన్ని కలిగి ఉండి, ఇతర పాత్రల్ని జాగృతపరిచేలా ఉంటాయి.

జీవితాన్ని కాచి వడబోసినట్లుగా మూడు పదుల వయసు పి. శ్రీదేవి తన ప్రతిరచనలోనూ అద్భుతమైన సత్యాలను, నిర్వచనాలను కథలో అవసరమైనచోట, కథానికకి బలాన్ని సమకూర్చేవిధంగా సమర్థవంతంగా శక్తిమంతంగా ప్రయోగించడం కూడా శ్రీదేవికి గల ఒక ప్రత్యేక రచనా సంవిధానంగా చెప్పొచ్చు.మరొక గుర్తించదగిన అంశం చాలా కథలలోను, ఆఖరికి కాలాతీత వ్యక్తులు నవలలోనూ కనిపించే అంశం తమ పసి వయసులోనే తల్లిని గానీ, తండ్రిని గాని కోల్పోయినట్లుగా కొన్ని ప్రధాన పాత్రను చిత్రించింది. కాకతాళీయమైతే కావచ్చు. ఆ పెను విషాదం శ్రీదేవి కూతురు మాళవికకు కూడా సంభవించటమే భరింపరాని విషయం.

తన కథలన్నిటా జీవితం పట్ల ప్రేమ, బతుకుపట్ల ఆసక్తి ప్రముఖంగా కనిపిస్తుంది. జీవితాన్ని సృష్టించే శ్రీదేవి జీవితాన్ని ఎలా దిద్దుకోవాలో అవగాహన ఉన్న శ్రీదేవి, జీవిత పరమార్థాన్ని ఆకళింపచేసుకున్న శ్రీదేవి ఆ జీవితాన్ని అనుభవించకుండా అదృశ్యమైపోవడం గొప్ప విషాదం.





పి. శ్రీదేవి తక్కువ కాలమే జీవించినా, అయిదారేళ్ళ రచనా కాలమే అయినా సుమారు ఇరవైకి పైగా కథలు మాత్రమే రచించినా అరవై ఏళ్ళ తర్వాత కూడా సాహిత్యరంగంలో సజీవంగా ఉన్నవంటే అదంతా ఆమె వైదుష్యమే అనే విషయానికి ఈ కథలు సజీవ సాక్ష్యాలు.

"రేవతీ స్వయంవరం" పూర్తిగా ప్రేమకథ. ప్రేమభావం జన్మించడం వలన కలిగిన అనుభూతులు, ఆ అనుభూతులను సామాజికపరంగా ఆలోచించి వాటిని సమన్వయపరచుకొని అధిగమించిన సంస్కారం ఇందులో చక్కగా ద్యోతకమవుతుంది. రేవతి వ్యక్తిత్వంతో తన జీవితాన్ని సరైన పంథాలో నడిపించుకోగలిగింది. ప్రేమపట్ల అంతవరకూ గల భావాలస్థానే ఒక కొత్తరకమైన అవగాహన బయలుదేరి స్త్రీ పురుష సంబంధాలను ప్రభావితం చేసిన స్థితి పి.శ్రీదేవి రచనల్లో ప్రతిబింబించింది. "రేవతీ స్వయంవరం"లో కూడా అంతవరకూ సమాజంలో భావకవిత్వ ధోరణులలో సాగిన ప్రేమతత్వాన్ని వీడి వాస్తవిక ధోరణిలో ఆలోచించిన స్థితి కనబడుతుంది. అడవి బాపిరాజు లాంటివారి రచనల్లో వ్యక్తమైన ప్రేమభావనల కంటే భిన్నమైన భావనలు పి. శ్రీదేవి కథల్లో చూడగలం.

ఇంటర్మీడియేట్ చదివేటపుడు కలిగే ప్రేమ కేవలం ఆకర్షణ మాత్రమే. రేవతిలో తొలివలపు సీతారాంపట్ల కలుగుతుంది. కానీ సీతారాం వివాహితుడు కావడంతో, అతనిపట్ల అల్లుకున్న ఆశలన్నీ అడియాసలవుతాయి. అయినా ఆమె తట్టుకోగలుగుతుంది. గాయపడ్డ హృదయాన్ని స్నేహంగా మార్చుకొని, అతనితో స్నేహితురాలిగానే వ్యవహరించగలిగింది తప్ప హద్దుదాటి ప్రవర్తించలేదు. "నా తొలివలపు మొగ్గలోనే తుంచి మోడుగా జీవించలేను. రెండవ భార్యగానైనా నీకు సేవలు చేస్తూ దాసిగానైనా సరే పడి ఉంటాను. నన్ను నీ పాదాల చెంతనే బతకనీ' లాంటి యాభై దశకంలోని స్త్రీల ఆలోచనా ధోరణిని చిత్రించలేదు. పోనీ తన వలపు భగ్నమైందని చెప్పి నిరాశతో కృంగిపోయి తన జీవితాన్ని అంతం చేసుకోదు. అవగాహనతో ఆ భావాన్ని అధిగమిస్తుంది. తర్వాత పరిచయమైన లెక్చరర్ వల్లగానీ, కృష్ణమూర్తి పట్లగానీ తనకు ఏర్పడిన భావాలను ఎలా అధిగమించగలిగిందో లెక్చరర్ – రేవతి కలిసినప్పుడు మాట్లాడిన సందర్భంలో తెలుస్తుంది.

సీతాపతి మీ అందరికంటే నాకు ముందు పరిచయమైనాడు. అతడు తనకు పెళ్ళయిపోయిందని నాతో చెప్పకుండా కొన్నాళ్ళు దాగుడుమూతలాడాడు. బుద్ధిపూర్వకంగా కాదనుకోండి. ఆ దినాల్లో అతడు నన్ను చాలా ఆకర్షించాడు. నేనతన్ని వివాహం చేసుకోవాలి అని నిశ్చయించుకున్నాను. కానీ అతడు వివాహితుడని తెలియగానే నా ఆశలు అడియాసలైనాయి. ఒకరకంగా నా మనసు దెబ్బతింది. తరువాత మిమ్మల్ని గాఢంగా గౌరవించాను, అభిమానించాను. ఒక్కొక్కప్పుడు నాకు తెలియకుండానే నాలో ఏవో కోరికలు కలుగుతున్నా వాటన్నిటినీ అణచివేసే గుణమెక్కటే నన్ను హెచ్చరించేది. ఇక కృష్ణమూర్తి విషయం అతడు వెన్నవంటివాడు. అతనితో జీవితం బాగానే గడుస్తుంది. కానీ అతని హృదయానికి గట్టితనం లేదు. అతడంటే నాకు పసిపిల్ల వానిపట్ల కలిగే వాత్సల్యం లాంటిదని అంటుంది. తనను ఇష్టపడిన వారిలో తనజీవిత భాగస్వామి

కాదగిన వరున్ని ఎన్నుకునే క్రమంలో రేవతిలో కనిపించే స్పష్టత, హేతుబద్ధత, ఆలోచించి నిర్ణయం తీసుకునే వ్యక్తిత్వం చదువుకున్న అమ్మాయిల పట్ల ఈకథ సదభిప్రాయాన్ని కలుగజేసింది. "రేవతిదేవి స్వయంవరం" రూపంలో చేసిన ఆలోచనా దోరణి వయక్తిక సమస్యగా కాక సామాజిక దృష్టికోణాన్ని సంతరించుకోగలిగింది.

యవ్వనోదయంలో అనేక ఆకర్షణలు. కోరికలు యువతీ, యువకుల మనసులను పూలపల్లకిగా చేసి ఊగిస్తాయి. నిద్రలేచింది మొదలు పడుకునే వరకూ అనేకమందితో పరిచయాలు ఏర్పడతాయి. ఈ సామాజిక వాతావరణంలో అమ్మాయిలు మూలకూర్చొని పంజరంలో చిలకలా బ్రతికే జీవితాలు కావు. ఆధునిక జీవనంలో సామాజిక సంబంధాలు ఉరుకులు పరుగులతో సాగిపోతుంటాయి. అలా ప్రవాహవేగంగా వెళ్ళే కాలాన్ని సైతం స్థంభించేసి మనసును, మమతను చూరగల వ్యక్తులు తారసపడుతుంటారు. అట్లని అందరిపట్ల ఒకేరకమైన భావమే కలిగితే లేదా చూసిన వారందరినీ పెళ్ళాడే స్థితి కాదు కదా! మరి అలాంటప్పుడు యువతులు పెళ్ళి సమస్యను ఎలా పరిష్కరించాలి? అన్న ప్రశ్న ఉదయిస్తుంది. మొదటితరంలో చదువుకున్న అమ్మాయిలు రేవతిలాగే మనసులోనే స్వయంవరాన్ని ప్రకటించుకోవాలి. ఆ స్వయంవరంలో జీవితాన్ని తనదైన బాణీలో ప్రభావితం చేసే వ్యక్తిని, గాఢమైన అనుభూతిని కలిగించిన వ్యక్తిని జీవిత భాగస్వామిగా ఎన్నుకోగలగాలి. మిగిలిన భావనలను సామాజిక దృష్టితో ఆలోచించి అధిగమించాలన్న ఆలోచనల్ని రచయిత్రి ఈ కథలో పొందుపరిచారు.

రేపతి ఆలోచనలూ, ఆచరణ ఆమె స్వీయ నిర్ణాయక శక్తికి నిదర్శనం. కానీ జీవిత భాగస్వామిని ఎన్నుకునే క్రమంలో తనకేమాత్రం పరిచయం లేని వేణుగోపాలరావుతో పెళ్ళి నిశ్చయం చేసుకుంటుంది. అందుకే ఆమె లెక్చరర్ "ఏమీ పరిచయంలేని ఒక వ్యక్తితో జీవితం ప్రారంభించేకంటే అదివరకే అర్థం చేసుకున్న వ్యక్తితో జీవితం సుఖవంతంగా ఉండదంటావా? అని ప్రశ్నిస్తాడు.

తనను అభిమానించి తన మనసుకు దగ్గరగా వచ్చిన వ్యక్తిని, బాగా పరిచయమున్న వ్యక్తిని భాగస్వామిగా నిర్ణయించుకోవడం మేలైనదనేది అతని అభిప్రాయం . కానీ రేవతి అలా కాకుండా ఏమాత్రం పరిచయం లేని వ్యక్తిని పెళ్ళాడి జీవితాంతం అతనితో గడపడానికి సిద్ధపడడమంటే జీవితాన్ని లాటరీ వేయటం కంటే భిన్నమైనది కాదు. అతని అలవాట్లు, వ్యక్తిత్వం సంస్కారం లాంటివేమీ జీవిత భాగస్వామికి తెలిసే అవకాశం ఉండదు. కనీసం పంచుకోడానికి కావలసిన సాధారణమైన అవగాహన కూడా ఏమీ లేకుండా జీవించడానికి నిర్ణయించుకోవడం అశాస్త్రీయమైనదనే జనాంతికమైన అభిప్రాయం రేవతి అభిప్రాయం కాదు.

స్వాతంత్ర్యానంతరం క్రమంగా స్త్రీ విద్య అభివృద్ధి చెంది, సామాజికంగా ఒక ఆవరణ అంటూ స్త్రీకి ఏర్పడటం వలన, అంటే ఉద్యమం, ఉద్యోగం లాంటి అవకాశాలు కలిగిన తరువాత ఇంకా స్పష్టంగా చెప్పాలంటే ఆర్థికంగా, రాజకీయంగా ఓ మేరకు పాల్గొనే స్థితికి స్త్రీలు ఎదిగిన



ISSN No.2319-3905

తర్వాత స్త్రీల భావాలలో విప్లవాత్మక మార్పులు వచ్చినాయి. ప్రేమ విషయాలలో కూడా అలా వచ్చిన పరిణామాలలో భాగంగానే రేవతి పాత్ర చిత్రణ జరిగింది.

" ప్రేమ నిలకడలేని నీటివంటిదనా నీ ఉద్దేశ్యం" అని అడిగితే, నిలకడలేని నీటివంటిదని చులకన చేయటం లేదు నేను. అనువైన ప్రతి హృదయంలోకి ప్రవహించగల శక్తివంతమైన, సజీవమైన ప్రవాహమంటాను. దానిని మనకు కావలసిన చోట ఆనకట్ట వేసి నిలుపుకోవటానికి ఎంతో నిగ్రహం కావాలి. అందుకు ప్రయాస పడవలసి ఉంటుంది. ఆ ప్రవాహంలో పడి కొట్టుకుపోయేకంటే ఒడ్డున కూర్చొని ఆనందించడం తేలికైన పని." అని అంటుంది రేవతి.

అనువైన ప్రతి హృదయంలోకి ప్రవహించల శక్తివంతమైన, సజీవమైన ప్రవాహంగా రేవతి ప్రేమను నిర్వచించటం ఉదాత్తంగా ఉంది. మరి ప్రేమపట్ల అంత గొప్ప భావనలు గల రేవతి ఎందుకు ప్రేమ వివాహం చేసుకోలేకపోయిందో గమనిస్తే, ఆమె చెప్పిన దానికంటే పెద్ద కారణమేమీ ఉండదనిపిస్తుంది. ప్రవాహంలాంటి ప్రేమను ఆనకట్ట వేసి నిలుపుకోవడానికి ఎంతో నిగ్రహం కావాల్సి ఉంటుందని మాట్లాడుతుంది. రేవతి ప్రేమను పొందే అర్హత గల పురుషులుగా ఆమెకు ప్రపోజ్ చేసినవారికి లేరనేది ఆమె అభిప్రాయం. కళ్ళెంలేని గుర్రంలా, పల్లంలోకి ప్రవహించే నీటిలాంటి తన ప్రేమను, హృదయాన్ని ఓ చోట స్థిరంగా నిలపగలుగుతుంది. అందువలననే డా. వేణుగోపాలరావును పెళ్ళాడడానికి సిద్ధపడింది.

ప్రేమ ప్రవాహంలో కొట్టుకు పోయేకంటే ఒడ్డున కూర్చొని ఆనందించటం తేలికైన పని అని అనటంలో ప్రేమ పట్ల ఆమెకు గౌరవం లేక కాదు. రేవతి ప్రేమ గురించి అంత ఉదాత్తమైన అభిప్రాయాన్ని ప్రకటించి కూడా ఉదాసీనంగా ఒడ్డున కూర్చొని తిలకిస్తూ ఆనందపడతానని అనడానికి గల బలమైన కారణం ప్రేమ, పెళ్ళి పేరుతో స్త్రీల జీవితాలను అస్తవ్యస్తం చేస్తున్న పురుష స్వభావంపై నమ్మకం లేకనే. ప్రేమలో ఎలా దిగాలి? అన్న ప్రశ్నలోని అంతరార్థం.

ప్రేమ ప్రవాహంలో తడిసిన అనుభూతిని అనుభవించాలి. దాని లోతును గ్రహించగలగాలి. వాటి ద్వారా ఏర్పడిన పులకింతలను, పరవశాన్ని భద్రంగా పదిలపరచుకోవాలి. తనివితీర ఆ మధురానుభూతుల్ని నెమరేసుకుంటూ గడపాలి. శ్రీ శ్రీ. మాటల్లో చెప్పాలంటే, 'అనుభవించి, పలవరించాలి. అంతేగానీ ఒడ్డున కూర్చొని చూడటం ద్వారా అనుభూతుల్ని పొందగలమా? చూసి ఆనందించడం వినోద ప్రాయమౌతుందేగానీ అనుభవం కాదు,. కానీ రేవతి ప్రేమవిషయంలో ఎప్పుడూ ఎమోషనల్ అవదు. రేవతి ప్రేమపైన తనకుగల అభిప్రాయంతో ప్రేమలో పడకుండా జాగ్రత్త పడుతుంది. ప్రేమించడానికి అర్హత లేని వాళ్ళను వివాహమాడటం కంటే తాను వరించడానికి అర్హత కలిగినవాడు అపరిచితుడైనా అన్నివిధాలుగా తనకు తగిన వాడుగా డా. వేణుగోపాల్ నే అర్హుడిగా నిర్ణయించుకుంటుంది.

ఆమెలోని శాస్త్రీయ, హేతుబద్ధమైన భావజాలం, పురుషస్వామిక సామాజికతల ఫలితమే అవరిచితుణ్ణి పెళ్ళాడ్డం. జీవితాంతం కలసి బ్రతకాల్సిన వ్యక్తి అంతకుముందు ఏమాత్రం పరిచయం

లేకపోయినా తాళి కట్టిన మరుక్షణం నుంచి నీవే నాసర్వస్వం అని భావించడం, సేవించడం, మొదటి రాత్రి పేరుతో ఎలాంటి మానసిక అనుబంధం ఏర్పడక ముందే జీవితాన్ని పంచుకోవటం స్త్రీల అస్వతంత్రకు నిదర్శనం . పెళ్ళి పేరుతో జరిగే శారీరక దురాక్రమణను ఎటువైపు నుంచి చూసినా ప్రోత్సహించదగింది కాదు. అందులోనూ రేవతిలాంటి ఆధునిక స్త్రీలు వాఛించే పెళ్ళి కాదు. అట్లని తమ భావాలకు భద్రతలేని సమాజంలో, అభద్రతలో బ్రతకడానికి రేవతి లాంటి ఆధునిక స్త్రీలు సిద్ధంగా లేరన్న వాస్తవాన్ని కూడా పరిగణనలోకి తీసుకోదగింది. ఆమె వైవాహిక జీవితానికి సంబంధించిన నిర్ణయాన్ని గౌరవించి అర్థం చేసుకోవాల్సి వుంది. రేవతిలోని ఈ రకమైన ఆలోచనా ధోరణిని గమనించినట్లయితే, ప్రేమ విషయంలో ఆనాటి స్త్రీల స్థిరమైన అభిప్రాయాలలోని ప్రాక్టికాలిటీ, ధైర్యమే ఈనాటి స్త్రీవాద ఉద్యమం వరకు పర్యవసించిన మూలాలు ఒక క్రమంలో కనిపిస్తాయి.

అట్లని రేవతి మిగిలిన ఇద్దరిలో ఎవరో ఒకరిని వివాహం చేసుకోవాలనేది కాదు. లెక్చరర్ కానీ, కృష్ణమూర్తిగానీ నచ్చలేదనుకుంటే, మరొకరెవరైనా సరే అతని పట్ల ప్రేమ కలిగినపుడే వివాహానికి సిద్ధపడవచ్చు. రేవతి లాంటి స్త్రీలు పరిస్థితుల్ని విశ్లేషించుకోగలిగిన పరిజ్ఞానం గలవాళ్ళు. అని పాఠకులు నమ్మినట్లయితే, ఎలాంటి సందేహాలకు అవకాశం ఉండదు. కానీ వేలసంవత్సరాలుగా అబలలుగా చూసిన సమాజానికి రేవతి లాంటి ఆధునిక స్త్రీల బలాన్నిఅపనమ్మకంగా చూసిన లెక్చరర్ లాంటి విద్యావంతులు విశ్వసించడానికి కూడా కొంత సమయం పడుతుంది. స్త్రీ ఆంతరంగిక జీవితాన్ని చిత్రించిన ఈకథ యాభైలలోని స్త్రీ పురుష సంబంధాలను వ్యక్తికరించిన మంచికథ 'రేవతి స్వయంవరం". స్త్రీగా తనకేం కావాలో తానే నిర్ణయించుకోగలిగిన స్త్రీగా రేవతి, అమృతవల్లి పాత్రచిత్రణ, "కాలాతీతవ్యక్తులు" నవలలోని ఇందిరలాగే కాలాతీతమైనవిగా తెలుగు సాహిత్యంలో ఆనాడు సంచలనం సృష్టించాయి.

"అర్థం కాని అనుభవం" అనే కథ ఇతివృత్తంలో, నిర్మాణంలోని బలహీనత, భావజాల అస్పష్టత ఆతరువాతి కథల్లో కనబడదు. "కళ్యాణ కింకిణి" కథలోని కళ్యాణి కౌమారదశలోనే గర్భం ధరించడం, దాన్ని దాచడానికి తల్లిదండ్రులిద్దరూ ప్రయత్నిస్తారు. ఆమెను సాటి సామాజికుల నుండి సంరక్షించే క్రమంలో ఆమె కుటుంబం సంక్షోభంలో పడుతుంది. కళ్యాణిని ఆమె తల్లిదండ్రులు దూషించి దూరం చేసుకోలేదు. తల్లి కూతుర్ని లోకనిందనుండి కాపాడి, ఆమె సంతానాన్ని తన సంతానంగా చూపుతుంది. తండ్రి ఉన్నపళంగా కూతురి వివాహం చేయాల్సి రావడంతో దొంగతనానికి పాల్పడటం, దాన్ని సవతి కొడుకు తన నెత్తిన వేసుకొని ఇంటి నుండి పరారవడం ఈ సంఘటనలన్నీ కథాప్రారంభం నుండి రచయిత్రి చిత్రించలేదు. ముగింపులో మాత్రమే పాఠకులకు తెలుస్తాయి. కుటుంబ భారాన్ని మోసే ఒక త్యాగమూర్తిగా భావిస్తారు. కాని తన తల్లి, తండ్రి, అన్న దూరం కావడానికి తానే కారణం అన్ననిజం కళ్యాణిని దహించివేస్తుంది. ఇద్దరు కలసి చేసిన దానికి తానే బాధ్యత వహించాలనుకుంటుంది. కనీసం



ISSN No.2319-3905

అతని పేరు కూడా బయటపెట్టడానికి ఇష్టపడని స్థితి ఆమెది. ఒక పెళ్ళికాని తల్లి పడే సంఘర్షణ "కళ్యాణ కింకిణి" ఇతివృత్తం. కళ్యాణి జీవితంలో జరిగిన సంఘటన తల్లిదండ్రులకు తప్ప మరెవరికీ తెలియక పోవడం, అన్నతో పంచుకొ హృదయ భారాన్నితగ్గించుకోవడంవలన పలికిన మువ్వల సందడిగా ఆమె హృదయ స్పందనలను ప్రతీకాత్మకంగా రచయిత్రి పోల్చడం జరిగింది.

ఫ్యూడల్ సామాజిక నియంత్రణలు స్త్రీలను అనుక్షణం న్యూనత పరుస్తుంటాయి. వాటిని అర్థం చేసుకొని అధిగమించడానికి కొంతకాల వ్యవధి అవసరమవుతుంది. ఈ సంధికాలంలో వాళ్ళు తమనితాము సన్నద్ధం చేసుకునే సమయంలో ఎన్నో ఒడిదుడుకులకు లోనవ్వాల్సి వస్తుంది. వాటిని తట్టుకొని జీవిత సాఫల్యం చేసుకునేందుకు స్త్రీపురుషులమధ్య పెంపొందాల్సిన అవగాహనకు వారిమధ్యగల ప్రేమే ప్రధాన పాత్ర పోషిస్తుందని నిరూపించిన కథ "ఉరుములూ మెరుపులూ". ఈకథలోని నాయకానాయికలు బావామరదళ్ళు, ప్రేమికులు, బార్యాభర్తలు కూడా కావటంతో గాలి వానగా మారాల్సిన వాళ్ళ కాపురం ఉరుములూ మెరుపులతోనే సుఖాంత మవుతుంది.

ఆనందంగా సాగాల్సిన కాపురంలో ఒకరినొకరిని అర్థంచేసుకోకపోతే వచ్చే అనర్థాలకు జీవితాన్నే కోల్పోవాల్సి వస్తుందనే హెచ్చరిక "చక్రనేమి క్రమాన" కథలో ఇమిడివుంది. బార్యాభర్తల అభిరుచులలోని వైవిధ్యాన్ని ఒకరుగా అర్థంచేసుకోవటం కంటే జీవితభాగస్వామికి కూడా అర్థం చేయించాల్సి వస్తుంది. అమృతవల్లి, వురఫ్ మిసెస్ పాణి, మిసెస్ రంగనాథం పశ్చాత్తాపంతో మృత్యు ఒడిలోకి ఒరిగిన ఒక స్త్రీ విషాధ కథగా ముగింపు ఇవ్వడంలో సమకాలీన సాధారణ (పురుష) దృష్టికోణాన్నే ఈకథ అందించింది.

ఒకరకంగా మనం ఇతరులకేమి చేస్తామో దాన్నే రెండింతలుగా అనుభవించాల్సి వస్తుంది, చేసుకున్న వాళ్ళకు చేసుకున్నంత అనే లోక సహజ వ్యాఖ్యానాలకు, మూఢనమ్మకాన్ని సమర్థిస్తుందా ఈకథ అన్న అనుమానం ఒక్క క్షణం కలుగుతుంది. కానీ స్త్రీల గమ్యం, గమనం పురుషుడే అయ్యేట్లు చేసిన స్థితి గురించి, పురుషుడి కలల ద్వారానే స్త్రీలు కలగనాల్సిన స్థితి గురించి, పురుషుడి ఆలోచనల అనుబంధంగానే చూడటాన్ని "రేవతీ స్వయంవరం","ఉరుములూ మెరుపులూ", కళ్యాణ కింకిణి" కథల్లో గమనించగలం.

స్త్రీలను ఇంతకాలం పంజరంలో బంధించిన ఫ్యూడల్ కుటుంబ చట్రాలలో ఆధునిక భావాల వ్యాప్తితో మొదలైన ఒదులు కొంతమంది తమకు కావాల్సిన, అవసరమైన మోతాదు కంటే ఎక్కువగా వినియోగించుకోవటం కూడా జరిగింది. సగం సగం అవగాహన, సగంసగం అభివృద్ధి స్త్రీల జీవితంలో పెను మార్పులకు దోహదం చేసింది. ఆ అభివృద్ధి ఫలాల ఫలితాల్ని అర్థంచేసుకోవటానికి, ఆచరించటానికి మధ్యగల కాల వ్యవధి చేసిన అసంబద్ధ పర్యవసానాల్ని పి. శ్రీదేవి తన కథలలో ప్రయోగాత్మకంగా చిత్రించారు. స్త్రీల లైంగిక సంబంధాలను వక్రీకరించే పితృస్వామిక భావజాల ప్రభావం నుండి బయటపడలేని స్థితి, లైంగిక స్వేచ్ఛ రాజకీయాంశంగా గుర్తించక పోవడం వల్లనే ముగింపు విషయంలో అసంతృప్తిని ఈమె కథల్లో చూడగలం. స్త్రీల

రచనల విషయంలో స్త్రీలుగా తమవైన సంవేదనలకు ప్రతిస్పందిస్తూనే, పురుష ప్రతినిధులుగా పితృస్వామిక ప్రయోజనాలను కాపాడేందుకు తమకు తెలియకుండానే దోహదపడటం కూడా కాలిక స్పృహగా అంగీకరించాల్సిన కథాసంధర్భం.

"రేవతీ స్వయంవరం"లో స్త్రీపురుష సంబంధాలలోని ప్రేమ పెళ్ళిపట్లగల అనేక అంశాలను పి. శ్రీదేవి చర్చించారు. "కళ్యాణ కింకిణి" కథలో వైవాహిక సంబంధం లేకుండా స్త్రీ తల్లి కావడం, కుటుంబ సభ్యులందర్నీ ఎలా సంక్షుభితం చేస్తుందో చర్చించారు. స్త్రీల అపరిపక్వ లైంగిక స్వేచ్ఛాజీవితంలోని ఒడిదుడుకులకు చిత్రిక పట్టారు. పి. శ్రీదేవి తన కథల్లో చేసినన్ని ప్రయోగాలు ఆమె సమకాలికులు చేయలేదు. ఒక ప్రత్యేకమైన సిద్ధాంతానికి ఈమె సాహిత్యం కట్టుబడకపోవటం ఒకరకంగా ఈమె కథా సాహిత్యాన్ని శక్తివంతంచేసిందని చెప్పడంలో ఎటువంటి సందేహంలేదు.

పి. శ్రీదేవిలోని ఆధునిక ఆలోచనలూ, అభ్యుదయ భావాలూ, హేతువాద దృక్పథం, ప్రపంచ పరిశీలన, సామాజిక, రాజకీయ, ఆర్థిక అవగాహన, మానవ సంబంధాలలో ఆర్థికాంశాలతో పెనవేసుకున్న సంఘటనల పట్ల నిరసన నవల ఆసాంతం అడుగడుగునా వ్యక్తమౌతుంటాయి.

రచయిత్రికి వృత్తిపరంగాను, ప్రవృత్తిపరంగాను సమాజంతో, సమాజంలోని వ్యక్తులతో మమేకం కాగలిగే అవకాశం ఉండడం వల్ల వ్యక్తుల భిన్న ప్రవర్తనలు, విభిన్న మనస్తత్వాలు, అవి ఆ రకంగా ఏర్పడటానికి ప్రేరకాలు అయిన వంశానుగత లక్షణాలు, కుటుంబ పరిస్థితులు, సామాజిక పరిస్థితులు, ఆర్థిక పరిస్థితులు మొదలగు వాటిపట్ల అవగాహన కలిగి ఉండటంవలననే నవలలోని పాత్రలన్నింటినీ సజీవంగా చిత్రించగలిగింది.

విద్యావంతురాలు కావటంవలన స్వేచ్ఛా ప్రవృత్తిని కోరుకొనే ఇందిరలాంటి మనస్తత్వం నాణానికి ఒక ముఖం అయితే రెండవ ముఖంగా మిగతా పాత్రలైన కళ్యాణి, వైదేహి, వసుంధర కనిపిస్తారు. చదువుకున్నా, ఉద్యోగం చేస్తున్నా తరతరాలుగా ఆలోచనల్నీ మనసుల్నీ ప్రవర్తనల్నీ అడుగడుగునా సాంప్రదాయక ఆంక్షలతో నియంత్రణకు గురౌతున్న పాత్రలవి. మగవాళ్ళతో మాట్లాడితే ఎవరేమనుకుంటారోననే భయం, వాళ్ళతో కలిసి నడవటానికి జంకు వీళ్ళలో చిత్రించారు రచయిత్రి.

**ఉపయుక్త గ్రంథ సూచి**


1. కాలాతీతవ్యక్తులు- నవల విశాలాంధ్ర ప్రచురణ
2. ఉరుములు-మెరుపులు- కథల సంపుటి
3. తెలుగు స్వతంత్ర పత్రికలు- 1955-1956
4. స్వతంత్ర పత్రికలు - 1957-1960
5. ఏరిన పూలు - సంకలనం







6. యువ మాసపత్రిక - 1957 మార్చి, ఆగస్టు, నవంబరు 1960
7. ఆంధ్ర మహిళ - 1959 జనవరి సంచిక
8. జయంతి - 1958 నవంబరు 1, 1959 జూలై 1
9. నవ్య సాహితీసమితి సంకలనం

ఉపయోగించిన పి. శ్రీదేవి కథలు

1. స్వరూపంలో రూపం - తెలుగు స్వతంత్ర - 1955 మార్చి-ఏప్రిల్
2. వర్షం వెలిసేసరికి - తెలుగు స్వతంత్ర 1955 సెప్టెంబర్ 2
3. రేవతి స్వయంవరం - తెలుగు స్వతంత్ర 1956 ? 3
4. ఉరుములు - మెరుపులు - తెలుగు స్వతంత్ర - 1956 సెప్టెంబర్-అక్టోబరు
5. కల తెచ్చిన రూపాయలు - తెలుగు స్వతంత్ర - 1956 అక్టోబరు 26
6. మబ్బు బ్రతుకు - స్వతంత్ర 1957
7. కళ్యాణ కింకిణి - సంపుటిలో కథ 1957
8. మెత్తని శిక్ష - యువ - 1957 మార్చి 15
9. చక్రనేమిక్రమాన - స్వతంత్ర 1958 ఫిబ్రవరి
10. వీధి దీపాలు - స్వతంత్ర - 1958 మార్చి
11. ఎదురు తిరిగిన ప్రకృతి - స్వతంత్ర - 1958 ఏప్రిల్ 12 / ఏప్రిల్ 17
12. బెడిసికొట్టిన వాత్సల్యం - స్వతంత్ర 1958 2 17
13. జ్వర పీడితులు - స్వతంత్ర - 1958 సెప్టెంబరు 6
14. శ్రావణ భాద్రపదాలు - జయంతి - 1958 నవంబరు
15. ఒక్క రూపాయి ఎక్కువ - స్వతంత్ర
16. తిరగేసి తొడుక్కున్న ఆదర్శం - ఆంధ్రమహిళ - 1959 జనవరి 1
17. ఎవరి స్వప్నం వారిదే - తెలుగు స్వతంత్ర - 1959 జనవరి
18. వాళ్ళుపాడిన భూపాలరాగం %-% 1966 జయంతి-1959 జూలై 1బీ (ఏరినపూలు కథాసంకలనం)60/2.

20. అర్థంకాని అనుభవం- యువ 1960 నవంబరు 1

# 6

# గురజాడ సాహిత్యం – విశిష్టత

**– ఆచార్య ఎం.రామనాథం నాయుడు**

ఆధునిక తెలుగు కవిత్వంలో వివిధ ప్రక్రియలు అవతరించాయి. ప్రారంభంలో ఖండకావ్యం ప్రధాన ప్రక్రియగా ఉదయించింది. ఆత్మాశ్రయరీతి, వస్తువులో నవ్యత, భావనవ్యత, శైలిలో నవ్యత ఆధునిక తెలుగు కవిత్వానికి లక్షణాలయ్యాయి. ఇలాంటి అనేక లక్షణాలను తెలుగు కవిత్వానికి మొదటిసారిగా అందించిన కవి గురజాడ అప్పారావు గారు. గురజాడవారు ప్రారంభంలో సాంప్రదాయిక కవిత్వాన్నే రాశారు. 'సుభద్ర', 'ఋతుశతకం' అలాంటివే. ఆయన మనసులో క్రమక్రమంగా మార్పు రాసాగింది. గురజాడవారి డైరీలు ఆ మార్పును సూచిస్తున్నాయి. గురజాడవారు మొదట తన ప్రయోగాన్ని కన్యాశుల్క నాటకంలో చేశాడు. తర్వాత దాన్ని కవిత్వానికీ అన్వయింపజేశాడు. వ్యర్థమైన పద ఆడంబరాన్ని గురజాడవారు ఇష్టపడలేదు. తిక్కనను, వేమనను ఆదర్శంగా తీసుకున్నాడు. 'ముత్యాలసరం' అనే గజల్ లాంటి ఛందస్సును వాడుకలోకి తెచ్చాడు. మనకు అంతుకుముదే రగడలున్నాయి. వాటిలో కొంత మార్పు చేసి గజల్‌ను తీసుకుని ముత్యాలసరాన్ని సృష్టించాడు. పద్యాల మీద మోజు తగ్గని తెలుగువారిని గేయంవైపు మళ్ళించిన గురజాడ వారి సాహసం మెచ్చదగినది. మాత్రానియమాన్ని పాటించన తెలుగుకు మొదటి నుంచి లక్షణాలుగా వున్న వడిప్రాసల్ని కూడా పాటించకుండా వ్యవహారికాన్ని కవిత్వంలో వాడిన కవి గురజాడ. ఉదాత్త విషయాల్ని వస్తువుగా తీసుకుని అప్పారావు గారు తన వన్యప్రియతను చాటుకున్నాడు. 1909లో గురజాడవారు నీలగిరి పాటల్ని రాశాడు. ఇవి కీర్తనలరూపంలో వున్న సాంప్రదాయిక రచనలు. 1910లో ముత్యాలసరాన్ని సృష్టించి విశిష్ట మాధ్యమాన్ని ఏర్పరచుకున్నారు. గురజాడ కవిత్వంలో మానవీయత, దేశభక్తి, ప్రకృతి ప్రేమ వంటి ముఖ్యమైన గుణాలు కన్పిస్తాయి. "మనిషి చేసిన రాయి రప్పలకు మహిమ వుందని మొక్కుతూ ప్రాణం వుండే మనుషుల్ని రాయి రప్పలకంటే హీనంగా చూడడం తగునా" అని సమాజాన్ని ప్రశ్నించారు గురజాడగారు. 'సంఘసంస్కరణ' గురజాడ వారి కవిత్వంలోని ముఖ్యగుణం. 'కన్యాశుల్కం' అనే నాటకం ద్వారా సాంఘిక దురాచారాలను నిర్ద్వంద్వంగా ఖండించారు. ముత్యాలసరాలలో మూఢవిశ్వాసాలను ఖండించే అనేక గీతాలున్నాయి. తోకచుక్కను గురించిన గీతంలో ధూమకేతువు





కేతువని, మోము చందురుడు అలిగి చూడడం లేదని విమర్శించాడు. లవణరాజు కలలో కూడా ఇలాంటి అనేక విషయాలను గురజాడవారు ప్రస్తావించారు. "మలినదేహులు మాలలనేట్లయితే నేను మాలనే అవుతాను" అని అన్నారు. "మలిన చిత్తం వుండే వారిని అగ్రవర్ణమని చెప్పే వర్ణధర్మం" అని అన్నారు. "మంచి అన్నది మాల అయితే నేను మాలనవుతాను" అని. గాంధీజీ హరిజన ఉద్యమాన్ని ప్రారంభించడానికి ముందే గురజాడ అప్పరావు గారు ఇలాంటి వాక్యాలు రాయడం గమనించదగిన విషయం.

గురజాడ అప్పారావు గారు ప్రతిపాదించిన ప్రేమతత్వం, పవిత్ర దాంపత్యం, విశ్వమానవ ప్రేమ అనే రెండు ముఖాలున్న శిల్పం. ఆయన అచిరమైన ప్రేమను తలచుకోకూడదని, వయసు వచ్చిన తర్వాత మరులు మరలిపోయి ప్రేమ మిగులుతుందని, అరమరికలు లేని ప్రేమ మగవారికీ, ఆడవారికీ సమానమని చాటిచెప్పారు. "లోకమెల్ల ఒక్క ఇల్లై, వర్ణభేదములెల్ల కల్లై" పవిత్ర ప్రేమబంధం పెంపొందాలని ఆకాంక్షిచాడు.

గురజాడ అప్పారావు గారు దేశభక్తికి కొత్త నిర్వచనం ఇచ్చారు. ఆయన రాసినది విశ్వమానవ గీతం. "దేశమును ప్రేమించుమన్నా, మంచి అన్నది పెంచుమన్నా" అన్న మాటల్లో భారతదేశమనే మాటలేదు. "దేశమంటే మట్టి కాదోయ్ – దేశమంటే మనుషులోయ్" అనే వాక్యాలు గురజాడ వారి అంతరంగాన్ని ప్రతిబింబిస్తాయి. గురజాడవారి గీతాలలో పూర్ణమ్మ చాలా ప్రాచుర్యం పొందింది. సాంఘిక దురాచారాలలో ఒకటైన కన్యాశుల్కాన్ని గర్హిస్తూ రాసిన గీతం ఇది. ఆధునిక తెలుగు కవిత్వానికి గురజాడ ఇచ్చిన కొత్తదనం బహుముఖమైంది. ముత్యాలసరం తెలుగు కవిత్వ మాధ్యమానికి కొత్త మలుపు. గేయరూపంలో కథకావ్యాన్ని రాయడం, భావగీతాలు రాయడం, ప్రబోధకావ్యం రాయడం, సాంఘిక దురాచారాలను ఖండించడం, పవిత్ర ప్రణయాన్ని గురించి రాయడం, పిల్లల పాటల్ని రాయడం గురజాడ వారు చేసిన మహత్తరమైన ప్రయోగాలు.

ఆధునిక తెలుగు సాహిత్యానికి అడుగుజాడగా నిలిచిన గురజాడ అప్పారావు గారు ముఖ్యంగా సాంఘిక దురాచారాలపై కలం ఎత్తి, కరుణరసాత్మకమైన రచనలు చేసిన కవిశేఖరుడు. స్త్రీవిద్య అత్యంత అవసరమని గుర్తించిన సంఘసంస్కర్త. ఆధునిక కథలకు ఆద్యుడుగా ప్రసిద్ధి. దేశమంటే మట్టికాదోయ్, దేశమంటే మనుషులోయ్ అని చాటిచెప్పిన మహాకవి. సాహితీ సంపన్నుడు, అభ్యుదయ భావాలు కలిగి సమాజం కోసం పరితపించిన మానవతావాది. వ్యావహారిక భాషోద్యమంలో భాగం పంచుకున్న ఉద్యమకారుడు. కన్యాశుల్కమనే నాటక రచనతో అశేష జనహృదయాలలో కలకాలం నిలిచిపోయిన ఆధునిక తెలుగు మహాకవి, అగ్రగణ్యుడు మన గురజాడ అప్పారావు గారు.

గురజాడ అప్పారావుగారికి సమకాలీన సమాజం అన్నా, సమాజంలోని సమస్యలన్నా అమితాసక్తి. వాటిని ఎలాగైన సాహిత్యంలోకి తీసుకురావాలన్నది ఆయన ఆశయం. గురజాడ ఆధునిక భావాలు కలిగిన ప్రగతిశీలి. మానవ సమాజం పట్ల నాకొక మహత్తరమైన బాధ్యత

వుందని గుర్తించిన మహానుభావుడు. ఆధునిక తెలుగు సాహిత్య రచనకు ఆయన పూనుకోవడం వల్ల ఆ సాహిత్యపు రూపురేఖలు మారిపోయాయి. ఆధునిక తెలుగు రచయితలకు గురుతుల్యుడుగా గురజాడ వారు ముందుచూపును ప్రసాదించాడు.

సాహిత్యం సమాజానికి దర్పణం వంటిది. సమాజశ్రేయస్సు కోరి సామాన్యులకు అతి సమీపమైన తేటతెలుగులో రచనా వ్యాసంగాన్ని చేపట్టి సాహిత్యం, కవిత్వం, నాటకం వంటి ప్రక్రియలతో బహుళ ప్రజాదరణ పొందేటట్టు గురజాడ కృషి చేశారు. ఆయన ఆంగ్ల సాహిత్య అధ్యయనం స్వభాషా సేవకు, సామాజిక చైతన్యాన్ని రగిలించడానికి ఉపయోగించారు. భావుకుడిగా ప్రజల హృదయాలలో నిలిచాడు. తెలుగు సాహిత్యంలో వెలుగులు పూయించాడు. తెలుగు భాషామతల్లికి ఎనలేని సేవ చేశాడు.

గురజాడ అప్పారావుగారి అధ్యయన వస్తువు ముఖ్యంగా సామాన్యుల జీవితం. అట్టడుగు స్థితిలోని మనుషుల బతుకుల గురించి ఆలోచించి, అధ్యయనం చేయదలచి ఆధునిక తెలుగు సాహిత్యంలో సాహిత్య కృషీవలుడై, దార్శనికుడై, జీవితంపట్ల సమగ్రమైన అవగాహనను పొంది, మానవతాపథంలో 'అభ్యుదయగామి'గా వెలుగొందాడు. అలాగే ఆయన పాండితీ ప్రకర్ష వంక మొగ్గు చూపకండా సామాన్య ప్రజల దగ్గరకు తీసుకువెళ్ళే కవిత్వాన్ని రాసి, ప్రజల కవిగా ప్రసిద్ధి చెందాడు. ఆయన సామాన్య పదాలను సహజ కవిత్వంగా మలచి తెలుగు వెలుగు పూలు పూయించి, ముత్యాల పేటలుగా గుచ్చడం విశేషం.

'మంచి అనేది మాల అయితే నేను మాలనే' అవుతాననే మాట గురజాడ వారి నిష్టకు, నిబద్ధతకు నిదర్శనం. 'దేశమంటే మట్టికాదు, దేశమంటే మనుషులు' అని చెప్పడం ఆయన దార్శనికతకు నిలువుటద్దం. 'చెట్టపట్టాల్ పట్టుకుని దేశస్థులంతా నడవవలెను' అనే మాట సమైక్యతా ప్రబోధానికి దర్పణం వంటిది. అలాగే "దేశాన్ని ప్రేమించాలి. మంచి అనేది పెంచాలి" అని ఋషివాక్యం తెలిపి, వట్టి గొప్పలు చెప్పుకోకుండా ఏదైనా సమాజానికి ఉపయోగపడే ఒక మేలు తలపెట్టాలని ప్రజలను హెచ్చరించాడు. "మతాలన్నీ మాసిపోయి జ్ఞానం ఒక్కటే నిలిచి వెలుగుతుందని" మతసామరస్య ధోరణితో తెలియజెప్పాడు. "పరుల కలిమికి పొర్లి ఏడ్చే పాపికెక్కడ సుఖం" అని సార్వత్రిక నీతిని చెప్పాడు. "ఆధునిక మహిళలు చరిత్రలు తిరగరాస్తారని" తన శంఖారావాన్ని పూరించాడు.

ఆధునిక తెలుగు సాహిత్యంలోకి వాడుకభాషను, మాండలిక పదాలను చేర్చడం, మనుషుల ఆంతర్యాలకు, మనసుల అంతరాలకు అద్దం పట్టడం, ప్రతి రచనలోనూ ఓ ఆదర్శాన్ని నిభిడీకృతం చేయడం, దార్శనికతతో మానవ గొప్పతనాన్ని చూపడం వంటివి గురజాడ అప్పారావు గారు సాధించిన ఘనవిజయాలు.

గురజాడ వారు తెలుగులో 'కన్యాశుల్కం' అనే నాటకం రాయడం తెలుగు వారి అదృష్టం. ఈ నాటకం మనుషుల మనసుల్లోకి చొచ్చుకొనిపోయి వాళ్ళను రంగస్థలం మీద నిలబెట్టి ప్రేక్షకుల





మదిలో నిలుపగలగడం నాటకకర్తలందరికీ గమ్యమే అయినా ఒక్కొక్క భాషలో ఆ గమ్యాన్ని చేరుకున్న ప్రజ్ఞావంతులు కొందరే వున్నారు. ప్రజాబాహుళ్యపు సంబరంతో అందలమెక్కించిన తొలి తెలుగు సామాజిక నాటకం, రససిద్ధికి పరాకాష్టగా రూపొంది ప్రజాధరణతో కళగట్టిన మొదటి తెలుగు నాటకం 'కన్యాశుల్కం'. అందుకే గురజాడవారు తెలుగు సామాజిక నాటకానికి 'యుగకర్త' అయ్యాడు.

బాల్యవివాహాలు, వేశ్యావృత్తి, కన్యాశుల్కం వంటి వాటిని సామాజిక స్పృహతో విశ్లేషించటం గురజాడవారి బుద్ధి తీక్షణతకు నిదర్శనం. సరసదృష్టిని ప్రజాసామాన్యానికి అందించగలగడం ఆయన సాహితీ విజ్ఞతకు తార్కాణం. సామాన్య ప్రజల నాడిని పసిగట్టగలగడం గురజాడవారు సాధించిన గొప్ప విషయం.

ఆధునిక తెలుగు కథకు గురజాడవారు శ్రీకారం చుట్టి, తన కథలన్నింటిలోనూ సమాజాన్ని చక్కదిద్దే ప్రయత్నం చేశారు. ఆధునిక కథ సమాజానికి అద్దంపట్టడమేకాక వ్యాఖ్యానించడం కూడా జరిగింది.

మంచికథను చదవడానికి పట్టే సమయంకంటే కథ చదివి తర్వాత పాఠకుడిని ఆలోచింపజేసే సమయమే ఎక్కువ. మంచి కథలు ఎక్కువ మందిని ప్రభావితం చేయడమేకాక చాలామంది జీవితాలకు అద్దం పట్టడం ఆధునిక కథాలక్ష్యం, లక్షణం కూడా. ఆధునిక కథకు గురజాడవారు శిల్ప ప్రాధాన్యతను చెప్పకనే చెప్పారు. అందుకే పాలగుమ్మి పద్మరాజు "తెలుగు కథానిక గురజాడ చేతుల్లో యవ్వనంలో పుట్టిందని" అన్నారు. మధురాంతకం రాజారం "కథానిక లక్షణాలివి అని గురజాడ చెప్పలేదు గాని లక్షణాలన్నీ తెలిసేట్టు 'దిద్దుబాటు'ను రాశారు అని అన్నారు.

సమాజంలో దురాచార నిర్మూలనా చైతన్యాన్ని తీసుకురావడం, ఆధునిక తెలుగు సాహిత్య పరంగా తేటతెనుగు వ్యవహారిక భాషా ఉద్యమంలో భాగస్వామ్యం కావడం, రచనారీతులు ఎంపికలో మనుషుల మనసులలోనిచి చొచ్చుకుపోగలిగిన సాహిత్య స్వరూపాలను ఎంపికచేసుకోవడం, మానవతా పరంగా సౌశీల్యం, సమానత్వ భావం, స్త్రీవిద్య, స్త్రీ జనాభ్యుదయ కృషి కలిగి వుండడం వల్ల గురజాడ ఆధునిక తెలుగు సాహిత్యానికి 'యుగకర్త'గా వన్నెకెక్కడం జరిగింది. ఆయనకు సమాజానికి ఏదో చేయాలనే ఆలోచన రావడమే గొప్ప. ఆలోచనను కార్యరూపానికి తీసుకురావడం ఇంకా గొప్ప. గురజాడ వారి కృషి మనుషుల మనసుల్లో మెదులుతూ వుండడం, సామాజిక స్ఫూర్తిని అందిస్తూ వుండడం, ఆయన భాషాసేవ కొత్త పుంతలు తొక్కడం అమోఘం. ఆయనను చక్కగా మలచినది ఆయన ఎన్నుకున్న కవితాంతరంగం, ఆయన ముందుచూపు ఆయనకున్న అవగాహన, మానవత్వ భావన. ఆయన సాగిన బతుకుబాట ఎంతో స్ఫూర్తినిస్తాయి. అయితే రచయిత గమనాన్ని, గమ్యాన్ని పాఠకలోకం అతని జీవితకాలంలో గుర్తించలేకపోయినా, అసలు గుర్తించకపోయినా తరువాతి తరాలవాళ్ళు గుర్తించి తీరుతారు. గురజాడ వారికి కాలమే న్యాయాన్ని చూకూర్చింది.

"గురజాడ అప్పారావు గారు 1915లో చనిపోయినా 1915 తర్వాతనే జీవించడం ప్రారంభించాడని" దేవులపల్లి కృష్ణశాస్త్రి గారు మాట నిజమే అయింది. "తెలుగులో మొట్టమొదటి ఆధునిక కవి గురజాడ అని, ఆయన ప్రారంభించిన నవ్యకవితారీతి ఆధునికతకు ఆరంభం" అని వెల్చేరు నారాయణరావు గారు అభిప్రాయపడ్డారు. అలాగే శ్రీశ్రీ గారు సామాజిక పరిణామానికి విప్లవ పంథాలో ఏగం సాధించిన మహాకవిగా, నవ్యకవిత్వానికి యుగకర్తగా గురజాడను గుర్తించారు. ఇంకా "అడుగుజాడ గురజాడ. అది భావికి బాట" అని, ఆదికాలంలో తిక్కన, మధ్యకాలంలో వేమన, ఆధునిక కాలంలో గురజాడ మన తెలుగు మహాకవులని ప్రశంసించడం జరిగింది.

గురజాడ వారు సరళమైన భాషలో, మృదువైన భావాన్ని హృదయానికి హత్తుకునేట్టు తన కవితాలక్ష్యమని భావించి, సాహిత్యంలో వర్తమాన జీవిత వాస్తవానికి పట్టంగట్టి "నవయగ వైతాళికుడు"గా పేరు గాంచారు.

చివరి రోజుల్లో అప్పారావు ఆరోగ్యం క్షీణించసాగింది. విజయనగరం నుండి వైద్యం కోసం విశాఖపట్టణానికి వెళ్లారు. అప్పారావు విశాఖపట్నంలో తమ మిత్రులు ప్రిన్సిపాలు పి.టి.శ్రీనివాసయ్యంగారింట్లో దిగారు. తీపి విరిగిన చెరుకులా, అప్పారావు కోర్కెలన్నీ బెండైపోయాయి. 'లంగరెత్తుము' అని చరమగీతం రాశాడు. ఈ కవితలోని ప్రతి చరణానికి అతని జీవితంలో వివిధ ఘట్టాలు వ్యాఖ్యానాలుగా ఉదహరించవచ్చు. 1915 నవంబరు 25వ తేదీనాడు అప్పరావు లంగరెత్తేసి తన జీవన నౌకను తిరిగిరాని ఏ సుదూర తీరాలకో నడిపించుకొని పోయాడు. జనన మరణాలు రెండింటిలోనూ ఆయన తన కాలానికి ముందుండడానికే ప్రయత్నించారు. నెలలు పూర్తిగా నిండక ముందే తల్లి కడుపులోంచి భూమిమీద పడడానికి ఎంతో తొందరపడ్డాడో అలాగే తల్లి కళ్లముందే ఆమెకన్నా ముందుగా వెళ్ళిపోవడానికి నిశ్చయించుకొన్నాడా అన్నట్లు త్వరపడి మరణించాడు. ఇది తెలుగు సాహితీ లోకానికి తీరని లోటు.

**చదవదగిన పుస్తకాలు:**


1. తెలుగు సాహిత్య సమీక్ష, 1985, నాగయ్య జి., నవ్య పరిశోధక ప్రచురణ, తిరుపతి
2. తెలుగు సాహిత్య చరిత్ర, 1998, శాస్త్రి ద్వా.నా., ప్రతిభా పబ్లికేషన్స్ హైదరాబాదు.
3. తెలుగు సాహిత్య చరిత్ర, 2021, సిమ్మన్న వెలమల, విశాలాంధ్ర పబ్లికేషన్స్, విజయవాడ.
4. తెలుగు సాహిత్య చరిత్ర, 1996, కొర్లపాటి శ్రీరామమూర్తి, విశాలాంధ్ర పబ్లికేషన్స్ హౌస్, హైదరాబాదు,
5. ఆధునికాంధ్ర కవిత్వము సంప్రదాయాలు – ప్రయోగాలు, 2015, నారాయణ రెడ్డి, సి. విశాలాంధ్ర
6. సమగ్రాంధ్ర సాహిత్యం, 2013, ఆరుద్ర, తెలుగు అకాడమీ, హైదరాబాదు.






# 7

# తెలుగు ప్రధాన ద్రావిడ భాషలతో పరస్పర సంబంధాలు

– *డా.డి.ఉదయ కుమారి*

ప్రపంచ భాషలన్నింటినీ భాషాశాస్త్రజ్ఞులు భాషా కుటుంబాలుగా విభాగం చేశారు. వీటిలో ద్రావిడ భాషాకుటుంబం ఒకటి. అతిపెద్ద భాషాకుటుంబంగా దీనిని మనం భావించవచ్చు. ద్రావిడ భాషలు భారతదేశం మొత్తాన్ని వ్యాపించి ఉన్నాయి. తమిళం, మలయాళం, కన్నడం, ఆంధ్ర ప్రాంతాల్లో ఈ భాషలు వ్యాపించి ఉన్నాయి. ఈ భాషలనే మనం దక్షిణ, మధ్య, ఉత్తర ద్రావిడ భాషలని విభాగం చెయ్యవచ్చు. మొత్తం మనకుండే భాషలు 23. ఇందులో తెలుగును మనం విశిష్టమైన భాషగా చెప్పుకుంటున్నాం. భౌగోళిక స్వరూపాన్ని బట్టి ద్రావిడ భాషల్ని మూడు ఉపకుటుంబాలుగా విభాగించాం. జనాభాను బట్టి తెలుగుభాష భారతీయ భాషల్లో ద్వితీయస్థానాన్ని ఆక్రమించిందని చెప్పవచ్చు. తెలుగు భాష మీద సంస్కృత భాషా ప్రభావం ఎక్కువగా కన్పిస్తుంది. తెలుగు భాషా సాహిత్యం పదకొండవ శతాబ్దం నుంచి ప్రారంభమైనది. మధ్య ద్రావిడ భాషాకుటుంబంలో పన్నెండు భాషలున్నాయి. పన్నెండు భాషల్లో తెలుగు భాషే అగ్రస్థానాన్ని ఆక్రమించింది. నాగరిక భాషగా మన తెలుగు భాషను పేర్కొనవచ్చు.

మిగిలిన ద్రావిడ భాషలతో తెలుగు పరస్పర సంబంధం ఉంది. అదే రీతిలో తెలుగుపై ద్రావిడ భాషల ప్రభావమూ ఉంది. ప్రధాన ద్రావిడ భాషలైన తమిళం, మలయాళం, కన్నడ భాషల ప్రభావం తెలుగు భాషపై ఉంది. ద్రావిడ భాషల్లో తెలుగుస్థానానికి సంబంధించి, వర్ణనిర్మాణం, పదవ్యుత్పత్తి, శబ్దరూప నిర్మాణాల ద్వారా మనం చెప్పుకోవచ్చు. అలాగే వీటి ద్వారా ద్రావిడ భాషల మధ్య పరస్పర సంబంధాన్ని గుర్తించవచ్చు. మూల ద్రావిడ భాషావర్ణాల క్రమపరిణామం ద్రావిడ భాషా కుటుంబ నిర్ణయానికి ఎంతో తోడ్పడుతుంది. దక్షిణ ద్రావిడ భాషల్లో త.–అఋ, మ.–అఋ, క.–అఋ, కీ–అగ్ గానూ మధ్య ద్రావిడ భాషల్లో తె. ఏడ్చు, గదబ అడ/అడ్, కోలామి – అర్, నాయికీ – అర్, మండ/కూయి – డీ, కువి– డి మొదలైన వర్ణాలుగా మనకు కనిపిస్తున్నాయి. తాలవ్యీకరణంలో కచ మార్పును మనం వివిధ భాషల్లో చెప్పుకోవచ్చు. 'క' కారం ఇ, ఈ, ఎ, ఏలతో కూడినది తెలుగు, మలయాళ భాషల్లో 'చ' కారంగా

మారుతుంది. ఈ ధ్వని మార్పు మధ్య ద్రావిడ భాషల్లో కన్పించదు. తెలుగు భాషలో కనిపిస్తుంది. ఈ మార్పు తెలుగు దక్షిణ ద్రావిడ భాషగా గుర్తించడానికి ఉపయోగపడుతుంది.

మూ.ద్రా.–కివి, త.–చెవి, మల.–చెవి, కన్న–కివి, తె.–చెవి, నాయకీ–కెవ్ ఈవిధమైన తాలవ్యీకరణంలో క > చగా మారడాన్ని మనం చూస్తాం.

తాలవ్యాచ్చులైన ఇ, ఈ, ఎ, ఏలు తర్వాత మూర్ధన్య వర్ణం ఉంటే తాలవ్యీకరణం జరగదు. దక్షిణ ద్రావిడ భాషలైన తమిళం, మలయాళం మొదలైన భాషల్లో తెలుగు భాషలో మాత్రం తప్పకుండా ఈ మార్పు కన్పిస్తుంది.

మూ.ద్రా.–కిళి, త.–కిళి, మల.–కిళి, క.–గిళి, తు.–గిళి, తె. –చిలక, పర్జీ–కిల్

'అయ్' అనేది తెలుగులో 'ఏ'కారంగా మార్పు చెందుతుంది. అయితే ఈ మార్పు దక్షిణ ద్రావిడ భాషలైన తమిళ, మలయాళ భాషల్లో లేదు.

ఉదాహరణకు మూ.ద్రా – కయ్, త. –కై, మల–కై, కన్నడ – కై, తె–చేయి, పర్జీ–కెయ్. ఈ తాలవ్యీకరణ మార్పు తెలుగు భాషలో వలే కాకుండా భిన్నంగా జరుగుతుందని స్పష్టమౌతుంది.

అలాగే ణ > న; ళ > ల పరిణామం. ఈ మూర్ధన్య ధ్వనులైన ణ, ళలు మధ్య ద్రావిడ భాషల్లో న,ల కారాలుగా మార్పు చెందాయి. దక్షిణ ద్రావిడ భాషల్లో అలాగే మార్పులేకుండా ఉన్నాయి. దీనికి ఉదాహరణగా

మూ.ద్రా. కణ్, త. –కణ్, మ. –కణ్, క.–కణ్, కోత–కణ్, తు. – కణ్ణ. ఈ విధమైన మార్పును మనం చూడవచ్చు దక్షిణ ద్రావిడ భాషల్లో.

**మధ్యద్రావిడ భాషల్లో**

మూ. ద్రా. – కణ్. తెలుగు–కన్ను, గోండి– కను. అదేవిధంగా త > ట్ట/ట పరిణామంకూడా. దక్షిణ ద్రావిడ భాషల్లో అలాగే ఉంటుంది. మధ్య ద్రావిడ భాషల్లో తెలుగు, గదబ, పర్జీ భాషల్లో ట్టి/టగా మార్పు చెందుతుంది.

పదాది డలరలు – సంయుక్తాక్షరాల మార్పు కూడా ఇక్కడ చెప్పుకోవచ్చు. దక్షిణ ద్రావిడ, మూల ద్రావిడ భాషల్లో ఈ మార్పు కన్పించదు. కానీ మధ్యద్రావిడ భాషలైన తెలుగు, గోండి, పెంగో, మండ, కుయి, కువి, మొదలైన భాషల్లో ఇవి కన్పిస్తున్నాయి. వీటికి ఉదాహరణలు ఎన్నో మనం చెప్పుకోవచ్చు. అలాగే యాగ ఏ పరిణామం కూడా చెప్పుకోవచ్చు. మూల ద్రావిడ భాషలోని 'యా' అనే వర్ణం తెలుగులో 'ఏ'గా మారింది. మధ్యద్రావిడ భాషల్లో ఈ పరిణామం ఉన్నది. అలాగా ఇ > అ > ఏ పరిణామం కూడా. మూల ద్రావిడ భాషలో 'ఇ''కారం తర్వాత ఆకారం కానీ, ఏ కారం కానీ ఉంటే కొన్ని పదాల్లో తెలుగులో 'నే' గా మారుతుంది. ఇక్కడ కూడా తెలుగు మధ్య ద్రావిడ భాషలకూ సన్నిహిత సంబంధం ఉందనే విషయం స్పష్టం. వర్ణనిర్మాణం గనక పరిశీలిస్తే తెలుగు భాషకు మధ్య ద్రావిడ భాషలతోనూ, దక్షిణ ద్రావిడ భాషలతోనూ ఉన్న సంబంధం స్పష్టమౌతుంది.





పదవ్యుత్పత్తి కూడా తెలుగులో ఇతర ద్రావిడ భాషలతో ఉన్న పరస్పర సంబంధాన్ని మనం తెలుసుకోవచ్చు. పదవ్యుత్పత్తిని బట్టి చూస్తే తెలుగు భాషకు ఎక్కువగా మధ్యద్రావిడ భాషతోనే సంబంధం ఉందనే విషయం స్పష్టమౌతుంది. అలాగే పదజాలం విషయానికి వస్తే కూడా ఎక్కువగా తెలుగు భాష మధ్య ద్రావిడ భాషలతో ఎక్కువ సంబంధం కలిగి ఉందనే విషయం స్పష్టం.

తె. – డప్పి, దప్పి, దప్పిక

కోలామీ – అ – దాహం చేయు

నాయికీ – అడ్ – దాహం

ఈ విధమైనవి.

అలాగే ద్రావిడ భాషల్లో లింగభేదాల్ని ప్రధానంగా మూడు రకాలుగా చెప్పుకోవచ్చు. పరిశీలనాత్మకంగా చూస్తే తెలుగు ఏకవచనం, మధ్య ద్రావిడ భాషలతోనూ, బహువచనం దక్షిణ ద్రావిడ భాషలతోనూ దగ్గర సంబంధం కలిగి ఉందనేది నిర్ధారించుకోవచ్చు.

(1) ఉదా॥ తమిళం

| | |
|---|---|
| ఏ.వ. | బ.వ |
| మహత్ : న్ – అవన్ | మహత్ – ర్ – అవర్ |
| మహతీ : ళ్ – అవళ్ | మహతీ స్త్రీ – పుం. సామాన్య బహువచనం |
| అమహత్: తు – అతు | అమహత్: వ్ – అవ్/అవై |

(2) ఉదా॥ తెలుగు

| | |
|---|---|
| ఏ.వ. | బ.వ |
| మహత్: డు – వాడు | మహత్ రు – వారు |
| మహతీ ది – అది | మహతీ స్త్రీ పుం. సామాన్య బహువచనం |
| అమహత్ | అమహత్ వి – అవి |

(3) ఉదా॥ గోండి

| | |
|---|---|
| ఏ.వ. | బ.వ. |
| మహత్ ర్ – వోరె | మహత్ ర్ – పూర్ |
| మహతీ ద్ – ఆద్ | మహతీ న్ – అన్ |
| అమహత్ | అమహత్ |

అలాగే వచన విధానం పరిశీలిస్తే, ద్రావిడ భాషల్లో మహద్బహువచన ప్రత్యయం రేఫ (అర్, ఇర్, ఉర్) ఉన్నాయి. కొన్ని భాషల్లో అమహద్బహువచన ప్రత్యయం 'క్'గానూ, మరికొన్ని భాషల్లో 'ళ్' గానూ కొన్ని భాషల్లో 'కళ్'గానూ ఉంది. తెలుగు భాషలో మాత్రం 'లు' వర్ణమే

బహువచనంగా పేర్కొనబడింది. వచనంలో తెలుగు భాష మధ్యద్రావిడ భాషలైన పర్జీ, కోలామీ, ఒల్లారి మొదలైన భాషలతో సన్నిహిత సంబంధం కలిగి ఉంది.

ద్వితీయా విభక్తుల విషయంలో తెలుగు మధ్య ద్రావిడ భాషలతో సంబంధం కలిగి ఉంది. ద్రావిడ భాషల్లో కొన్ని పదాలు ద్వితీయ విభక్త్యంగాలుగా కన్పిస్తున్నాయి. నామ ధాతువుకు విభక్తికి మధ్య 'త్' వంటి విభక్త్యుపసర్గలు కొన్ని చోట్ల ఉన్నాయి. తెలుగు, కొండ మొదలైన మధ్య ద్రావిడ భాషల్లో 'తి' అనేది ద్వితీయాది విభక్తిగా ఉంటుంది. తెలుగు భాషను, ఈ విషయాలన్నీ పోలిస్తే మధ్య ద్రావిడ భాషలతో పరస్పర సంబంధం కలిగి ఉందని తెలుస్తుంది. అదేవిధంగా సర్వనామాల్ని పరిశీలిస్తే తెలుగు మధ్య ద్రావిడ భాషలైన గోండి, కుయి, కువి, కొండ, భాషలతో సంబంధం కలిగి ఉంది. ఏకార్థక సర్వనామాల్ని చూస్తే తెలుగు, పర్జీ, ఒల్లారి, కోలామి మొదలైన భాషలన్నిటికీ సంబంధాలున్నాయని తెలుస్తుంది. అదేవిధంగా క్వార్థక ప్రత్యయమైన 'ఇ'లో కూడా తెలుగు మధ్య ద్రావిడ భాషలతో పరస్పర సంబంధముందని స్పష్టమవుతుంది. వ్యతిరేక క్వార్థకం విషయంలో కూడా ప్రాచీన ద్రావిడంలో 'ఆ' మీద 'క' చేరిన రూపాలు కన్పిస్తున్నాయి. విధ్యర్థక రూపాల విషయంలో కూడా తెలుగు మధ్య ద్రావిడ భాషకే చెందుతుంది.

పై విషయాల పరిశీలనలో తెలుగు భాష మధ్య ద్రావిడ భాషకు చెందిందని, తెలుగు భాష మిగిలిన భాషలతో పరస్పర సంబంధం కలిగి ఉందనే విషయం స్పష్టమవుతుంది. తెలుగు భాషకు శబ్దరూపప్రమాణమే ప్రామాణికమైనదనే విషయం ఇక్కడ స్పష్టమైంది. దక్షిణ ద్రావిడ భాషతో కూడా తెలుగు భాషకు అక్కడక్కడ కొన్ని విషయాలతో సంబంధమున్నా, ఉత్తర ద్రావిడ భాషలతో కొంతవరకూ సంబంధమున్నా కూడా, మధ్య ద్రావిడ భాషతో ముఖ్యంగా సంబంధముందనే విషయం పై పరిశీలనలో స్పష్టమైంది.

**ఆధార గ్రంథాలు**

1. ద్రావిడ భాషలు– ఆచార్య పి.ఎస్. సుబ్రహ్మణ్యం
2. తెలుగు భాషా చరిత్ర – డా. వెలమల సిమ్మన్న



ISSN No.2319-3905

# 8
# ఆరుద్ర జీవితం - సాహిత్యం

*–ఆచార్య ఎన్. ఈశ్వర రెడ్డి*

**పరిచయం:**

అభ్యుదయ సాహిత్య ఉద్యమ నిర్మాతల శత జయంతి సంవత్సరాలు ఒక్కొక్కటిగా వస్తున్న నేపథ్యంలో, ఆరుద్రగా ప్రసిద్ధికెక్కిన భాగవతుల సదాశివ శంకర శాస్త్రిని గుర్తు చేసుకోవడం మన బాధ్యత. సినీ గీత రచయితగా, సమగ్ర సాహిత్య చరిత్ర నిర్మాతగా, విభిన్న ప్రక్రియల్లో ప్రత్యేక స్థానం సాధించిన సృజన శీలిగా ఆరుద్ర చిరస్మరణీయుడు. మూఢ నమ్మకాలను, తిరోగమన సంప్రదాయాలను ఎడమ పాదంతో తన్ని, అసలైన భౌతిక వాదిగా, కమ్యూనిస్టుగా, సిద్ధాంతాల ఆచరణ శీలిగా నిలబడ్డ సాహితీ మూర్తి ఆరుద్ర. శ్రమైక జీవన సౌందర్యానికి సమానమైనది లేనేలేదని చెప్పిన శ్రీశ్రీ సిద్ధాంతాన్ని ఆచరించి చూపించిన అపురూప వ్యక్తిత్వం కలిగిన మనిషి ఆరుద్ర.

శంకరం, శంకర శాస్త్రి, ఛోటా శాస్త్రి, జూనియర్ అశ్విని,టింగు రంగారావు, సామిధేని సావిత్రి, మార్కండేయుడు,వామాక్షి, హరిదాసు, కోనేటి రావు,ఆరుద్ర వంటి కాలం పేర్లతో రచనలు చేశాడు. తెలుగు సాహిత్య వినీలాకాశంలో చిరస్థాయిగా నిలిచిపోయిన పేరు మాత్రం ఆరుద్ర.

**జననం, విద్యాభ్యాసం:**

భాగవతుల సదాశివ శంకర శాస్త్రి (ఆరుద్ర ) 1925 ఆగస్టు 31న విశాఖపట్నంలో జన్మించారు. వెంకట జోగమ్మ భాగవతుల నరసింహారావు వీరి తల్లిదండ్రులు. విశాఖపట్నం కలెక్టర్ కార్యాలయంలో దొరికిన ఆధారాలను బట్టి చూస్తే ఆరుద్ర కన్నా 13 తరాల ముందు వీరు కరువు కాటకాల కారణంగా దక్షిణ ద్రావిడ ప్రాంతం నుండి యలమంచిలి సమీపంలోని దిమిలి అనే గ్రామానికి వలస వచ్చారు. వీరి మూలపురుషుడైన సీతారామ భగవతి ఇంటి పేరు ఆదిభట్ల. ఈయన గ్రామచావిడిలో కూర్చుని నిరంతరం భాగవత పారాయణం చేయడం ద్వారా ఆయన ఇంటిపేరు కాస్త భాగవతులుగా మారిపోయింది.

ISSN No.2319-3905

ఆరుద్ర ప్రాథమిక విద్యను విశాఖపట్నం లోని శివరామయ్య బడిలో అభ్యసించారు. ఏవియం కాలేజీ హైస్కూల్లో స్కూల్ ఫైనల్ వరకు చదువుకున్నారు. ఇంటర్మీడియట్ విజయనగరంలో చేరి, దేశ రాజకీయాల ప్రభావంతో కళాశాల చదువుకు స్వస్తి చెప్పారు. ఆరుద్రకు పాఠశాలలో లేదా కళాశాలలో బోధించే పాఠాలు కన్నా సామాజిక సాహిత్య అంశాలను తెలిపే గ్రంథాల పట్ల మక్కువ ఎక్కువగా ఉండేది. విశాఖపట్నంలోని రీడింగ్ రూమ్ గ్రంథాలయం, ఆర్యవైశ్య గ్రంథాలయం, విశ్వబ్రాహ్మణ గ్రంథాలయాలు ఆరుద్రకు చదువు నేర్పాయి అనడంలో అతిశయోక్తి లేదు. ఆరుద్ర నివసిస్తున్న వీధిలోనే అబ్బూరి రామకృష్ణారావు, పింగళి లక్ష్మీకాంతం ఉండడం ఆరుద్ర సాహిత్య అధ్యయనం వైపు నడవడానికి మరో కారణం. ఆరుద్ర అభ్యుదయ కవిగా మారడానికి కారకుడు శ్రీ శ్రీ. శ్రీశ్రీ ఆరుద్ర కు ఆప్తుడు, చుట్టం, మేనమామ కూడా.

ఆరుద్ర తాత కృష్ణయ్య. కృష్ణయ్య సోదరి అప్పలకొండ. అప్పలకొండ భర్త వెంకటరమణయ్య. అప్పలకొండ వెంకటరమణయ్యల కొడుకే శ్రీశ్రీ.

ఆరుద్ర కళాశాల విద్య చదువుకునే సమయానికి విజయనగరం రావాల్సి వచ్చింది. విజయనగరంలో రోణంకి అప్పలస్వామి, చాగంటి సోమయాజులు, శ్రీరంగం నారాయణబాబు ఆరుద్రకు పరిచయమయ్యారు. చాగంటి వారి గ్రంథాలయంలో ఆధునిక ఆంగ్ల శాస్త్ర గ్రంథాలను అధ్యయనం చేసే అవకాశం వచ్చింది. ఆరుద్ర తనను వెలిగించిన దీపం రోణంకి అని చెప్పుకున్నాడు. టీఎస్ ఇలియట్, ఎజ్రాపౌండ్, మొదలైన ఫ్రెంచ్, ఆంగ్ల రచయితలను వారి రచన రీతులను రోణంకి ఆరుద్ర విశ్లేషించి చూపాడు. అనివార్య కారణాలవల్ల ఆరుద్ర కళాశాల విద్యను పూర్తి చేయలేదు. అందువల్ల ఆరుద్ర చదువుకుంది ఎస్ఎస్ఎల్సి అని చెప్పాల్సి ఉంటుంది. విద్య పట్ల ఆరుద్రకు మక్కువ ఎక్కువ. 1960లో రావూరి దొరస్వామి శర్మ గురుత్వంలో వ్యాకరణాన్ని మూడు సంవత్సరాలు అభ్యసించారు.' శాస్త్రమాచార్య' చదవాలన్న పెద్దల మాట కోసం 35 సంవత్సరాల వయసులో వ్యాకరణాన్ని నేర్చుకున్నట్టు తెలుస్తోంది.

**బతుకు తెరువు కష్టాలు:**

ఆరుద్రలో ఆత్మవిశ్వాసం దేశభక్తి రెండూ మెండు. సొంత కాళ్లపై నిలబడడానికి, ఫాసింజంపై యుద్ధం చేయడానికి 1943లో వైమానిక దళంలో చేరాడు. రాయల్ ఇండియన్ ఎయిర్ ఫోర్స్ లో జనరల్ డ్యూటీ గుమస్తాగా చేరాడు. 1943-46 మధ్యకాలంలో 69/- రూపాయల వేతనానికి ఈ ఉద్యోగం చేశాడు అంతేకాకుండా బ్యాండ్ మ్యూజియం అప్రెంటిస్ గా కూడా పనిచేశారు. అంబాలా నుండి ఒక మిత్రుడు కోసం ఉత్తరం రాస్తూ "బతుకుతెరువు కోసం సంగీతం నేర్చుకుంటున్న తెలుగు రచయిత రాస్తున్నాడు లావాతో ఒక లేఖ"అని ఆరుద్ర రాసుకున్నాడు. యుద్ధం తర్వాత నిరుద్యోగం ఆరుద్రను వెంటాడింది. 1947-48 మధ్యకాలంలో మద్రాసులో ఆనందవాణి అనే మాస పత్రికకు సంపాదకులుగా పనిచేశారు. ఆనందవాణి పుస్తక రూపంలో వెలువడిన మొదటి వారపత్రిక ఈ పత్రికను ఉప్పులూరి కాళిదాసు నడిపేవాడు.



అదే సమయంలో శ్రీ శ్రీ తో కలిసి మద్రాసులో ఉండేవాడు ఇద్దరూ కలిసి నెలకు 600 రూపాయలు సంపాదించేవారు. అవి వారికి సరిపోక పేవ్‌మెంట్ల పైన, పానగల్ పార్కులో గడపవలసి వచ్చేది.

మద్రాసులో గడిపిన ఈ చేదు జీవితానుభవాలను 1948లో నాల్బూరు నుంచి ఆవంత్స సోమసుందర్ గారికి రాసిన పోస్ట్ చేయని ఉత్తరంలో ఆరుద్రే తెలియ చేశారు. 'ఇల్లులేక అక్కడా ఇక్కడా బతికే వాణ్ణి. తాగుబోతులతో జూదగొట్టులతో, సానిముండలతో, సంఘం అడుగున జీవించే పురుగులతో భుజం భుజం కలిపి ఊపిరి తీసేవాణ్ణి. ప్రతి ఒక్కడు బాధపడుతున్నా ఆ విషాదాన్ని ఉతికి ఇస్త్రీ చేసి తొడుక్కునే వాణ్ణి. వాళ్ళ ఏడుపులో వాటా పుచ్చుకొని మద్రాసు వీధుల్లో నడిచే వాణ్ణి. చేస్తున్నది పరువైన ఉద్యోగం. మోస్తున్నది బరువైన గౌరవం. రెండు రకాల మొఖాలను ధరించే నేర్పు లేక చాలా మంది చేత ఆరుద్ర చెడిపోతున్నాడనిపించు కొన్నాను. రెండు రకాల నాలుకలు లేక 'ఆనంద వాణి' నుంచి విరమించు కొన్నాను. రెండు రకాల మాటలు చేతకాక మద్రాసు నుంచి మహాభినిష్క్రమణం చేశాను" అంటాడు. మద్రాసులో దుర్భర జీవితం గడపలేక తిరిగి విశాఖపట్నం చేరుకున్నాడు. శ్రమ జీవితాన్ని ఇష్టపడే ఆరుద్ర విశాఖలో గుమస్తాగా చేరాడు. కొంతకాలం తర్వాత 'లైకో గ్రాఫ్ స్టూడియో'లో ఫోటోగ్రాఫర్ గా చేరి ప్రొఫెషనల్ ఫోటోగ్రాఫర్ గా పేరు తెచ్చుకున్నాడు. విశాఖపట్నంలో ఆరుద్ర అవిశ్రాంతంగా పనిచేసినా, జీవితం ఆశించినంత మెరుగ్గా లేదు. మధ్యతరగతి జీవితంపై వెగటు పుట్టింది. అందుకే అక్కడనుండి హౌరా జిల్లాలోని నాల్బూర్ కు వెళ్లాడు.

'నాలుగు రైల్వే కొంపలు పాతికమంది మనుషులు ఊరంతా చెరువు కలిగిన నాల్బూరు' ఆరుద్ర కు నచ్చింది. అది కలకత్తాకు దగ్గరలో ఉంది. రెండు నెలల కోసం వెళ్లి ఆరు నెలలు అక్కడ గడిపాడు. అక్కడ సంపాదించింది ఏమీ లేకపోయినా, సాహిత్య అధ్యయనం మాత్రం జరిగింది. '10 గంటలకు భోంచేసి ప్రబంధ కన్యలని చదువుకుంటూ అల్లసాని పెద్దన, కూచి మంచి జగ్గకవి, శేషం వెంకటపతి, చేమకూర వెంకట కవి, మొదలైన వాళ్ళ గ్రాంథిక బూతులు వింటూ కూర్చుంటాను' అనే ఆరుద్ర, ప్రాచీన భాషను మస్తగతం చేసుకున్నాడు. అక్కడ సరైన ఉ పాధి లేక తిరిగి విశాఖపట్నం సమీపంలోని కొత్తవలసలో ఉన్న తన బాల్య స్నేహితుడు తీగల బుచ్చి వెంకటరమణ దగ్గరకు వచ్చాడు. ఆయనకు సినిమా హాలు ఉండేది. ఆ సినిమా హాల్లో మేనేజర్ గా పని చేస్తానని మనసులోని మాట చెప్పాడు ఆరుద్ర. అయితే ఆరుద్రకు రచయితగా ఉన్న గుర్తింపును దృష్టిలో ఉంచుకొని బుచ్చి కొండ ఆ ప్రతిపాదనను అంగీకరించలేదు. మంచి భవిష్యత్తు ఉన్న ఆరుద్ర ఆ పల్లెటూర్లో మగ్గిపోవడం ఆయనకు ఇష్టం లేదు. అందుకని మళ్లీ మద్రాసుకే వెళ్లి స్థిరపడమని సలహా ఇవ్వటమే కాకుండా దారి ఖర్చులతో పాటు ఒక నెల రోజులకు సరిపడా డబ్బులు ఇచ్చి మద్రాసు రైలు ఎక్కించాడు.

1948లో మద్రాసు కు చేరుకున్న ఆరుద్ర 'ఢంకా ' అనే పత్రికలో ప్రూఫ్ రీడర్గా చేరాడు. రోజుకు ఒక రూపాయి వేతనం. ఆ డబ్బుతో రాత్రిపూట ఇంగ్లీష్ సినిమాలు చూసేవాడు. ఆ ఒక రూపాయి ఉద్యోగం ఆరుద్ర బతకడానికి సరిపోలేదు.

న్యాపతి నారాయణరావు కొత్త పత్రికను ఆరంభిస్తాడని తెలిసి, మంచి ఉద్యోగం కోసం ప్రయత్నించాడు. ఆయన ఆరుద్రకు పెద్ద ఉద్యోగమే ఇవ్వాలనుకున్నాడు. అయితే ఆ పత్రిక ప్రారంభం ఆలస్యం కావడంతో, రాజరాజేశ్వరి ఫిలిం కంపెనీ వారికి ఆరుద్రను పరిచయం చేసి, అందులో పని చేయమని ఆరుద్రను ప్రోత్సహించాడు. అందులోనూ కథా విభాగంలో ఆరుద్ర పనిచేయవలసి వచ్చింది. అలా సినీ రంగంలో అడుగుపెట్టిన ఆరుద్ర ఇంతింతై వటుడింతై అన్న చందంగా ఒక మహా వృక్షంలా ఎదిగిన విషయం అందరికీ తెలిసిందే.

**దాంపత్య జీవితం:**

సినీ రంగంలో మంచి పేరు తెచ్చుకున్న ఆరుద్ర చాలామందికి చిరపరిచితుడయ్యాడు. గోరా శాస్త్రి సంపాదకత్వంలో తెలుగు స్వతంత్ర పత్రిక మద్రాస్ నుండి వెలువడేది. గోరా శాస్త్రితో ఉన్న పరిచయం వల్ల ఆరుద్ర తరచూ ఆయన్ను కలుసుకోవడానికి స్వతంత్ర పత్రిక ఆఫీసుకు వెళ్తూ ఉండేవాడు. అదే సమయంలో ఆ పత్రికలో సబ్ ఎడిటర్ గా పనిచేస్తున్న కె.రామలక్ష్మితో ఆరుద్రకు పరిచయం ఏర్పడింది. ఆ పరిచయం పెళ్ళికి దారితీసింది. 1955 ఏప్రిల్ 28న రామలక్ష్మిని పెళ్లి చేసుకున్నాడు. 60 రూపాయల ఖర్చుతో రిజిస్టార్ కార్యాలయంలో జరిగిన ఆ పెళ్లికి మొదటి సాక్షి సినిమా దిగ్గజం హెచ్ ఎం రెడ్డి అయితే రెండో సాక్షి శ్రీశ్రీ. పెళ్లికి మనసులు కలవడం ముఖ్యం అంతేగాని మాంగల్యం కాదు అని విశ్వసించే ఆరుద్ర భార్యా మెడలో తాళిబొట్టు కట్టలేదు. ఆరుద్ర ప్రత్యేకత ఏమిటంటే.. ఆయన సినిమాల కోసం రాసిన "సీతారాముల కళ్యాణము చూతము రారండి" పాట తెలుగు వారి సంప్రదాయాలను ప్రతిబింబించేదిగా ఉంటే " శ్రీరస్తు శుభమస్తు" పాట మనసులు కలబోసుకుని బతకమనేదిగా ఉంటుంది. ఈ రెండు పాటలు లేని పెళ్లి క్యాసెట్లు సీడీలు ఉండవు అంటే అతిశయోక్తి కాదు. అంత ప్రాచుర్యం పొందిన ఈ పాటలు తెలుగువారి పెళ్లి సంప్రదాయం ఉన్నంతకాలం వినిపిస్తూనే ఉంటాయి.

ఆరుద్ర రామలక్ష్మి లు ఉత్తర దక్షిణ ధ్రువాలుగా ఉండిన భిన్నత్వంలో ఏకత్వం సాధించినట్లుగా జీవితం సాగిందని ఆరుద్ర అంటారు. ఫ్యూటల్ వ్యవస్థ రూపొందించిన భార్యగా ఆమెను ఎప్పుడూ చూడలేదు. సాటి వ్యక్తిగా, తెలివైన మనిషిగా, మంచి స్నేహితురాలుగా ఆమెను గౌరవించాడు. 40 సంవత్సరాల వైవాహిక జీవితంలో ఒడిదుడుకులు ఎన్ని ఉన్నా, జీవిత ప్రయాణం సాఫీగానే సాగిందని సంతృప్తి పడ్డాడు.

**సంతానం:** ఆరుద్ర దంపతులకు ముగ్గురు కుమార్తెలు, ఒక పెంపుడు కూతురు మొత్తం నలుగురు. కవిత, లలిత, త్రివేణి, వాసంతి. వారికి మనవాళ్లు మనవరాలు అర డజను మందికి పైగా ఉన్నారు. వారికి స్వేచ్ఛతో కూడిన విద్యను ఆస్తి పాస్తిగా ఇచ్చారు. వారి పిల్లలందరికీ



ISSN No.2319-3905

ఆదర్శ వివాహాలు చేశారు. అందుకే మేడిపల్లి గారు అంటుంటారు ఒకే ఇంట్లో లౌకిక సమైక్య భారతదేశం ఉందని. లలిత ఒక్కరే సాహిత్య వారసత్వాన్ని అందిపుచ్చుకొని రౌద్రి అనే కలం పేరుతో తెలుగు ఇంగ్లీషు భాషల్లో కవిత్వం రాస్తున్నారు.

**అభ్యుదయం వైపు అడుగులు:**

భాగవతుల సీతారామ భగవతి కాలం నుండి చూసినా, ఆరుద్ర కుటుంబం సనాతన భావజాలం జీర్ణించుకున్న వంశం. దానికి తోడు ఆరోతరం వాడైన మాదన్న 5వ కుమారుడు వెంకన్నకు విజయరామ గజపతి జమీందారీని దత్తం చేశాడు. ఆరుద్ర బాల్యం వరకు తండ్రి నరసింహారావుకు జమీందారీ దర్పం ఆ కుటుంబంలో ఉండేది. ఒకవైపు సనాతన భావజాలం మరోవైపు జమీందారీ కుటుంబ నేపథ్యం ఉన్న ఆరుద్ర అభ్యుదయ రచయితగా మారడానికి ఆయనకు ఎదురైన సంఘటనలే ప్రధాన కారణంగా కనిపిస్తాయి.

1932-33 కాలంనాటి సంఘటన ఇది. తీగల బుచ్చి వెంకట రమణయ్య, తీగల బుచ్చిపెద్ద కొండ మీ ఇద్దరూ ఆరుద్రకు చిన్ననాటి స్నేహితులు వీరు వైశ్య కులానికి చెందినవారు. స్నేహితులతో కలిసి ఇంటికి వచ్చిన ఆరుద్రకు ఎదురైన చేదు అనుభవం ఏంటంటే, ఆరుద్రకు భోజనం ఇంట్లో కూర్చోబెట్టి పెట్టారు. స్నేహితులకు వసారాలో కూర్చోబెట్టి భోజనం పెట్టారు. అంతే కాకుండా వారి కంచాన్ని కూడా ప్రత్యేకంగా ఉంచారు. ఈ వివక్ష ఆరుద్రను తీవ్రంగా బాధించింది. ఆరుద్రలో హేతువాద భావాలను రగిలించింది. ఆరుద్ర 'వడుగు'ను నిరాకరించాడు. తన కులపోళ్ళందరూ ఆడిపోసుకున్నారు. అదొక సంచలనం. అయినా ఆరుద్ర ఎవరికీ భయపడకుండా నిరీశ్వర వాదిగా మారిపోయాడు. ఏవీఎం స్కూల్లో ఫైనల్ పరీక్షకు వెళ్లేటప్పుడు, ఆరుద్ర అమ్మ గారు ' దేవుడికి దండం పెట్టుకుని వెళ్ళు నాయనా' అంటే, అందుకు ఆరుద్ర 'నేను దండం పెట్టుకుంటే నా బదులు దేవుడు వచ్చి పరీక్ష రాస్తాడా?' అని ప్రశ్నించాడు. అలా ఆరుద్ర బాల్యం నుండే అభ్యుదయ ఆలోచనల వైపు అడుగులు వేశారు. శ్రీ శ్రీ ప్రభావం, హేతువాద దృక్పథం, సామ్యవాద భావజాలం, ఆనాటి సామాజిక స్థితిగతులు ఆరుద్రను అభ్యుదయ పథంలో నడిపించాయి.

**సాహిత్యకారుడుగా ఆరుద్ర:**

ఆరుద్ర రచనా వ్యాసంగం 13 వయసులో ప్రారంభమైంది. 1936లో శివరామయ్య బడిలో చదువుకుంటున్న రోజుల్లో రావు త్రయం పేరుతో రాసిన కరపత్రంతో ప్రారంభమైంది. వేమూరి జగన్నాథ రావు, మద్ది జగన్నాథ రావు, గలడా జగన్నాథ రావు అని ముగ్గురు జగన్నాథ రావు ఉండేవాళ్లు. వీళ్ళు తరగతి గదిలో బోర్డు తుడవడం పాఠ్యపుస్తకాలను ఉపాధ్యాయుల టేబుల్ పై ఉంచడం వంటి పనుల్లో పోటీ పడుతూ ఉండేవారు. ఆరుద్ర ఈ ముగ్గురిని రావు త్రయంగా భావించి, వీరి పేరుతో ఒక కరపత్రం రాశాడు. ఆ కరపత్రంలో ఆనాటి ఉపాధ్యాయుల చండశాసనత్వం, పాఠశాలలో కనిపించే అవకతవకలు రాశాడు. కరపత్రంలోని వ్యాసం ఆరుద్రే

రాశాడని శివరామయ్య మాస్టారుకు తెలిసింది. అందుకు ప్రతిఫలంగా ఆరుద్ర అరచెయ్యి దెబ్బలతో చిట్లిపోయింది.

తర్వాత ఏవీఎం కాలేజీ హైస్కూల్లో చదువుకుంటున్నప్పుడు స్కూల్ మ్యాగజైన్ కోసం రాసిన "తల్లిదండ్రులు వెళ్లిపోతూ/ తనకు ఇచ్చిన యావదాస్తి/ చిట్టి కోసం పొట్టి కోసం/ చిల్లి చెంబు ఒకటే... "అంటూ సాగే గేయం బిచ్చగాళ్ళ దీనత్వాన్ని కళ్ళకు కట్టించింది. దీనికన్నా ముందే తీగల వెంకటరమణయ్య చనిపోతే రాసిన ఎలిజి పద్యం మొదటి సృజనగా పేర్కొన్నా , అది లభించలేదు.

1939లో 'చిత్రగుప్త' పత్రికలో ఆరుద్ర రాసిన 'నా కలలో' దీర్ఘ కవిత మొదటి ముద్రిత కవితగా పేర్కొంటాడు. ఆ కవితను చూసి ఇంట్లో అందరూ ఆశ్చర్యపోయారు, నమ్మలేకపోయారు. అప్పటికి ఆయన ఇంకా మారలేదు. 1942 దాకా శ్రీ శ్రీ ప్రభావంలో మునిగిపోయాడు. ఆరుద్ర ప్రజాబంధు పక్షపత్రిక, ఆంధ్ర పత్రిక, పెంకి పిల్ల, వినోదిని వంటి పత్రికల్లో భాగవతల శివశంకర శాస్త్రి పేరుతో 24 కవితలు దాకా అచ్చయ్యాయి.

1942 ప్రాంతంలో ప్రపంచాన్ని యుద్ధమేఘాలు కమ్మేసాయి రెండవ ప్రపంచ యుద్ధం ప్రారంభమైంది హిట్లర్ యూరప్ దేశాలను లొంగదీసుకుంటున్నాడు ఆ క్రమంలో ఫ్రాన్స్ కూడా లొంగిపోయింది రష్యాను కూడా లొంగ తీసుకునే ప్రయత్నం చేస్తున్నాడు హిట్లర్. అమెరికా బ్రిటన్లు ప్రయత్నాలను సఫలం కావాలని చూస్తున్నాయి. మరోవైపు జపాన్ ఆసియా దేశాలను ఆక్రమిస్తుంది భారత్ పై కూడా ఉక్కు పాదం మోపింది ప్రధాన నగరాలపై బాంబర్ల విమానాలు గిరికీలు కొడుతున్నాయి. అదే సంవత్సరం విశాఖ సమీపంలోని సముద్ర తీరంలో ఏప్రిల్ 6న జపాన్ విమానం అమెరికా విమానాన్ని వ్యక్తం చేసింది. విశాఖ అర్బన్ లో మరో యుద్ధ విమానం అతని కోసం పొంచి ఉంది. విశాఖపట్నం కాకినాడలపై బాంబుల వర్షం కురిసింది ప్రజలు ప్రాణభయంతో తరలిపోయారు విశాఖ నుండి విజయనగరానికి తరలిపోయిన కుటుంబాల్లో ఆరుద్ర కుటుంబం కూడా ఉంది అప్పటికి ఆరుద్ర వయసు 16 సంవత్సరాలు. ఈ కారణంగానే ఆరుద్ర విజయనగరంలోని మహారాజ కళాశాలలో ఇంటర్ చేరాడు. యుద్ధ విమానాల బీభత్స కాండను చూసిన ఆరుద్ర మనసు కకావికలమైంది. కళ్ళు తెరిసినా, మూసినా యుద్ధ బీభత్సమే కనిపించింది. ఉగ్రవాదంపై కసి తీరా కవిత్వం రాశాడు. ఆ కవిత పేరు లోహవిహంగాలు."ఓహో ఏమిటీ జీవప్రవాహం / యంత్రాల మాదిరి మనుష్యులు/ ప్రాణాలు పిడికిట పెట్టుకొని/ గుండెలు చేతపట్టుకొని / బలుసాకును వెతుక్కుంటూ / బతుకు బాటపై క్రిక్కిరిసి /భుజాలు రాసుకుంటూ / ఉన్మాదంతో పోతున్నారు/ రాసుకుంటూ తొత్తుకుంటూ../అయిదు గంటల వేళ మళ్ళా

ఏరాడ కొండదిశ హార్బరు గగనాన్నంటి/ రెండు బారుల్లో ఎగురు తున్నాయి /పాపాల పుట్టలు జెపాను పిట్టలయిదు /నా ఆకర్ణాంత విశాల చక్షులన్/టెలిస్కోపుల చేసుకొని పరికించు చున్నానునే పుట్టి పెరిగిన విశాఖపట్నపు 'మరణం'' అంటూ...



ISSN No.2319-3905

ఆనాటి బీభత్స దృశ్యం ఈ ఖండికలో ఆవిష్కృతమైంది. ఈ కవితను చదివిన శ్రీ శ్రీ చాగంటి సోమయాజులు మెచ్చుకోవడంతో కవిగా ఆరుద్రకు గుర్తింపు లభించినట్లు అయింది.

1944లో వచ్చిన రసం వారి 'అభ్యుదయ రచనల సంపుటి'లో ఆరుద్ర రాసిన 'పేదరాలి జోలపాట' కరుణ రసాన్ని నింపుకుంది. జీవితంలోని వాస్తవికతను అన్వేషించి ఆవిష్కరించడం, శ్రామిక వర్గ పురోగతిని ఆశించి వారి భాషలో సాహిత్య సృజన చేయడం అవసరమనిపించింది ఆరుద్రకు. టీఎస్ జేమ్స్ జాయిస్ డేవిడ్ గేస్కో ఇన్ తదితరుల రచనల అధ్యయనంతో ఆరుద్ర అభ్యుదయ మార్గంలో దూసుకుపోయాడు.

**రచనలు:**

ఆరుద్ర రాసిన త్వమేవాహమ్ , సినీ వాలి, ఇంటింటి పజ్యాలు, కూనలమ్మ పదాలు, పైలా పచ్చీసు, ఏడాది కేడాది, అరబ్బీ మురబ్బాలు స్వతంత్ర కావ్యాలుగా వచ్చాయి.

వేసవి– వెన్నెల ( తమిళంలో జయగొండన్ రాసిన 'కళింగత్తు పరణి') దక్షిణ వేదం (తిరువళ్ళువర్ తమిళంలో రాసిన తిరుక్కురళ్) జైలు గీతాలు ( వియత్నాం స్వేచ్ఛ స్వతంత్రాల కోసం హొచ్మిన్ రాసిన the prison diary of Ho chi minh) అనువాదాలుగా వెలువడ్డాయి.

ఆరుద్ర రాసిన సాలభంజిక, దీర్ఘ రాత్రం, గ్రంథ మహా యుద్ధం, తదేవగృహం నాటికలను సాలభంజిక పేరుతో గ్రంథస్థం చేశాడు. విష ప్రయోగం, దేవుని ఎదుట, న్యాయాధికారి, పార్క్ బెంచి, దరఖాస్తు ఫారం, నన్ను గురించే, అక్కయ్యకి ప్రమోషన్ నాటికలను ఆరుద్ర నాటికలు పేరుతో పుస్తక రూపంలోకి తెచ్చాడు.

రాదారి బంగాళా, శ్రీకృష్ణదేవరాయ, కాటమరాజు కథ, ఖడ్గ తిక్కన, ద్రౌపది, శ్రీకృష్ణ కుచేల వంటి నాటకాలను రాశాడు. పది కథలతో 'నే చెప్పానుగా' 13 కథలతో 'ఊరు ఊరుకుంది' ఏడు కథలతో 'డిటెక్టివ్ కథలు' గ్రంథస్తం చేశాడు. పలకల వెండి గ్లాసు, అణాకో బేడ స్టాంపు, అహింసా రౌడీ, రెండు రెళ్ళ ఆరు, ఆనకట్ట మీద ఆత్మహత్య, త్రిశూలం, కొండచిలువ, వేట కుక్క నవలలు అపరాధ పరిశోధక రచనలుగా విలువడ్డాయి.

వీటన్నిటి కన్నా చెప్పుకోదగ్గ పరిశ్రమ 'సమగ్రాంధ్ర సాహిత్యం' రచన. ఒక విశ్వవిద్యాలయమో లేక ఒక సంస్థో చేయవలసినంత పనిని ఆరుద్ర ఒక్కడే చేశాడు. ఆరుద్ర కన్నా ముందుటి పరిశోధకులు తెలుగు సాహిత్య విభజనను కవుల పేర్ల మీద ప్రక్రియల పేర్ల మీద చేశారు. వాటిలో శాస్త్రీయత లోపించిందని భావించిన ఆరుద్ర రాజుల పేరు మీదుగా యుగ విభజన చేశాడు. 1965 నుండి 1968 మధ్యకాలంలో 12 సంపుటాలు వెలువడ్డాయి. 1989లో ఈ 12 సంపుటాలను ఎనిమిదికి కుదించి ఆ తర్వాత జరిగిన పరిణామాలతో మరో మూడు సంపుటాలు తీసుకొచ్చాడు.

వేమన వేదం, మహనీయులు, మన వేమన , వ్యాసపీఠం, గురజాడ గురుపీఠం, ప్రజా కళలూ-ప్రగతి వాదులూ, శ్రీ శ్రీ కథ మొదలైన సాహిత్య విమర్శకు సంబంధించిన గ్రంథాలను వెలువరించాడు. ఇవి కాక శుద్ధ మధ్యాక్కరలు, హస్త లక్షణ పదాలు, అమెరికా ఇంటింటి పజ్యాలు ఆరుద్ర కలం నుండి జాలువారాయి. ఆరుద్ర సాహిత్య కృషికి ఆయన రచనలే నిలువెత్తు సంతకాలు.

**ఆధార గ్రంథాలు:**


1. ఆరుద్ర జీవితం- రచనలు సమగ్ర పరిశీలన: డాక్టర్ ఎల్ సంగయ్య (1991) మాధురి ప్రచురణలు, నందిగామ.
2. ఆరుద్ర: మేడిపల్లి రవికుమార్, (2007) (భారతీయ సాహిత్య నిర్మాతలు) సాహిత్య అకాడమీ, న్యూఢిల్లీ.
3. సమగ్రాంధ్ర సాహిత్యం : ఆరుద్ర(1989), ప్రజాశక్తి, విజయవాడ.
4. ఆంధ్ర సాహిత్య వికాసము: పి.యశోదా రెడ్డి(1974) సుధర్మ పబ్లికేషన్స్, హైదరాబాద్




ISSN No.2319-3905

# 9

# ఉత్తర భారతీయ, ద్రావిడ భాషల్లో ప్రాచీన సాహిత్యం: తులనాత్మక అధ్యయనానుకూలత

*-డా.వి.పళని*

**Early Indians: The story of our ancestors and where we come from - Tony Joseph** తన పుస్తకంలో పురాతన డిఎన్ఏ పై ఆధారపడే కొన్ని అద్భుతమైన పరిశోధనల గురించి చర్చించాడు. హార్డ్ వర్డ్ యూనివర్సిటీ, జెనెటిక్ సైన్స్ పరిశోధకుడు డేవిడ్ రీచ్ నిర్వహించిన ఒక అధ్యయనం ఫలితాలను గురించి ఇందులో ప్రముఖంగా చర్చించాడు. ఈ పరిశోధనను బట్టి భారతదేశంలోకి రెండు వలసలు జరిగాయని జన్యు శాస్త్రం నిరూపిస్తున్నది.

మొదటి వలస బిఫోర్ కామన్ ఎరా 7000 నుండి 3000 సంవత్సరాల మధ్య జరిగినది. ఈ వలసదారులు జాగ్రోస్ ప్రాంతం నుండి వచ్చి అప్పటికే ఇక్కడ స్థిరపడి ఉన్న మూలవాసులతో కలిసిపోయి సింధులోయ నాగరికతలో భాగస్వాములు అయ్యారు.

రెండవ వలస బిఫోర్ కామన్ ఎరా 2000 సంవత్సరాల తర్వాత జరిగినది. ఈ వలసదారులు యురేషియన్ స్టెప్పి ప్రాంతం అంటే నేటి కజకిస్తాన్ ప్రాంతం నుండి వచ్చినవారు. వారే ఆర్యులు. సంస్కృత భాషను వారే భారత్ కు తీసుకొని వచ్చారని ఈ అధ్యయనం వెల్లడించింది.

అంటే, మొత్తం మీద సింధులోయ నాగరికతా నిర్మాతలు ఇక్కడి మూలవాసులని, ఈ తొలి భారతీయులు సుమారు 65 వేల సంవత్సరాల ముందే ఇక్కడ స్థిర నివాసం ఏర్పరచుకొని ఉన్నారని, ఈ పరిశోధనలో వెల్లడైంది. మరింత లోతుగా వెళితే ఈ వలసదారులు అవుట్ ఆఫ్ ఆఫ్రికా (OOA) జాతుల వారు కావచ్చని ఈ పరిశోధన అంచనా వేసింది. ఆర్యుల రాక తర్వాత ఈ జాతులు దక్షిణ ప్రాంతానికి వచ్చారని అనేక పరిశోధనలు చెబుతున్నాయి.

మొత్తం మీద ఈ దేశ మూలవాసులైన ద్రావిడులు దక్షిణ ప్రాంతంలో స్థిర నివాసం ఏర్పరచుకుని ఒక విలక్షణమైన సాంస్కృతిక వారసత్వాన్ని ప్రోది చేశారు. దక్షిణ భారతీయ సమాజం ఇన్ని వేల సంవత్సరాలుగా అనేక జాతులతో కలిసి జీవన గమనాన్ని సాగించినప్పటికీ వారి

సాంస్కృతిక విలక్షణత మాత్రం పుట్టుక నుండి పాడె వరకు కొట్టొచ్చినట్లు కనిపిస్తూనే ఉంటుంది.

గతంలో కూడా జరిగిన ఇటువంటి పరిశోధనల ప్రభావంతో దక్షిణ భారతదేశంలోని రాష్ట్రాల్లో ముఖ్యంగా తమిళనాడులో ద్రావిడ జాతీయ వాద ఉద్యమం 1930 తర్వాత దాదాపు రెండు దశాబ్దాల పాటు సందడి చేసింది. ఇ.వి. రామస్వామి నాయకర్ వంటి వారు ఈ ఉద్యమానికి నాయకత్వం వహించారు.

ద్రావిడ జాతీయ వాద ఉద్యమం ప్రధానంగా మూడు లక్ష్యాల కోసం సైద్ధాంతిక పోరాటం చేసింది. మొదటిది, అగ్రకుల ఆధిపత్య భావజాలాన్ని తొలగించడం, తద్వారా ఏర్పడిన దురాచారాలను నిర్మూలించడం. రెండవది, ద్రావిడ సంస్కృతికి పునరుజ్జీవనం కలిగించడం, దాడిని తిప్పికొట్టడం. మూడవది, మహిళలకు పురుషులతో సమానమైన గౌరవాన్ని కల్పించడం.

ద్రావిడ జాతీయవాద ఉద్యమ ప్రభావం తమిళనాడు పై అత్యధికమైన ప్రభావాన్ని చూపింది. ఆర్యులు వెలువరించిన సాహిత్యంలో అనేక లోపాలు ఉన్నాయనీ, వారు సత్యాలను దాచిపెట్టి అసత్యాలను ప్రకటించారనీ ద్రావిడ జాతీయవాదులు గట్టిగా విమర్శించారు. ముఖ్యంగా ద్రావిడ సంస్కృతిని చాలా తక్కువ చేసి చూపారని, ద్రావిడ వీరులను అనాగరికులుగాను లేదా అనైతికులుగాను చూపించే ప్రయత్నం చేశారని విమర్శించారు. అలాగే ఆర్యులు ప్రకటించిన రెండు ఇతిహాసాల్లోనూ కొన్ని పాత్రలపై పనిగట్టుకుని విషం పోసారని వాదించారు. ముఖ్యంగా దుర్యోధన, కర్ణ, రావణ పాత్రలను పూర్తిగా ప్రతినాయక ఛాయలతో చూపించారని, వ్యక్తుల మానసిక సంఘర్షణతో సంబంధం లేకుండా కొందరిని పూర్తిగా మంచిగాను, కొందరిని పూర్తిగా చెడ్డగాను చెప్పడం సరికాదని వాదించారు.

కాళిదాసుకు పూర్వుడుగా భావిస్తున్న భాస మహాకవి ప్రతినాయక పాత్రలను తీసుకుని ఆ పాత్రల మానసిక సంఘర్షణలను చిత్రిస్తూ నాటకాలను రాశాడు. ఊరు భంగం నాటకంలో దుర్యోధన పాత్ర మానసిక సంఘర్షణలోని మానవీయకోణాన్ని ఆవిష్కరించాడు. అలాగే కర్ణ భారం నాటకంలో కర్ణుని మనోవేదనను, వ్యక్తిత్వ సంపదను చిత్రీకరించాడు. ఇటువంటి సాహిత్య ప్రభావం మన రామారావు గారి పై స్పష్టంగా కనిపిస్తుంది. శ్రీకృష్ణ పాండవీయం, దానవీరశూరకర్ణ వంటి అనేక చిత్రాల్లో దుర్యోధన, కర్ణ పాత్రలను ఉదాత్త రీతిలో తీర్చిదిద్దడం ఇందుకు ఉదాహరణ.

1961 లో రామారావు స్వీయ దర్శకత్వంలో నిర్మించిన చిత్రం శ్రీ సీతారామ కళ్యాణం. ఇందులో రావణ పాత్రను అత్యద్భుతమైన రీతిలో ఆవిష్కరించారు. రావణ పాత్రలో విభిన్నమైన దృక్కోణాలను ఈ చిత్రం ఆవిష్కరించింది. ఈ చిత్రం స్క్రిప్టు కొరకు పరిశీలించిన గ్రంథాల్లో 'సీతా పరిభ్రమణ విభ్రమం' ఒకటి. ఈ పుస్తకాన్ని రామారావు స్నేహితుడైన ధనేకుల బుచ్చి వెంకట కృష్ణ చౌదరి రామారావు గారికి ఇచ్చారు. వివిధ రామాయణాలు, శివపురాణం వంటి దాదాపు 40 గ్రంథాలను పరిశోధించి రావణ పాత్రలోని రసైక దృష్టిని, మానవీయకోణాన్ని



ISSN No.2319-3905

ఆవిష్కరించిన గ్రంథం ఇది. ఈ పుస్తకం ప్రభావంతో రామారావు గారు రావణ పాత్రను అద్వితీయమైన రీతిలో తీర్చిదిద్దారు.

భాషా శాస్త్రజ్ఞులు ఇంతవరకు 27 ద్రావిడ భాషలను గుర్తించారు. మరింత లోతైన పరిశోధన జరిగితే మరిన్ని భాషలను గుర్తించే అవకాశం కూడా ఉంది. దానితోపాటుగా ద్రావిడ మూలవాసులు ప్రోది చేసిన సంస్కృతిపై విశేషమైన పరిశోధన జరగాల్సిన అవసరం ఉంది. కొందరు ఔత్తరాహుల దృష్టిలో ద్రావిడ, అనార్య పదాలు పర్యాయ పదాలు. ద్రావిడ జాతీయవాదులు ఆరోపిస్తున్నట్లుగా ద్రావిడ భాషలు అలాగే ఇతర ద్రావిడ సాంస్కృతిక అంశాలు తీవ్రమైన వివక్షకు గురైనట్లు గుర్తించవచ్చు.

ఒక తరం నుంచి మరొక తరానికి సాంస్కృతిక వారధులుగా పనిచేసేవి భాషా సాహిత్యాలు. ఒక జాతి సాహిత్యాన్ని సమగ్రంగా అధ్యయనం చేసినప్పుడే ఆ జాతి సంస్కృతిని సంపూర్ణంగా దర్శించడం సాధ్యమవుతుంది. వేల సంవత్సరాల చరిత్ర కలిగిన భారతీయ సమాజాన్ని సక్రమంగా దర్శించడానికి నిజమైన ఆధారం భారతీయ సాహిత్యం.

ప్రాచీన భారతీయ సమాజంలో సామాజిక సామరస్యం పరిఢవిల్లింది అని చెప్పడం ఒక పార్శ్వం. ప్రాచీన భారతీయ సమాజంలో కులం చాలా కఠినమైన వ్యవస్థ. ముఖ్యంగా మధ్య యుగం నుండి శూద్రుల మీద ప్రత్యేకించి అస్పృశ్యుల పేరుతో అట్టడుగు వర్గాల వారిమీద వివక్షత కొనసాగుతూనే ఉంది. కాబట్టి భారత చరిత్రలో స్వర్ణయుగం ఏది లేదని చెప్పడం మరొక పార్శ్వం. అగ్ర కులాలు, భూస్వామ్య వర్గాలు, పెద్ద స్థాయి వర్తక సంఘాలు సమాజంలో ఎల్లప్పుడు సంతోషంగా ఉండేవారని, అణగారిన వర్గాల ధన మాన ప్రాణాలకు రక్షణ ఉండేది కాదని ప్రఖ్యాత చరిత్రకారుడు ప్రొఫెసర్ డీ.ఎన్.ఝా అభిప్రాయం. (బిబిసి కి ఇచ్చిన ఇంటర్వ్యూ)

ఉత్తర, దక్షిణ భారత దేశాల్లో విభిన్నమైన సాంస్కృతిక జీవనం ఉందన్నది స్పష్టం. అయినప్పటికీ ఉత్తర, దక్షిణ భారతీయ సాహిత్యాలన్నింటిలోనూ భారతీయ ఆత్మ దర్శనమిస్తుంది. భారతీయ సమాజం బహిరంతర రూపాలు భిన్నత్వంతోను, భారతీయ ఆత్మ ఏకత్వంతోను దర్శనమిస్తుంది. నదులన్నీ సముద్రంలో సంగమించినట్లు భారతీయ సమాజంలోని ఏ భాషలో వెలువడిన సాహిత్యమైనా ఈ భారతీయుతలోనే సంగమిస్తుంది.

కొన్ని వేల సంవత్సరాల నుండి భిన్నమైన జాతి మత ప్రాంతాల వారు భారతదేశానికి వలస వచ్చి ఇక్కడ స్థిరపడ్డారు. భిన్నమైన మత విశ్వాసాలు, విభిన్నమైన ఆచార వ్యవహారాలు, విరుద్ధమైన జీవన విధానాలు భారతీయ ప్రజల్లో ఉన్నప్పటికీ వీరందరిని కలిపే ఒక అంతస్సూత్రం మాత్రం దండ లోపలి దారం లాగా అదృశ్య రూపంలో ఉన్న భారతీయ ఆత్మ మాత్రమే. ఇది దేశ భౌగోళిక పరిధిని బట్టి ఏర్పడింది కాదు. తరతరాలుగా ఇక్కడి ప్రజలు ప్రోది చేసుకున్న ఒక మహత్వ పూర్ణ మైన వ్యక్తిత్వం ఇది.కాబట్టి కాశ్మీర్ నుండి కన్యాకుమారి వరకు వివిధ భాషల్లో వెలువడిన భారతీయ సాహిత్యాన్ని తులనాత్మకంగా విశ్లేషించడం ద్వారా విలువైన సాంస్కృతిక

అంశాలు అనేకం గుర్తించే వీలు కలుగుతుంది. అటువంటి సాహిత్య సముద్రంలోని ఒక బిందువును ఇక్కడ సూచించే ప్రయత్నం చేస్తాను.

**ప్రాకృత సాహిత్యం:**

ఉదాహరణకు ప్రాకృత సాహిత్యం చాలా వైవిధ్యభరితమైంది. గుణాఢ్యుని 'బృహత్కథ' ప్రాకృత భాషలో వెలసిన గొప్ప కథా ప్రబంధం. హాలుని 'గాథా సప్తశతి', భోజదేవుని 'గాథా కోశం', కుతూహలుని 'లీలావది' వంటి అనేక గాథా గ్రంథాలు కూడా ప్రాకృతంలో కనిపిస్తాయి. హరి భద్ర సూరి రచించిన 'సమరా ఇచ్చకహ' కూడా గొప్ప కథా కావ్యం. శౌరసేనీ ప్రాకృతంలో విమల సూరి రచించిన 'ప ఉమ చరిఉ' రామాయణ కథ. ప్రాకృతంలో ఇంతటి విస్తృత స్థాయిలోను, వైవిధ్యంతోను వెలుగు చూసిన సాహిత్యం మనకు ఆశ్చర్యాన్ని కలిగించక మానదు.

శాతవాహనుల సామ్రాజ్యం తమిళ ప్రాంతంలోకి కూడా చొచ్చుకుని విస్తరించి ఉన్నందువలన కాల విస్తరణలో వైరుధ్యం ఉన్నప్పటికీ ప్రాకృత భాషలో వెలువడిన హాలుని 'గాథా సప్తశతి' ని తమిళ సంగ సాహిత్యంలోని 'ఎట్టుత్తొగై', 'పత్తుప్పాట్టు' లతో పోల్చి చూడవచ్చు.

**అస్సామీ:**

అస్సామీల భాషలో నిర్దుష్టమైన కవిత్వం ప్రారంభించిన వాడు క్రీస్తుశకం 1400 కాలానికి చెందిన మాధవ కందలి. ఈయన రామాయణ కావ్యంలోని ఏడు కాండాలను పద్యరూపంలో దేశీయమైన అస్సామీ పలుకుబడిలో 'సప్తకాండ రామాయణం' పేరుతొ రాశాడు. అస్సామీ సాహిత్యంలోని మాధవ కందలి 'సప్తకాండ రామాయణా' న్ని తెలుగులో గోనబుద్ధారెడ్డి 'రంగనాథ రామాయణం'తోను, తిక్కన 'నిర్వచనోత్తర రామాయణం' తోనూ పోల్చి చూడవచ్చు.

**ఒరియా:**

ఒరియా సాహిత్యంలో క్రీస్తుశకం 15వ. శతాబ్దంలో సారళా దాసు రచించిన 'సరళ మహాభారత' వ్యాసుని మహాభారతానికి పునఃసృష్టి లాగా కనిపిస్తుంది. ఒడిశా ప్రాంత జీవన సంస్కృతికి ఈ గ్రంథం ఒక విజ్ఞాన సర్వస్వం వంటిదని అంటారు. సారళా దాసు గజపతి మహారాజు కపిలేంద్ర దేవుని కాలంలోని వాడు. శూద్ర ముని గా ప్రసిద్ధుడైన ఈయనకు 'ఆదికబి' బిరుదం ఉంది. సారళా దాసుమహాభారతం బెంగాలీ సాహిత్యం పై కూడా గొప్ప ప్రభావాన్ని ప్రసరించింది. సారళా దాసు మహాభారతాన్ని తెలుగులో కవిత్రయ భారతంతో తులనాత్మకంగా పరిశీలించవచ్చు.

**కాశ్మీరీ:**

కాశ్మీరీసాహిత్యం మొదటి యుగంలోని లాల్ దవ్వ(లల్లాదేవి) శివాద్వైత మతంలోని 'త్రిక' అనే శాఖకు చెందిన మార్మిక కవయిత్రి. విశ్వజనీన లక్షణం కలిగిన ఈమె కవిత్వం గొప్ప ప్రజాదరణ పొందింది. ఉపదేశాత్మకమైన 'శ్రుఖ్' లు రాసిన షేక్ నూరుద్దీన్, 'మహా నయన ప్రకాశ్' రచయిత శితకంఠుడు, 'బాణాసుర కథ' రాసిన భట్టావతార్ వంటి ఎందరో కవులు



ISSN No.2319-3905

కనిపిస్తారు. మొత్తంగా ఈ దశలో కాశ్మీర సాహిత్యంపై శైవ మత ప్రభావం కనిపిస్తున్నది. అలాగే మార్మిక, ఉపదేశాత్మక కవిత్వం ఈ యుగంలో ఎక్కువగా వెలువడింది.

లల్లా దేవి దాదాపుగా తెలుగు సాహిత్యంలోశివకవి యుగానికి దగ్గరగా ఉన్న కవయిత్రి. ఈమె శివుని స్తుతిస్తూ రచించిన మార్మికమైన ఆధ్యాత్మ వర్ణనలతో ఉన్న పద్యాలను 'వఖ్' లు అంటారు. లల్లా దేవిని తెలుగు సాహిత్యం లోని శివకవి యుగంలోని మల్లికార్జున పండితారాధ్యులు, పాల్కురికి సోమనలతో పోల్చి చూడవచ్చు. కన్నడంలో అల్లమప్రభు, అక్కమహాదేవి తో పోల్చి చూడవచ్చు.

కాశ్మీర్ సాహిత్యంలో క్రీస్తుశకం 18వ శతాబ్దం అంతం వరకు నడిచిన రెండవ భాగం చాలా విలక్షణమైనది. మార్మిక కవిత కొనసాగుతున్నప్పటికీ ఈ యుగంలో వెలువడిన అత్యంత విలక్షణమైన కవిత్వం 'లోల్ గీత్'. లోల్ అంటే ఒక గాఢమైన ప్రణయ స్థితి. లోల్ గీతిక సంగీత బద్ధంగా, నాలుగు చిన్న పంక్తులతో ముగుస్తుంది. అలాగే హబా ఖటూన్ ప్రతి చరణంలో మూడు పంక్తులు, పల్లవి ఉంటూ ఛందో బద్ధంగా లయాత్మకంగా సాగే 'వత్సన్' గీతాలను రాశాడు. తర్వాతి తరాల వారు ఈ సంప్రదాయాన్ని అనుసరించారు. ఈ గీతాల్లో సంసారంలోని సుఖదుఃఖాల వల్ల కలిగే వేదన, విచారం, ఆర్తి గోచరిస్తాయి.

కాశ్మీరీ సాహిత్యంలోని లోల్ గీతిని మన భావ కవిత్వంతో పోల్చవచ్చు. కాశ్మీరీ సాహిత్యంలో హబా ఖటూన్ రాసిన వత్సన్ గీతాలను తెలుగులోని వేమన పద్యాలను తులనాత్మకంగా పరిశీలించవచ్చు.

**గుజరాతీ:**

క్రీస్తు శకం 15 వ. శతాబ్దిలో గుజరాతీ సాహిత్యంలో వైష్ణవ భక్తి కవిత్వం ప్రారంభమైంది. దీని ప్రారంభకుడు నరసింహ మెహతా. ఈయన రాసిన 'వైష్ణవ జనతో' గీతం శ్రీకృష్ణుని పరవశంతో పలు విధాలుగా కీర్తించింది. తదనంతరం మీరాభాయి కూడా కృష్ణ భక్తి తో అనేక గీతాలు రచించి గానం చేసింది. రామ భక్తుల్లో భళన కవి గీతాలు ప్రజాదరణలో ప్రసిద్ధమైనవి.

గుజరాతీ సాహిత్యంలోనే 'వైష్ణవ జనతో గీతా'న్ని పోతన 'శ్రీమదాంధ్రభాగవతం' లోని దశమ స్కంధంతో పోల్చి చూడవచ్చు. అలాగే, గుజరాతీలోని భళన కవి రామ గీతాలను రామదాసు కీర్తనలతో పోల్చి పరిశీలించవచ్చు. మీరాబాయి కృష్ణ గీతాలను క్షేత్రయ్య మువ్వగోపాల పదాలతో తులనాత్మకంగా పరిశీలించవచ్చు.

**పంజాబీ:**

15వ శతాబ్దిలో సిక్కు మత ధర్మ స్థాపకుడైన గురునానక్ తోనే మళ్ళీ పంజాబీ కవిత్వం ప్రారంభమైందని అంటారు. గురునానక్ సహజమైన, సుందరమైన పంజాబీ భాషకు పట్టాభిషేకం చేసిన కవి. సిసలైన పంజాబీ జానపద హృదయాన్ని అర్థం చేసుకున్న వాడు గురునానక్. ఆయన తరువాత గురు రామదాస్, గురు అర్జున్ దేవ్ ఈ పంథాను కొనసాగించారు. గురునానక్ సిద్ధ

ISSN No.2319-3905

సమాధి చెందినప్పుడు గురు అర్జున్ దేవ్ 'శ్రీ రాగ్ కి వర్' పేరుతొ రాసిన స్మృతి గీతికలు 'శ్రీ గురు గ్రంథ్ సాహిబ్' లో ఉన్నాయి. స్మృతి గీతికల లోని అనుభూతి తీవ్రత మనల్ని కదిలించి వేస్తుంది.

పంజాబీలకు నిత్య పారాయణ గ్రంథమైన 'శ్రీ గురు గ్రంథ్ సాహిబ్' ('ఆది గ్రంథ్') ను సంకలనం చేసిన వాడు గురు అర్జున్ దేవ్. ఈ గ్రంథం ఆనాటి సామాజిక, మత పరిస్థితులకు అద్దం పడుతుంది. అర్జున్ దేవ్ కు సహాయకుడైన భాయి గురుదాస్ 'వర్' ప్రక్రియా రచనలో ప్రసిద్ధుడు. ప్రౌఢ మైన పంజాబీ కవిత్వాన్ని భాయి గురుదాస్ తన 'వర్' ల ద్వారా అందించాడు. పంజాబీ కవిత్వంలోని 'వర్' అనేది పంజాబీ జానపద కథానాయకుల కథలు లేదా చారిత్రక సంఘటనలను వివరించే వీరోచిత గీతం. 1739 సంవత్సరంలో నాదిర్ షా భారతదేశంపై దండయాత్ర చేసిన విషయాన్ని వివరిస్తూ నజాబత్ రాసిన 'నాదిర్ షా ది వర్' వంటివి రచనలు వర్ లకు మంచి ఉదాహరణలు. ఆధ్యాత్మిక రచనలతో బాటుగా పంజాబులో వీర గాథా కవిత్వం కూడా వెలుగు చూసింది. ఇటువంటి రచనల్లో ప్రసిద్ధమైంది గురు గోవింద్ సింగ్ రాసిన 'చండీ ది వర్'. ఈ కావ్యంలో లయాత్మకత పంజాబ్ సమాజాన్ని ఉగ్రూతలూగించింది. అలాగే సిక్కు సైన్యాధిపతి హరి సింగ్ నాలవా విజయ యాత్రలను వర్ణిస్తూ కాదిర్ యార్ రాసిన 'హరి సింగ్ నాలవ ది వర్' కావ్యం కూడా ఈ కోవలో ప్రసిద్ధమైనది.

పంజాబీ సాహిత్యం లోని వర్ కావ్యాలను తెలుగులో పల్నాటి యుద్ధం, బొబ్బిలి యుద్ధం వంటి వీర గాథలతో పోల్చి పరిశీలించవచ్చు. యక్షగాన ప్రక్రియలోని వీరగాథల్ని కూడా పోల్చవచ్చు.

**బెంగాలీ:**

15వ. శతాబ్దం ఉత్తరార్థంలో కృత్తి బసు సంస్కృత వాల్మీకి సంస్కృత రామాయణా న్ని 'శ్రీరామ్ పాంచాలి' పేరుతొ వంగ భాష లో రాసాడు. ఇది బెంగాలీ భక్తి సాహిత్యంలో ఒక ప్రత్యేకమైంది, ప్రసిద్ధమైంది. "పాంచాలీ" అనేది జానపద శైలిలో చెప్పే పద్యగాథ (%ఝశ్రీ-శ్రీఖ౧-శ్రీఅవెవ ఋతీతీక్అజవ%), ప్రదర్శనకు అనుకూలంగా ఉంటుంది. బెంగాలీ సాహిత్యం లోని ఆఖ్యానాత్మక కావ్య సంప్రదాయంలో ఈ రామాయణం ప్రసిద్ధమైంది. గుణరాజ ఖాన్ బిరుదాంకితుడైన కవి మాలాధర బసు రచించిన 'శ్రీకృష్ణ విజయ' కావ్యం శ్రీకృష్ణుని విజయ గాథల్ని వర్ణిస్తున్నది. వంగ సాహిత్యంలో బడు చండీదాస్ రాసిన 'శ్రీకృష్ణ కీర్తన్' శ్రీకృష్ణ తత్వంపై వెలువడిన ఉత్తమ కావ్యం.

బెంగాలీ సాహిత్యంలోని 'శ్రీకృష్ణ విజయ' కావ్యాన్ని ఎఱ్ఱన 'హరివంశం' తోను, నాచన సోమనాథుని 'ఉత్తర హరివంశం' తోను తులనాత్మక పరిశీలన చేయవచ్చు.

**మరాఠీ:**

ప్రాచీన మరాఠీ సారస్వత యుగంలో ఎక్కువగా పురాణ, ఇతిహాస సంబంధమైన ఇతివృత్తాల పై రచనలు వెలువడ్డాయి. ఆనాటి సాహిత్యంలో ప్రాపంచిక దృష్టి కంటే ఆధ్యాత్మిక దృష్టి ఎక్కువగా



కనిపిస్తుంది. ముకుంద రాజు రచించిన 'వివేక సింధు', జ్ఞానేశ్వర మహరాజ్ రచించిన 'జ్ఞానేశ్వరి' ప్రాచీన మరాఠీ సాహిత్యానికి మార్గదర్శకాలు. జ్ఞానేశ్వరుని మరాఠీ సాహిత్యానికి మూల పురుషుడుగా భావిస్తారు. 'జ్ఞానేశ్వరి' మరాఠాల నిత్య పారాయణ గ్రంథం.

జ్ఞానేశ్వరుని తర్వాత పేర్కొనదగిన మరొక కవి నామదేవ్. ఈయన వార్కరీ తత్వ మార్గాన్ని సులభమైన భాషలో భక్తి గీతాల రూపంలో ప్రచారం చేసిన భక్తకవి. తర్వాతి వాడు ఏకనాథుడు. ఆయన మహా భక్తుడు. భాగవతం దశమ స్కంధం లోని శ్రీకృష్ణ లీలలు ఇతివృత్తంగా ఈయన రాసిన గ్రంథమే 'ఏకనాథీ భాగవత' పేరుతో ప్రసిద్ధమైంది. ఇది మరాఠాల నిత్య పారాయణ గ్రంథాల్లో పేర్కొనదగింది. ప్రాచీన మరాఠా సాహిత్యంలో ప్రజల కవిత్వానికి పునాదులు వేసిన గొప్ప సంస్కరణ వాది ఏకనాథుడు. ఈయన మార్గాన్ని కొనసాగించిన మరొక మహాకవి ముక్తేశ్వరుడు. ముక్తేశ్వరుడు రచించిన 'ముక్తేశ్వరీభారత' కథన విధానానికి గొప్ప ఉదాహరణగా నిలుస్తుంది.

మరాఠి సాహిత్యంలో ప్రజాబాహుళ్యం పై అత్యంత ప్రభావం చూపిన వాగ్గేయకారుడు తుకారాం. ఈయన రాసిన గీతాలను 'అభంగాలు' అంటారు. తుకారాం రచనలు 'అభంగ్ గాథా' లేదా 'తుకారాం గాథా' పేరుతో ప్రసిద్ధమైనాయి. వ్యంగ్య భావ స్ఫోరకమైన రచన, బలమైన భావనా శక్తి, ప్రగాఢ మైన భక్తి భావం ఈయన రచనలో ముప్పిరిగొని కనిపిస్తాయి. ఇదే కాలంలో 'దాస బోధ' పేరుతో గొప్ప గ్రంథాన్ని రాసిన రామదాసును గురు పరంపరలోని వ్యక్తిగా ఆరాధిస్తారు. నిషధాధిపతి అయిన నలుని వృత్తాంతాన్ని 'నల దమయంతీ స్వయంవర్ ఆఖ్యాన్' పేరుతో కావ్యంగా అందించిన రఘునాథ పండితుడు గొప్ప ప్రతిభావంతుడైన కవి.

మరాఠీ సాహిత్యంలోని ఏకనాథుని భాగవతాన్ని పోతన భాగవతం దశమస్కంధంతో తులనాత్మక పరిశీలన చేయవచ్చు.

తుకారాం అభంగాలను అన్నమయ్య సంకీర్తనలతో పోల్చి చూడవచ్చు. ఇటువంటి ప్రయత్నం ఇప్పటికే జరిగినట్లు కనిపిస్తున్నది. రఘునాథ పండితుని 'నలదమయంతి స్వయంవర్ అఖ్యాన్' కావ్యాన్ని శ్రీనాథ మహాకవి 'శృంగార నైషధం' తో పోల్చి పరిశీలించవచ్చు.

హిందీ:

అఖండమైన భారతీయ సాహిత్యం పై విశేషమైన ప్రభావాన్ని చూపింది భక్తి ఉద్యమం. క్రీస్తుశకం 14వ శతాబ్దం నుండి 17వ శతాబ్దం వరకు హిందీ సాహిత్యం పై కూడా భక్తి ఉద్యమ ప్రభావం స్పష్టంగా కనిపిస్తుంది. మహమ్మదీయుల అధికారంలో అభద్రతను అనుభవిస్తున్నామని భావించిన ఇతరులు తమ దృష్టిని భగవంతునిపై మరల్చి సమాజంలో భక్తి, ప్రశాంతతలను కలిగించే ఉద్దేశ్యంతో వెలువడిన సాహిత్యం భక్తిని విశేషంగా ప్రచారం చేసింది. ఈ యుగంలోని కవుల్లో కొందరు సాకార పరబ్రహ్మాన్ని మరికొందరు నిరాకార పరబ్రహ్మాన్ని కీర్తించారు. వీరిలో నిర్గుణ మార్గానికి ప్రాధాన్యమిచ్చిన వారినే 'సంత్' కవులు అంటారు. కబీర్ దాస్, ధర్మ దాస్,

దాదూ దయాళ్ వంటి ఎందరో కవులు తాము రాసిన పాటలలో (సాఖీలు) కర్మ కాండలను, మూఢాచారాల ఆచరణను ఖండించి, ఏకేశ్వరవాదాన్ని ఎలుగెత్తి చాటారు. అయితే సూఫీ సంప్రదాయ కవులు భగవంతుని ప్రేమ మార్గం ద్వారా చేరుకోవాలని ప్రబోధించారు. పరమాత్మని ప్రియురాలిగా భావిస్తూ వీరు కావ్యాలు వ్రాశారు.

సాకార పరబ్రహ్మన్ని ఆరాధించే కవుల్లో రామభక్తులు, కృష్ణభక్తులు రెండు వర్గాలుగా కనిపిస్తారు. ఈ యుగంలో వెలువడిన సంగీత ముక్తక కావ్యాలు ప్రజలను విశేషంగా ఆకర్షించి, ఉర్రూతలూగించాయి. తులసీదాస్ రచించిన 'రామచరిత మానస్', సూరదాస్ రచించిన 'సూర్ సాగర్' వంటి ప్రసిద్ధ కావ్యాలెన్నో ఈ యుగంలో వెలుగుచూశాయి.

హిందీలో నిర్గుణ మార్గానికి ప్రాధాన్యం ఇచ్చిన కబీర్ దాస్ ను అచల యోగి వేమన తో పోల్చి పరిశీలించవచ్చు. అలాగే హిందీ సాహిత్యంలోని ముక్తక కావ్యాలను సరియైన శతకాలతో పోల్చి చూడవచ్చు.

ప్రాచీన భారతీయ సాహిత్యం లోతుల్లోకి వెళ్లి చూస్తే అనేక అమూల్యమైన రత్నాలు తులనాత్మక అధ్యయనానికి అనుకూలంగా ఉన్నాయని సులభంగా గుర్తించవచ్చు.

## Works Cited


1. Tony Joseph. Early Indians: The Story of Our Ancestors and Where We Come From. Juggernaut Books, 2018.
2. డీ.ఎన్.ఝా. "భారతదేశంలో స్వర్ణయుగం ఒక మిథ్." BBC తెలుగు, 2020. www.bbc.com/telugu/india-xyz. Books & Articles Referred:

1. Devy, G. N. After Amnesia: Tradition and Change in Indian Literary Criticism. Orient Longman, 1993.
2. Zvelebil, Kamil V. The Smile of Murugan: On Tamil Literature of South India. E. J. Brill, 1973.
3. Pollock, Sheldon. The Language of the Gods in the World of Men: Sanskrit, Culture, and Power in Premodern India. University of California Press, 2006.
4. Cutler, Norman. Interpreting Tirukkural: The Role of Commentary in the Creation of a Text Journal of the American Oriental Society, vol. 112, no. 4, 1992, pp. 549–566.
5. Ramaswamy, Sumathi. Passions of the Tongue: Language Devotion in Tamil India, 1891-1970. University of California Press, 1997.




ISSN No.2319-3905


6. Hardy, Friedhelm. Viraha-Bhakti: The Early History of Ka Devotion in South India. Oxford University Press, 1983.
7. Sivathamby, K. Literary History in Tamil: A Study in Methodology. Institute of Asian Studies, 1986.
8. Blackburn, Stuart H., and A. K. Ramanujan, eds. Another Harmony: New Essays on the Folklore of India. University of California Press, 1986.
9. Dalmia, Vasudha, and Heinrich von Stietencron, eds. Representing Hinduism: The Construction of Religious Traditions and National Identity. SAGE Publications, 1995.
10. Raghavan, V. The Greater Dawn: A Study of the Sanskrit Poetic Theory and Its Application to Indian Litera
11. బండ్ల అన్వేష్.. భారతీయ సాహిత్యంలో తులనాత్మకత – ఆంధ్ర విశ్వవిద్యాలయ ప్రచురణ, 2012.
12. పింగళి లక్ష్మీకాంతం. తెలుగు సాహిత్య చరిత్ర. – ఆంధ్రప్రభ, 1975.
13. వట్టికోట ఆళ్వారుస్వామి. వేమన – స్వీయ అధ్యయనం. విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, 1981.
14. మల్లంపల్లి సోమశేఖరశర్మ. తెలుగు సాహిత్యంలో భక్తి ఉద్యమం. తెలుగు యూనివర్సిటీ, 1994.
15. నిడదవోలు వెంకటరావు. ఆంధ్రదేశము–సంస్కృతి, చరిత్ర. – విశాఖ సాహితీ ప్రచురణ, 1967.
16. ఆచార్య ఎన్. శ్రీరామమూర్తి. భాస నాటకాలు – తులనాత్మక విశ్లేషణ. తెలంగాణ విశ్వవిద్యాలయం, 1990.
17. కొమ్మూరి వెంకటప్పయ్య. తెలుగు జానపద సాహిత్యం – విజ్ఞాన ప్రచురణలు, 1983.
18. చాగంటి సోమయాజులు. రావణుడు – వేరే కోణంలో. చాగంటి ప్రచురణలు, 2005.
19. బుచ్చిబాబు. సాహిత్యంలో మార్మికత – విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, 1972.
20. శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రి. తెలుగు తులనాత్మక సాహిత్య పరిశోధన – శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం, 1987.

# 10

# మధ్యయుగాల్లో పరిపాలనభాషగా తెలుగుకున్న స్థానం

***– డా. పప్పుల వెంకటరమణ***

తెలుగు భాషకు అన్ని స్థాయిల్లోనూ అధికార భాషా గౌరవం కల్పించాలని ఎప్పటినుండో ప్రయత్నాలు చేస్తున్నాం. ఈ సమయంలో పూర్వము మన భాష ఎటువంటి స్థితిగతుల్లో ఉన్నదో తెలుసుకుంటే మన ప్రస్తుత కర్తవ్యాన్ని సమర్థంగా నెరవేర్చకోగలం.

చారిత్రక విషయాలను తెలుసుకోవడానికి ప్రధాన ఆధారాలు రెండు. ఒకటి సాహిత్యము రెండు శాసనాలు. ఇప్పటివరకు దొరికిన తెలుగు కావ్యాల్లో మొట్టమొదటిది క్రీస్తుశకం 11వ శతాబ్ది నాటిది. అంతకు పూర్వం చరిత్రను శాసనాల ద్వారానే తెలుసుకోవాలి. ఆ శాసనాలు ప్రధానంగా రెండు రకాలు. శిలాశాసనాలు, తామ్రశాసనాలు. తామ్ర శాసనాల సంఖ్య చాలా తక్కువ. ఇంచుమించుగా అన్నీ దానశాసనాలే. శిలా శాసనాల్లో అనేక రకాలు ఉన్నాయి. దాన శాసనాలు, ప్రసస్తి శాసనాలు, ధర్మనిరూపకాలు మొదలైనవి. వీటి ద్వారా లభించే చారిత్రక విషయాలను బట్టి, వీటిని రాసిన భాషను బట్టి అప్పటి చరిత్రతో పాటు ఆనాటి శాసనభాషకు సమాజంలో, పరిపాలనలో ఉన్న గౌరవాదరాలను తెలుసుకోవచ్చు. ఒక భాష వ్యవహార స్థితి నుంచి రాజభాషా స్థాయికి క్రమంగా పరిణమిస్తుందని సాధారణంగా సిద్ధాంతీకరించవచ్చు. అప్పటి విద్యా విధానం సమకాలిక భాషకు ఉన్న హెచ్చుతగ్గులను సూచిస్తుంది. అందువల్ల తెలుగుదేశంలోని విద్యా విధానమూ, తెలుగు భాషను ఉపయోగించిన సందర్భాలూ ఎట్లా ఉండేవో శాసనాల ద్వారా పరీక్షించి నట్లయితే తెలుగు భాషా స్థితి ఎట్లా ఉండేదో స్పష్టమవుతుంది.

శాతవాహనులు, ఇక్ష్వాకులు, విష్ణుకుండినులు, శాలంకాయనులు, బృహత్పలాయనులు, ఆనందగోత్రీకులు, పల్లవులు తెలుగుదేశాన్ని పరిపాలించినంత కాలం ప్రాకృతమే రాజభాషగా, సాహితీ భాషగా ఉండేది. అంటే క్రీస్తు శకం ఐదో శతాబ్ది వరకూ అదే పరిస్థితి. ఆ తరువాత క్రీ. శ. 17వ శతాబ్ది వరకూ సంస్కృత శాసనాలు, సంస్కృతాంధ్రాలు రెండూ ఉన్న ద్విభాషా శాసనాలూ, కేవలం తెలుగు శాసనాలు వచ్చాయి. క్రీ. శ. 575లో నుంచి తెలుగులో శాసనాలుదొరుకుతున్నాయి. తొలి తరం తెలుగు శాసనాల్లో చాలా భాగం రాయలసీమలో రేనాటి చోడులూ, వైదుంబులు వేయించినవే. అయితే క్రీ.శ. ఐదో శతాబ్ది నుంచి ఆయా కాలాల్లో



ISSN No.2319-3905

తెలుగుదేశంలో విద్యా విధానం ఎట్లా ఉండేదో, రాజభాషాత్వం తెలుగుకు ఎంతవరకు లభ్యపడిందో విస్పష్టంగా చెప్పే శాసనాలు దొరకలేదు. తెలిసినంతలో సంస్కృత విద్యాభ్యాసాన్ని గురించే వివరంగా తెలుసు.

సంస్కృత పండితులు సంపాదించిన అగ్రహారాది దానాలను గురించి సుదీర్ఘ వర్ణనలున్న సంస్కృత శాసనాలు ఉన్నాయి. అయితే దేశభాషా గురువుల స్థితిగతులను గురించి కొన్ని విషయాలు సూచనప్రాయంగా దొరక్కపోలేదు. కొన్ని పద్య శాసనాల్లోనూ, చక్కని పాకంలో రాసిన కొన్ని గద్య శాసనాల్లోనూ, కనిపించే “సాహితీ గుణం” ఆనాటి తెలుగు భాషకు విద్యా విధానంలో అధికార స్థాయిలో కొంత ప్రాబల్యం ఉన్నట్లు తెలియపరుస్తుంది. అయితే గ్రామస్థాయిలో తెలుగు చదువులకు విలువ ఉండేదని తెలిసినా ఆ విలువలను మన పూర్వులేవిధంగా సాధించారో స్పష్టంగా తెలియదు.

శాసనాల్లో, కొన్ని కావ్యాల్లో కనిపించే నిదర్శనాలే కాకుండా విదేశీ యాత్రికులు కొందరు రాసిన రాతల ద్వారా కూడా నాటి విద్యా విధానంతో పాటు అప్పుడు తెలుగుకున్న గౌరవం కూడా తెలుస్తుంది. Robert de Nobili (1610) అనే ఇటాలియన్ యాత్రికుడు ఒక రకం “వయోజన విద్యాపద్ధతి” ఆనాడు వాడుకలో ఉండేదని, గ్రామ సీమల్లో జరుగుతున్న విద్యాబోధన తాను “కనీవినీ ఎరగని” దనీ పేర్కొన్నాడు. Pietro Della Valle (1623) అనే మరో ఇటాలియన్ కూడా వర్ణించాడు. హిందువులు మఠాల్లో దేవాలయాల్లో బడులు నడిపేవారు. అవి లేని చోట్ల చెట్ల కిందనే చదువులు నడిచేవి. పై చదువులు అన్వీక్షికీ, త్రయీ, వార్తా, దండనీతులనే నాలుగు విషయాలుగాని, 14 విద్యలుగాని (చతుర్వేదాలు, షడంగాలు, పురాణాలు, తర్క, మీమాంసా, ధర్మశాస్త్రాలు) అవిగాక ఆయుర్వేద, ధనుర్వేద, గాంధర్వవేద, అర్థశాస్త్రాలను గాని చదివారు. అంటే పై చదువులన్నీ సంస్కృతంలో సాగేవి. కాకతీయుల కాలంలో కూడా అదే స్థితి. మహమ్మద్ గవాన్ (బహమనీ రాజు) బీదర్లో ముస్లిం విద్యాశాలను నెలకొల్పే వరకూ అదే స్థితి. ఆంగ్లేయులు రాకతో మెకాలే విద్యా విధానం వచ్చిపడి సంస్కృత విద్య వెనకబడినా కొంతవరకు తెలుగు చదువులు వెలుగు చూశాయి. మధ్యయుగాల్లో సంస్కృత ప్రాబల్యం తెలుగును ఒక విధంగా బలహీన పరిచిందనాలి.

పరిస్థితి ఇట్లా ఉండగా కొందరు తూర్పు చాళుక్యులు తెలుగును రాజాభాషగా కూడా అన్ని సందర్భాల్లోనూ గౌరవించాలని చెప్తున్నారు. నన్నయభట్టు రాసిన నందంపూడి శాసనంలోనే సరిహద్దులు తప్ప తక్కిన విషయాలన్నీ సంస్కృతంలో ఉన్నాయి. క్రీస్తుశకం ఆరో శతాబ్ది తరువాత నెలకొన్న తెలుగువారి సామ్రాజ్యాల్లో (తూర్పు చాళుక్యులు, కాకతీయులు, వెలమరాజులు, రెడ్డిరాజులు పరిపాలించినంతకాలం) రాజభాషగా సంస్కృతం రాజ్యమేలింది. అట్లాగని తెలుగుకు అసలే స్థానం లేదని చెప్పకూడదు. కాలక్రమాన రెడ్డిరాజుల కాలానికి ఇంచుమించు సమస్థితికి వచ్చి, విజయనగర చక్రవర్తుల కాలంలో మధుర, తంజావూరు సామంతుల కాలంలో సంస్కృతం

కన్నా ఎక్కువ గౌరవాన్ని తెలుగు సంతరించుకో గలిగింది. అయితే చక్రవర్తులు సంస్కృతానికి రాజపూజలు జరుపుతున్న రోజుల్లో సామంతులు తెలుగుకు పాద పూజలు చేస్తూ వచ్చారని అనేక నిదర్శనాలున్నాయి.

రాజరాజ నరేంద్రుడు తెలుగు కావ్యాన్ని అంకితం పుచ్చుకోవటంలో అతనికి గల భాషాభిమానం కన్నా పెద్ద కారణం అతని రాజకీయ అవసరాలు. దుర్బలరాజులు, చుట్టూ శత్రువులు, స్థానిక ప్రజల సహాయం కావాలి. అతనికి ముందుగాని, తర్వాతగాని పాలించిన తూర్పు చాళుక్య చక్రవర్తులు ఎవరూ తెలుగు కృతులు అంకితం పుచ్చుకున్నట్లు తెలియదు. కాకతీయ చక్రవర్తులు సంస్కృత పోషకులు. వారి సేనానులూ, సామంతులూ తెలుగు కావ్యాలను అంకితం పుచ్చుకున్నారు. వారు తీసుకోలేదు. అద్దంకి రాజు "నా తమ్ముండు ఘనుండు మల్లరథినీనాథుం"డని మరో కృతిపతిని తెలుగు రచనకు ప్రసాదించాడు. రాచకొండ, దేవరకొండల్లో తెలుగు అధికారభాషా గౌరవం పొందలేదు. కొండవీడు, రాజమహేంద్రవర రెడ్డిరాజ్యాల మంత్రులు, సేనాపతులు తెలుగు కృతులు స్వీకరించినా ప్రభువులు సంస్కృత కావ్యశాస్త్రాలకు వ్యాఖ్యానాలు రాసి సరిపెట్టుకున్నారు. కాకపోతే కొండవీటి రెడ్డిరాజులు ఒక తెలుగు కవికి "విద్యాధికారిత్వం" మిచ్చారు. విజయనగర చక్రవర్తుల కాలానికి దాన శాసనాలైన తామ్రపత్రాల్లో కూడా తెలుగుకు స్థానం దొరికింది. కర్నూలు జిల్లా పెదబెళగల్లు తామ్రశాసనం(1492), బళ్లారి జిల్లా ఆస్వరి తామ్రశాసనం వంటివి ఇందుకు నిదర్శనాలు. మధుర, తంజావూరు రాజులు స్వదేశానికి దూరంగా వున్న "ప్రవాసాంధ్రులు" కాబట్టి స్వభాషాభిమానాన్ని విశేషంగా ప్రదర్శించారు.

"తెలుంగు నిలిపి రంధ్ర విషయంబున జన సత్యాశ్రయుని దొట్టి చాళుక్యనృపుల్" అనే నన్నెచోడుని మాటను సాహితీ విషయంలో మాత్రమే అనుసంధించడం క్షేమం. అన్ని రాజకీయ విషయాల్లోనూ, విద్యా విషయాలల్లోనూ, తెలుగును తూర్పు చాళుక్య రాజులు పోషించారన్నవారు లేకపోలేదు. అయితే ఇటువంటి పోషణ స్థానిక పరిపాలనలోనూ, ప్రాథమిక విద్యాబోధనలోనూ మాత్రమే జరిగిందని కొందరు అంటారు. ఆ రోజుల్లో సంస్కృతమే రాజభాషగా ఉండేది. 14వ శతాబ్దంలో రెడ్డిరాజులు పరిపాలనకు వచ్చేదాకాను, కాకతీయుల కాలంలోనూ చిన్నచిన్న మాండలికులు, సామంతులు, సంస్థానాధీశులు మాత్రం తెలుగును పరిపాలన భాషగా వాడే వారనీ, రెడ్డిరాజుల కాలంలో కూడా తెలుగు రాజాస్థానాల్లో ప్రవేశించగలిగిందే గాని రాజభాష కాలేక పోయిందనీ వాదించటానికి అనేక నిరూపణలు, దృష్టాంతాలు లభిస్తున్నాయి. 1492 నాటి పెదబెళగల్లు తామ్రశాసనంలోనే తెలుగు మొదటిసారిగా స్థానం సంపాదించగలిగిందంటారు. దాన శాసనాలు తెలుగులోనే ఉన్నా అధికార భాషగా సంస్కృతమే మధ్యయుగంలో గౌరవ మర్యాదలు అందుకున్నది. గోల్కొండ కుతుబ్షాహీల కాలం నుంచి రాజశాసనాల్లో తెలుగు భాషకు ఇతోధిక గౌరవమో, స్థానమో లభించటం మొదలైంది. బ్రిటిష్ వారి పరిపాలనా కాలంలో సామాన్య



ISSN No.2319-3905

ప్రజలను ఉద్దేశించి చేసిన ప్రకటనలు, నోటీసులు గ్రామాధికారుల రికార్డులు తెలుగులోనే ఉన్నా రాజభాష స్థానం ఇంగ్లీష్ ఆక్రమించింది. అధికార భాషగా తెలుగు స్థానాన్ని వివరించే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ శ్వేతపత్రంలో తూర్పు చాళుక్యులు కాలం నుంచి – అంటే సుమారు వెయ్యి సంవత్సరాలుగా తెలుగు అధికారభాషా స్థానం పొందిందని ఘోషిస్తూ అందుకు సమర్థనగా ఇచ్చిన పట్టికలో మాండలికుల, సామంతుల వాడుకలో తప్ప చక్రవర్తుల ఆస్థానాల్లో సంస్కృతం, పర్షియన్, అరబిక్, ఇంగ్లీష్ భాషలే భిన్నకాలాల్లో అధికార భాషలుగా ఉన్నట్లు అంగీకరించక తప్పలేదు.

అధికార భాషగా తెలుగు ఉన్నప్పుడు అది ఏ రూపంలో ఉండాలనేది ప్రధానంగా చర్చించవలసిన అంశం. తెలుగు సాహిత్య భాషగా అత్యుత్తమ స్థానం సంపాదించింది. పద్య ప్రక్రియలోను, ఒకటి రెండు విమర్శన పరిశోధన వ్యాసాదుల్లోను తప్ప పూర్వకాలపు కావ్య భాషా రూపాన్ని ఇప్పుడు ఎవరూ వాడటం లేదు. ఎటువంటి సాహితీ విషయాన్నైనా నేటి తెలుగులో వ్యక్తీకరించగలుగుతున్నాం. కాని పరిపాలన వ్యవహారాల్లోనూ, శాస్త్ర రచనల్లోనూ తెలుగు వాడేటప్పుడు దాని స్వరూపం ఆధునికంగానా, ప్రాచీన పద్ధతిలోనా ఉండవలసిందనే చర్చ సాహితీ విషయంలో లాగా రాలేదు. అంటే ప్రజా వ్యవహారానికి సన్నిహితంగా పత్రికల్లో, రేడియోల్లో, సినిమాల్లో వాడే భాషారూపమే అధికార భాషకు ఉండాలని అందరూ అంటున్నారు. ఉన్న చిక్కల్లా పారిపాషిక పదాల విషయంలోనూ, ఇంగ్లీష్ లోని నియమ నిబంధనలను, చట్టాలను, ఉత్తర్వులను అనువదించే విషయములోనూ వచ్చిన తీవ్రమైన అభిప్రాయ భేదాల్లోనే ఉంది.

మధ్యయుగాల నుంచి తెలుగు అధికార భాషగా ఉంటూ వచ్చిందని విశ్వసించిన వారు ఆనాటి పరిభాషను ప్రభుత్వం ఎందుకు వాడటం లేదని ప్రశ్నించారు. నిజానికి అప్పటి భూస్వామ్య వ్యవస్థలోని పరిపాలన విభాగాలు గాని పద్ధతులు గాని ఈనాటి సువిస్తృత పరిపాలన రంగంలో సహస్రాంశం కూడా కావు. తర్వాత ఈ రెండు వ్యవస్థలకు ఎంతో భేదం ఉంది. అప్పటి వ్యవస్థ అధిక భాగం ఇంగ్లీష్ సంప్రదాయ అనువాది. ఆధునిక శాస్త్ర సాంకేతిక రంగాల్లో అనుక్షణం వస్తున్న వినూత్న పరిణామాల వల్ల రష్యన్, జపనీస్ భాషల నుంచి కూడా మాటలు ఎరువు తెచ్చుకోవాల్సి వస్తున్నది. సరికొత్త భావాలతో పాటు సరికొత్త మాటల వాడుక కూడా పెరుగుతుంది. ఇంగ్లీష్ భాషా విషయంలో లాగా క్రమపరిణామములో కొత్త భావాలు, కొత్త మాటలు ఏర్పడాలంటే దశాబ్దాల, శతాబ్దాల కాలం గడిచిపోతుంది. మనకున్న మధ్యయుగాల భూస్వామ్య వ్యవస్థ నుంచి సామాజిక, రాజకీయ, విజ్ఞాన రంగాల్లో ఆకస్మిక పరిణామం ద్వారా అత్యధిక స్థితికి రావలసి వచ్చినందువల్ల ఈ పరిణామ దశను ప్రతిఫలించే పరిభాషలో, ఈ దశకు పర్యవసానమైన అనువాద సమస్యల్లో కాలహరణానికి తావులేదు. ఫలితాలకు త్వరపడక తప్పని పరిస్థితి వచ్చింది. ఇంగ్లీష్ భాష లాటిన్ గ్రీకు భాషల మీద ఆధారపడి శతాబ్దాల కాలంలో నిర్మించుకున్న పరిభాషా, వాక్యరచనా పద్ధతులను తెలుగు భాష, సంస్కృతభాషా మర్యాదలను అనుసరించి సాధించవచ్చునని

అటు కేంద్ర ప్రభుత్వం వారు, ఇటు కొందరు సంప్రదాయ పండితులు అభిప్రాయపడుతున్నారు. కానీ ఒకే సంస్కృత పదానికి దేశంలో భిన్న ప్రాంతాల్లో భిన్న భాషల్లో భిన్న అర్థాలు ఉన్నాయి.

ప్రాచీన భారతదేశంలో ప్రతిష్టావంతంగా అభివృద్ధి సాధించిన తర్క న్యాయ వ్యాకరణాది శాస్త్రాల్లోని సంస్కృత పరిభాషను యధాతథంగా వాడి తెలుగును సుసంపన్నం చేయవచ్చనీ, ఇంగ్లీష్, లాటిన్, గ్రీకుల మీద ఆధారపడినంత మేరకు తెలుగు, సంస్కృతం మీద ఆధారపడితే యావత్ భారతదేశానికే ఒకే ఒక పరిభాష ఏర్పడటంతో పాటు తెలుగుభాష అభివృద్ధి కూడా సాధ్యమనే వర్గమొకటి వుంది. ఇంతకుముందే చెప్పినట్లు దేశంలో సంస్కృతం ఒకే రూపంలో లేదని వీరు గుర్తించరు. ఉత్పత్తి శాస్త్రపద్ధతుల్లో మూలధాతువుల నుంచి శబ్దాలు సృష్టిద్దామంటారు వీరు. "ప్రకృతి ప్రత్యయ విభాగౌ కేవలం కాల్పనికౌ" అనే మంజూష వాక్యం ఈ విభజన, సృష్టి ప్రణాళికలు ఎంత కృత్రిమాలో నిర్దేశిస్తుంది.

మధ్యయుగ రాజ్యాలలో సామంతులు, చిన్నరాజులు స్వభాషాభిమానం అనే విధానానికి విరుద్ధం. వారి రాజ్యాలు చిన్నవి అధికారమూ చిన్నది అవసరాలూ తక్కువ పరిపాలన యంత్రాంగం కూడా సహజంగా చిన్నదే. అందువల్ల తమ చిన్న ముచ్చట్లను, కష్టసుఖాలనూ ప్రజలకు మాతృభాషలో చెప్పుకున్నారు. తమ పరిమితాధికారాన్ని పురస్కరించుకొని తాము చేసిన ధర్మ నిర్ణయాలను కూడా తెలుగులోనే చెప్పుకున్నారు. క్రీ. శ. 9 నుండి 11 శతాబ్దముల మధ్యగల కేవలం తెలుగు శాసనాల్లో 74 రాయలసీమలోనూ, 4 మాత్రమే తెలంగాణలోనూ, తక్కిన 155 సాగర సీమలోనూ దొరికాయి. అప్పటప్పటి తెలుగు శాసనాల్లోని విషయ వైవిధ్యాన్ని గుర్తిస్తే పరిపాలన వ్యవహారాల్లో తెలుగు భాషకు అప్పటి వారు ఇచ్చిన స్థానాన్ని గమనించగలం. (ఆయా సామంతులు దాన శాసనాలు తెలుగులోనే వేయించినా, ఆ శాసనాలను సభా మధ్యంలో అధికార, అనధికారుల సమక్షంలో ప్రకటించి తాటాకుల మీద (బహుశా సంస్కృతంలో) రాయించి కవిలెకట్టలు (రికార్డ్స్) కట్టించి దాచేవారని కొందరి విశ్వాసం4. మచ్చుకు కొన్ని వివరాలు:

1. క్రీ. శ. 972 నాటి తన పట్టాభిషేకాన్ని వైదుంబరాజు గండత్రినేత్రుడు తెలుగులోనే ప్రకటించుకున్నాడు.
2. క్రీ.శ. 825 ప్రాంతాల్లో నొరంబిరాజు 'చంతమనదడి' ని 'ముదుమడుపు' కయ్యంలో వధించిన వైదుంబరాజు తన విజయాన్ని పేర్కొన్నాడు. పండరంగని అద్దంకి శాసనం ఇటువంటిదే.
3. క్రీ. శ. 825 ప్రాంతాల్లో జరిగిన 'సోరమడి', 'మడువ' యుద్ధాలను పేర్కొని అందులో వీరస్వర్గం అలంకరించిన వారిని స్మరించిన శాసనాలు 20 దాకా దొరుకుతున్నాయి.
4. పన్నులు రాయితీ యిస్తూ క్రీ.శ. 972లో భువనత్రినేత్ర ఇరుగెయ మహారాజు వేయించిన తెలుగు శాసనం. సుప్రసిద్ధమైన కాకతీయ గణపతి దేవుని మోటుపల్లి శాసనం వంటిదే.
5. సంఘ ధర్మాలనూ, వాటిని వ్యతిరేకించిన వారికి వేసేశిక్షలనూ నిరూపించే శాసనాలు



ISSN No.2319-3905

కొన్ని ఉన్నాయి. అందులో కొన్ని రాజులు వేయించినవైతే, కొన్ని కులకట్టుబాట్లను నిర్దేశిస్తూ ఆయా కులాల, వృత్తుల వారు ప్రకటించినవి.
6. క్రీ.శ. 892 – 922 మధ్యకాలం నాటి చాళుక్య సామంతుడు కుసుమాయుదుడు వరంగల్ జిల్లా మహబూబాబాద్ తాలూకా కొరవిలో వేయించిన శాసనం. క్రీ. శ. 972 నాటి చిత్తూరు జిల్లా వాయల్పాడు తాలూకా కలకడలోని ఇరుగెయరాజు శాసనం.
7. అఖిల దేశాల తెలిక వేగురు చేసుకున్న వివాహమర్యాదను వివరించే 1553 నాటి బెజవాడ శాసనం. గుంటూరు జిల్లా నరసరావుపేట తాలూకా నాదెండ్లలో వారే వేయించిన శిలాశాసనం.

గోల్కొండలో కుతుబ్షాహీల పరిపాలన వచ్చిన తరువాత పరిపాలన భాషగా తెలుగు మరికొంత గౌరవ మర్యాదలు పొందింది. ఆ కాలంలోనే అనేక ఉర్దూ పదాలు నిత్య పరిపాలన పరిభాషగా తెలుగులోకి చేరి ఇప్పటికీ చాలా వరకు నిలిచాయి. ఇందుకు నిదర్శనగా మహమ్మద్ కులీ కుతుబ్ షా పరిపాలన కాలంలోని ఒక శాసన భాగాన్ని (గుంటూరు జిల్లా మంగళగిరిలో క్రీ.శ. 1593లో వేయించిన దాన్ని) చూడవచ్చును.

"రాజశ్రీ గోలకొండను నవరత్న సింహాసన రూఢులై మహమందు ఖుళ్ళీ పాదశహా వొడయలుంగారు ఖోజ్జో అల్లి జరగరుం బిలిపించి నీకవులు ప్రజలు భూమి గ్రామాలు మామూళు అవుచుంన్నవి. బేజిల్లయిన పని వుపాయ చూచి కవుళు యిచ్చి ......దివాణయం ముట్టివచ్చి నానారొఖ్ఖాలకు, నానా బాబులకున్ను నఫరు నఫరుకి ప్రత్యేకాలు మక్తాను.. మొదలి వహీం"

వీరి పరిపాలన కాలంలోనే గుత్తేదారీ, రైత్వారి, జమీందారీ విధానాలు వ్యాపించి రాయలసీమలో కూడా పాతుకుపోయినాయి. కుందూరి ఈశ్వర దత్తు గారి "శాసన శబ్దకోశం" లోను, హెచ్. హెచ్. విల్సన్ ప్రచురించిన "%ూ +శ్రీశీంయిఖీఎ శీట జీబఎఱఎఙఖశ్రీ ఖఅఎ =వఙవఅబవ ఎవతీఎం%" వంటి ఇతర గ్రంథాల్లోనూ లభించే పరిపాలన పరిభాష (administrative terminology) మధ్యయుగాలనాటి భూస్వామ్య వ్యవస్థలో పూర్తిగాను, తర్వాత బ్రిటిష్ వారి ద్వారాను సంక్రమించింది. అప్పటి సువిస్తృత పరిపాలన యంత్రాంగాన్ని నడపడంలో భారత ప్రభుత్వంవారు తయారు చేయించిన పారిభాషిక పదకోశాలతోబాటు, ఆంగ్లం నుంచి తీసుకున్న పదజాలాన్ని కూడా వాడితే తప్ప పని జరగదు. సాంకేతికంగా అభివృద్ధి చెందుతున్న యంత్రాంగంలోని అన్ని భాగ విభాగాలకూ, భావ భేదాలకూ పేరు పెట్టడానికీ, వివరించడానికీ, అన్య దేశాలు వాడుక తప్పనిసరి. కొన్ని విశిష్ట సంస్థల పరిపాలనలో (specialist institutions) రకరకాల శాస్త్రీయ కార్యకలాపాలకూ వాటిని నెరవేర్చే ఉద్యోగులకు పేర్లు పెట్టవలసి ఉంటుంది. బ్రిటీష్ వారి ద్వారా కొంత, భారతీయ ధర్మాలద్వారా కొంత, ప్రస్తుత అవసరాల ద్వారా కొంతగా సంక్రమించిన న్యాయవ్యవస్థలోని భావాలకు, అధికారులకు పేర్లు పెట్టుకోవలసివుంది. ఇప్పటికే ప్రజాస్వామ్యం నిత్యవ్యవహారంలో చేరి బహుళ వ్యాప్తి సంపాదించిన ఆయా

పారిభాషికాలను సేకరించక తప్పదు. మిగిలిన అవసరాల కోసం కొత్త పదాలను సృష్టించుకోవడమో, అన్య దేశాలను స్వీకరించటమో కర్తవ్యం. భాషా పవిత్రత చెడిపోతుందనే సంప్రదాయ దాస్యబుద్ధి పోగొట్టుకొని ఆధునిక అవసరాలకు సరిపడేటట్లు తెలుగును ఆధునీకరించుకోవాలి. ఈ ప్రయత్నంలో ఆధునిక శాస్త్ర గ్రంథాలను పెద్ద ఎత్తున తెలుగు చేయించడం కూడా అత్యవసరం. అందుకు పట్టుదల, భాషాభిమానం, చిత్తశుద్ధి భారీగానే కావాలి.

**పాద సూచికలు:**

1. ఆంధ్రుల సాంఘిక చరిత్ర, సురవరం ప్రతాపరెడ్డిగారు, పుట – 67.
2. ఆంధ్రుల సాంఘిక చరిత్ర, సురవరం ప్రతాపరెడ్డిగారు, పుట – 355.
3. ప్రాచీనాంధ్ర శాసనాలు (1971), బూదరాజు రాధాకృష్ణ, పుట – vi, vii.
4. శాసనశబ్ద కోశం,(1967), కుందూరి ఈశ్వరదత్తుగారు, పుట – 30.

**ఆధార గ్రంథములు:**

1. భాషా శాస్త్ర వ్యాసాలు, బూదరాజు రాధాకృష్ణ, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, హైదరాబాద్.
2. తెలుగు భాషా చరిత్ర, ప్రొఫెసర్ వెలమల సిమ్మన్న, దళిత సాహిత్య పీఠం, విశాఖపట్నం.
3. తెలుగు భాషా చరిత్ర, ఆచార్య బద్రిరాజు కృష్ణమూర్తి, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, హైదరాబాద్.
4. సాహితీ నీరాజనం, కోరాడ రామకృష్ణయ్య, కళాజ్యోతి ప్రెస్, హైదరాబాద్.





# 11

# అమెరికా ప్రవాస జీవితాన్ని కళ్లముందుంచే వంగూరి చిట్టెన్ రాజు నాటికలు

*– డా. యం. హరికృష్ణ*

'వంగూరి చిట్టెన్‌రాజు'.. అమెరికాలో 'తెలుగు దీపం' కొడిగట్టిపోకుండా చేతులడ్డం పెడుతున్న ఒక భాషా ప్రేమికుడు. తన రచనల ద్వారా ప్రవాసాంధ్రులలో నెలకొని వున్న కుల, మత, ప్రాంత, తరాల అంతరాలను తొలగించి, వారిని ఏకం చేయడానికి నడుంబిగించిన సాహసి. ఈయన ప్రవాసాంధ్రుల జీవితాలను తన రచనల ద్వారా సంపూర్ణంగా ఆవిష్కరించారు. దీనికోసం ఈయన ఎంచుకున్న రసం హాస్యం.

చిట్టెన్ రాజు రచనలు వ్యంగ్య, హాస్యాలతో కూడినవైనా అందులో అంతర్లీనంగా సందేశం వుంటుంది. ఒక వ్యధ, సామాజిక బాధ్యత కనిపిస్తుంది. ఈయన రచనల్లో అమెరికాలోని ప్రవాసాంధ్రుల జీవన విధానం, తొలితరం ప్రవాసాంధ్రులు, అక్కడే పుట్టి పెరిగిన వారి పిల్లల మధ్య నెలకొని వున్న సంఘర్షణ, కొత్తగా అమెరికాకు వచ్చినవారి పాట్లు, ప్రవాసాంధ్రుల సంసార జీవితంలో నెలకొని వున్న లోటుపాట్లు వంటివన్నీ మనకు కనిపిస్తుంటాయి. సరదాగా సాగిపోయే ఈ నాటకాల వెనుక ఎంతటి తీవ్రత వుందో ఆలోచించినప్పుడే అర్థం అవుతుంది. ఆయన రాసిన 'అసలు సమాధానం' అనే నాటికలో అమెరికాలో ప్రవాసాంధ్రులు పెట్టుకున్న తెలుగు సంఘాల 'డొనేషన్ల' సమస్యను గురించి నిర్మొహమాటంగా ప్రస్తావించారు. 2003 ప్రాంతంలో ఈయన ఈ నాటకాన్ని రాశారు. కారణాలేవైనా కానీ ఈ నాటకం ప్రదర్శనకు నోచుకోలేదు. తాజాగా అమెరికాలో అనేక మంది తెలుగువారు డొనేషన్ల స్కాంలో ఇరుక్కుని ఉద్యోగాలు కోల్పోయిన తర్వాతే ఈ డొనేషన్ల సమస్య అక్కడ ఎంత తీవ్రంగా వుందో అందరికీ అర్థం అయింది. ఈ విషయాన్ని గురించి చిట్టెన్ రాజు ఆనాడే హెచ్చరించడం విశేషం.

వంగూరి చిట్టెన్ రాజు 1945లో కాకినాడలో జన్మించారు. కాకినాడలో ఇంజనీరింగ్ విద్య అభ్యసించిన అనంతరం ముంబాయి ఐఐటిలో ఎం.టెక్, పిహెచ్.డి చేసి ఉద్యోగరీత్యా

అమెరికాలో స్థిరపడ్డారు. ఈయన సుమారు 50 కథలు, 50 వ్యాసాలు రాశారు. అనేక హాస్యనాటికలు రాయడంతో పాటు వాటిని అనేక ప్రాంతాల్లో ప్రదర్శించారు. ఈయన నాటకకర్తే కాక నటుడు, దర్శకుడు కూడా.

చిట్టెన్‌రాజు 1976లోనే అమెరికా తొలి తెలుగు పత్రికల్లో ఒకటైన 'మధురవాణి' పత్రికను ప్రారంభించి దాదాపు 25 సంవత్సరాలు విజయవంతంగా నడిపారు. 1994లో వంగూరి ఫౌండేషన్ పేరిట ఒక తెలుగు సాహిత్య సేవా ధార్మిక సంస్థను ప్రారంభించి తెలుగు సాహిత్య పరిరక్షణకు ఎంతో సేవచేశారు. ఈ ఫౌండేషన్ ద్వారా ఇప్పటివరకూ వందకుపైగా తెలుగు పుస్తకాలను ప్రచురించారు. అమెరికాలో ప్రదర్శించిన మొట్టమొదటి తెలుగు నాటికగా భావిస్తున్న 'బామ్మాయణం అను సీతాకళ్యాణం'ను 1977లో ఉగాది సందర్భంగా వంగూరి చిట్టెన్ రాజుగారే రాసి ప్రదర్శించారు.

"నవలలుగానీ, కథానికా సంపుటాన్ని గానీ మనం చదువుకొని సొరుగులో పెట్టేస్తాం. నాటకము, నాటిక అలాకాదు. వాటికి రంగస్థలం మీదనే ప్రాణం రావాలి. ప్రదర్శనం పండిందా లేదా? అదీ మొదటి టెస్టు. ఈ పరీక్షలో చిట్టెన్ రాజుగారు ఫస్టుగా పాసయ్యారు."1

"చిట్టెన్‌రాజుగారు అమెరికా జీవితాన్ని కాచి వడబోశారు. అక్కడి వికారాలూ, వ్యక్తులూ, మనస్తత్వాలూ, వెర్రులూ, హిపోక్రసీలూ, భేషజాలూ, షోకులూ, యాసలూ, కృత్రిమ విలువలూ, నిస్సహాయమైన ఒదుగుబాట్లూ, తప్పనిసరైన రాజీలూ– అన్నిటినీ క్షుణ్ణంగా పరిశీలించి వాటికి చక్కని హాస్యాన్ని రంగరించి– సమస్యకి వాడినీ, వేడినీ సంతరించారు."2

చిట్టెన్‌రాజు వెలువరించిన 'అమెరికామెడీ నాటికలు' అనే సంకలనంలో వున్న కొన్ని నాటికలను ఇక్కడ పరిశీలిద్దాం.

**'బామ్మాయణం అను సీతాకళ్యాణం'** అనే నాటికను ఆయన 1968లో బొంబాయి ఐఐటీలో చదివే సమయంలో రాసి ప్రదర్శించారు. తరువాత 1977లో అమెరికాలో కూడా దీనిని ప్రదర్శించారు. అమెరికాలో ప్రదర్శించిన తొట్టతొలి తెలుగు నాటికగా దీనిని భావించవచ్చునని రచయితే తన ముందుమాటలో చెప్పుకొచ్చారు. ఈ నాటిక బొంబాయిలో చదువుతున్న సమయంలో రాయడం వల్ల ఈ నాటకంలో మాత్రం ఆయన పుట్టిపెరిగిన కాకినాడ వాతావరణమే కనిపిస్తుంది.

నాటకంలో ప్రధాన పాత్రలు కృష్ణ, సీత, బామ్మ, శేఖరం, పరంధామయ్య. కథలోకి వస్తే కృష్ణ, సీత ప్రేమించుకున్నారు. వారి ప్రేమ పెళ్లిపీటలెక్కాలంటే మాత్రం సీత బామ్మ అంగీకరించాలి. బామ్మ అంత తేలిగ్గా ఒప్పుకునే రకం కాదు. ఆవులించకుండానే పేగులు లెక్కబెట్టే మనిషి బామ్మ. మరి ఆమెను తమ పెళ్లికి ఎలా ఒప్పించాలి? దీనికోసం సీత, కృష్ణ ఒక ఉపాయం ఆలోచించారు. కృష్ణ, తన స్నేహితుడు శేఖరంతో కలిసి సీత ఇంట్లో అద్దెకు దిగి బామ్మను మెప్పించి సీతను పెళ్లిచేసుకోవాలి. అయితే అంత తేలిగ్గా బామ్మ ఇంటిని వారికి అద్దెకు ఇవ్వదు. పల్లెలో వుండే తమ్ముడు పరంధామయ్య అంటే బామ్మకు అమితమైన ఇష్టం. ఆయన చెప్పాడు అంటే ఇల్లు



ISSN No.2319-3905

వారికి ఇచ్చి తీరుతుంది. అందుకే సీత సలహామేరకు కృష్ణ తన స్నేహితుడు శేఖరంతో కలిసి పరంధామయ్య రాసినట్లుగా ఒక నకిలీ సిఫారసు లేఖను రాసి దానిని బామ్మకు చూపించారు. బామ్మకు లేఖ చదువుతున్నప్పుడు ఆమెకు సవాలక్ష సందేహాలు వచ్చాయి. ఆ సందేహాలన్నింటినీ ఎలాగోలా తీర్చి బామ్మను ఒప్పించి వారింట్లో అద్దెకు దిగారు.

తరువాతి ఘట్టం బామ్మ దృష్టిలో పడి ఆమెను మెప్పించడం. అందుకే రోజూ శేఖరంతో కలిసి కృష్ణ బామ్మగారికి సేవలు చేయడం మొదలెట్టాడు. బామ్మకు కృష్ణకాకుండా అతని స్నేహితుడు శేఖరం నచ్చాడు. సీతను శేఖరానికిస్తే బాగుండు అనుకుందామె. బామ్మ చెప్పిన ఈ మాటతో కృష్ణకు గొంతులో పచ్చి వెలక్కాయ పడ్డట్టయింది. పులిమీద పుట్రలా దీనితోపాటు మరొక సమస్య కూడా వచ్చిపడింది. అనూహ్యంగా పరంధామయ్య అక్కను చూడడానికిగానూ సీత ఇంటికి వచ్చేశాడు. బామ్మకు తాము చెప్పిన అబద్ధం ఎక్కడ బయటపడిపోతుందోనని స్నేహితులిద్దరూ భయపడిపోయారు. కృష్ణకైతే దిక్కుతోచలేదు. తాము చెప్పిన అబద్ధం గురించి ఆయనకు చెప్పి తమను కాపాడమని పరంధామయ్య కాళ్లు పట్టుకున్నాడు. అయితే పరంధామయ్య నవ్వి, తనకీ విషయాలన్నీ ముందే తెలుసునని చెప్పాడు. సీత ముందే ఈ విషయాలన్నీ చెబుతూ తనకు లేఖ రాసిందని, స్నేహితుల తెలివితేటలు ఎలా వున్నాయో చూద్దామని నేరుగా వచ్చానని చెప్పాడు. పరంధామయ్య ఆ తర్వాత అక్కతో మాట్లాడుతూ శేఖరంకు ముందే పెళ్లయిందని, పిల్లలు కూడా వున్నారని, అతను వ్యసనపరుడని, మద్యం తాగుతాడని.. ఇంకా ఏవేవో అబద్ధాలు ఆడి కృష్ణతో పెళ్లికి ఒప్పించాడు. దాంతో కథ సుఖాంతమైంది.

ఇది నేటితరం పాఠకులకు సాధారణ కథగా అనిపించొచ్చు. అయితే 1968లో రచయిత నాటకం రాసేనాటికి పరిస్థితులు నేడు వున్నట్లుగా లేవు. పిల్లల ప్రేమలను ఆనాటి తరం అంత తేలిగ్గా అంగీకరించేది కాదు. ఒకే కులానికి చెందిన ప్రేమికుల పరిస్థితే ఇలా వుంటే, వేరువేరు కులాలు, మతాల మధ్య ప్రేమకు అసలు అవకాశమే ఉండేది కాదు. కులాలు, మతాలు దాటి ప్రేమల్లో పడినవారు తమ పెద్దలను ఒప్పించలేక, వారిని ఎదిరించలేక తమ ప్రేమలను త్యాగం చేసిన ఘటనలు కోకొల్లలు. ఆ కష్టాలను, పెద్దల పట్ల పిల్లలకున్న గౌరవాభిమానాలను, వారిని నొప్పించకుండా ఒప్పించడానికి పడే కష్టాలను చూపుతుంది ఈ కథ. ప్రేమ పట్ల పిల్లలకున్న నిబద్ధతను కూడా చూపిస్తుంది. నేటితరం నిర్లక్ష్యంతో ఏ మాత్రం పోల్చలేని ఆనాటితరం బాధ్యతను చూపుతుంది. ఈ నాటకం నేటి పిల్లలకు కనువిప్పును కలిగిస్తుంది.

**'ఏడవలేక నవ్విన సన్యాసి'** అనే నాటకంలో దేశాలు దాటివెళ్లినా వదలని కులమతాల జాఢ్యాన్ని తీవ్రంగా విమర్శించారు చిట్టెన్‌రాజు. బతుకు తెరువుకోసం నా అన్న వారందరినీ వదిలి ఎక్కడో దూరదేశాలలో వున్నా వదలని కులజాడ్యాన్ని చూసి తట్టుకోలేక ఆవేదనతో ఈ నాటకం రాశానని ఆయన ముందుమాటలో చెప్పుకొచ్చారు. ఈ నాటకాన్ని 1990లో అమెరికాలో ప్రదర్శించారు.

నాటకంలో ప్రధాన పాత్రలు సన్యాసి, ముత్యాల సీత, రాజు, సత్యప్రభారెడ్డి. కథలోకి వస్తే జాయింట్ అసోసియేషన్ ఆఫ్ తెలుగు కల్చరల్ అసోసియేషన్స్ (జట్కా)కు ఎన్నికల ప్రహసనం మొదలైంది. కులమత బేధాలను సమూలంగా తుడిచిపెట్టాలని కోరుకునే సైకియాట్రిస్ట్ సన్యాసి దగ్గరకు ఎన్నికల్లో పోటీచేస్తున్న వారంతా కులాలవారీగా ప్రచారంకోసం రావడం మొదలుపెట్టారు. ముందుగా కమ్మకులానికి చెందిన సీత సన్యాసి దగ్గరకు వచ్చింది. తాను జట్కా సంఘానికి అధ్యక్షురాలిగా నిలబడుతున్నానని, సన్యాసి తనకే ఓటు వేయాలని కోరింది. తెలుగు సంఘాన్ని కులమతాల వారీగా విడదీయొద్దన్నాడు సన్యాసి ఆవేదనగా. దానికి ఆమె,

"ఇదిగో, నాకు అసలు ఆ మాటకొస్తే, మా కమ్మోరికి ఎవ్వరికీ అంత న్యారో అవుట్‌లుక్ లేదు. ఇంకా మిగతావాళ్లంటారా, ఆ రెడ్డిలకీ, బాపనాళ్లకీ ఎప్పుడూ మావాళ్లమీద, మా వైభవం మీద పడి ఏడవడమే" 3 అన్నది. ఈ సన్నివేశంలో తమ కులాలను భుజానికెత్తుకొని, ఎదుటి కులాలను విమర్శించే వైఖరిని సీత పాత్ర ద్వారా చూపుతారు రచయిత.

వీరిద్దరూ మాట్లాడుకుంటూ వుండగా రాజు, సత్యప్రభారెడ్డి కూడా అక్కడికి వస్తారు. తాము కూడా 'జట్కా' కు పోటీచేస్తున్నామని తమకే మద్దతునివ్వాలని సన్యాసిని కోరడంతో పాటు, తమకు అసలు కులమతాల పట్టింపులే లేవని బుకాయిస్తారు. అక్కడ వున్నవారంతా ఏఏ కులాలకు చెందినవారో కూడా తమకు తెలియదనేస్తారు. వారి బుకాయింపులకు సన్యాసికి ఆగ్రహం వచ్చింది. ఆయన వారికి 'మాయాబజార్' సినిమాలో చూపించే 'సత్యపీఠం' లాంటి 'సత్యకుర్చీ'ని చూపిస్తాడు. సినిమాలోలాగానే దానిమీద కూర్చుంటే నిజం తప్ప అబద్ధాలు నోటివెంట రావని చెబుతాడు. జట్కా ఎన్నికల్లో మద్దతుకోసం వచ్చిన ముగ్గురూ ఆ కుర్చీమీద కూర్చుని మాట్లాడాలని చెబుతాడు.

ముందుగా కుర్చీమీద కూర్చున్న సత్యప్రభారెడ్డి "మేం రెడ్డి ప్రభువులం. మాకు మిగిలిన కులాలవారికీ నక్కకూ, నాగలోకానికి వున్నంత తేడా వుంది. లీడర్‌షిప్, పరిపాలన లాంటివి మాకు ఉగ్గుపాలతో పెట్టిన విద్యలు. ఏదో మీమీద దయతలచి అప్పుడప్పుడు మీతో చేతులు కలుపుతాం కానీ మీ లెవలెంత, మా లెవలెంత? ఈసారి మిమ్మల్ని ఓడించకపోతే నా పేరు సత్యప్రభారెడ్డి కానేకాదు 4" అంటుంది.

'సత్యకుర్చీ' అనేది వాస్తవం కాదు. అదొక కల్పితం మాత్రమే. అది నాటకం చదివే, చూసే ప్రతివారికీ తెలుసు. కానీ ఇందులో చూడాల్సింది సత్యకుర్చీని కాదు. మనిషి అంతరాంతరాల్లో జీర్ణించుకుపోయిన కులమత తత్వాలను, అణుబాంబుకన్నా శక్తివంతంగా సమాజాన్ని నిలువుగా చీలుస్తున్న ఒక ఉన్మాదాన్ని ఈ సత్యకుర్చీ అన్న భావన ద్వారా వెలికి తీసి చూపుతున్నారు రచయిత. సహ కుల, మతాల వారితో స్నేహంగా వున్నట్లు కనిపించినా, ఆ స్నేహం మధ్య నెలకొనివున్న పూడ్చలేని అగాథాన్ని చూపుతున్నారు రచయిత. దేశవిదేశాలలో ఎక్కడ వున్నా ఇదే పరిస్థితి. ఈ స్థితి కేవలం తెలుగువారికో, భారతీయులకో పరిమితం కాలేదు. కులమతాల ప్రస్తావన



ISSN No.2319-3905

లేదని గొప్పగా చెప్పుకునే అమెరికాలాంటి దేశాలలో కూడా నలుపు, తెలుపు వర్ణాల మధ్య పూడ్చలేని అంతరం వుండడం కనిపిస్తూనే వుంది. ఇది కూడా కులమతాల తరహా అంతరమే కదా.

మిగిలిన ఇద్దరూ కూడా సత్యకుర్చీ ఎక్కగానే అదే తరహాలో మాట్లాడతారు. సన్యాసి వారందరినీ కూర్చోబెట్టి హితబోధ చేస్తాడు. మనం అమెరికాలో తెలుగు సంఘాలు ఎందుకు పెట్టుకున్నామో చెప్పమంటాడు. తానాలాంటి సంఘాలను పిల్లలకు మన పారంపర్య తెలుగు వారసత్వాన్ని అందించడానికి పెట్టుకున్నామని అయితే ఆ లక్ష్యం నెరవేరడం లేదంటారు సన్యాసి. పదవీ వ్యామోహంతో, స్వలాభం కోసం, ఈగోలతో కులమతాలను అడ్డుపెట్టుకొని మనమే ఆ సంఘాలను చీల్చి చిన్నాభిన్నం చేస్తున్నామని ఇది సరైనదేనా అని ఆయన ప్రశ్నిస్తాడు. చివరికి తమ తప్పులను అందరూ అంగీకరించి, ఇకముందు ఇలాంటి పరిస్థితి వుండదని, తమకు కనువిప్పు కలిగిందని చెప్పడంతో నాటిక ముగుస్తుంది.

అమెరికాలో వున్న తెలుగువారి మధ్య నెలకొని వున్న కులమత విభేదాలు తెలుగుజాతిని ఎలా నిర్వీర్యం చేస్తున్నాయో.. తానా, ఆటా వంటి సంఘాలను ఎంత బలహీనపరుస్తున్నాయో చిట్టెన్ రాజు ఈ నాటికలో కళ్లకు కట్టినట్లు చెబుతారు. భూతలస్వర్గంలా భావించే అమెరికాలో నివసిస్తూ కూడా కులవ్యవస్థకు బానిసలుగానే వున్న తెలుగువారిని ఆయన ఈ నాటికద్వారా తీవ్రంగా మందలించారు.

**'అసలు ప్రశ్న'** అనే నాటకం అమెరికాలో నివసిస్తున్న తెలుగువారి సంకుచిత మనస్తత్వానికి అద్దం పడుతుంది. సంకుచితం అనడం కంటే తొలితరం, మలితరం ప్రవాసాంధ్రులు ఉద్యోగరీత్యా అమెరికాలో స్థిరపడినా దానిని 'మన' అనుకోలేని ఒక సందిగ్ధ మానసిక స్థితిని మనకు చూపుతుంది.

నాటికలో గిరిజ, ఆమె భర్త రాజా, వారి పిల్లలు నాగు, అపూర్వ, అమూల్య, గిరిజ తండ్రి రఘు, ఆంధ్రప్రదేశ్‌నుంచి సినిమా తీయడానికి వెళ్లిన దర్శకుడు ఆనందమోహన్ ప్రధాన పాత్రలు.

గిరిజ అమెరికాలో డాక్టర్. ఆమె భర్త రాజా బ్యాంకుల సెక్యూరిటీ విభాగంలో పనిచేస్తుంటాడు. వారి పిల్లలు నాగు, అపూర్వ, అమూల్య. పిల్లలు ముగ్గురినీ భారతీయత ఉట్టిపడేలాగా పెంచాలన్నది భార్యాభర్తల తాపత్రయం. అందుకే చిన్నపిల్లలిద్దరికీ ఇష్టంలేకపోయినా బలవంతంగా వారికి కూచిపూడి నృత్యం నేర్పుతుంటారు. పాశ్చాత్య నృత్యగానాలకు, జీవన విధానాలకు వాళ్లను దూరంగా పెంచాలని ప్రయత్నిస్తుంటారు.

ఇదే సమయంలో వారి ఇంటికి వచ్చిన సినిమా దర్శకుడు ఆనందమోహన్ దీనినిచూసి తెలుగు రాష్ట్రంలోనే పరిస్థితులన్నీ మారిపోయాయని, పిల్లలకు బలవంతంగా ఏదీ నేర్పకూడదని, వారికి నచ్చినవి చేయాలన్నాడు. సమాజానికి అనుగుణంగా మనమూ మారక తప్పదని హితబోధ చేశాడు. గిరిజ తండ్రి రఘు కూతుర్ని చూడడానికి తెలుగు రాష్ట్రం నుంచి అమెరికాకు వచ్చాడు. కానీ ఆ వాతావరణానికి ఇమడలేక అవస్థలు పడుతున్నాడు.

అంతలో వారి పెద్దకూతురు యుక్తవయస్కురాలు అయిన నాగు ఇంటికి వచ్చింది. ఆమెను మగరాయుడులా ప్రవర్తిస్తున్నావని మందలిస్తారు తల్లిదండ్రులు. అమెరికాలో కూడా అంజలీదేవిలా వుండాలంటే ఎలా అని ప్రశ్నిస్తాడు దర్శకుడు.

'అసలు ప్రాబ్లం ఇదండి.. పెళ్లీడుకు వచ్చిన పిల్లకదా, అసలు ఇలాంటి డ్రెస్‌లు వేసుకుని తిరిగితే దీనికి పెళ్లి ఎలా అవుతుంది?' అంటాడు రాజు.

పెళ్లి ప్రస్తావన రావడంతో తాను ఒక అబ్బాయిని ప్రేమిస్తున్నానని చెబుతుంది నాగు. ముందుగా ఆ అబ్బాయి అమెరికన్‌యేమో అని సందేహిస్తారు గిరిజ. కానీ, అతడు భారతీయుడని చెప్పడంతో కాస్త ఊరట చెందుతారు. అబ్బాయి గుజరాతీ అని నాగు చెప్పడంతో తెలుగువారు దొరకలేదా అని మళ్లీ ఆమెతో వాదించడం మొదలెడతారు. భారతీయుడు, తెలుగువాడు, మన కులంవాడు అన్నది చూసుకునే ప్రేమించాలా అని తిరగబడుతుంది నాగు తల్లిదండ్రుల మీద.

ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ "ఎన్నిసార్లు చెప్పాలే నీకు. I am the father and I get to decide what goes on in this house"5 అంటాడు. ఎంతో ఎదిగిన, అగ్రదేశమైన అమెరికాలో వున్నా కూడా ఇంటిపెద్ద మగవాడే అన్న అహం ఈ పాత్రలో కనిపిస్తుంది.

"సార్! నేనొక మాట చెప్పనా! ఏదో వ్యాపారం కోసం సినిమాలు తీసుకుంటాను గాని, నేనూ ఒక తండ్రినే. ఇండియాలో మాకూ ఉన్నాయి ఈ సమస్యలు. కానీ మీరంతా చదువుకున్నవాళు ్లు. ఎంతో సంస్కృతి వున్నవాళ్లు. అమెరికాలాంటి సంపన్నదేశంలో వుంటున్నారు. ఇందాకటి నుంచీ చూస్తున్నాను. ఆ అమ్మాయిని మనవాడ్ని చేసుకో అంటున్నారు. మనవాడు అంటే తెలుగువాడు అనా, మన కులం అనా, భారతీయుడు అనా? అసలు ప్రశ్న ఏమిటో తెలిస్తే!"6 కదా సమాధానం లభించేది అని అంటాడు ఇదంతా చూసిన దర్శకుడు ఆనందరెడ్డి.

వాళ్లు ఇష్టపడిన వాళ్లతో పెళ్లి చేయడానికి తమకు అభ్యంతరం లేదని, తాము చెబుతున్నది వారిలో ఒక స్పష్టత లేదన్న విషయం గురించేనని అంటారు రాజు. పిల్లలు తమ తల్లిదండ్రులతో వారి జీవితం గురించి చర్చిస్తే వారికి మార్గదర్శకత్వం వహిస్తామని, అలా చేయకుండా స్వయం నిర్ణయాలు తీసుకుంటే వారికి అనుభవం లేక తప్పటడుగులు వేసే ప్రమాదం వుందంటాడాయన. పిల్లలకు ఏం కావాలో వారికి నిజంగా, స్పష్టంగా తెలుసా? అని ప్రశ్నిస్తాడు రాజు. ఈ ప్రశ్ననే సంధిస్తారు మనమీదకు కూడా వంగూరి చిట్టెన్ రాజు.

ఈ నాటిక రెండు రకాల ప్రశ్నలను మనమీదకు సంధిస్తుంది. అమెరికాలో శాశ్వత నివాసం ఏర్పరచుకుని, ఆ సంస్కృతిలో మమేకమై జీవిస్తున్న పిల్లలు భారతీయులను వివాహం చేసుకుని ఇక్కడ ఇమడగలరా? అన్నది ఒకటైతే, జీవితం పట్ల ఒక స్పష్టమైన అవగాహన లేని యుక్తవయసు పిల్లలు తల్లిదండ్రులను ధిక్కరించి తమ సమాజానికి ఆవల పక్కవారిని పెళ్లిళ్లు చేసుకుంటే పర్యవసానాలు ఎలావుంటాయి? అన్నది మరొక ప్రశ్న. ఈ రెండింటికీ సమాధానం కావాలంటే తల్లిదండ్రులు, పిల్లల మధ్య అంతరం లేకుండా మనసువిప్పి మాట్లాడుకోవాల్సి



ISSN No.2319-3905

వుంటుంది.

చిట్టెన్ రాజుగారు ఈ నాటికలను 'అమెరికామెడీ నాటికలు'గా ప్రచురించినా కొన్ని నాటికల్లో అమెరికాలో తెలుగువారి తీరు తెన్నులు, వారి జీవన విధానంపై ఆయన ఆవేదన కనిపిస్తుంది. కులమతాల గొడవలు, పిల్లలకు తెలుగును ఒక జీవనవిధానంగా నేర్పడం కన్నా మన సంప్రదాయం పేరిట అవసరంలేని గొబ్బిళ్ళవంటి నృత్యాలను చేయించడం, సరదాగా కాసేపు కాలక్షేపం చేసి వెళ్లిపోవడం వంటి విధానాలను ఆయన తప్పుపట్టినట్లు కనిపిస్తుంది. కోటి ఆశలతో అమెరికాకు చేరుకుని రెసిషన్ కారణంగా ఉద్యోగాలు కోల్పోయి జీవనోపాధి కనిపించక అయోమయంలో జీవిస్తున్న యువత కష్టాలను ఆయన తన నాటికల్లో చూపించారు. చిట్టెన్‌రాజు రాసిన ఈ నాటికలు చాలా ఏళ్లముందు రాసినా కూడా ఇప్పటికీ ఈ సమస్యలు ఇంకా అలాగే వుండడం కూడా మనకు కనిపిస్తోంది. అమెరికాలోని తెలుగువారు ఇప్పటికైనా కళ్లు తెరిచి తమ జీవితాల్లోనూ, మనసుల్లోనూ మార్పులు తెచ్చుకుంటే బాగుండుననిపిస్తుంది.

**<u>ఆధార గ్రంథాలు</u>**


1. శ్రీశ్రీ, అమెరికామెడీ నాటికలు వెనుకమాటలో, అమెరికామెడీ నాటికలు, వంగూరి చిట్టెన్‌రాజు, వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా, సెప్టెంబర్ 2008
2. గొల్లపూడి మారుతీరావు, అమెరికామెడీ నాటికలు ముందుమాటలో.., అమెరికామెడీ నాటికలు, వంగూరి చిట్టెన్‌రాజు, వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా, సెప్టెంబర్ 2008, పుట 3
3. ఏడవలేక నవ్విన సన్యాసి, అమెరికామెడీ నాటికలు, వంగూరి చిట్టెన్‌రాజు, వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా, సెప్టెంబర్ 2008, పుట92
4. ఏడవలేక నవ్విన సన్యాసి, అమెరికామెడీ నాటికలు, వంగూరి చిట్టెన్‌రాజు, వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా, సెప్టెంబర్ 2008, పుట97
5. అసలు ప్రశ్న, అమెరికామెడీ నాటికలు, వంగూరి చిట్టెన్‌రాజు, వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా, సెప్టెంబర్ 2008, పుట 157
6. అసలు ప్రశ్న, అమెరికామెడీ నాటికలు, వంగూరి చిట్టెన్‌రాజు, వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా, సెప్టెంబర్ 2008, పుట 161

# 12
# గుర్రం జాషువా "గబ్బిలం"

*డా.ఎస్. హేమలత*

గుంటూరు జిల్లాలోని వినుకొండలో వీరయ్య, లింగమాంబ ఆదర్శ దంపతులకు 1895లో గుర్రం జాషువా జన్మించారు. 'కృషితో నాస్తి దుర్భిక్షం' అన్న నానుడి ఈయన విషయంలో సంపూర్ణంగా నిజమైందని చెప్పాలి. దారిద్ర్యం, అస్పృశ్యత అవమానాలు ఈయన కవితాశక్తి ముందు నిలబడలేక పలాయనం చిత్తగించాయి. జాషువా ఉపాధ్యాయుడుగా, యుద్ధ ప్రచారకునిగా, ఆకాశవాణి మద్రాసు కేంద్రంలో తెలుగు ప్రొడ్యూసర్‌గా వివిధ ఉద్యోగాలు నిర్వహించారు. వృత్తులు ఎన్ని చేసినా, ప్రవృత్తి మాత్రం సాహిత్యంగానే ఉండి గబ్బిలం, బాపూజీ, క్రీస్తు చరిత్ర, పిరదౌసి, కొత్తలోకం మొదలైన రచనలు చేశారు. వీరి సారస్వత సేవను మెచ్చిన ఆంధ్ర విశ్వవిద్యాలయం వారు 'కళా ప్రపూర్ణ' బిరుదునిచ్చి సన్మానించారు. భారత ప్రభుత్వం వారిచే పద్మభూషణ బిరుదును, కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారాలను అందుకున్నారు. ఇవే కాకుండా అనేక సన్మానాలు, పురస్కారాలను అందుకున్నారు. వీరేశలింగం, చిలకమర్తుల వారి ఆశీర్వాదం పొంది తన సాహితీ ప్రయాణాన్ని నిరాటంకంగా కొనసాగించిన కవి. జాషువా జీవితంలోని 'గబ్బిలం' కావ్యం జాషువా స్వీయ అనుభవాల క్రోడీకరింపు అనటం అతిశయోక్తి కాదు. జాషువా రచనలన్నీ అతని గుండెలోతులలో నుంచి పెల్లుబికి వచ్చిన తరతరాల దు:ఖాన్ని వెల్లడిస్తుంది. ఒక పక్క దారిద్ర్యం మరోపక్క అస్పృశ్యతలు వెక్కిరిస్తూ వుంటే వెరవక ధైర్యంగా సాహితీ క్షేత్రంలో పసిడిని పండించిన కృషీవలుడు జాషువా.

'గబ్బిలం' ప్రధానంగా వర్ణవివక్షత మీద దాడి చేస్తుంది. సమాజక్రౌర్యానికి బలై తన జీవన హక్కులను కోల్పోయిన అభాగ్యుడి గాథ 'గబ్బిలం'. స్వాతంత్ర్యం వచ్చిన తొలి నాళ్ళలో భారతదేశంలో నెలకొని ఉన్న సామాజిక రుగ్మతలను ఎత్తి చూపిన కావ్యం 'గబ్బిలం'. అస్పృశ్యునిగా ముద్రవేయించుకొని జీవితమంతా అవమానాలు ఎదుర్కొన్న క్షుధాగ్ని పీడితుడి గుండెమంటలు ఈ కావ్యంలో కనిపిస్తాయి.





ఈ కావ్యంలో కథానాయకుడు తనకున్న దానితో తృప్తిగా జీవించేవాడు కాని, లేని దాని కోసం అర్రులు చాచేవాడుకాదు. ఒకరిని మోసం చేయాలనే ఆలోచనలు ఏనాడు ఇతనికిలేవు. ఆకలి మంటలకు ఆహుతి అయిన అతను నిత్య సంతోషి, బొక్కెడు బువ్వతో సమస్త కష్టాలను మరిచిపోయే నీతిమంతుడు. 'వాని రెక్కల కష్టం లేనినాడు పంటపడే అవకావమే లేదు. వాడు చేమటోడ్చి ప్రపంచానికి భోజనం పెట్టినా భుక్తికి మాత్రం కరువుపడేవాడు'. ఈ కర్మభూమిలో ధర్మదేవత కూడా ఈ దరిద్రుడి నీడపడిన చోట ఉలిక్కి పడుతుందట. ఏదిక్కులేని అంటరాని వానిని ఉద్ధరించే భగవంతుడే లేనపుడు సాటి మనిషి, వాడిని కనికరించటం ఎలా సాధ్యం అవుతుందని ప్రశ్నిస్తాడు.

గ్రహణ సమయంలో చంద్రుడిని పట్టి పీడించే రాహువుది కొంత కాలమే ఉండే పట్టు, కాని కాలాతీతమైన ఈ కులపట్టు నోటిచిక్కితే మరి ఇంకా బయటపడే మార్గమే లేదంటాడు. ఆ శిక్ష ఆజన్మాంతం.

"ఆ యభాగ్యుని రక్తంబు నాహరించి
యినుప గజ్జెల తల్లి జీవనము సేయు
గసరి బుసకొట్టు నాతని గాలిసోక
నాల్గు పడగల హైందవ నాగరాజు"

ఏకులములేని తనకు బిడ్డలు మాత్రం ఎందుకని ఆ అభాగ్యుడు బ్రహ్మచారిగానే జీవితాన్ని వెళ్ళదీయాలనుకుంటాడు. కొడుకుని కంటే వాడు బానిసగానే జన్మిస్తాడని తెల్సి ఆ ఊసే ఎత్తడు. పొద్దు పొడిచిన దగ్గరినుండి పొద్దుపోయే దాకా రెక్కల ముక్కలు చేసుకునే ఆ బీదవాడు, చిక్కని చీకటిలో కుక్కి మంచం మీద ఒత్తిగిల్లగానే అక్కడ తిరుగుతున్న గబ్బిలాన్ని చూశాడు. దానిని చూడగానే శతాబ్దాల తరబడి తన వారికి జరుగుతున్న అన్యాయం, అనంత వేదనా గళం స్వరం విప్పింది. తన స్వీయ వృత్తాంతాన్ని గబ్బిలంతో చెప్పుకుందామనుకున్నాడు.

"ప్రతిమల దేవతా భవన వాసము చేయుచు
మమ్ము వంటి మానవులకి గౌరవమునందుల
దూగెడు గబ్బిలాల రాణి"

అంటూ దానిని కవి సంభోదిస్తాడు. కటిక పేదవాని ఇంట్లో ఏమి దొరుకుతుందని "దొరకదిచట ఆనంద కిరణలవం" అంటాడు. తన గుడిసెలో వినిపించేవి మూలుగులు, ఏడుపులేనని, వెతకటం వృథా ప్రయాస అని అంటాడు. హృదయము లేని లోకము సుమీ అని చెపుతూ.. "ధేనువుల్ పిదకన పాలు పేదకు లభించవు. శ్రీ గల వారి ఆజ్ఞలో" అని అంటాడు. అందుకే అన్నం లేని పేద ఇంటికి చేరితే ఏం లాభముంటుందని గబ్బిలాన్ని అడుగుతాడు.

"ప్రతిమల పెండ్లి సేయుటకు వందలు వేలు
వ్యయించుగాని దు:ఖితులైన పేదల పకీరుల శూన్యములైన పాత్రలన్

మెతుకు విదల్ప దీ భారత మేదినిముప్పది మూడు కోట్ల

వతలెగపద్ద దేశమున భాగ్య వీహీనుల క్షుత్తులార్తునే"

ప్రతి సంవత్సరం వేల రూపాయలు వెచ్చించి, భగవంతుని కళ్యాణం పేరిట బొమ్మల పెళ్ళిళ్ళు చేస్తారు. పేదలు రిక్తహస్తాలతో తిరుగుతూ, అన్నమో రామచంద్ర అని వేడుకుంటున్నా వారి బిక్షా పాత్రలలో మెతుకులు విదల్చటానికి మాత్రం ఎవరికి చేతులు రావని అంటాడు. ముప్పయి మూడు కోట్ల దేవతలున్న భరత ఖండంలో భాగ్యవిహీనుల ఆకలి మంటలు ఆరే రోజులెప్పుడని కవి ప్రశ్నిస్తాడు. అటు దేవుళ్ళు, ఇటు పూజారులు శ్రీ గల వాని ఆజ్ఞలో పెదవి కదల్పజాలరని కవి అంటాడు. తన కంటే గబ్బిలమే అదృష్టవంతురాలని భావించి శివుని సమీపంలో వ్రేలాడే అదృష్టం అయినా తనకి ఉందని అందుకే తగిన సమయం చూసి శివునికి తన దైన్య స్థితిని విన్నవించమని అంటాడు. తన సృష్టిలో జీవులకి, జీవులకి మధ్య ఉన్న అంతరాన్ని చూడమంటాడు. తన ప్రతిరూపం అయిన మనిషి ఒకడు హేయమైన స్థితిలో ఉండటం సృష్టికే మాయని మచ్చని కవి చెపుతాడు. నరునికి చేరరాని సదనంబున వాసముసేయు విశ్వేర్వరునికి నివేదించమంటాడు. తాను పుట్టుకతోనే పాపి కాబట్టి పిడుగులు పడ్డా తనకు అక్కడ ప్రవేశము లేదనే దుర్భర సాంఘిక పరిస్థితిని వివరిస్తాడు.

అనేకమార్లు కవి తాను అనుభవించిన వివక్షతకు అక్షర రూపం ఇచ్చే ప్రయత్నం చేస్తాడు. ఒకసారి రైలు ప్రయాణంలో తన తోటి ప్రయాణికులకు తన కవిత్వాన్ని వినిపిస్తాడు. అతని కవితా వధూటి వదనంబ నెగాదిగా జూచి కమనీయ వైఖరుల గాంచి భళి భళీ అన్న వాడే తానెవరో తెలిసిన వెంటనే వాడన్న మాట "బాకున గ్రుమ్మినట్లగున్" అంటాడు. ఇలా అనేకమార్లు తాను ఎదుర్కొన్న వివక్షతను అక్షర రూపంలో పెట్టే ప్రయత్నం చేస్తాడు. తన రచనల్ని గ్రంథరూపంబు దాల్చు భాగ్యంబులేక కంటదడి బెట్టుచుండు నాకవన పటిమ అని విచారిస్తాడు. మహావీరుడైన కర్ణుడికే తప్పలేదు, కులపరీక్షకుల నడుమ, ప్రతిభ వున్నా వివక్షతను ఎదుర్కొన్నాడు. అలాగే తాను కూడా ప్రతిభ ఉన్నా తన కవితా శక్తిని వెల్లడించే అవకాశాలు లేక తల్లడిల్లుతాడు.

విశ్వమానవ గోత్రేయ వీరులైన

కవులకున్ కర్మబంధంబు కట్టబెట్టి

పులుముచుందురు తలమీద కులమురంగు

తొలగిపోవదు లక్ష సబ్బులకు గూడ

గబ్బిలానికి కొనసాగించాల్సిన ప్రయాణ మార్గాన్ని నిర్దేశించి చూపుతూ అనుకోని రీతిలో వర్షాకాలపు ఈదురు గాలులు, ఎండాకాలపు సుడిగాలులు వీచినా భయపడవద్దని అంటాడు. ధర్మానికి పరికితనం ఎన్నడూ లేదని, సత్య వాక్యానికి చావులేదని కవి నమ్మకం. తెలుగుదేశంలోని అనేక చారిత్రక స్థలాలను ప్రస్తావిస్తూ "తడవైనన్ గుడిగోపురాలు సందర్శించుచుంబొమ్ము" అని కవి గబ్బిలానికి హితం చెపుతాడు. ప్రసిద్ధి చెందిన చేమకూర వేంకటకవి మొదలుకొని క్షేత్రయ్య



ISSN No.2319-3905

వరకు గల కవులనందరికి వేనోళ్ళ ప్రస్తావించాడు. వారి భాషా వైదుష్యాన్ని ప్రస్తుతించాడు. నెల్లూరి సీమ గురించి ఒక పలుకు జాణతనమున సకియలు నెల్లూరి సీమ సత్కవివరులం దికమకలు పెట్టగలరని పుకారు ఉన్నదని గబ్బిలాన్ని హెచ్చరించాడు. అదేవిధంగా తన ఆంధ్రాభిమానాన్ని చాటుకుంటూ కృష్ణదేవరాయుల ఆంధ్రాభాషాభిమానాన్ని, హంపీ క్షేత్ర ప్రాధాన్యతను సవిస్తారంగా వర్ణిస్తాడు.

తెలుగు భాషకు వన్నె తెచ్చిన రాయల ప్రదేశాలలో నేడు గచ్చులుమ్మెతులున్ గన్నేరుం బొదలావరించినవి అని గత వైభవంతో ఈనాటి పరిస్థితులు చూడలేక తన ఆవేదనని వెల్లడిస్తాడు.

"నాగజెముదు పురుగులాగున నీ చుట్టు

ముంగియున్న నేటి నాగరికత

తెలుగుదనము తొడ దినివేయదో, నీయ

శో లతాంతములను వాలకమును"

తన వెతలను గబ్బిలానికి వివరిస్తూ "పిట్టా నీకు నమస్కరించెదను నావిజ్ఞప్తి నాలింపవే" అని తన బాధలను గబ్బిలానికి చెప్పుకుంటాడు. ఒకానొక సందర్భంలో కవి గబ్బిలాన్ని 'ఖగసన్యాసిని, ఖగసతి, ఖగరాజ్ఞి, ఖగవధూటి, ఖగాంగ అని కూడా పిలుస్తాడు. కాళీదాసు మేఘ సందేశమును పంపుతాడు, ఇక్కడ జాషువా గబ్బిలం ద్వారా తాను అనుభవిస్తున్న అవధిలేని శిక్షను ఈశ్వరునికి నివేదించమని చెపుతాడు.

"నాదు కన్నీటి గాథ సమన్వయము సేయ

నార్ద్ర హృదయంబు గూడ కొంతవసరంబు"

ఎన్ని దేశాలు తిరిగిన నేమి నీకు నీవు

నావలె బుట్టు బానిసవు కావు"

అని కవి గబ్బిలంలో చెపుతాడు.

"ఆలయంబున నీవు వ్రేలాడే వేళ

శివుని చెవు నీకు గొంత చేరువగనుండు

మౌని కగరాజ్ఞి! పూజారి లేనివేళ

విన్నవింపుము నాదు జీవిత చరిత్ర"

"కలదంబేద్కరు నా సహోదరుదు మాకై యష్ట కష్టాలకుంబలియై సీమకుపోయి క్రమ్మరిన విద్వాంసుదు" అని ఆయన తెచ్చిన మార్పును జాతికి తెలియజేస్తాడు.

"నేను చిందులాడి, నేను దప్పులు గొట్టి

యలసి సొలసి సత్తి కొలుపు గొలువ

ఫలితమేల్ల నొరుల భాగించుకొని పోవు

నీచమైన భూమి జూచినన్"

తాను చేయవలసిన పనులన్నీ దప్పులు కొట్టి పకీలు, చిందులు వేసే పనులు భూమిని తన శ్వేదంలో సస్యశ్యామలం చేస్తే, దాని ఫలితమంతా వేరేవరో వచ్చి భాగాలు వేసుకొని పోతారు. ఇక్కడ 'నేను' అన్న పదం సహస్ర వృత్తులవారిని ప్రస్తావిస్తుంది. సామాజిక జీవితంలోని ప్రతి భాగాన్ని పునర్నిర్మించే ఉన్నతాశయమే జాషువా గబ్బిలానికి ప్రేరకమైనది.

ఒక సందర్భంలో 'నా కావ్యాలన్నీ మరుగున పడితే పడవచ్చుకాని 'గబ్బిలం' మరుగున పడటానికి వీలులేదని' జాషువా అన్న మాటలు నూటికి నూరుపాళ్ళు నిజం. తెలుగు కవిత్వంలో 'గబ్బిలం' ఒక ఉత్తమ కావ్యంలా చిరస్థాయిగా నిలిచిపోతుంది. "జీవితం నేర్పిన పాఠాలను, జీవన విలువని గ్రహించేందుకు తన రచనలు ఉపయోగించటం అనేది కవి సాధించిన విజయంగా పేర్కొనవచ్చు. జీవితం నాకు ఎన్నో పాఠాలు నేర్పింది. నా గురువులు ఇద్దరు 1. పేదరికం 2. కులమత భేదం. ఒకటి నాకు సహనం నేర్పితే మరొకటి నాలో ఎదిరించే శక్తిని పెంచిందే కాని బానిసగా మాత్రం మార్చలేదు" అని అంటాడు. షేక్స్పియర్ చెప్పినట్లు All the world is a stage, all men and women are players they have their exits and entrances అలాగే జాషువా

ఆవిరియోడలో జలధి యోనమొనర్చెడు బాటసారు లో
భూవర! రేవులందు దిగిపోయెదరించుక వెన్కముందుగా
నీ వసుధాపణంబు పనియెల్ల ముగించి స్వదేశగాములై
పోవుచువచ్చు చంద్రు సతమున్ బ్రజలీ నరజన్మవర్తకుల్
ఈ నడుమ ఇన్ని వైషమ్యాలు ఎందుకని ప్రశ్నిస్తాడు.

దళితులకు ప్రతిభలేదనే వాదనలకు ఆరోజే జవాబు చెప్పాడు జాషువా. అలాగే విద్య అనేది మానవత్వాన్ని అందించాలే కాని విచక్షణలేని మృగంలాగా మార్చకూడదని, చివరగా అంబేద్కర్ కలలు గన్న స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం కలగలిసిన నూతన ప్రజాస్వామిక దేశాన్ని జాషువా 'గబ్బిలం' ఆశిస్తుంది.

**ఆధార గ్రంథాలు:**

1. గబ్బిలం – జాషువా
2. జాషువా సాహిత్యం – దృక్పథం పరిణామం – ఎండ్లూరి సుధాకర్
3. జాషువా సాహితీ ప్రస్తానం – (సం)యస్వే. సత్యనారాయణ.



ISSN No.2319-3905

# 13
# ప్రపంచ కథలలో స్త్రీల స్థితి

– డా. పి. ఎస్. గణేష్ మూర్తి

**ఉపోద్ఘాతం**

స్త్రీలు కష్టంలో ముందుండి సుఖంలో క్రిందుండి విజయంలో వెనకుండి ఎల్లప్పుడు పక్కనుండేదే స్త్రీ. స్త్రీని పూర్వ కాలంలో అబల అనగా బలం లేనిది అనేవారు. పూర్వం స్త్రీలు ఇంటి పట్టున ఉండి ఇంటి పనులు చేసుకొనేవారు. వివాహితలు ఇంటిని చక్కదిద్దుకుంటూ భర్త, పిల్లల యొక్క బాగోగులు చూసుకొనేవారు. ఆ విధంగా గృహిణి పాత్ర నూరు శాతం వహించేది. యుద్ధానికి వెళ్ళే పురుషులను ఆశీర్వదించేవారు. కాని నేడు స్త్రీలు బయటకు వచ్చి పురుషులతో పోటీగా చదువుతూ, ఉద్యోగాలు చేస్తూ, పురుషుల పరిమితమైన విజయాల్ని సైతం దక్కించుకుంటున్నారు,

ఒక ప్రక్క స్త్రీని మాతృ మూర్తిగా, ఇంటికి దీపంగా, త్యాగశీలిగా పరిగణిస్తూనే మరొకప్రక్క బానిసగా, వ్యక్తిత్వం, స్వేచ్ఛ లేనిదానిగా, పరాధీనగా చూస్తూనే ఉన్నారు. మనువు నుండి మొదలుకుని నేటి ప్రపంచీకరణ మానవుడి వరకు స్త్రీ స్థానం మగాడి తరువాతే అంటున్నారే తప్ప ఇరువురి సమాన ప్రతిపత్తిని గురించి ఆలోచించడం కానీ, ఆచరించడం కానీ కనిపించదు. స్త్రీలు విద్యా ఉద్యోగాలలో చాలా ముందడుగు వేస్తున్నారు. వారి స్థాయిని పెంచుకుంటున్నారు. వారికంటూ ఒక గుర్తింపును పొందగలుగుతున్నారు. మగాడితో ఏమాత్రం తీసిపోనంత సంపాదనా పరులుగా కూడా నిలుస్తున్నారు. సాఫ్ట్వేర్ రంగాలలో తాజాగా జరిగిన పరిశోధనలు కూడా స్త్రీలు మగవాళ్ళ కన్నా బాగా తమ ఉద్యోగనిర్వహణలో ముందున్నారు. కానీ ఈ మార్పు, ఈ విజయం నిజంగా స్త్రీలు ఆనందంగా అనుభవించగలుగుతున్నారా, ఇంత అభివృద్ధి కనిపిస్తున్నా, ఇంత ముందడుగు వేసినా మహిళ ఎందుకు మగాడి తరువాతే అవుతోందన్న విషయాలను ప్రపంచీకరణ కథా సాహిత్యం తెలిపే ప్రయత్నంచేసింది. ఈ వ్యాసం యొక్క ఉద్దేశ్యం ప్రపంచీకరణలో మహిళలను కథనాల ద్వారా పరిశీలిస్తున్నాను.

## స్త్రీ దయనీయ దశ దాటి సాధికారత దిశగా

చారిత్రిక అధ్యయనాలు పౌరాణిక సాహిత్యాల ప్రకారం వైదిక యుగం తొలి దశలో (క్రీ పూ 2000–1000) భారతీయ స్త్రీలకు సమాజంలో ఉన్నత స్థానం ఉండేది. రుగ్వేద కాలంలోనూ సమాజం స్త్రీ, పురుషులకు సమాన హోదా కల్పించింది. అప్పట్లో వివాహం తప్పనిసరి కాదు. కేవలం సామాజిక మతపరమైన విధి.

పురాణ ఇతిహాసాలు కాలంలో స్త్రీల స్థాయి తగ్గిపోయింది శ్రీ పురుష సమానత్వం లేదు వైదిక విజ్ఞానం స్త్రీలకు అందుబాటులో లేకుండా పోయింది. సీతాదేవి, సతీ అనసూయ, సావిత్రి దమైంది లాంటి ఆదర్శప్రాయమైన స్త్రీలకు గౌరవం లభించింది. బుద్ధుడు మొదట మహిళను బౌద్ధ మతంలో చేర్చుకోవడానికి సుముఖత చూపలేదు. తర్వాత కాలంలో బౌద్ధ జైన మతంలో స్త్రీలకు ప్రయాణం పెరిగింది. 15వ శతాబ్దం నాటికి పరిస్థితిలో కొంత మార్పు వచ్చింది భారతీయ సమాజంలోనే పునరుజ్జీవన ప్రయత్నాలు జరిగాయి. ఈ విషయంలో భక్తి ఉద్యమం ప్రధాన పాత్ర పోషించింది భక్తి ఉద్యమకారులు స్త్రీ పురుష సమానత్వాన్ని, స్త్రీలకు పురుషులతో సమాన అవగాహన కల్పించడాన్ని తమ రచనల్లో కార్యక్రమాల్లో ప్రచారం చేశారు. పరిపాలన రంగంలోనూ అతివలు విజయవంతంగా పాల్గొన్నారు. కాకతీయ సామ్రాజ్యాన్ని పరిపాలించిన రుద్రమదేవి గురించి మార్కోపోలో తన రచనలో పేర్కొన్నాడు. రజియా బేగం, నూర్జహాన్, మెహెరునిసా, మహం అంగా, చాంద్ బీబీ, తారాబాయి, ఆహ్లాబాయి, హోల్కర్ లాంటి స్త్రీలు కూడా రాజ్యాలను పరిపాలించారు. ఆ కాలంలో ప్రసిద్ధి చెందిన వనితలో జహనారా, రోషనారా జేబునీసా ఔరంగజేబు కుమార్తె జిజిభాయ్ (శివాజీ తల్లి) లాంటి వారిని సమర్థ భారత ప్రస్తావిస్తారు.

## ప్రపంచీకరణ కథల్లో స్త్రీ

భార్యా భర్తల సంబంధాల్లో అసమానత్వం, యాంత్రికత, హింస, విశ్వాసరాహిత్యం, పెత్తనం, అధికారం, అణచివేత మొదలైనవి అనేక కథలకు ప్రధాన వస్తువుగా కనిపిస్తుంది. వివాహం నుండి బయటపడ్డానికీ, వివాహం కంటే అతీతంగా తమకొక అస్తిత్వం ఉందని గుర్తించడానికీ స్త్రీలు ఈ నాటికీ వెనకాడుతూనే ఉన్నారు. నేటి స్త్రీలు చదివి మంచి ఉద్యోగంలో ఉన్నప్పటికీ తన మానసిక సంఘర్షణలో మాత్రం తేడా ఉండటం లేదు. మహిళల పట్ల, కుటుంబంలో సమాజంలో వారు నిర్వహించవలసిన పాత్ర పట్ల మన ఆలోచనా విధానంలో తరతరాలుగా ఉన్న ధోరణి మారాలి. పిల్లల్ని కని, పెంచే బాధ్యత మహిళలదే అయినా పిల్లల్ని కనాలా, వద్దా, కనాలనుకుంటే ఎపుడు కనాలి, ఎంతమందిని కనాలి అనే విషయాన్ని నిర్ణయించే హక్కు మాకుటుంది అంటున్న పురుషుడి ధోరణిలో మార్పు రానంత వరూ ఈ సంఘర్షణ కొనసాగుతూనే ఉంటుంది.

స్త్రీ జీవితానికి వివాహమే పరమార్థం, మాతృత్వమే పరమ పదం. లైంగిక జీవితం అన్నస్పృహ స్త్రీకి అవసరం లేదు. అది స్త్రీలు చర్చించాల్సిన, ఆలోచించాల్సిన విషయం కాదు.



ISSN No.2319-3905

స్త్రీ కాస్త ముందడుగు వేసినా బరితెగించిన ఆడదిగా సత్కరింపబడుతుంది. డబ్బు సంపాదనే ధ్యేయంగా పురాతన వస్తువుల్ని ఎన్నెన్నో సేకరించి, ఇంటి నిండా అలంకరించి తన గొప్పతనానికి తానే గర్వపడుతున్న మనసులేని వ్యక్తి కథ 'శిథిల శిల్పాలు'. డబ్బు వ్యామోహంలో, మత్తులో కన్నతల్లిని కూడా భారంగా భావించి అనాథ శరణాలయానికి పంపిన కసాయి కొడుకు కథ ఇది. ప్రాణం లేని వస్తువులకు ఉన్న విలువ కన్న తల్లికి లేకపోవడం ఈ కథలో చూడవచ్చు. మనిషిలో కరుడుగట్టిన స్వార్థాన్ని హృద్యంగా చూపి మనసును స్పందింపచేసే మరో కథ 'సలీవ్కు' రూపాయి చెట్టు కథాసంపుటిలోని 'చావు' కథ.

నరేందర్ 'నాతి చరామి' కథా సంపుటిలోని కథలన్నింటిలో సమాజంలో స్త్రీ పట్ల కనిపిస్తున్న అలసత్వం, స్త్రీల మానసిక క్షోభ, ప్రపంచీకరణ ప్రభావంలో కొట్టుకు పోతూ తప్పని పరిస్థితిగా తమను తాము మార్చుకుంటున్న వైనం, భార్యా భర్తల బంధాల్లో ఏర్పడుతున్న విలువలు, వాటిని శాసిస్తున్న ఆర్థిక సంబంధాలు ప్రధానంగా చర్చించబడ్డాయి.

## భౌతికవాదానికి బలవుతున్న స్త్రీ

ప్రపంచంలో లభ్యమవుతున్న సర్వ సౌఖ్యాలు అనుభవించాలనుకోవడం ప్రపంచీకరణ తెచ్చిపెట్టిన నూతన దృష్టి. ఆర్థిక ఇబ్బందులు మనిషిని కుదురుగా కూర్చోనీయవు. పరిష్కారంగా డబ్బు సంపాదించాలనుకోవడం, అవసరాలను తీర్చుకోవాలనుకోవడం సమంజసమే అయితే అందుకు ఎన్నుకునే మార్గాలు సరైనవిగా ఉండాలి. లేకపోతే జరిగేవి అన్ని అనర్థాలుగా మిగిలిపోతాయి. అయిదు లక్షల పారితోషకం కోసం ఆశపడి తన భార్య సువర్చలను బలవంతంగా వేరెవరికో టెస్ట్ ట్యూబ్ బేబీని కనివ్వడానికి ఒప్పిస్తాడు రాజేష్.బిడ్డ పెరిగే కొద్దీ తన సొంతం కాని బిడ్డ గురించి మమకారం పెంచుకోవడమా, తెంచుకోవడమా తెలియని అయోమయ పరిస్థితి, కొడుకు బంటీతో నీకు తమ్ముడో, చెల్లినో పుడుతుందిరా అని మనసారా చెప్పుకోలేని స్థితి, ఎత్తుగా పెరుగుతున్న కడుపుతో బయటికి వెళ్ళడానికి భయం ఇలా ఎన్నో సంఘర్షణలు ఆమెను చిత్రవ్యథకు గురిచేస్తాయి. ఏ భర్తకోసమైతే తాను ఈ త్యాగానికి అంగీకరించిందో ఆ భర్తనే తనను దగ్గరకు రానీకుండా దూర దూరం పెట్టడం చూసి ఏడవాలనిపించినా ఏడవలేని అసహాయస్థితి.

తల్లి పేగులు ప్రయోగాల పేర దిగజార్చిన సైన్స్ ని దూషించినా, మాతృత్వం శపించినా, డబ్బు శాసించింది. సువర్చల బ్రతుకును మాత్రం ఛిద్రం చేసింది. స్కానింగుల్లో ఆడపిల్ల అని తేలినప్పుడల్లా అబార్షన్ పిల్స్ మింగించినవాడు డబ్బుకోసం చివరికి ఇంత అన్యాయానికి ఒడిగట్టాడన్న బాధతో ఆమె చివరికి బిడ్డను ప్రసవించి తన ప్రాణాలను పోగొట్టుకోవడం 'పరిహారం' కథలో కనిపిస్తుంది.

రాజేష్ లాంటి మగాళ్లు ఈ సమాజంలో పెద్దమనుషుల్లా చలామణి అవుతూనే ఉన్నారు. ఆడదాని చెర పడుతూనే ఉన్నారు. గృహిణుల్లోనే కాక ఉద్యోగాలు చేస్తూ, రాజకీయాల్లో రాణిస్తూ

మంచి పదవి, కలిగివున్న మహిళల్లో కూడా మగాడి నుండి ఎదురవుతున్న వత్తిడి హింసధ్వని('నాతిచెరామి' కథల సంపుటి, ఆంధ్రభూమి ఆదివారంలో ప్రచురితం), అవిశ్వాసం('నాతిచెరామి' కథల సంపుటి, ఆదివారం–ఆంధ్రప్రభలో ప్రచురితం) మొదలైన కథల్లో కనిపిస్తుంటే మహిళలు ముందడుగు వేసి రాకాసి భర్తల నుండి విడాకులు తీసుకోగలిగినా ఆ తరువాత వారు పడుతున్న కష్టాలు, ఎదుర్కొంటున్న సమస్యలను చర్చించిన కథలు అలసిపోయాను ప్రభూ నిన్నటిదాకా శిలనైనా మొదలైనవి.

ప్రేమ పేరుతో దేశంలో బలవుతున్న అమ్మాయిల సంఖ్యకు కొరత లేదు. ఇక విదేశాల్లో స్థిరపడిపోయిన కుటుంబాల్లో అక్కడే పుట్టి పెరిగిన ఆడపిల్లల జీవితాలు ఎటూ తేల్చుకోలేని సందిగ్ధతకు లోను కావడాన్ని ఎ బిసిడి ('నాతిచెరామి' కథల సంపుటి, ఈనాడు–ఆదివారంలో ప్రచురితం) కథలో చూడవచ్చు. ఆడపిల్లలు పుడితేనే పాపం అనుకునే కసాయితనం నేటికీ ప్రబలివుందన్న సత్యాన్ని ఈ కథ ఆవిష్కరించింది. కన్నవారింటా కష్టాలే, మెట్టినింటా కష్టాలే తప్ప స్త్రీకి కొత్తదనం ఏమీ లేదు. కసాయి తండ్రి నుండి ముగ్గురు ఆడపిల్లలు ఆత్మహత్య చేసుకుని దూరం కావలసిన పరిస్థితికి పరోక్షంగా నయినా ఈ సమాజం కారణం. చదువుకున్నదీ, సంస్కారం కలదీ, ఎన్నో రాత్రుళ్ళు అతన్ని తృప్తిపరిచింది, అయినా అతడు సుఖాన్వేషణలో మరో ఆడదాన్ని వెతుక్కుంటూ పోయాడు %–% ఓ ఇల్లాలి మానసిక క్షోభ అద్దంలో అబద్దంగా చిత్రించబడింది. పెళ్లి ఒక అవసరమేనా? చేసుకునే వాళ్ళకి శారీరకంగా, చేయించే వాళ్ళకి ఆర్థికంగా, అర్థేచ, మోక్షేచ, కామేచ అన్నారు గానీ మనసేచా అనలేదు. వీటికోసమే 'నాతిచెరామి' అనిపిస్తే అర్థమేముంది? పదహారేళ్ల లలిత మదిలో నాటుకున్న ఈ ప్రశ్నలకు దొరకని జవాబులను వెతుక్కుంటూ తన ప్రాణాలు సైతం వదలవలసిన పరిస్థితి ఆ పసివయసులో ఎందుకు వచ్చింది. ఇది సమాజం మొత్తం ఆలోచించవలసిన విషయం.

**రాజకీయ జీవితములో స్త్రీ**

రాజకీయాల్లో మహిళల రిజర్వేషన్ల పుణ్యమాని తన భర్త ఒత్తిడి మీద రాజకీయాల్లో ప్రవేశించి, మండలాధ్యక్షురాలిగా పదవి స్వీకరించిన శ్వేత ప్రజాభిమానం సంపాదించి మండలంలో, జిల్లాలో ఒక ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకుంటుంది. సంసార జీవితానికి, రాజకీయ జీవితానికి వారధిలా నిలిచి ఎన్నో ఒడిదుడుకులను రాజకీయంగా, సంసార పక్షంగా ఎదుర్కొంటుంది. స్త్రీ ఎంత సమర్థవంతురాలు, తెలివిమంతురాలు అయినప్పటికీ భర్తకు మాత్రం తానొక బానిస మాత్రమే. మగాడి చేతిలో కీలుబొమ్మగా మారిన ఆడదానికి ప్రపంచీకరణే కాదు ఇందో అద్భుత ప్రపంచం ఆవిర్భవించినా ఆమె ఇలా కాలుతూనే ఉంటుందనడానికి అవిశ్వాసం కథలోని శ్వేత పాత్ర నిదర్శనంగా నిలుస్తూ మహిళలను హెచ్చరిస్తున్నట్లుగా కూడా కనిపిస్తుంది. పదవిలో ఉన్నపుడే బాగా సంపాదించుకోవాలన్న తపనతో శ్వేత భర్త రామకృష్ణ శ్వేత నుండి అక్రమంగా డబ్బు సంపాదనకు బలవంతపెడతాడు. ఆమెకు బదులు అతనే లంచం తీసుకుంటూ, తాను



ISSN No.2319-3905

లంచం తీసుకున్నాడు కాబట్టి ఆ పనులన్నీ శ్వేతను చేయవలసిందిగా అజ్ఞాపిస్తాడు. కాదంటే చేయి చేసుకోవడం, ఇలా రోజుకొక హింస. ఇది మహిళలపై మగాడి రాజకీయం. పదవీ, పలుకుబడి, డబ్బుపై వ్యామోహాలు మనిషిని ఎంతగానో దిగజార్చటం ఒక ఎత్తయితే వాటికోసం మనసుకు కష్టమయినా ఇష్టం లేని పనిని చేయవలసిన అనివార్య స్థితి ఏవిధంగా నెలకొంటూందో, మహిళలు అడకత్తెరలో పోకచెక్కలా ఎలా విలవిలలాడుతున్నారో వివరిస్తున్నాయి ఈ కథలు.

ప్రజానాయకులకు ఇద్దరు పిల్లలకు మించి ఉండకూడదు. పంచాయతి రాజ్ చట్టం 1994 ఆర్టికల్ 19 (3) ప్రకారం మూడో బిడ్డని కనగానే అదిలాబాద్ జిల్లా నెన్నెల మండలాధ్యక్షురాలిని పదవినించి సస్పెండ్ చేశారు. అసలే ఇక్కడ నాకు ఎమ్డీవో గాడికి పడిచావట్లేదు. మూడో బిడ్డ పుడితే నీ పదవి పోతుంది. అందు అబార్షన్ అంటున్నాను – అంటున్న రామకృష్ణ మాటలు ఆడపిల్ల పుట్టబోతోందన్న ఆనందంలో మునిగి ఉన్న శ్వేతకు పిడుగు పడ్డ భావనను కలుగచేస్తాయి. తన భార్య మనసుకు గాయమవుతుందేమో అన్నది ప్రక్కన పెడితే అసలామెకు మనసే లేనట్లు స్టేట్మెంట్ ఇచ్చిన రామకృష్ణలాంటి స్వార్థ పూరిత భర్తలు ఎంతోమంది నేటి సమాజంలో ఉన్నారు. బయటికి పెద్దమనుషుల్లా చెలామణి అవుతూ, స్త్రీని ఎన్ని విధాలుగా దగా చేయవచ్చో, మరెంతగా నరకయాతనకు గురిచేయవచ్చో అన్నీ చేస్తూ తాము మాత్రం విలాసవంతంగా, హుందాగా కాలం గడుపుతున్నారు.

శ్వేత విషయంలో అలానే జరుగుతుంది. ఆమె తల్లితనమే గొప్పనుకుంటుంది, దాంతో ఆమె కడుపుపై బలంగా పిడికిలి తాకడం, కళ్ళు మూసుకుని ముడుచుకు పడుకున్న పసిగుడ్డు శాశ్వతంగా కళ్ళు మూయడం క్షణాల్లో జరిగిపోతుంది. ఈ దృశ్యం కనుల ముందు సజీవంగా ప్రత్యక్షమయ్యేలా ఈ కథలో చిత్రించబడింది. రాజీనామా చేస్తానన్న శ్వేతతో నేను విడాకులిస్తానన్న భర్త ఆఖరి అస్త్రం ప్రయోగింపబడుతుంది. చివరికి శ్వేత మౌనం దాల్చక తప్పని పరిస్థితి నెలకొంటుంది. ఇది ఆడదాని అసహాయ స్థితి. భార్యలకు మాత్రమే అవసరమవుతున్న భర్త అండ దుస్థితి. ఇటువంటి క్లిష్టమయిన పరిస్థితులనుండి స్త్రీలు బయటపడే మార్గాలు స్త్రీలే సృష్టించక తప్పదన్న సత్యాన్ని మనముందుంచుతోంది అవిశ్వాసం కథ.

**స్త్రీ ఉద్యోగం,సంసారం, స్త్రీ పురుష సంబంధాలు**

మగాడు ఆడదాన్ని ఏనాడూ సమాన దృష్టితో చూడడు. అలా చూస్తున్నాడూ అంటే దాని వెనక ఖచ్చితంగా తన స్వార్థం ఉండనే ఉంటుందన్న విషయం నిరూపిస్తున్న కథ హింసధ్వని (నాతిచరామి కథల సంపుటి) ప్రభాకర్ తన భార్య రజనికి వంటింట్లో సహాయం చేస్తూ మా తరం వాళ్ళు వెనకటి మగాళ్లలా కాదు, స్త్రీలను తలుపుచాటుకి ఉంచట్లేదు. ఇంటి పనిలో, వంటపనిలో మేము చేస్తున్నంత హెల్ప్ ఏ కాలంలోనూ, ఏ మగాళ్లూ చేయలేదు. అందు మా తరం మగాళ్లే గొప్పంటాను అంటూ గొప్పలు పలుకుతున్న ప్రభాకర్ నిజస్వరూపం తన భార్య రజని తాను ఆరునెలల పాటు ఉద్యోగానికి సెలవు పెడుతున్నాననడంతో బయట పడుతుంది. ఆర్నెల్లు ఉద్యోగం మానేస్తావా, నెలకు ఆరువేల చొప్పున ముప్పైయారు వేలు నష్టం.

నీకేమయినా మతి పోయిందా, నువ్వు లీవ్ పెడితే చంపేస్తాను అంటాడు. డిగ్రీ కాగానే ఉద్యోగం, ఉద్యోగం రాగానే పెళ్లి, పెళ్లితో పిల్లలు, రోజూ ఆఫీస్, రొటీన్ రొటీన్, చదువునుంచీ అలసట–అలసట. ఎందుకో నాలో సహజసిద్ధమైన ఆడతనం ఆర్నెల్లయినా గృహిణిగా ఉండాలని కోరుకుంటోంది. అనుభూతులను కోల్పోతుంటే జీవితం నిస్సారమై ఏదో వెలితి ఏర్పడుతోంది. ముఖ్యంగా మా ఉద్యోగినుల్లో అంతరాంతరాల్లో పేరుకుంటున్న అసంతృప్తి ఇది. ఆ అనుభూతుల్ని తిరిగి పొందడం కోసమే ఆర్నెల్లయినా లీవ్ పెడదామనుకుంటున్నాను అన్న రజనీ మాటలకు ప్రభాకర్ అది చాలా చిన్న విషయమనీ, నువ్వు సెలవు పెట్టడానికి వీల్లేదనీ కోప్పడతాడు. పైగా ఇంతపని చేసి పెడుతున్నాం కనిపించట్లేదా అంటూ అప్పటిదాకా తరిగిపెడుతున్న ఉల్లిగడ్డల ప్లేటు ఎత్తి పడేస్తాడు. మీ సహకారంలో స్వార్థముంది. సంపాదించే భార్యని కనుక టైవ్కు అడ్జెస్ట్ మెంటు కోసం, మేం తెచ్చే జీతం కోసం మీరు ముసుగు వేసుకుంటున్నారు తప్పితే ఆర్నెల్లు లీవ్ పెడుతున్నాననగానే మీ ఉల్లిగడ్డలు తరగడం ఆగిపోయి పావుగంటయింది. జీతం రాదని తెలిసాక మీ నిజ రూపమేంటో తెలుస్తోంది అని ఆవేశంగా అన్న రజని చెంప చెళ్ళుమనిపిస్తాడు ప్రభాకర్.

ఆర్థిక పరిస్థితులు లేదా మగవాడి బలవంతం ఏదో ఒకటి ఈ ఉద్యోగం చేయిస్తాయి తప్ప కావాలని ఎవరూ ఇలాంటిది కోరుకోరు అంటున్న లేడీ బస్ కండక్టర్ మాటలద్వారా, మరియు డిగ్రీ డిస్కంటిన్యూ అయి ఏడేళ్లయింది. మావారి బలవంతం మీద డిగ్రీ చేశాను. అలాగే ఇన్ఫర్మేషన్ టెక్నాలజీలో డిప్లొమా చేయించారు. ఉద్యోగం చేయాలని పెద్దగా నాకు లేదు కానీ మా ఆయనేమో నీకు ఇబ్బంది? నేనే ఆఫీస్ దగ్గర దింపేసి మళ్లీ తీసుకొస్తా కదా, వంటింటి పని కూడా సగం షేర్ చేసుకుంటాననడంతో తప్పదని ట్రై చేస్తున్నాను అంటున్న సంధ్య మాటల ద్వారా తప్పక చేయటం అన్నది కనిపిస్తుంది. స్త్రీకి స్వేచ్ఛ లేదంటున్న మాటల్లో సత్యాసత్యాలు అవగతమవుతాయి.

ఇటువంటి ఒక సంఘర్షణ ఇరుగు పొరుగు ఉద్యోగినుల విషయంలో మనం నిత్యం చూస్తూనే ఉన్నాం. ఉద్యోగం ఉంది కానీ ఆర్థిక స్వాతంత్ర్యం లేదు, ప్రతి రూపాయికీ లెక్క చెప్పాలి అంటున్న మహిళలే ఎక్కువగా కనిపిస్తున్నారు. పాకీ పని చేసుకునే పనిమనిషి నుండి మంచి ఉద్యోగంలో ఉన్న మహిళ వరకూ ఎవరికీ ఆర్థిక స్వాతంత్ర్యం లేదు. ఆశ పడి కడుపు నిండా రుచికరమైన భోజనం తినడం కోసం తన జీతం ఖర్చు పెట్టి అలాగే ఒక చీర కొనుక్కున్న ఆఫీస్ పనిమనిషి భర్తకు లెక్కచెప్పడానికి భయపడి ఆ లోటు తీర్చటం కోసం సిగ్గు విడిచి హొటల్ యజమాని పక్కకు చేరి, వాడిని తృప్తిపరిచి సర్దుబాటు చేసుకున్న హింసధ్వని కథలోని మరో పాత్ర ఈ విషయాన్ని దృఢపరుస్తుంది. మరి ఈ పాపం ఎవరిది. ఆ పనిమనిషికి అటువంటి ఆలోచన రావడానికి దారితీసిన పరిస్థితులకు బాధ్యత ఎవరు వహించాలి? ఇటువంటి మహిళలు ఈ కథల్లోనే కాదు నిజ జీవితంలో తారస పడుతూనే ఉంటారు. అందు ప్రపంచీకరణ ముసుగులో ఇంకొంచెం ముందడుగు వేస్తున్న మహిళ చివరికి ఎక్కడ ఆగుతుంది అన్న ప్రశ్నను



ISSN No.2319-3905

మొలకెత్తిస్తున్నారు కథకులు. ఆడవాళ్ళు ఉద్యోగం చేయటం గొప్ప మార్పు అయినప్పటికీ తద్వారా మహిళలు ఏం సాధిస్తున్నారు అన్నది ఆలోచించవలసిన విషయం.

మగాడు మారలేదమ్మా, ఆడదానికి ఉద్యోగావకాశాలు పెరగటంతో మారినట్టు నటిస్తున్నాడు. మనం ఉద్యోగాలు చేయటమనే గొప్ప సామాజిక మార్పు వెనక ఒక నిశ్శబ్ద దోపిడి సాగుతోంది. మగాడిలో ఇపుడు కనిపిస్తున్న సహానుభూతి తెచ్చిపెట్టుకున్నదే కానీ, శాశ్వతం కాదు. గృహిణికుండే సర్దుబాటు ఉద్యోగిని కోల్పోతుంది. జీవితానికి తప్ప వ్యక్తిత్వానికి విలువివ్వకపోవడం పట్ల కల్లోల సంద్రమైపోతుంది. ఆ సంఘర్షణలో నుంచే మగాడే దిక్కనుకునే కన్నా విడాకులే ఉత్తమం అనుకునే ధోరణి మనదేశంలో కూడా చొచ్చుకోస్తోంది. ఒకప్పుడు భర్త దూరంగా ప్రవర్తిస్తేనే విడాకులకు ప్రధాన కారణంగా కన్పించేది, కానీ ఇప్పుడు భర్తనించి భార్యకు, భార్యనించి భర్తకు ఆశించిన మద్దతు లభించకపోతేనే విడాకులు. అన్ని సంబంధాలూ ఆర్థిక సంబంధాలుగా మారుతున్న గొంగళి పురుగు దశ ఇది అంతా ఆర్థిక మయమే, సమాజమే భ్రష్టు పట్టబోతున్న దశ ప్రపంచీకరణ.

**సమకాలీన తమిళ సాహిత్యంలో స్త్రీల స్థితి**

స్త్రీలు స్వయం ప్రేరేపితులై ఉంటారు, అయితే స్త్రీలు తమపై విధించిన సాంప్రదాయ ఆలోచనల ద్వారా ఉద్ధరిస్తారువారు వ్యక్తిత్వంతో పనిచేయడానికి ఆటంకం కలిగి ఉంటారు మరియు వివిధ కష్టాలకు లోనవుతారు. సమాజం తనపై విధించిన సంప్రదాయ విలువలను కాపాడుకోవాలంటే స్త్రీ అనేక రకాల సమస్యలను ఎదుర్కొంటూ తన ఇష్టాయిష్టాలను దాచిపెట్టి సమాజంలో రాయిలా నడవాలి.

తన కవితల్లో స్త్రీల పట్ల ప్రవర్తించిన తొలి కవి భారతి అని చెప్పడంలో అతిశయోక్తి లేదు. స్త్రీలను దేవతలుగా పూజించే సమాజంలో ఆడ పుట్టుక అంగీకరించబడదు. సామాజిక నిర్మాణంలో స్త్రీల గురించి ప్రస్తావించబడింది.

**ఉపసంహారం:**

ప్రపంచీకరణ మహిళల విముక్తికి దారితీయవచ్చు, కానీ అదే సమయంలో అది వారిపై మరింత అణచివేతకు కూడా దారితీస్తుంది. అది వారు పనిచేసే సందర్భం మరియు ఆచరణలో అమలు చేయబడిన విధానాలపై ఆధారపడి ఉంటుంది.

ప్రపంచీకరణ వల్ల స్త్రీలకు సంబంధించిన కథల్లో కొన్ని సానుకూల అంశాలు, కొన్ని ప్రతికూల అంశాలు ఉన్నాయి. వలసలు యువతులకు సామాజిక చలనశీలత మరియు ఆర్థిక పురోగతికి అవకాశాలను అందిస్తాయి, అయితే సాంకేతిక పురోగతి మరియు మీడియా ప్రపంచీకరణ మహిళలకు నిర్మాణాత్మక ప్రతికూలతలను సృష్టిస్తాయి,అదే సమయంలో, వారు మార్పిడి మరియు నెట్వర్కింగ్ కోసం మరిన్ని మార్గాలను తెరిచారు, స్త్రీవాదం ప్రపంచీకరణ కారణంగా, మహిళలు విద్య మరియు ఉపాధిలో ఎక్కువగా పాల్గొంటున్నారు. మహిళల ప్రస్తుత స్థితి మెరుగుపడిందని మరియు మహిళల అభివృద్ధి పురుషులతో సమానంగా అభివృద్ధి చెందినట్లు చూడవచ్చు.

ఉపయుక్త గ్రంథాలు.

1. వట్టిపల్లి శంకర్ రెడ్డి స్త్రీ దయనీయ దశ దాటి సాధికారత దిశగాఈనాడు ప్రతిభ కథాసంపుటి పుట -23
2. వి.నరేందర్-దేవుడు విసిరిన రాళ్లు-నాతి చరామి కథా సంపుటి పుట-125,
3. వి. నరేందర్-అద్దంలో అబద్దం, నాతి చరామి కథా సంపుటి పుట-96,
4. వి. నరేందర్-గుండెనెందుకిచ్చావురా:దేవుడా, నాతి చెరామి కథా సంపుటి పుట-108,
5. వి. నరేందర్ %-% అవిశ్వాసం, నాతి చరామి కథా సంపుటి %-% పుట-79,
6. వి. నరేందర్ %-% అవిశ్వాసం, నాతి చరామి కథా సంపుటి %-% పుట-81,
7. ఆర్ . మహేశ్వరి, వన్నంగల్ మారువదిలై సన్ లాక్స్ జర్నల్ సంపుటి పుట -152



ISSN No.2319-3905

# 14

# సంస్కృతభాషయందు విభక్తి వైచిత్రి

*- డా॥ లంక వేంకట సుబ్రహ్మణ్యేశ్వర శర్మ*

పదమనగా విభక్తి ప్రత్యయములతో కూడిన ప్రాతిపదికయే పదము. సుబంతమునకును, తిజిన్తమునకును పదము అని సంజ్ఞ. **సుప్తిజన్తం పదమ్ (1-1-14)** అని పాణిని సూత్రము. సుప్పులు అనగా నామ విభక్తులు. ఏడు విభక్తులకు మూడేసి వచనముల చొప్పున మొత్తం ఇరువదియొక్క ప్రత్యయములు. వాని స్వరూపమిది -

| | **ఏ** | **ద్వి** | **బహు** | **తెలుగు భాషలో** |
|---|---|---|---|---|
| ప్రథమావిభక్తి | సు | ఔ | జస్ | డు, ము, వు, లు |
| ద్వితీయా విభక్తి | అమ్ | ఔట్ | శస్ | నిన్, నున్, లన్, కూర్చి, గురించి |
| తృతీయా విభక్తి | టా | భ్యామ్ | భిస్ | చేతన్, చేన్, తోడన్, తోన్ |
| చతుర్థీ విభక్తి | జే | భ్యామ్ | భ్యస్ | కొఱకు, కై |
| పంచమీ విభక్తి | జసి | భ్యామ్ | భ్యస్ | వలనన్, కంటెన్, పట్టి |
| షష్ఠీ విభక్తి | జస్ | ఓస్ | ఆమ్ | కిన్, కున్, యొక్క లోన్, లోపలన్ |
| సప్తమీ విభక్తి | జి | ఓస్ | సుప్ | అందున్, నన్ |

సంబోధనయందును ప్రథమావిభక్తి ప్రత్యయములే చేరును. తెలుగులో ఓ, ఓరి, ఓసి అనే పదములు ప్రయోగించబడును. ఇందు మొదటి "సు" తో చివరి పకారమును ఇత్తు **ఆదిర్యన్త్యేన సహేతా (పా.సూ.1-1-11)** అను సూత్రముచే కలుపగా సుప్ అను ప్రత్యాహారము ఏర్పడి, అది ఈ ప్రత్యయముల నన్నింటిని బోధించును. కావున సుప్ అనునది పై ఇరువదియొక్క ప్రత్యయములకు సంజ్ఞ 'సుప్' అంతమందు కలది సుబంతము సుప్పులు ప్రాతిపదికములకు జేరును.

ధాతువు కానిదియు, ప్రత్యయము కానిదియు, ప్రత్యయాంతము కానిదియు నగు అర్థవంతమైన శబ్దస్వరూపమును ప్రాతిపదికముందురు. **అర్థవదధాతురప్రత్యయః ప్రాతిపదికమ్ (1-2-45)**.

ఆ ప్రాతిపదికమునకు ఈ సుప్పులలోనే ఏదో నొకటి చేరిన యెడల ఆ మొత్తమునకు పదమను పేరు ఈ సూత్రముచే సిద్ధించుచున్నది. ఉదా :- రామ + సు = రామః, అగ్ని + ఆమ్ – అగ్నిమ్ మొదలగునవి. ఈ సుబంతమైన ప్రాతిపదికయే మనోభిప్రాయమును బోధించగలదు.

నామ విభక్తుల వలెనే క్రియా విభక్తులను కలవు. వానికి తిఙ్ అని సంజ్ఞ. అదియును ఒక ప్రత్యాహారము. ధాతువులు (క్రియాపదముల మూల రూపములు) పరస్మైపదులనియు, ఆత్మనేపదులనియు రెండు విధములు. క్రియలలో ప్రథమ – మధ్యమ – ఉత్తమ భేదములతో మూడు పురుషములు కలవు. ఒక్కొక్క పురుషమునకు ఏకవచన, ద్వివచన బహువచనములు కలవు. కావున మూడు పురుషములకు మూడేసి వచనముల చొప్పున పరస్మైపదికి తొమ్మిదియు, ఆత్మనేపదికి తొమ్మిదియు మొత్తము క్రియాప్రత్యయములు పదునెనిమిది వాని స్వరూపమిది.

| **పరస్మైపదము** | **ఏ** | **ద్వి** | **బ** |
|---|---|---|---|
| ప్రథమ పురుషము | తిప్ | తస్ | ఝి |
| మధ్యమ పురుషము | సిప్ | థస్ | థ |
| ఉత్తమ పురుషము | మిప్ | వస్ | మస్ |
| ఆత్మనేపదము | | | |
| ప్ర.పు | త | ఆతామ్ | ఝ |
| మ.పు. | థాస్ | ఆథామ్ | ధ్వమ్ |
| ఉ.పు. | ఇట్ | వహి | మహిఙ్ |

ఇందు మొదటి **"తి"** అను ప్రత్యయము, చివరి 'మహిఙ్' లోని ఙకారముతో కలిసి **ఆదిరన్త్యేన సహేతా (1-1-7)** అను సూత్రమువలన **"తిఙ్"** అని, అయి తనకును, మధ్య వానికిని సంజ్ఞయగుచున్నది. కావున తిఙ్ ఙనగా ఈ పదునెనిమిది ప్రత్యయములు తెలుపబడును. వీనిలోని ఏదేని అంతమందు గల దానిని **"తిఙంతము"** అందురు. అదియు ఈ సూత్రము వలన, క్రియా పదమగును. ఉదా :- భవతి, అలభత మొదలగునవి.

ఇవి తిఙంతములైన పదములు పది లకారములయందు ప్రయోగింపబడుతున్నది. (1) లిట్ (2) లిట్ (3) లుట్ (4) ల్రుట్ (5) లేట్ (6) లోట్ (7) లఙ్ (8) లిఙ్ (9) లుఙ్ (10) ల్రుఙ్ అని.



ISSN No.2319-3905

లట్ – వర్తమాన కాలమునందును.

లేట్ – వేదమునందును

లుఙ్, లఙ్, లిట్ } —— భూత కాలము నందును.

లిఙ్, లోట్టులు } —— విధ్యర్థమునందును, ఆశీరర్థమునందును

ల్రుఙ్, ల్రుట్, లుట్టులు } —— భవిష్యదర్థమునందు వచ్చును.

ఈ తిఙంత పదములు ణ్యన్త, సన్నన్త, యఙన్త, యఙ్లుగన్త, నామధాతు అను ప్రకరణములయందు ప్రయోగింప బడుతున్నాయి. ఇది తిఙంతపదములయొక్క సంక్షిప్త చరిత్ర.

సంస్కృత భాషయందలి సుబంతపదముల పరిశీలనయే సంస్కృతభాషయందలి విభక్తి వైచిత్రి. ఈ భావమును గ్రహించియే **భట్టోజిదీక్షితులుగారు** **వైయాకరణసిద్ధాన్తకౌముది** యందు కారకపరిచ్ఛేదనమున ఏ ఏ విభక్తులు ఏ ఏ సందర్భమునందు వచ్చునో, ఆ విషయములను సూత్రములద్వారా అందరికి అర్థమయే రీతిలో సోదాహరణముగా బోధించినారు.

ఆ విషయములన్నిటిని నా వ్యాసమునందు నిరూపించుటయే నా యొక్క ప్రధానోద్దేశ్యము. దీనివలన వాక్యనిర్మాణము నందు సమగ్రమైన బోధ కల్గుతుంది. దానివలన భావబోధన సుస్పష్టంగా కలుగుతుంది.

సంస్కృతభాష యందలి విభక్తివైచిత్రియే కారకజ్ఞానానుశీలనము. కారకములనగా క్రియను చేయునవి = క్రియతో నన్వయము కలవి అని అర్థము. కారక పద నిర్వచనము :-

1. **కారక ఇతి మహతీ సంజ్ఞా క్రియతే, సంజ్ఞా చ నామ యతో న లఘీయః తత్ర మహత్యాః సంజ్ఞాయాః కరణే ఏతత్ ప్రయోజనమన్వర్థసంజ్ఞా యథా విజ్ఞాయేత కరోతీతి కారకమితి (మ.భా. 1-4-23)**
2. **కరోతీతి కారకమ్ (మ.భా. 1-4-23)** క్రియను జనింపచేయునది కారకము. కరోతీతి కారకమితి ? సాధ్యత్వేన క్రియైవ శబ్దాత్ ప్రతీయత ఇతి క్రియాయాః నిర్వర్తకస్య కారకసంజ్ఞాఽపాదానాదిసంజ్ఞా చ ప్రవర్తతే। (క్రైయట –ప్రదీప 1.4.23)
3. **క్రియానిమిత్తం కారకమ్ ।** (సరస్వతీకంఠాభరణ 1.1.32)
4. **యత్ క్రియానిమిత్తమాత్రం ప్రధానమ్ అప్రధానమ్ వా తత్ కారకమ్ ।** (కారక 221 వృత్తి)

5. **క్రియానిష్పత్తి కారకం కర్త్రాది కారకసంజ్ఞం భవతి ।** (గోపీచంద్ర – సంక్షిప్తసారటీకా)
6. **క్రియానిష్పాదకత్వం కారకత్వమ్ ।** (నాగేశ–మంజూషా)
7. **క్రియాసమ్బద్ధ విశేషి కారకమ్ ।** (హరినామామృత– వ్యాకరణ 4.10)
8. **క్రియాన్వయిత్వం కారకత్వమ్** అనగా ప్రత్యక్షంగా గాని పరోక్షంగా గాని క్రియతో సంబంధించునది కారకము.
9. **కరోతి క్రియాం నిర్వర్తయతీతి కారకమ్.** కారకమనగా క్రియను పుట్టించునది.
10. **ఏవం చ సతి న ద్రవ్యమాత్రం కారకమ్, న క్రియామాత్రం కారకమ్, కిం తర్హి క్రియాసాధనమ్, క్రియావిశేషయుక్తం కారకమ్. యత్ క్రియా సాధనం స్వతస్త్రం స కర్తా, న ద్రవ్యమాత్రం, న క్రియామాత్రమ్ । క్రియయా వ్యాప్తుమిష్య మాణతమం కర్మ, న ద్రవ్యమాత్రం న క్రియామాత్రమ్ । ఏవం సాధకతమాదిష్వపి (న్యాయభాష్యం 2.1.16)**

అని విభక్తులకు సార్థకనామము. **పాణిని కారకే (పా.సూ.1–4–23)** అని అధికారసూత్రమును చెప్పి **తత్ప్రయోజకోహేతుః చ (1–4–55)** అను సూత్రమువరకు, పదములు వరకు **ముప్పదిమూడు** సూత్రములతో కారకవ్యవస్థను చేసెను. **పాణిని** మతంలో కారకములు ఆరు – కర్త, కర్మ, కరణం, సంప్రదానం, అపాదానం, అధికరణం అని చెప్పెను :–

**కర్తా కర్మ చ, కరణం సమ్ప్రదానం తథైవ చ**
**అపాదానాऽధికరణం చేత్యాహుః కారకాణి షట్ ॥ (పాణిని–అష్టాధ్యాయి 2.3.50).**

హేతువు స్వతంత్రమైన కారకము కాదు. అది కర్తయొక్క భేదము. సంబంధము కూడా కారకము కాదు. దానిని శేషః అని వ్యవహరించినారు.

**కారకబోధతాలికా**




H వైయాకరణమతే సంబన్ధస్య కారకత్వం నాస్తి. తథా చాత్ర సంగ్రహః – కర్తా కర్మ చ కరణం, సంప్రదానం తథైవ చ ।
అపాదానధికరణ మిత్యాహుః కారకాణి షట్ ॥



ISSN No.2319-3905

**1. కర్తృకారకము :** ఈ కారకమునందు ప్రథమా విభక్తి వచ్చును. ప్రథమావిభక్తి ప్రాతిపదికార్థమును, లింగమును, పరిమాణమును, వచనమును (సంఖ్యను) మాత్రము సూచించును. **ప్రాతిపదికార్థలింగపరిమాణవచనమాత్రే ప్రథమా (2–3–46).**

**నియతోపస్థితికము** ప్రాతిపదికార్థము. అనగా నియతమైన ఉపస్థితి కలది ప్రాతిపదికార్థము. ఏ శబ్దమును వినుటతోడనే యే యర్థము నియతముగా స్మరింపబడునో ఆ అర్థము ఆ శబ్దముయొక్క ప్రాతిపదికార్థమని తాత్పర్యము. ఉదా : రామ అను పదమును వినుటతోడనే దశరథుని పుత్రుడగు ఒక వ్యక్తి మనస్సున స్మరింపబడును. కావున దశరథపుత్రుడు అనునది రామశబ్దము యొక్క ప్రాతిపదికార్థము. ఈ అర్థమును చెప్పుటకు ప్రథమాంతపదము ఉపయోగింపబడును. ఉదా : ఉచ్చైః (ఎత్తు) నీచైః (పల్లము) ఇవి రెండును అవ్యయములు. నియతమైన అర్థములను చెప్పుటకు ప్రథమాంతములుగా ఇచట గ్రహింపబడినవి. కృష్ణః = (వసుదేవుని కుమారుడు) శ్రీః = (లక్ష్మి) జ్ఞానమ్ = (తెలివి) ఇచట ప్రథమావిభక్తిని వానికి నియతమైన అర్థమును చెప్పుటకు ఉపయోగించితిమి. అనగా వాక్యములో ఇతర పదములతోను ఎట్టి సంబంధమును వ్యక్తము చేయక ఇచట వాని నియతార్థమును మాత్రమే చెప్పితిమని తాత్పర్యము. ఇట్లు కేవల ప్రాతిపదికార్థమును చెప్పుటకు ద్వితీయాది విభక్తులు ఉపయోగింపరాదని భావము. కావుననే నిఘంటవులలో పదములన్నియు ప్రథమా విభక్త్యంతములుగా చూపబడును.

అట్లే ఆ యా శబ్దములకు గల లింగమును వివక్షించునపుడును ప్రథమావిభక్తి వచ్చును. ఇందొక విశేషము కలదు. ప్రాతిపదికార్థము వివక్షింపక కేవల లింగమునకు, పరిమాణమునకును ప్రతీతియుండదు. అవి ప్రాతిపదికార్థ వివక్ష ఉన్న తరువాతనే ఉండును. కావున ప్రాతిపదికార్థముతో పాటు అధికముగా లింగము, పరిమాణము వివక్షించునపుడు, శబ్దము ప్రథమాంతమగును. ఉదా :– తటః, తటీ, తటమ్. తటశబ్దము అనియత లింగము. కొన్ని శబ్దములు నియతలింగములు. అనగా అవి యేదో ఒకే లింగంలో నుండును. కొన్ని శబ్దములు అట్లుకాక యథాసంభవముగా రెండు లింగములలో గాని, మూడు లింగములలోని గాని ఉండవచ్చును. ఇది (తట శబ్దము) తటః (పుంలింగము) తటీ (స్త్రీ లింగము) తటమ్ (నపుంసక లింగము).

**పరిమాణమనగా –** కొలత లేక ప్రమాణము దానినభివ్యక్తము చేయవలసినప్పుడును ప్రథమావిభక్తి వచ్చును. ప్రాతిపదికార్థముతో పాటు అధికముగా పరిమాణార్థము చెప్పవలసి వచ్చినపుడును ప్రథమావిభక్తి వచ్చును. ఉదా : ద్రోణో వ్రీహిః । ద్రోణమనునది ఒక కొలపాత్ర వంటిది. కావున ద్రోణః అను ప్రథమాంతపదము ద్రోణ ప్రమాణము గల వ్రీహి (ధాన్యము) వ్యక్తము చేయుచున్నది.

**వచనమనగా** సంఖ్య. కేవల సంఖ్యను తెలుపునపుడు కూడ ప్రథమావిభక్తి చేరును. ఉదా : ఏకః (ఒకడు ఒకటి) ద్వౌ (రెండు, ఇద్దరు) బహువః (చాల, చాలమంది).

**సంబోధనే చ (2-3-47)** సంబోధనమునందును ప్రథమావిభక్తి అగును. **సంబోధనమనగా** అభిముఖముగా లేని వానిని అభిముఖునిగా చేసికొనుట అర్థాత్ - ఎదుటనున్న వానిని పిలుచుట) హే రామ! మాం పాహి! ఇచట రామ అనునది ప్రాతిపదికము. 'హే' అనునది ముందు చేర్చబడెను. ఇచ్చట సంబోధ్యవాచకము (పిలువబడు వ్యక్తిని తెలుపు పదము).

**2. కర్మ కారకము :-** ఈ కర్మ కారకమునందు ద్వితీయావిభక్తిని గ్రహించవలయును.

కర్తకు, క్రియచేత పొందుటకు మిక్కిలి ఇష్టమైన కారకము "కర్మము" అను సంజ్ఞపేరు. **కర్తు రీప్సితతమం కర్మ (1-4-49)**.

**ఈప్స** అనగా పొందవలెనను కోరిక (**ఆప్తుమిచ్ఛా ఈప్సా**) **ఈప్సితము** - కోరబడినది. **ఈప్సితతమము** - మిక్కిలిగా కోరబడినది. కర్త, తాను చేయు క్రియచేత దేనిని పొందవలెనని మిక్కిలిగా కోరునో దానిని కర్మమందురు. ఉదా :- మోదకాన్ అత్తి. (మోదకములను తినుచున్నాడు). అను వాక్యమునందు అత్తి అను క్రియ ద్వారా కర్త మిక్కిలిగా పొందవలయునని అభిలషించిన పదార్థము మోదకములు. అవి కర్మ సంజ్ఞ కలవి అగును. ద్వితీయావిభక్తి వచ్చినది.

అనభిహితమైన కర్మమునందు వర్తమానమగు ప్రాతిపదికమునకు ద్వితీయవచ్చును. **కర్మణి ద్వితీయా (2-3-2)**.

**అభిహితము** - ఉక్తము అనగా చెప్పబడినది. దేనిచే చెప్పబడినది అను ఆకాంక్ష కలుగగా **'తిజ్'** మున్నగు వానిచే అను అర్థము సిద్ధమగును. **అనభిహితమనగా** - అనుక్తము - చెప్పబడనిది. కర్మ వాచకము **తిజ్** మున్నగు వానిచేత చెప్పబడని సందర్భమున దానికి (కర్మవాచక ప్రాతిపదిమునకు) ద్వితీయా వచ్చును. ఉదా : **హరిం భజతి** (హరిని సేవించుచున్నాడు) ఇచట **భజతి** అను క్రియలోని 'తిప్' ప్రత్యయము కర్త్రర్థమున విధింపబడినది. కావున అది చేరిన పదము **భజతి** అనునది కర్తను బోధించును కాని కర్మను బోధింపదు. కావున ఇచ్చట కర్మ వాచకమగు హరి అనునది అనభిహితము. అట్టి దానికి ద్వితీయావిభక్తి వచ్చును.

**అనభిహితే** అనుటవలన కర్మవాచకము తిజాదులచే అభిహితములైనపుడు ద్వితీయ రాదు. అచట పై సూత్రముచే ప్రథమయే వచ్చును. ఉదా : **హరిః సేవ్యతే ।** (హరి సేవింపబడుతున్నాడు) ఇచట తిజ్ (క్రియావిభక్తి) (ప్రత్యయము కర్మార్థమున విధింపబడినది. కావున అది కర్మమునే చెప్పుచున్నది. కాని ఇచట కర్మము అభిహితము. దానికి ప్రాతిపదికార్థమున ప్రథమావిభక్తి వచ్చినది. ఇచట హరి - కర్మము సేవించువాడు కర్త. అలాగే లక్ష్మ్యా సేవితః (లక్ష్మిచే సేవింపబడినవాడు). ఇచ్చట క్త ప్రత్యయములు కర్మార్థమున విధింపబడినది. అనగా అది చేరిన పదము కర్మమును బోధించునని తాత్పర్యము. కావున ఇచట కర్మము కృత్ప్రత్యయముచే ఉక్తమైనది. అగుటచే కర్మవాచకమునకు ద్వితీయ రాదు. ప్రథమ వచ్చినది **లక్ష్మ్యా సేవితః ।**

అపాదానాది విశేషములచేత వివక్షితము కాని కారకము కూడ కర్మమనబడును **అకథితం చ (1-4-51)**.



ISSN No.2319-3905

**కారికా :- దుహ్యాచ్పచ్దణ్డరుధిప్రచ్ఛిచిబ్రూశాస్జిమథ్ముషామ్ ।**
**కర్మయుక్ స్యాదకథితం తథా స్యాన్నీహృకృష్వహామ్ ॥**

దుహ్, యాచ్, పచ్, దణ్డ్, రుధ్, ప్రచ్ఛ్, చి, బ్రూ, శాస్, జి, మథ్, ముష్ అను వానియొక్కయు, నీ, హృ, కృష్, వహ్ అను ధాతువులయొక్క ప్రధానకర్మముతో సంబద్ధమైన దానిచే ఇట **అకథిత**శబ్దముచే గ్రహింపవలయును.

పూర్వము **'కర్తురీప్సితతం కర్మ' (1-4-49)** అను సూత్రముచే కర్మసంజ్ఞ విధింపబడినది. అది మాత్రమే కాక వేరు విధమైన కర్మమును కలదు. అదియే ఈ సూత్రముచే చెప్పబడినది.

**కథితమనగా** చెప్పబడినది. చెప్పబడనిది **అకథతము**. చెప్పబడనిదేది? అను ఆకాంక్షవలన నీ సందర్భమున చెప్పబడినవి కాక తక్కినది అని అర్థమగును.

ఈ కారక ప్రకరణమున **కర్మము, కరణము, కర్త, సంప్రదాయము, అపాదానము, అధికరణము** అను ఆరు సంజ్ఞలు ఆ యా నిర్వచనములతో చెప్పబడినవి. వీనిలోనికి రానిది ఇచట అకథితము. దానికి కూడ కర్మ సంజ్ఞను ఈ సూత్రము విధించుచున్నది. ఉదా : గాం దోగ్ధి పయః (ఆవు నుండి పాలు పిదుకుచున్నాడు) ఇచట దోగ్ధి - పిదుకుచున్నాడు అను క్రియచే కర్తకు ఈప్సితతమైనది. పయస్సు పాలు అది కర్మము. ఈ వాక్యమునందలి **'గామ్'** అను పదము కర్తకి ఈప్సితతమమైనది కాదు. కావున ఈ సూత్రముచే దీనికి కర్మ సంజ్ఞ సిద్ధింపదు. కాక కరణము, కర్మ సంప్రదానము, అపాదానము, అధికరణము అను సంజ్ఞలలోని ఏదియు దీనికి కలుగదు. కావున ఇది **అకథితమైనది** అగుటచే నీ సూత్రముచే దానికి కర్మసంజ్ఞ కలుగును. కర్మ వాచకమునకు ద్వితీయవిభక్తి వచ్చును. కావున దీనికి ద్వితీయావిభక్తి వచ్చినది.

కాని దీనికి ఇంతస్థూలముగాను అర్థము చెప్పుకొనుటలో ఒక చిక్కు కలదు. **"నటస్య గాథాం శృణోతి"** నటుని గాథను వినుచున్నాడు. అను వాక్యమున **'నటస్య'** అను పదము కూడ కరణాదులచే **అకథితమే** అగును. కావున అది కూడ కర్మవాచకము కావలసివచ్చును. అది ఇష్టము కాదు. కావున కొన్ని కొన్ని ధాతువులయొక్క ప్రధానకర్మముతో సంబంధము కలిగి, కరణాది విశేషసంజ్ఞ చెప్పబడని దానికే ఈ కర్మసంజ్ఞ కలుగునని ఈ **కారికలో** నాధాతువుల నిర్దేశము చేయుటవలన చెప్పబడినది. ఆ ధాతువులు ఇవి - దుహ్ - పిదుకు, యాచ్ - అడుగుకొను, పచ్ - వండు, దణ్డ్ = దండించు, రుధ్ - నిరోధించు, ప్రచ్ఛ్ = ప్రశ్నించు, చి = కూడబెట్టు, బ్రూ = చెప్పు, శాస్ - శాసించు, జి - జయించు, మథ్ - చిలుకు, ముష్ - దొంగిలించు అను పంద్రెండు ధాతువులయొక్కయు, నీ - నడవు, హృ= హరించు, కృష్ - లాగు, వహ్ = మోయు వహించు అను నీ నాలుగు ధాతువులయొక్కయు ప్రధాన కర్మముతో సంబంధము కలదియై కరణాది విశేషసంజ్ఞలు పొందుటకు వీలులేనిది. ఇచట అకథితమైనదిగా పరిగణింపబడి కర్మ వాచకమై ద్వితీయావిభక్తిని పొందునని ఈ **కారికయొక్క తాత్పర్యము**. అనగా నీ ధాతువులు ద్వికర్మకములని తాత్పర్యము. అందు కర్తకు క్రియచే ఈప్సితతమమైనది ముఖ్యకర్మము

లేక ప్రధాన కర్మమనియు దానికి సంబంధించిన రెండవ కర్మము అముఖ్యకర్మమనియు (indirect object) అందురు.

(1) గాం దోగ్ధి పయః = ఆవునుండి పాలు పిదుకుచున్నాడు. ఇందు ముఖ్యకర్మము పాలు, అముఖ్యకర్మము గోవు.

(2 బలిం యాచతే వసుధామ్ – బలిని భూమిని యాచించుచున్నాడు. ఇచట భూమి ముఖ్యకర్మ, బలి అముఖ్యకర్మము.

(3) తణ్డులానోదనం వచతి (4) గర్గాన్ శతం దణ్డయతి (5) వ్రజమవరుణద్ధిగామ్ (6) మాణవకం పన్థానం పృచ్ఛతి (7) వృక్షమవచినోతి ఫలాని (8,9) మాణవకం ధర్మం బ్రూతే శాస్తి వా (10) శతం జయతి దేవదత్తమ్ (11) వసుధాం క్షీరనిధిం మథ్నాతి (12) దేవత్తం శతం ముష్ణాతి.

13 నుండి 16 **గ్రామమజాం నయతి హరతి కర్షతి వహతి. వా** గ్రామమునందు మేకను తీసికొనిపోవుచున్నాడు. హరించుచున్నాడు, లాగుచున్నాడు, మోయుచున్నాడు చేర్చుచున్నాడని తాత్పర్యము. ఇందు అజము ముఖ్యకర్మము, గ్రామము అముఖ్యకర్మము.

పైన పేర్కొనిన అముఖ్యకర్మములన్నియు నీ సూత్రముచే కర్మసంజ్ఞ పొందినవై ద్వితీయాంతములయినవి. ఇందు అపాదానాదులు వివక్షితములైనచో పంచమీ విభక్త్యాదులు వచ్చును. ఉదా :– గోః దోగ్ధి పయః – గోవు నుండి పాలను పిదుకుచున్నాడు మొదలగునవి.

ఈ కారికయందు పేర్కొనిన ధాతువులు మాత్రమే కాక ఆ యర్థముగల ఇతర ధాతువులయొక్క అముఖ్యకర్మలకును ఈ విధి వర్తించునని **"అర్థనిబన్ధనేయం సంజ్ఞా"** అను వాక్యము తెలుపుచున్నది. ఈ సంజ్ఞ అర్థము కారణముగా గలది అని అర్థము కావున **యాచ్** ధాతువుయొక్క అర్థమే కల **భిక్ష్** ధాతువుయొక్క కర్మముతో సంబంధము గలదియు కర్మమే అగును.

**3. కరణ కారకము :–** ఈ కరణ కారకమునందు తృతీయావిభక్తి వచ్చును. క్రియయందు స్వాతంత్ర్యముతో వివక్షింపబడును. అర్థము కర్త అనబడును. **స్వతంత్రః కర్తా (1–4–54)**.

క్రియను నెరవేర్చుటలో ప్రధానభూతమైనది కర్త అనబడును. ప్రధానభూతమనగా మరియొక దానిపై ఆధారపడక ప్రవర్తించునది అని అర్థము. **"సూదః అన్నం పచతి"** వంటవాడు (అన్నమును వండుచున్నాడు) అనుచోట పచనము చేయుట అను క్రియను నిర్వహించుటలో అనగా ప్రొయ్యిలో మంట నేర్పరచుట, గిన్నె దాని పైని పెట్టుట, బియ్యము పోయుట, మున్నగు పనిని చేయుటలో సూదకునకు స్వాతంత్ర్యము కలదు (**స్వాతంత్ర్యమనగా ప్రాధాన్యము**) గిన్నె, బియ్యము, పొయ్యి మున్నగువాని కట్టి స్వాతంత్ర్యము లేదు. కావున సూదకుడిట స్వతంత్రుడు కావున కర్త. కొండొకయెడ స్వాతంత్ర్యము లేకపోయినను ఉన్నట్లు భావించుట జరుగును. కావున స్వాతంత్ర్యముచేత వివక్షితమైన అర్థము అని చెప్పబడినది. ఉదా :– స్థాలీ పచతి గిన్నె వండుచున్నది.



ISSN No.2319-3905

ఇచట వస్తుత గిన్నెకు వండుటలో స్వాతంత్ర్యము లేదు గాని అది ఇచట వివక్షింపబడినది. (వివక్షయనగా వక్తకు గల చెప్పవలయునను కోరిక).

**క్రియాసిద్ధి**యందు ప్రకృష్టోపకారకము కరణము. **సాధకతమం కరణమ్ (1–4–42)** అను పాణిని సూత్రము. క్రియా **సిద్ధియనగా** ఒక పని అగుట. **సాధకమనగా** సాధించుటకు ఉపయోగింపబడు వస్తువు. సాధకతమమనగా మిక్కిలిగా సాధించునది. అనగా దేనితో ఫలముయొక్క ప్రాప్తి అగునో అది **సాధకతమము**. అట్టి దానికి కరణమని పేరు.

అనభిహితములగు కర్తృకరణములకు తృతీయావిభక్తి విధింపబడుచున్నది. **కర్తృకరణయోస్తృతీయా (2–3–18)** అనభిహితమైన కర్తృకరణములకు తృతీయవచ్చును. ఉదా :– రామేణ బాణేన హతో వాలీ (రామునిచే బాణముతో వాలి హతుడయ్యెను).

క్రియా సిద్ధియందు స్వాతంత్ర్యము కలది కర్తయనియు, ప్రకర్షముగాను ఉపకరించు సాధనము కరణమనియు తెలుపబడినది. అవి రెండును తిఙాదులచే తెలుపబడనియపుడు వానిని తెలుపు పదములు తృతీయాంతములగునని సూత్ర తాత్పర్యము. ఉదా : రామేణ బాణేన హతో వాలీ. ఇచట 'హతః' అను కృదంతము కర్మ వాచకమగు **"వాలి"**ని చెప్పుచున్నది. కర్తయగు రాముడు గాని, కరణమగు బాణము గాని అభిహితము లగుట లేదు. చంపుట అను వ్యాపారముతో స్వాతంత్ర్యము కలవాడగుటచే రాముడు కర్త. చంపుటకు మిక్కిలిగా ఉపకరించిన సాధనమగుటచే బాణము కరణము. ఇవి రెండును ఇచట ధాతువునకు చేరిన ప్రత్యయముచే అనభిహితములగుటచే అవి తృతీయను పొందినవి రామేణ – తృతీయాంతము – కర్త; బాణేన – తృతీయాంతము – కరణము.

**అనభిహితే** అనుటవలన కర్తృ కరణములు **అభిహితము**లైనచో ప్రథమా విభక్తియే వచ్చును. ఉదా :– రామో వాలినం హతవాన్. రాముడు వాలిని చంపినవాడు. ఇచటి క్తవతు ప్రత్యయము కర్తను చెప్పును. కావున కర్త ఇట అభిహితము ఉక్తము చెప్పబడినది.

**4. సంప్రదాన కారకము :–** సంప్రదానార్థమున చతుర్థియగునని చెప్పబడుచున్నది. దానముయొక్క కర్మముచేత నెవనిని అభిప్రీతుని గావించునో అతడు సంప్రదానమనబడును. **కర్మణా యమభిప్రైతి స సంప్రదానమ్ (1–4–32)**. **సంప్రదీయతే అస్మై ఇతి సంప్రదానమ్ –** ఈతనికి (ఒక వస్తువు) ఈయబడును. అను అర్థమునను ఇది అన్వర్థమగు సంజ్ఞ. కర్మణా అనుటలో దేని కర్మము అను ఆకాంక్షచే దానముయొక్క కర్మముచేత అను నర్థము సిద్ధించును. ఇచ్చుట అను వ్యాపారములో ఫలమైన కర్మసంజ్ఞ కలదానిచే కర్త ఎవనిని అభిముఖముగా వచ్చునట్లు చేసికొనునో ఆతడు లేక అది **సంప్రదానమన**బడును. అనగా త్యాగమునకు **ఉద్దేశ్యమైన** వ్యక్తి అని తాత్పర్యము. ఇచ్చుట అను వ్యాపారములో ఇచ్చువాడు కర్త. ఈబడువస్తువు కర్మము, పుచ్చుకొనువాడు సంప్రదాన సంజ్ఞుడు అని ఫలితార్థము.

అనభిహితమైన సంప్రదానమున చతుర్థి అగును. **చతుర్థీ సంప్రదానే (2-3-13)**. ఉదా :- **విప్రాయ గాం దదాతి**. (విప్రునికొరకు గోవు నిచ్చుచున్నాడు). ఇచట **'దదాతి'** అను క్రియ ఇచ్చెడు వ్యక్తిని చెప్పుచున్నది. ఇందు త్యాగము చేయబడు గోవు కర్మము. దానిచే అభిప్రీతుడగు వ్యక్తి విప్రుడు, త్యాగమునకు లక్ష్యమతడు. కావున సంప్రదాన సంజ్ఞ కలుగుటచే విప్రశబ్దమునకు చతుర్థి వచ్చినది (విప్రాయ).

**నమః స్వస్తి స్వాహాస్వధాలం వషడ్యోగాచ్చ (2-3-16). నమః స్వస్తి, స్వాహా, స్వధా, అలం, వషట్** అనుపదములతో యోగమున్న శబ్దమునకు చతుర్థీవిభక్తి చేరును. ఉదా :- హరియే మొదలగునవి. ఇచట అలమ్ అనునది పర్యాప్త్యర్థకము, దానిచే దైత్యేభ్యో హరిరలమ్, ప్రభుః, సమర్థః, శక్తః ఇత్యార్థం ఇచట గ్రాహ్యము.

నమః మున్నగు పదములతో యోగము - సంబంధము గల శబ్దములకు చతుర్థీవిభక్తి వచ్చునని సూత్రార్థము. నమః అనుటతోడనే ఎవరికి? అను నాకాంక్ష పుట్టును. ఎవరో వ్యక్తి చెప్పబడును. ఆ వ్యక్తిని తెలుపు శబ్దమునకు చతుర్థీ విభక్తి చేరును. ఇచట సంప్రదానార్థము లేకుండుటచే పూర్వసూత్రముచే చతుర్థి సిద్ధింపకపోవుటవలన మరల విధింపబడినది. ఉదా : హరయే నమః - ఇచట నమః అను శబ్దముతో యోగముగల హరిశబ్దమునకు చతుర్థి వచ్చినది (హరయే చతుర్థ్యంతము) ఈ విధముగానే **ప్రజాభ్య స్వస్తి అగ్నయే స్వాహా, పితృభ్యః, స్వధా, అలమితి హరిరలమ్, ప్రభు, సమర్థః, శక్తః** అను ప్రయోగములును కూడా గ్రహించాలి.

ఇచట **ఉపపదవిభక్తి** - అనగా **క్రియాసిద్ధి** కొఱకు ఏర్పడినది కాక సన్నిహితముగా నున్న పదమును బట్టి యేర్పడిన విభక్తి. **"ఉపపదవిభక్తేః కారక విభక్తిః బలీయసీ"** 'ఉపపద విభక్తికంటె కారక విభక్తి బలీయసి' అను న్యాయమును అనుసరించి క్రియాన్వయమున్నపుడు **'నమః'** మున్నగు పదములతో యోగమున్నను చతుర్థి కాక యోగ్యతను బట్టి ఇతరవిభక్తి వచ్చుట సంభవించును.

**5. అపాదాన కారకము :-** అపాదానకారకర్థమున పంచమీ విభక్తి సంజ్ఞ వివరింపబడుచున్నది. **అపాయమనగా** విశ్లేషము అదియగునపుడు **ధ్రువము**. అనగా అవధిభూతమైన కారకము అపాదానమనబడును. **ధ్రువమపాయేఽపాదానమ్ (1-4-24)**.

**అపాయమనగా** - ఒకటి ఒకదాని నుండి తొలగిపోవుట కలిసియున్న స్థితి నశించి వేరుగానగు స్థితికి వచ్చుట అని తాత్పర్యము. అట్టిది కలుగునపుడు ఏది **ధ్రువమో** అనగా **అవధిభూతమో** అనగా దేని నుండి వస్తువు దూరమగుచున్నదో దానికి **అపాదానమని** పేరు. ఈ యవధి భూతమైన వస్తువు స్థిరము వచ్చును. చలము కావచ్చును చెట్టు నుండి ఆకు పడుచున్నది. అనుచోట చెట్టునకును ఆకునకును కల సంశ్లేషస్థితి (కూడియుండు స్థితి) పోయి విశ్లేషము కలిగినది. అందు ధ్రువంగా నుండునది చెట్టు. కావున దానిని చెప్పు పదము అపాదానసంజ్ఞ కలది అగును.



ISSN No.2319-3905

విశ్లేషము జరిగినపుడు (రెండు వస్తువులకు లేక వ్యక్తులకు లేక వస్తువునకు వ్యక్తికి వేరుపాటు అను వ్యాపారము కలిగినపుడు) ధ్రువముగా నుండునది **అపాదానమని** చెప్పబడినది. తిఙాదులచే చెప్పబడని అపాదాన వాచకమునకు పంచమీ విభక్తి వచ్చును. **అపాదానే పఞ్చమీ (2-3-28)**. ఉదా :- **గ్రామాత్ ఆయాతి** (గ్రామమునుండి వచ్చుచున్నాడు) ఇచ్చట వచ్చు వ్యక్తికి గ్రామముతో విశ్లేషము కలిగినది. అందు **ధ్రువముగా** ఉన్నది గ్రామము. అది అపాదానసంజ్ఞ కలది అగును. కావున పంచమీ విభక్తి వచ్చినది (గ్రామాత్).

**ధ్రువము** అనగా అవధిభూతము - విశ్లేషము దేనివలన నయినదో అది అనియే అర్థము. కాని కదలకుండునది అని అర్థముకాదు. దీనిని స్పష్టము చేయుటకై మరియొక ఉదాహరణము చూపబడుచున్నది.

**ధావతోఽశ్వాత్పతతి** - (పరుగెత్తుచున్న గుఱ్ఱమునుండి పడుచున్నాడు) ఇచ్చట పతనక్రియ దేనినుండి జరిగినదో అది ధ్రువము. అది అశ్వము. ఆ అశ్వము కదలిక లేనిది కాదు పరుగిడుచున్నది. కావున **ధ్రువమనగా** విశ్లేషములో ఒక అవధి (మేర) అనియే కాని కదలికలేనిది అని అర్థము కాదు. ఇచట అశ్వము అపాదానము. కావున పంచమి వచ్చినది.

సంస్కృత విశేషణ, విశేష్యములను లింగవిభక్తి వచనములు సమానముగాను ఉండవలయును. నియమముచే **'అశ్వాత్'** అనుదానికి విశేషణమగు **ధావతః** అనునదియు పంచమ్యన్తమే అయినది.

**(యల్లిఙ్గం యద్వచనం యా చ విభక్తి ర్విశేషస్య । తల్లిఙ్గం తద్వచనం సా చ విభక్తిర్విశేషణస్యాపి ॥)**

**(విశేష్యము - వ్యవచ్ఛేదము - అనగా - వేరు చేయబడునది). (విశేషణము - వ్యవచ్ఛేదము అనగా వేరుచేయునది).**

**సంబంధకారకము :-** సంబంధార్థకారకము షష్ఠీ విభక్తిని చెప్పుతున్నది **షష్ఠీ శేషే (2-3-50)** కారకము. ప్రాతిపదికార్థము అనువాని కంటె వేరైనదనియు, స్వస్వామి భావము మున్నగునదియునగు సంబంధము శేషము. దానియందు షష్ఠి అగును.

**శేషమనగా** మిగిలినది అని అర్థము. ప్రథమా, ద్వితీయా, చతుర్థీ, పంచమీ, సప్తమీ విభక్తులు క్రమముగా ప్రాతిపదికార్థాదులయందును, కర్మమునను, కర్తృ కరణములందును, సంప్రదానమునను, అపాదానమునను, అధికరణమునను విధింపబడినవి. కావున కర్మాదికారకములందును, ప్రాతిపదికార్థము నందును చేరని అర్థమిట **శేషపదముచే** చెప్పబడును. ఆ మిగిలిన అర్థము సంబంధము అది స్వస్వామి సంబంధము, (వస్తువునకు దానిని కలిగియున్న వ్యక్తికి గల సంబంధము - స్వమ్ = ధనమ్, స్వామి - అది కలవాడు) అవయవావయవి సంబంధము (అవయవములకు, అవయవములు కలదానికి కల సంబంధము) జన్యజనక సంబంధము (పుట్టినవానికి పుట్టించినవానికి గల సంబంధము) మున్నగు పేరులతో అనేక

విధములుగా కలదు. ఆ సంబంధార్థమును **తెలుపుటయందు షష్ఠీవిభక్తి ప్రయోగింపబడునని సూత్రార్థము. ఇది కారకము కాదు. నీ షష్ఠ్యంత పదము సూటిగా క్రియతోను అన్వయింపదు.**

ఉదా! **రాజ్ఞపురుషః** – రాజుయొక్క పురుషుడు. ఇచట రాజు స్వామి లేక సేవింపబడువాడు (సేవ్యుడు) పురుషుడు అతనికి సంబంధించిన వ్యక్తి. సేవకుడు – ఇచట సేవ్య సేవక భావస్వరూప సంబంధము కలదు. స్వస్వామి సంబంధమనియు చెప్పనగును. ఈ సంబంధమును తెలియజేయుటకై ఇచట రాజశబ్దమునకు షష్ఠీవిభక్తి వచ్చినది. (రాజ్ఞః) రాజసంబంధముగల పురుషుడని అర్థము.

**'వివక్షాతః కారకాణి భవన్తి'** అని యొక న్యాయము కలది. వక్తయొక్క ఇచ్ఛననుసరించి కారకములగును అని దాని అర్థము. కావున కర్మాదులకు కూడ సంబంధార్థమునే వక్త చెప్పగోరినయెడల కర్మాదులకు ద్వితీయాది విభక్తులు కాక షష్ఠియే వచ్చును. కర్మాది వివక్షయున్నచో ద్వితీయాది విభక్తులు వచ్చును.

ఉదా :– సతాం గతమ్ – గతమనగా గమనము (సతాం షష్ఠీ బహువచనము)

సర్పిషో జానీతే – నేతితో ప్రవర్తించుచున్నాడు (సర్పిషః షష్ఠీ ఏకవచనము)

మాతుః స్మరతి – తల్లిని స్మరించుచున్నాడు (మాతుః షష్ఠ్యేకవచనము)

ఏధోదకస్యోపస్కురుతే ఏధోదకములను సంస్కరించుచున్నాడు (ఏధోదకస్య – షష్ఠీ ఏకవచనము)

భజే శమ్భోశ్చరణయోః – శంభుని చరణములను సేవించుచున్నాను (చరణయోః – షష్ఠీ ద్వివచనము)

**6. అధికరణకారకము :–** ఈ అధికరణ కారకము యందు సప్తమీ విభక్తి వచ్చును. కర్తృ కర్మముల ద్వారమున వానియందున్న క్రియకు ఆధారమైన కారకము అధికరణమనబడును. **ఆధారోఽధికరణమ్ (1–4–45).**

**"ఆధ్రియతేఽస్మిన్ క్రియా"** దీనియందు క్రియ మిక్కిలిగా ధరింపబడును అని ఆధారశబ్దమునకు అర్థము. దేనికి ఆధారము ఆను ఆకాంక్షకు సమాధానముగా క్రియకు అని సిద్ధించినది. సాక్షాత్తుగా క్రియకు ఆధారమైనదానికి అధికరణ సంజ్ఞ కలుగదు. ఆ క్రియకు దానిని చేయుకర్త, ఏర్పడు ఫలమగు కర్మము అని దాని మూలమున, ఏది ఆధారమగునో అది అధికరణమనబడును. అనగా పాత్రయందు వండుచున్నాడు. అనునపుడు పాత్ర + వండుట అను క్రియకు ఆధారము. వండు వ్యక్తి గాని (కర్తగాని) వండబడు పదార్థము గాని (కర్మము) లేని యెడల వండుట అను వ్యాపారమునకు పాత్ర ఆధారము కాజాలదు. కావున కర్త, కర్మ అనివాని మూలముననే క్రియ యొక దాని యందుండును. అట్లు క్రియాకాధారమైన కారకమును అధికరణమందురు.



ISSN No.2319-3905

అధికరణమునందు సప్తమి వచ్చును. **సప్తమ్యధికరణే చ (2–3–36).** సూత్రములోని సముచ్చయార్థమగు 'చ' శబ్దమువలన పూర్వసూత్రము నందలి **(2–3–35) దూరాన్తికార్థేభ్యః** అనుపదము ఆకర్షింపబడును. కావున దూరము, అంతికము అను శబ్దములకు ఆ అర్థముగల ఇతర శబ్దములకును సప్తమి వచ్చునను అర్థము సిద్ధించును. ఔపశ్లేషికము, వైషయికము, అభివ్యాపకమని ఆధారము మూడు విధములు.

**(1) ఔపశ్లేషికము :–** ఉపశ్లేషమనగా సంయోగము రెండు వస్తువులు ఒకదానినొకటి అంటియుండుట. దానివలన నేర్పడినది ఔపశ్లేషికము. ఉదా :– కటే ఆస్తే – చాపయందున్నాడు. ఇచట చాపకును, దానిపైనున్న వ్యక్తిని సంయోగము భౌతికముగా కలదు. ఇందు ఉండుట అను క్రియ, ఉన్న వ్యక్తి మూలమున **'కటమ్'** అని దానియందు కలదు. కావున కటము ఆధారమగుటచే అధికరణ వాచకము. దానికి సప్తమీ విభక్తి వచ్చినది. (కటే సప్తమీ) ఇది ఔపశ్లేషికకు ఆధారమునకు ఉదారణము.

అట్లే స్థాల్యాం పచతి – పాత్రయందు వండుచున్నాడు. ఇది ఔపశ్లేషికమే. పచనక్రియ స్థాలిని అంటిపెట్టికొని స్థాలి (పాత్ర) యందున్నది. కావున స్థాలి పచన క్రియకు ఆధారము. కావున ఆధికరణ వాచకమైన సప్తమీ విభక్తిని పొందినది. (స్థాల్యామ్ స్త్రీలిం సప్తమీ ఏకచనము).

**(2) వైషయికాధారము :–** విషయముచే నయినది వైషయికము. సంయోగాది సంబంధము కంటె భిన్నమైన సంబంధముతో ఆధారమైనది వైషయికాధారము. ఉదా :– మోక్షే ఇచ్ఛాస్తి. మోక్షమును అందిచ్ఛకలదు. ఇచట మోక్షమునకు ఇచ్ఛకును సంయోగ సంబంధము లేదు. అనగా భౌతికమైన స్పర్శాదికము లేదని తాత్పర్యము. సమవాయ సంబంధము కూడా లేదు. సమవాయ సంబంధమనగా వస్త్రమునకు దారమునకునున్న సంబంధము వంటిది. దారములనే నిలువుగా అడ్డముగా నేయుటచే వస్త్రమేర్పడినది. దారములు తీసివేసినచో వస్త్రముండదు. మోక్షమునకు, ఇచ్ఛకును అట్టి సంబంధము కూడ లేదు. కావున ఇచట ఔపశ్లేషికాధారము లేదు. మోక్షవిషయకమైన = మోక్షము లక్ష్యముగా గల ఇచ్ఛయున్నదని తాత్పర్యము కావున దీనిని వైషయికాధారము అందురు. అట్లు ఆధారమగుటచే అధికరణ వాచకమైన మోక్షశబ్దమునకు సప్తమివిభక్తి వచ్చినది. (మోక్షే స.ఏ.)

**(3) అభివ్యావకము :–** ఆధేయము (వస్తువు) ఆధారము యొక్క అన్ని అవవయములయందును వ్యాపించియున్నచో అట్టి ఆధారమును అతివ్యాపకాధారమందురు. ఉదా :– సర్వస్మిన్నాత్మాస్తి. ఆత్మ అన్నిటియందును కలదు ఇచట ఆత్మకు ఆధారముగా చెప్పబడిన సర్వము అనునది ఆత్మలేని పదార్థము లేదను విషయమును దెలుపుచు అనగా చరాచర ప్రపంచమంతయు అణుమాత్రమైనను వదలుటకు వీలులేక ఆత్మయను దానిచే అంతటను వ్యాపింపబడియున్నదని తాత్పర్యము. ఇది అభివ్యాపకధారమునకు ఉదాహరణము.

దూరము, దగ్గఱ, అనునర్థములు గల శబ్దములకు సప్తమీ విభక్తి వచ్చును. ఉదా :

వనస్య దూరే – వనమునకు దూరమునందు, వనస్య ఆన్తికే – వనము యొక్క సమీపమునందు మొదలగునవి. ఇవి అధికరణ వాచకములు కాకపోవుటచే వేరుగా చెప్పబడినవి. ఈ శబ్దములకు దూరమ్, దూరాత్, దూరేణ ఇత్యాది విధముగా ద్వితీయా, పంచమీ, తృతీయా విభక్తులు కూడ రావచ్చును.

**ముగింపు :–** ఈ విధముగా భట్టోజిదీక్షితులవారి వైయాకరణసిద్ధాంతకౌముది అనుసరించి కారకప్రకరణమునందు కర్తృకారకమునందు ప్రథమావిభక్తి, కర్మ కారకమునందు ద్వితీయావిభక్తి, కరణకారకమునందు తృతీయా విభక్తి, సంప్రదాన కారకమునందు చతుర్థీ విభక్తి, అపాదాన కారకము నందు పంచమీ విభక్తి, **షష్ఠీశేషే (2–3–50)** అను సూత్రము అనుసరించి స్వస్వామిసంబంధమునందు షష్ఠీ విభక్తి (ఇది కారకము కాదు).

ఔపశ్లేషికము వైషయికము, అభివ్యాపకము అను మూడు ఆధారములతో కూడిన అధికరణమునందు సప్తమి విభక్తి వచ్చునని తెలియచున్నది. ఈ కారక విషయక తత్త్వచింతనము, తత్త్వ నిరూపణము, తత్త్వకథనము తెలియకుండగా వైదిక, లౌకిక, క్రియాకలాపములను యథావిధిగా నిర్వర్తించలేము. వాక్యము బోధనయందు, కర్త, కర్మ, క్రియ అనునవి ముఖ్యాంశములు. వాటియందు క్రియకు కారక ప్రకరణము సంబంధించినది. కారక చక్రమే మానవ జీవన బోధనచక్రము. ఇతోధికముగా కారక ప్రకరణ విషయములను తెలుసుకొనవలయునన్న కోరిక కల్గినచో :– **అష్టాధ్యాయి – పాణి, పరమలఘుమంజూష – నాగేశభట్టు, మహాభాష్యం – పతంజలి, వైయాకరణభూషణసారః కౌణ్డభట్టు, వాక్యపదీయమ్ – భర్తృహరి** గ్రంథములను పరిశీలించవలసి ఉన్నది. ఈ కారణముచేతనే వైయాకరణ పాఠ్యాంశములయందు కారకపరిచ్ఛేదము నేటికిని విద్యార్థులకు బోధింపబడుచున్నది.

– ఇతి శమ్ –

**ఉపయుక్తగ్రంథసూచి:**


1. వైయాకరణసిద్ధాన్తకౌముదీ శ్రీభట్టోజీదీక్షితః
2. వైయాకరణప్రబన్ధముక్తావలీ– డా॥ అశోకచన్ద్ర గౌడశాస్త్రీ
3. లఘుసిద్ధాంత కౌముదీ – శ్రీ మద్వరదరాజకృతా, వ్యాఖ్యాత – శలాక రఘునాథశర్మ
4. లఘు సిద్ధాన్తకౌముదీ –వ్యాఖ్యాతా, డా॥ పుల్లెల శ్రీరామచంద్రః
5. సంస్కృత వ్యాకరణ సంగ్రహము – డా॥ దివాకర్ల వేంకటావధాని
6. శబ్దరత్నావళిః శ్రీ గరణి వైయాకరణకృష్ణాచార్యేణ విరచితా, సంపాదక శ్రీ ఉడాలి సుబ్బరామశాస్త్రి




ISSN No.2319-3905

# 15

# తెలుగు సామెతలు – సాంఘిక, సాంస్కృతిక జనజీవన చిత్రణం

– డా. డి. జ్యోతమ్మ

ఏదైనా ఒక విషయాన్ని చెప్పేటప్పుడు పోలికకోసం చెప్పే వాక్యం 'సామెత'. 'సామెత'ను నానుడులు, సుద్దులు, జనశ్రుతులు, శాస్త్రములు, మాటలు అనే పదాలతో కూడా వ్యవహరిస్తారు. 'సామెత'కు బదులు తెలుగు సాహిత్యంలో లోకోక్తి, శ్లోకము, సామ్యము, జనవాదము, లోకహితోక్తి, నానుడి, నుడికారము పదాలు ఉపయోగించారు.

**సామెత నిర్వచనాలు**

**విదేశీయుల నిర్వచనాలు**

1. **అరిస్టాటిల్:** "Proverb is a remnant from old philosophy preserves amidst count less destructions by reason of its brevity and Fitness for use " (సంక్షిప్తత, ప్రయోగార్హత కారణాలుగా అసంఖ్యాకమైన ఆటుపోట్లకు ఎదురొడ్డి నిలిచిన ప్రాచీన జిజ్ఞాసా అవశేషమే సామెత)
2. **Cervantes:** "Short sentences drawn from long experience' (తరతరాల అనుభవం సృష్టించిన సంక్షిప్తవాక్యాలు సామెతలు)
3. **Bacon:** "Edged tools of speech" (పదునైన వాక్పరికరాలు సామెతలు)
4. **Hamid :** "A proverb is to speech what salt is to food" (భోజనానికి ఉప్పులాంటిది భాషకు సామెత)

**ఆంగ్ల నిఘంటువులు – సామెత నిర్వచనం**

(ఆక్స్‌ఫర్డ్ ఆంగ్లసామెతల నిఘంటువు) The oxford Dictionary of English proverbs "A short, pithy saying in common and recognised use"

(సార్వజనీనకంగా గుర్తించబడిన, సారవంతమైన, సంక్షిప్త వ్యక్తీకరణమే సామెత.)

**వివిధ విజ్ఞాన సర్వస్వాలు – సామెత నిర్వచనం:** Encyclopedia Americana

"A short, pithy saying presenting in striking form well known truth"

(ఒక ప్రసిద్ధి చెందిన సత్యాన్ని ఉటంకించే సంక్షిప్త సారవంతమైన వాక్యమే సామెత)

**తెలుగులో సామెతకు నిర్వచనాలు**

శ్రీ సంపత్ రాఘవాచారి – "జనవ్యవహార క్షుణ్ణమైన ఉక్తి సామెత"

శ్రీ విశ్వనాథ సత్యనారాయణ – "ఒక పిండితార్థాన్ని కొద్ది మాటల్లో చెబుతుంది సామెత"

శ్రీ నేదునూరి గంగాధరం – "పూర్వులు తమ అనుభవాలను సూత్రప్రాయంగా చెపుతూ వచ్చినవే సామెతలు".

క్రమంగా కొన్ని నీతులు, కథలు, బోధనలు కూడా సామెతలుగా ఉన్నాయి.

**తెలుగు సామెత ముఖ్య లక్షణాలు**

సామ్యం, ప్రాచుర్యత, తరతరాల అనుభవమూలం సాంప్రదాయికత, సారవత్తత – సంక్షిప్తత, శ్రావ్యత అనేవి ముఖ్య లక్షణాలు.

**సామ్యం:** తెలుగులో సామెతకు పోలిక, ప్రాణం, సాటవ కూడా సాదృశ్య అర్థాన్ని బోధిస్తుంది. సంభాషణలో మనం చెప్పే విషయాన్ని స్పష్టం చేయడానికి ఆ విషయాన్ని పోలిన మరో విషయం చెపుతాం అదే సామెత. శ్రోత అభిప్రాయాన్ని ఖండించడానికి గాని, బలపరచడానికి గాని వక్త సామెతల్ని ఉపయోగించుకోవచ్చు.

ఉదా: 'నేను బాగా రాసిన మాష్టారు మార్కులు వేయలేదు' అనే మాటను 'ఆడలేనమ్మ మద్దెల ఓడన్నదట' అనే సామెతతో ఖండించవచ్చు. అంటే వక్త చెప్పదలచుకొన్న అంశానికి మద్దతునిచ్చే పోలిక వాక్యాలుగా సామెతలు ఉపయోగపడున్నాయి.

**ప్రాచుర్యత:** ప్రాచుర్యంలో లేనిది సామెత కాలేదు. ప్రజలు ఎక్కువగా వాడినప్పుడే సామెతకు విలువ వస్తుంది.

**తరతరాల అనుభవమూలం:** తరతరాల అనుభవాల్ని దాచుకొన్న రసగుళికలు సామెతలు. చాలా సామెతలు వ్యక్తుల అనుభవం నుంచే పుడుతాయి. ఉదా: 'అత్తలేని కోడలుత్తమురాలు – కోడలు లేనత్త గుణవంతురాలు' అనే సామెత అత్తాకోడళ్ల అనుభవం నుంచి వచ్చిందే.

తెలుగు సామెతలు – ప్రజల సాంఘిక, సాంస్కృతిక జీవన చిత్రణం గూర్చి ఈ వ్యాసంలో విపులంగా చర్చించదలచాను.

**తెలుగు సామెతలు – సాంఘిక జన జీవన చిత్రణం**

తెలుగు సామెతల్లో వృత్తి, ప్రజల ఆహారపుటలవాట్లు, వ్యాపారం, నాణేలు, కొలతలు, పరిపాలన, న్యాయ సంబంధిత సామెతలు ప్రజల సాంఘిక జీవన చిత్రణకు సంబంధించినవి.

**వృత్తి:** జీవనోపాధి కోసం కుటుంబ సభ్యులంతా వంశపారంపర్యంగా చేసే పనిని 'వృత్తి' అనవచ్చు. కులంతో ముడిపెట్టే వీలులేని సామెతలు ప్రధానంగా తొమ్మిదున్నాయి. వీటికి సంబంధించిన సామెతలు అనేకమున్నాయి. 1. వ్యవసాయం – పశుపోషణ 2. వైద్యం 3. మంత్రసాని వృత్తి 4. పూటకూళ్ల వృత్తి 5. కసాయి/కటిక వృత్తి 6. కూలిపని 7. పదుపు వృత్తి 8. దొంగతనం 9. బిక్షాటన వృత్తి.



ISSN No.2319-3905

**రైతు ప్రాముఖ్యతను తెలిపే సామెతలు:** భూమి గొప్పదనం, పంటపొలాల విభజన, అదును పదును, ఎద్దు, వ్యవసాయ అవసరాలు – మూలధనం, ఇంటిపనులు, కూలీలు, ఉపకరణాలు (అరక, బండి) విత్తనాలు, ఎరువులు, పశువుల ఎరువు, ఆకు ఎరువు, గొర్రెలమంద కట్టించడం, మట్టి వేపపిండికి సంబంధించిన సామెతలున్నాయి.

**ఆంధ్రప్రదేశ్‌లో పండే పంటలు:** 1. ఆహార ధాన్యాలు – వరి, జొన్న, సజ్జ, ఆరిక, తమిద 2. పప్పు ధాన్యాలు – పెసలు, శనగలు, కందులు, ఉలవలు, మినుములు 3. నూనె గింజలు – ఆముదాలు, నువ్వులు 4. వ్యాపార పంటలు – చెఱకు, ప్రత్తి, పోగాకు, జనుము 5. కూరగాయాలు – దుంపలు, మిరప, ఉల్లి, ధనియాలు, చేమ మొదలైనవి 6. తోటలు – పండ్ల తోటలు మొదలైన వాటికి సంబంధించిన అనేక సామెతలున్నాయి.

**ప్రజల ఆహారపుటలవాట్లకు సంబంధించిన సామెతలు**

ఆహార ధాన్యాలు, భోజనానికి సంబంధించిన, విందు–పంక్తి భోజనం, భోజనవేళ, పళ్ళు తోముకోవడం, ఆకలి – రుచి, వంటచేసే స్త్రీలు, భోజనానికి మరుగు, వంట పరికరాలు – భోజన పరికరాలు, కుండలు, భోజనం చేసే సాధనాలు, వండడం, వరి అన్నం, కొర్రన్నం, సంగటి, చద్ది అన్నం, అంబలి–గంజి, జావ, కలి, తవుడు, పప్పు, కూరగాయలు, ఆకుకూరలు, ఉప్పు–కారము, కుడుములు, రొట్టెలు, గారెలు, అప్పడాలు, పులగం, పిండివంటలు మొదలైన వాటిని గురించిన సామెతలు అనేకమున్నాయి.

**వ్యాపారానికి సంబంధించిన సామెతలు**

వ్యాపార విషయాలు, వివిధ వ్యాపారాలు, బేరం, అమ్మకం, ధర, లాభనష్టాలు, అంగడి–సంత, కొసరు, తేరసొమ్ము, సుంకం అనే అంశాలకు సంబంధించిన అనేక విషయాలను తెలిపే సామెతలున్నాయి.

**నాణేలు, కొలతలకు సంబంధించిన సామెతలు**

వస్తుపరిమాణం నిర్ణయించేది కొలతలు, ధనపరిమాణం నిర్ణయించేవి నాణేలు. నాణేలు, కొలతలు తరతరానికి మారుతుంటాయి. నాణేల్లో మొదట వరహాలు, తర్వాత రూపాయలు – అణాలు; ఇప్పుడు రూపాయలు – పైసలు; కొలతల్లో పూర్వం శేరు, వీశె, గజాలు, ఇప్పుడు లీటరు, కిలోగ్రాము, మీటర్లు. కొలతల్లో నిర్దిష్టమైనవి, అనిర్దిష్టమైనవని రెండు రకాలు. కొలతల్లో ఒక నిర్ణీత ప్రమాణాన్ని చెప్పేవి నిర్దిష్టమైనవి. అనిర్దిష్టమైనవి దాదాపు పరిమాణాన్ని చెప్పేవి. నిర్దిష్టమైన కొలతకు శేరు, తవ్వ, పుట్టి మొదలైనవి ఉదాహరణాలు. పుటికెడు, గాదెడు, గోరంత, ఆకాశమంత లాంటివి అనిర్దిష్ట పరిమాణాలు.

ధనం, నాణేలు, ధాన్యం కొలత, ద్రవ్య పదార్థాల కొలత, ఆహార పదార్థాల పరిమాణం, వస్తుపరిమాణం, బట్టలు – నూలు కొలత, ఎత్తు, లోతు, పొడవు, దూరం, లావు, తూకం, కాలం, సంఖ్యలు, దారిద్ర్యం మొదలైన అనేక విషయాలకు సంబంధించిన సామెతలున్నాయి.

**పరిపాలన-న్యాయానికి సంబంధించిన సామెతలు**

పరిపాలనలో రాజు, మంత్రి, సేనాపతి మొదలైన రాజోద్యోగులు, రెడ్డి, కరణం తలారిలాంటి గ్రామోద్యోగులు, న్యాయానికి సంబంధించిన కోర్టుల గురించి అనేక సామెతలున్నాయి.

ప్రజల సాంఘిక జన జీవన చిత్రణకు సంబంధించిన తెలుగు సామెతలను మచ్చుకు కొన్నింటిని క్రింద విశ్లేషించడమైంది.

"అందరికీ అన్నం పెట్టేవాడు రైతే"

"రైతు క్షేమమే రాజుకు భాగ్యం"

"రైతు బాగుపడితే దేశం బాగుపడుతుంది."

ఈ సామెతల్లో రైతు ప్రాముఖ్యతను గూర్చి చెప్పడం జరిగింది. రైతు దేశానికి వెన్నెముక. రైతు సంఘానికీ, దేశానికీ ఎంత అవసరమో, అతని స్థితిగతులేమిటో సామెతల ద్వారా మనం తెలుసుకోవచ్చు.

మహారాజుకైనా, స్వాములకైనా, చదువుకున్న వారికైనా అన్నం పెట్టేవాడు రైతే. ప్రభుత్వంగాని, దేశంగాని, రాజుగాని బాగుపడాలంటే రైతు బాగుండాలి. రైతు బాగుంటే దేశం బాగుంటుంది.

"అన్నీ పండించిన రైతుకు అన్నమే కరువు"

'దున్నేవాడు లెక్కచూస్తే నాగలి కూడా మిగలదు"

రైతు ప్రశస్తిని చాటే సామెతలే, రైతు నిస్సహాయస్థితిని, వ్యవసాయంలో వచ్చే నష్టాన్ని కూడా తెలుపుతున్నాయి.

"కోటి విద్యలు కొంద్రకు లోకువే"

ఈ సామెత మనసాంఘిక జీవితంలో వ్యవసాయానికి సంబంధించినది. కోటి విద్యలు కూటి కోసమే. మనం ఏ పని చేసి డబ్బు సంపాదించిన కూటి కోసమే అన్నది ఇక్కడ స్పష్టంగా తెలుస్తున్నది.

'ఇల్లు కట్టి చూడు, పెళ్ళి చేసి చూడు'

ఈ సామెత కుటుంబ జీవనానికి సంబంధించినది. ఒక తండ్రి కూతురి పెళ్ళి చేయడానికి పడే అవస్థను తెలుపుతుంది. ఇల్లు కట్టాలన్నా, పెండ్లి చేయాలన్నా ఎక్కువ డబ్బు ఖర్చవుతుంది. రెండింటికి ఖర్చు ఎక్కువే. ఇల్లు కట్టడానికి యజమాని పడే బాధను ఈ సామెత గుర్తు చేస్తుంది. లోకానుభవాన్ని ఈ సామెత స్పష్టంగా చెపుతున్నది.

'తల్లిముఖం చూడని బిడ్డ, వానముఖం చూడని పైరు ఒకటే'.

వానముఖం చూడని పైరు ఎండిపోతుంది. ఆ పైరు కొంచెం పెద్దదైతే ఎండిన తర్వాత ఆవులకు వేస్తారు. లేకుంటే అది ఎందుకూ పనికి రాదు. అలాగే తల్లి ముఖం చూడని బిడ్డకు ప్రేమాభిమానాలుండవు. కనుకనే 'కన్నతల్లి నీడ కానుగ నీడ' అన్నారు. వేపచెట్టును వెర్రితల్లితో



ISSN No.2319-3905

పోలుస్తారు. బిడ్డకు తల్లి ముఖ్యం, తల్లి ప్రేమ ముఖ్యం.

'ఆడది తిరిగి చెడితే, మగవాడు తిరగక చెడ్డాడు'

'ఆడదాని బ్రతుకు అరిటాకువంటిది',

'అరిటాకు మీద ముల్లుపడ్డా, ముల్లు మీద అరిటాకుపడ్డా ఆకుకే నష్టం'.

కన్నెపిల్ల కాలుజారితే కన్న తల్లిదండ్రులకు అవమానమే కాక ఆ ఆడదాని బ్రతుకు ఎవరూలేని అనాథ బ్రతుకవుతుంది. అందుకనే 'ఆడది తిరిగి చెడితే, మగవాడు తిరగక చెడ్డాడు' అన్న సామెత పుట్టింది.

'పూజకొద్దీ పురుషుడు, దానం కొద్దీ బిడ్డలు'

ఆడపిల్ల అదృష్టం పండితే మంచి భర్త, అత్తమామలు, ఆడబిడ్డలు వస్తారు. లేకపోతే ఆమె జీవితం నరకమవుతుంది. కనుకనే పూజకొద్దీ పురుషుడు, దానం కొద్దీ బిడ్డలన్నారు. భర్త మంచివాడైతే అది తన పూర్వజన్మ సుకృతమనుకుంటుంది. మంచి వాడు కాకపోతే తనకర్మమనుకుంటుంది.

'పిల్లలు లేనిది ఇల్లుకాదు, పిట్టలు లేనిది తోటకాదు'

పిల్లలు ఇంటి మణిదీపాలు. ఇలాంటి 'పిల్లలు లేని ఇల్లు కందులు గొట్టిన కళ్ళం' వంటిది. కనుకనే గొడ్రాలితనం స్త్రీకి మంచిదికాదు. ఆమెను ఎగతాళి చేస్తుందీ సమాజం. నిజానికి మాతృత్వమనేది స్త్రీకి వరం లాంటిది. సంతానమున్నప్పుడే సంఘంలో స్త్రీకి గౌరవస్థానముంటుంది. స్త్రీకి పిల్లలు లేకుంటే సమాజంలో గౌరవముండదు. అందుకే 'పిల్లలు లేని ఇల్లు ఇల్లు కాదు పిట్టలు లేనిది తోటకాదు' అంటారు. అందుకే స్త్రీ సంతానం కోసం ఎందరో దేవుళ్ళను పూజిస్తుంది. వ్రతాలు, నోములు చేస్తుంది. ఉపవాసాలు చేస్తుంది. 'పుట్టి చచ్చినా పుత్రుడే మేల'ని విలపిస్తుంది.

'వానరాకడ, ప్రాణం పోకడ తెలియవు'.

వానవుంటే కరువు, పెనిమిటి వుంటే బీదతనం రాదు. పంటలు బాగా పండాలంటే వర్షాలు పడాలి. పంటలేనిదే వంటలేదు. వంటలేనిదే తిండిలేదు. తిండిలేకపోతే కండవుండదు. కండలేకపోతే మనుగడే లేదు ఇందులో సందేహం లేదు. వానలు పడితే కరువురాదు. అదేవిధంగా వాన ఎప్పుడు పడుతుందో, ప్రాణం ఎప్పుడు పోతుందో, ఎవరికీ తెలియదు. పెనిమిటి వుంటే బీదతనం రాదు.

రైతులు వర్షం మీద ఆధారపడి వ్యవసాయం చేస్తారు. కనుక రైతుల నోళ్ళలో వర్షానికి సంబంధించిన సామెతలు అనేకమున్నాయి. ఏ వర్షం ఏ పంటకు అనుకూలమో, కాదో రైతులకు బాగా తెలుసు. వ్యవసాయమే వీళ్ళ వృత్తి. కాబట్టి ఈ అనుభవాలన్నీ నరనరాల్లో జీర్ణించుకుపోయాయి.

'ఎంత వెలుగుకు అంత చీకటి'

'ఎంత చెట్టుకంతగాలి' ఎంత వెలుగుకు అంత చీకటి ఉంటుంది. అదేవిధంగా ఎంత సంసారానికి అంత ఖర్చుంటుంది.

'ఉత్తకుండకు ఊపులెక్కువ'. 'నిండుకుండతొణకదు'

ఏమీలేని ఆకు ఎగసెగసి పడితే, అన్నీవున్న ఆకు అణిగి మణిగి వుంటుంది'.

ఇవి బడాయిపడే వాళ్ళని గురించి చెప్పే సామెతలు. ఏమి లేనమ్మ ఎగిరెగిరిపడుతుంది. అన్నీ ఉన్నమ్మ అనిగిమనిగి వుంటుందని కూడా చెపుతారు. కొంతమంది ఏమీ లేకపోయినా అన్నీ ఉన్నట్లు ఎగిసి పడతారు. కొంతమందికి ఆస్తులు, డబ్బు వగైరా అన్నీ వున్నా అనకువుగా వుంటారు. అందుకే బడాయి బచ్చా, కూడులేక సచ్ఛా' అన్నారు. డౌలు చేస్తే దరిద్రం పోతుందా?

'ఆత్రగాడికి బుద్ధిమట్టు', 'నిదానమే ప్రధానం'

ఏ పని చేసినా ఆలోచించుకొని చేయాలి. చెప్పేలోగానే, విన్పించుకోకుండా కొందరు పనులు చేస్తుంటారు. ఇలాంటివి ఎన్నో అనర్థాలకు దారితీసే అవకాశముంది. కనుక ఏదైనా ఒక పని చేసేముందు తొందర పడకుండా ఆలస్యమైన బాగా ఆలోచించి చేయాలి.

**తెలుగు సామెతల్లో సాంస్కృతిక జన జీవన చిత్రణం**

ఒక జాతిని మరొక జాతి నుంచి వేరుగా నిరూపించే చిహ్నాల్లో ఆ జాతి మత విశ్వాసాలు, ఆచార వ్యవహారాలు, వేషం, భాష, జాతి, నివాసదేశం ముఖ్యమైనవి.

సంస్కృతిలో భాగాలైన మతం, విద్య–వైద్యం–కళలు, వినోద విలాసాలు, ఆటలు, ఆచార వ్యవహారాలు, ప్రజల నమ్మకాలు, వస్త్ర భూషణాలంకరణలు అనే అంశాల్ని వేరు చేసి ప్రజల సాంస్కృతిక జీవనాన్ని పరిశీలించవచ్చు. వీటిల్లో అలౌకిక జీవితానికి సంబంధించినది మతం, ఆచార వ్యవహారాలు, నమ్మకాలు లౌకికా లౌకిక జీవితాల్లో ఉపయోగించేవి విద్య, వైద్యం, కళలు, వినోద విలాసాలు – ఆటలు, వస్త్ర భూషణాలంకరణలు లౌకిక జీవితానికి చెందినవి.

ఆంధ్రుల వివిధ మతాలు, ఆ మత విశ్వాసాలు ప్రజలపై చూపించిన ప్రభావం, మతకలహాలపై సామాన్యుని అవగాహనను సామెతల ఆధారంగా చర్చించవచ్చు.

1975–76 అంచనాల ప్రకారం ఆంధ్రప్రదేశ్‌లో హిందువులు 88%, ముస్లింలు 8%, క్రైస్తవులు 4%, సిక్కులు 0.03%, బౌద్ధులు 0.02% ఉన్నారు. మతం పూజకు సంబంధించిన ధర్మ సంబంధమైన తెలుగు సామెతలున్నాయి. వైదిక, వైష్ణవ, శైవ, జైన, ఇస్లాం, క్రైస్తవ మతాలకు సంబంధించిన సామెతలున్నాయి.

'తాను ఒకటి తలిస్తే దైవం ఇంకొకటి తలచినట్లు'

మనిషి తలచిందానికి దేవుడు విరుద్ధంగా తలవచ్చని, దేవుని దయ ఉంటే ఎంతటి ఆపదలైనా పటాపంచలవుతాయని, లేకుంటే చిన్న ఆపదలే పెద్దవవుతాయని సామెతలు చెపుతున్నాయి.

'యముడికి శివుడికి వెరువనివాడు'

'మృత్యువు పంచాంగం చూచి పని చేయదు'

యమునికి, మృత్యువుకు సంబంధించిన సామెతల్లో సాహసవంతుడు యమునికి





భయపడడని, ఎన్ని పంచాంగాలు చూసినా మృత్యువు ఆసన్నమయ్యేకాలాన్ని నిర్ణయించలేమని, మృత్యువు అనుక్షణమూ పొంచి ఉంటుందని ఈ సామెతలు చెపుతున్నాయి.

'ఇంటికన్నా గుడిపదిలం'

గుడి, మఠం, సత్రం, హిందూమత స్థావరాలుగా చెప్పుకోవచ్చు. దైవ నివాసం గుడి. దైవ భక్తుల నివాసాలు మఠాలు, సత్రాలు. ఒక్కోసారి గుడిలోనూ దైవ భక్తులు కాలక్షేపం చేస్తూ వుంటారు. గుడి నిర్మాణం అభేధ్యంగా ఉంటుంది. ఇంట్లో ఆలు, పిల్లల పోరు వుంటుంది. గుళ్లో దేవుని పోరు ఉండదని' ఇంటి కన్నా గుడిపదిలం' అనే సామెత వచ్చింది.

'రోగము రట్టు సంసారము గుట్టు'

'ఆరోగ్యమే మహాభాగ్యం' అన్నారు పెద్దలు. మన ఆరోగ్యాన్ని కాపాడుకొనేందుకు ఆరోగ్య విషయాలు, అనారోగ్య లక్షణాలు, వివిధ వ్యాధులు, వాటి ఔషధాలు తెలియడం అవసరం. రోగాన్ని బయటికి చెప్పుకోవాలి. సంసారం గుట్టును గోప్యంగా ఉంచుకోవాలి. అన్నీ సాగితే రోగం దర్జాగా ఉంటుందని, చూసుకునే వాళ్ళుంటే రోగాలు కోరుకుంటారని, దిగులు పెద్ద వ్యాధి అని, అనుమానం రోగం కన్నా ఎక్కువ కీడు చేస్తుందని 'రోగము రట్టు సంసారము గుట్టు' అన్నారు.

'అత్తయింట అల్లుని చూడాలి. ఆముదపు చేలో ఆబోతును చూడాలి'

పెండ్లైన తర్వాత అత్తగారు అల్లునికి కొద్దిరోజులు షడ్రసోపేతమైన విందులు చేస్తారు. దీనిని మనుగుడుపులు అంటారు. అల్లెం, అల్లెడం తినడం అని అంటారు. నేతి పిండి వంటలు తిని అల్లుడు పుష్టిగా తయారవుతారు. అల్లెంలో అతిరసాలు తప్పకుండా ఉంటాయి. అందుకనే కొత్తగా పెళ్ళైన రోజుల్లో అత్తయింట అల్లుని చూడాలి అంటారు. అదేవిధంగా ఆముదపు చేల్లో మేసిన ఆబోతు కూడా పుష్టిగా నున్నగా వుంటుంది. అందుకనే అత్త ఇంట కొత్త అల్లుడుని ఆముదపు చేల్లో ఆబోతుతో పోలుస్తారు.

'అర్జీలకు పనులు కావు ఆశీర్వచనాలకు బిడ్డలు పుట్టరు' 'పుట్టలో పాలు పోసి పొట్ట తడుముకొన్నట్లు'.

ఈ సామెతలు పిల్లలు పుట్టని స్త్రీకి సంబంధించినవి. సంతానవతికి సంఘంలో ఉన్న గౌరవం గొడ్రాలికి లేదు. గొడ్రాలి మొగం చూస్తే పాపమని, అపశకునమని భావిస్తారు. పిల్లల్ని కనడం తన స్త్రీత్వానికి సార్థకంగా ప్రతి వివాహిత తలుస్తుంది. స్త్రీలు పిల్లల కోసం ఎన్నో బాధలు పడతారు. పెద్దల చేత, సన్యాసుల చేత దీవెనలు పొందడం, తాయెత్తులు కట్టించుకోవడం, నాగులకు పుట్టలో పాలు పోయడం, అశ్వత్థ ప్రదక్షిణం చేయడం, భర్తతో సరి గంగా స్నానాలు చేయడం, సప్తసాగర యాత్ర పోవడం లాంటివి చేస్తారు. సామెతల్లో ఈ కార్యాలన్నింటినీ పరిహసించడమూ, వ్యతిరేకంగా చూడడమూ జరిగింది.

'ఆరవ కాన్పు ఆడపిల్ల అత్తవారింటికి లక్ష్మి'

ఇది ప్రజల నమ్మకానికి సంబంధించిన సామెత అదృష్ట దురదృష్టాల మీద ప్రజల కెంతో నమ్మకముంది. తాము చేసిన పని ఫలిస్తే అదృష్టమని, పలించకపోతే దురదృష్టమని భావిస్తారు. ఆరవ కాన్పు ఆడపిల్ల అదృష్టవంతురాలు. అత్తవారింటికి లక్ష్మి అంటారు.

'మాట వెండి మౌనం బంగారం'

శ్రేష్టంగా అందంగా ఉండే విలువైన దాన్ని బంగారంతో పోలుస్తారు. బంగారు ఉండడం సిరికి చిహ్నం. అదృష్టవంతులు పట్టిందంతా బంగారమవుతుంది. కొద్ది బంగారైనా మనిషికి అహం పెంచుతుంది. ఎన్ని సార్లు పుటం పెట్టిన ఇత్తడి బంగారం కాదు. బంగారం ప్రకాశవంతంగా వుంటుంది. బంగారం కరిగించాలంటే వెలిగారం అవసరం నిప్పులో వేసి పుటం పెట్టేకొద్దీ బంగారు ఇంకా ఎక్కువ మెరుస్తుంటుంది. బంగారం వేసుకొనే కొద్దీ స్త్రీల సింగారం పెరుగుతుంది. ఎంత విలువైన దానికైనా ఆసరా అవసరముంటుంది. కనుకనే 'మాట వెండి మౌనం బంగారం' అనే సామెతలో. మాటను వెండితో, మౌనాన్ని బంగారంతో పోల్చారు. ఎవరైనా అనవసర విషయాలు మాట్లాడేప్పుడు మనం మాట్లాడే కంటే మౌనంగా వుండడం ఉత్తమం. కనుక మౌనం బంగారంతో సమానం.

ఈ విధంగా మన సాంఘిక, సాంస్కృతిక జీవితంలో ఎన్నో సామెతలు నిలద్రొక్కుకున్నాయి. జాతులు, ఆచారాలు – విశ్వాసాలు, వృత్తులు, ఆహారం, వైద్యం, నీతులు, పండుగలు పబ్బాలు, ఉపదేశాలకు సంబంధించిన సామెతలెన్నో మన సాంఘిక, సాంస్కృతిక జీవితంతో ముడిపెట్టుకొన్నాయి. సామెతలలో సాంఘిక జీవితం, సాంఘిక జీవితంలో సామెతలు ఒకదానికొకటి పేనవేసుకొన్నాయి. ఇదే విధంగా సామెతలలో సాంస్కృతిక జీవితం, సాంస్కృతిక జీవితంలో సామెతలు ఒకదానికొకటి పేనవేసుకొన్నాయి. సామెతలు సమాజాన్ని ప్రతిబింబించే నిలువుటద్దాలనడంలో అతిశయోక్తి లేదు. అనుభవసారాన్ని తెలిపే సామెతలు సమాజాధ్యయనానికి, అభ్యుదయానికి ఒక సాధనమని చెప్పవచ్చు.

**ఆధారగ్రంథాలు:**


1. తెలుగు సామెతలు – జనజీవనం – తెలుగు అకాడమి – డా॥ పాపిరెడ్డి నరసింహారెడ్డి.
2. జానపద విజ్ఞానాధ్యయనం – ఆచార్య జి.ఎస్. మోహన్.
3. సామెతలు – నిర్వచనము (వ్యాసం) స్రవంతి, ఏప్రిల్ 1964 (పు.27–31)
4. Encyclopedia Americana (Vol. XXII) (pps 704-705)
5. తెలుగు విజ్ఞాన సర్వస్వము (మూడవ సంపుటం)
6. తెలుగు సామెతలు (వ్యాసం) – నాయని కృష్ణకుమారి.
7. తెలుగు సామెతలు (పుట. 369).
8. ఆంధ్రుల సాంఘిక చరిత్ర, సాహిత్య చరిత్ర (పుట. 290) (పుట:369)




ISSN No.2319-3905

## రచయితల చిరునామాలు


1. **ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు,** తెలుగు శాఖ, హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటీ, హైదరాబాద్
2. **ఆచార్య పేట శ్రీనివాసులు రెడ్డి,** తెలుగు శాఖ, ఎస్.వి.యూనివర్శిటీ, తిరుపతి
3. **ఆచార్య పి.సి.వెంకటేశ్వర్లు,** ఓరియంటల్ ఇన్స్‌టిట్యూట్, ఎస్.వి.యూనివర్శిటీ, తిరుపతి
4. **ఆచార్య డి.వి.శ్రవణ్ కుమార్,** సంచాలకులు, ప్రచురణల శాఖ, ద్రావిడ విశ్వవిద్యాలయం, కుప్పం – 517 426
5. **ఆచార్య కె.శ్రీదేవి & పి.శ్రీదేవి,** తెలుగు శాఖ, ద్రావిడ విశ్వవిద్యాలయం, కుప్పం
6. **ఆచార్య ఎం.రామనాథం నాయుడు,** తెలుగు శాఖాధిపతి, కర్నాటక రాష్ట్ర సార్వత్రిక విశ్వవిద్యాలయం, ముక్త గంగోత్రి,మైసూరు –570 006, చరవాణి:87623 57996,.
7. **డా.డి.ఉదయ కుమారి,** అసోసియేట్ ప్రొఫెసర్–కం–డిప్యూటీ డైరెక్టర్, ప్రచురణల కేంద్రం, ద్రావిడ విశ్వవిద్యాలయం, కుప్పం– 517 426
8. **ఆచార్య ఎన్.ఈశ్వర రెడ్డి,** తెలుగు శాఖ, యోగి వేమన విశ్వవిద్యాలయం, కడప – 516 005
9. **డా.వి.పళని,** అసోసియేట్ ప్రొఫెసర్, తెలుగు శాఖ, ద్రావిడ విశ్వవిద్యాలయం, కుప్పం – 517 426
10. **డా.పప్పుల వెంకటరమణ,** తెలుగు విభాగాధిపతి, ప్రభుత్వ డిగ్రీ కళాశాల (పురుషులు), శ్రీకాకుళం, చరవాణి:9491811710.
11. **డా.యం.హరికృష్ణ,** అసిస్టెంట్ ప్రొఫెసర్, ప్రచురణల శాఖ, ద్రావిడ విశ్వవిద్యాలయం, కుప్పం – 517 426
12. **డా.ఎస్.హేమలత,** అసిస్టెంట్ ప్రొఫెసర్, ప్రచురణల శాఖ, ద్రావిడ విశ్వవిద్యాలయం, కుప్పం – 517 426
13. **డా.పి.ఎస్.గణేష్ మూర్తి,** అసిస్టెంట్ ప్రొఫెసర్, తమిళ శాఖ, ద్రావిడ విశ్వవిద్యాలయం, కుప్పం – 517 426
14. **డా॥ లంక వేంకట సుబ్రహ్మణ్యేశ్వర శర్మ,** వ్యాకరణాధ్యాపకులు, శ్రీవేంకటేశ్వర వేదాన్తవర్ధనీ సంస్కృతకళాశాల, (తి.తిరుపతి.దే) న్యూ బోయిన్‌పల్లి, సికింద్రాబాదు – 500 011. సెల్ : 9951374024
15. **డా.డి.జ్యోతమ్మ,** అసిస్టెంట్ ప్రొఫెసర్, ప్రచురణల శాఖ, ద్రావిడ విశ్వవిద్యాలయం, కుప్పం – 517 426

# ద్రావిడి
## (అర్ధ వార్షిక తెలుగు పరిశోధన పత్రిక)
## శైలీ పత్రం

- వ్యాసాలు ద్రావిడ భాషాసాహిత్యాలు, చరిత్ర, సంస్కృతి, జానపదవిజ్ఞానం, తత్త్వశాస్త్రం, మానవశాస్త్రం, ఇతర ఏ మానవీయ శాస్త్రాలకు చెందినదైనా ద్రావిడ సంబంధమైన పరిశోధన వ్యాసాలు రాయవచ్చు. కాని విషయం ఏ శాఖకు చెందినదైనా వ్యాసం తెలుగులోనే ఉండాలి.
- ఇతర ద్రావిడ భాషల పరిశోధన పత్రికలలోని ఉత్తమ వ్యాసాలను మూల రచయితల, ఆ పత్రికల యాజమాన్యాల అనుమతితో తెలుగులోకి అనువదించి పంపవచ్చు. కాని మూలభాషలోని మూల ప్రతిని కూడా పంపాలి.
- వ్యాసాలు తప్పనిసరిగా సరికొత్త పరిశోధనాంశాలతో ఆ శాఖాంశాలపై సరికొత్త ప్రతిపాదనలు కాని సరికొత్త విజ్ఞానదృష్టిని కాని అందించేవై ఉండాలి. ఏ ప్రాచీన సాహిత్యం సరికొత్త సాహిత్య ధోరణుల గురించి రాసినా పరిశోధనలో కొత్తదనం తప్పనిసరి. గతానుగతికమైన వాదనలను ఇప్పటికే చాలా మంది చెప్పిన విషయాలపైన తిరిగి రాసే వ్యాసాలను పత్రిక అనుమతించకపోవచ్చు.
- వ్యాసాల పరిమాణం మరీ చిన్నదిగా ఉండకూడదు. అచ్చులో కనీసం ఐదు పుటల వ్యాసాలు చిన్నవిగా ఉండవచ్చు. మరీ ఎక్కువ పుటలలో ఉంటే పరిశోధన గురుత్వాన్ని బట్టి అంగీకరించవచ్చు.
- వ్యాసాలు ఆధునిక ప్రామాణిక భాషలో ఉండాలి. మాండలిక కథలపైన, ఇతర మాండలిక భాషాధారిత ప్రక్రియలపైన వ్యాసాలు రాసినా వ్యాసం ఆధునిక ప్రామాణిక భాషలోనే ఉండాలి.
- పులుముడు వాక్యాల శైలి దూరాన్వయం దురన్వయం ఉన్న వాక్యాల శైలి కాక సూటిగా క్లుప్తంగా ఉండే వాక్యాలతో విషయాన్ని సూటిగా చెప్పే శైలిని పాటించాలి.
- ఇప్పటికే విస్తృతంగా జరిగిన పరిశోధనాంశాలపైన కొత్త ప్రతిపాదనలు చేసే వ్యాసాలలో తిరిగి ఉపోద్ఘాతాలు చేయకుండా తిన్నగా విషయాంశానికి వెళ్ళి చర్చించవచ్చు. ఉదాహరణకు జానపద గేయాలపై కొత్త వ్యాసం రాయదలచుకున్నప్పుడు. తిరిగి నిర్వచనాలను గురించి చెప్పడం గేయలక్షణాలు వగైరా రాయనవసరం లేదు. భావకవిత్వంపైన సరికొత్త ప్రతిపాదనలు



ISSN No.2319-3905

వివాదాలు రాయదలచుకున్న వారు తిన్నగా విషయంలోనికి వెళ్ళవచ్చు. కాని తిరిగి భావకవిత్వ నిర్వచనాలను గురించి ఉపోద్ఘాతాలు అవసరంలేదు.

- విసంధులు పాటించవచ్చు. అందంగా ఉన్నంత వరకూ వైరి సమాసాలను పాటించవచ్చు. పాలాభిషేకం, మెట్లోత్సవం, ఫిల్మోత్సవ్ వంటి మామూలు పాపులర్ భాషలోని దుష్టసంధులు వర్జించాలి. వ్యావహారికమైన పాపులర్ పత్రిక భాషను వాడకూడదు.
- థ-ధ, శ-ష-స భేదాన్ని తప్పక పాటించవలసి ఉంది. శకట రేఫ అవసరమైన చోట అంటే భాషాశాస్త్ర సంబంధి వ్యాసాలలో ప్రాచీన సాహిత్య చర్చకు సంబంధించిన వ్యాసాల్లో వినియోగించవచ్చు.
- వ్యాసానికి పాదసూచికలు/అంత్యసూచికలు ఇవ్వండి. సూచికలో స్పష్టమైన అవసరమైన సమాచారం ఉంటేనే ఇవ్వండి. చర్చలో అధికంగా ఇవ్వవలసిన సమాచారం ఉన్నా ఇవ్వండి. అతి ముఖ్యమైన విషయమైతేనే వ్యాసంలో ఉండాలి.
- ఉపయుక్త గ్రంథాల పట్టీ ఇచ్చేటప్పుడు వ్యాసంలో చర్చలో వినియోగించిన గ్రంథాలను మాత్రమే ఇవ్వాలి. దీనికి సంబంధం ఉన్నా ఇతర పుస్తకాలు జాబితాలో చేరవలసిన పనిలేదు.
- ఉపయుక్త గ్రంథాల జాబితా ఆధునికంగా అంతర్జాతీయంగా ఉపయోగించే పద్ధతిలో ఉండాలి. కింద ఉదాహరణ చూడవచ్చు.

  కృష్ణకుమారి నాయని, 1979. **జానపద గేయగాథలు,** తెలుగు అకాడమీ, హైదరాబాదు.
- జాబితాలో రచయితల పేరు పక్కన వారి బిరుదులు, హోదాలు రాయనవసరం లేదు. వ్యాసాన్ని కోట్ చేసినప్పుడు వ్యాసం ఉన్న పుస్తకాన్ని పై విధంగా రాయాలి. గ్రంథాల జాబితా గ్రంథకర్తల పేర్లతో అకారాది క్రమంలో ఉండాలి. జాబితాకు వరుస సంఖ్య అవసరం లేదు.
- అముద్రిత గ్రంథాలను, అముద్రిత సిద్ధాంత గ్రంథాలను కూడా ఉపయుక్త గ్రంథాల జాబితాలో అకారాది క్రమంలోనే రాయాలి. కాని (అముద్రితం) అని కుండలీకరణంలో, చివరిలో చెప్పాలి.
- Ibid, et.al. Op. Cit, వంటి వాటిని యథాతథంగా వాడుకోవచ్చు.
- ఉపశీర్షికలు వ్యాసరచనలో మరింత స్పష్టతనిస్తాయి. కాబట్టి వాడుకోవచ్చు.
- ఉటంకించే పాఠ్యం చిన్నది అయితే కొటేషన్ మార్కులలో ఉంచండి. లేదా ఒక పేరా అంత పరిమాణం ఉంటే దాన్ని ప్రత్యేకంగా మార్జిన్ పెట్టి వేరే చిన్న ఫాంట్‌లో రాయాలి.

- వ్యాసకర్తలే డి.టి.పి చేయించి పంపే పక్షంలో అను (version-7) కు కన్వర్ట్ కాగలిగిన ఫాంట్‌లనే వాడాలి. ఏ సాఫ్ట్‌వేర్ వాడింది ఏ ఫాంట్ వాడింది స్పష్టంగా రాసి పంపాలి. సాఫ్ట్ కాపీ ఇ–మెయిల్‌లో పంపవచ్చు.

  E-mail - publicationsdu@gmail.com

- మూలరచయిత అనుమతి పత్రం అనువాదానికి తప్పక జతచేయాలి.

ఈ పత్రికను ప్రాంతీయ భాష అయిన తెలుగులో వెలువరిస్తున్నా అంతర్జాతీయంగా వెలువడుతున్న పరిశోధన పత్రికల స్థాయిలో ప్రచురించాలనే మా అభిలాషను అర్థం చేసుకుని పరిశోధకులు సహకరించవలసిందిగా మనవి. ఇందుకు మీరూ తగిన సూచనలు చేయవచ్చు. మరిన్ని వివరాలకు సంపాదక మండలిని సంప్రదించవచ్చు. మీ రచనలు అందించి పత్రికను ఉత్తమ ప్రామాణిక పత్రికగా దిద్దితీర్చడంలో సహకారం అందించాలని మనవి.

**సంపాదకమండలి**